భారతి

సాహిత్య మాసపత్రిక

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

ఫిబ్రవరి 1956

సంపుటము 33 : : సంచిక 2

విడిపత్రిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

ఫిబ్రవరి 1956



ఉజ్‌బెక్ సట్టువరాంద్ర సమ్మోహన నృత్యం

తెలుగు పొలము

శ్రీ బెళ్లారి శ్రీనివాసమూర్తి

కమలని లేతనవ్వుల నిగారము జిల్కఁగ లేచి ముంగిటన్
గమగమ గోమయాన్వితముగా నుదకంబులు, పూలు జల్లి యం
దముగను మ్రుగ్గువైచి నిజధామము దీర్చుచు పూర్వసంప్రదా
యములకు గౌరవం బొసగు నావిడ తెల్గుకుమారి గావలెన్!

తొలి తెలి కాంతి తూరుపున దోపగ నేత్రములల్లవిప్పి, యం
జలి నిజమాతృపాదమున సన్నిధిసల్పి, గురూపదిష్టముల్
సలలిత కావ్యజాలములు శాస్త్రములున్ గొని వల్లెవేయ మం
జుల మృదుకంఠ నిర్గళిత శోభలు చల్లెడు నాంధ్రబాలుడా?

కనుగవ వాల్చి భక్తి తొలుకాడ నమస్కృతి సల్పి వల్లకిన్
గొని మృదులాంగులీచలిత కోమల తంత్రులు మ్రోయ గానవా
హిని బారలించి యీ జగతినే మఱపించి, కళానురక్తి ని
మ్మనముల నుద్ధరించెడి సుమాంగి తెలుంగుల గేస్తురాలగున్ !

పొలములవైపు నెద్దులను బోవగదోలుచు కాడికట్టి, యీ
హాలము భుజాగ్రసీమ నిడి, యాదల కుచ్చుల తీవిపాగతో,
మలయ సమీర వీచికలు మై సొగియింపగ నేలపాటలై
గులుకు కుమారకర్షకుని కోమలహాసము పండెపంటలై!

అరుణ కరప్రసార ముదయం బగుచోట సువర్ణకాంతులన్
బరపుచు దేవతానిలయ పార్శ్వములన్, గుడిగోపురంబులన్
విరిసరులెల్ల గ్రుచ్చినటు వింతలు వింతలు దోపజేయు నీ
తెరువులు ముద్దుగొల్పెడిని తెల్గుల శిల్పవిలాసవీథులా?

ఇల్లు కొన్నాడు

శ్రీ కొమ్మూరి వేణుగోపాలరావు

వర్షాకాలం; నిన్నటినుంచీ ముసురుగావుంది. ఇవాళ ఉదయం తుంపరగా ప్రారంభమై మధ్యాహ్నానికల్లా మరీ జోరయింది వాన.

అప్పటిదాకా నిద్రపోయి, వాన ఎలావుందో చూద్దామని ముందుగదిలోకి వచ్చిన చిదంబరానికి తెరిచివున్న కిటికీలోంచి వాన జోరు గోచరించింది. పొరపాటు చేత కిటికీ తలుపులు తెరవబడి వున్నాయి. పడమటి జల్లుకు గది కొంత భాగం బాగా తడిసిపోయింది. పంచె, చొక్కా తడుస్తున్నా లెక్క చేయకుండా, వెళ్లి తలుపులు మూశాడు.

వాన తగ్గలేదు. ఇంకా తగ్గలేదు. ఇప్పుడు నాలుగయింది. ఇంకా కొంచెం సేపటిలో అయిదు, మరికొంత సేపటిలో ఆరు. అంతలో చీకటి పడుతుంది. రాత్రి ప్రారంభమౌతుంది. తిరిగి రేపటి ఉదయం వరకు ఏపనీ చేయటానికి వీలు లేదు.

రెండు మూడు నిమిషాలు ఆయన విసుగ్గా ఆలోచిస్తూ నిలబడ్డాడు. అంతలో టప్పుమని ఒక నీటి బిందువు సరిగ్గా నెత్తిమీదపడింది. దాని వెంటనే యింకొకటి. గ్రహించి, తలపైకెత్తేలోగా మరొకటి. తలఎత్తి చూశాక యింకా ఒకటి; సరిగ్గా యీసారి నోటిలోకి వచ్చిపడింది. తెరిచివున్న నోట్లోకి.

ఛీ. చీదరగా ఆయన రెండడుగులు యివతలకు వేశాడు. ఈసారి భుజం తడిపింది. విసుక్కుని అవతలకు వెళ్ళాడు. ఈమారు వీపు తడిపింది చినుకులు! చినుకులు! చినుకులు! గదంతా కురుస్తోవుంది. ఎటువెళ్లినా తడిశాడు. నేలంతా తడిసిపోతోంది. గోడల మీదుగా నీళ్లు కారిపోతున్నాయి. పై కప్పు అంతా తడిసి ముద్దయింది.

పూర్తిగా తడిసిపోయి కోపంగా లోపలకు వచ్చాడు. ఇల్లంతా విధ్వంసమయంగా వుంది. మూడే గదులు మొత్తం. ముందుగది గతి అలావుంది. మధ్య హాలు ఒకమాదిరి పరవాలేదు. మళ్ళీ వంటగది ఎంతో సేపు ఏడిచినట్లు చెమ్మగిలివుంది.

మధ్య హాల్లో పరిచివున్న చాపమీద మళ్లీ పడుకున్నాడు చిదంబరం.

నీళ్లు! నీళ్లు! నీళ్లు! ఎక్కడ చూసినా నీళ్లు యీ యింటినిండా. ఈ యింట్లోనే కాదు. యాభయి అయిదేళ్ళ వయస్సు తనది. పుట్టి బుద్ధెరిగాక యింత కంటే మంచి యింట్లో ఎప్పుడూ వుండలేదు. తన జీవితమంతా యింతవరకూ అద్దెయిళ్లలోనే బ్రతికాడు. ఇన్నాళ్ళూ అద్దె యిళ్ళ బ్రతుకుకే అలవాటు పడిపోయాడు. గదుల్లోకి ఎండ వచ్చినా సహించాడు. నీళ్ళు కురిసినా భరించాడు. ఖాళీ చేయమన్నప్పుడు ఖాళీ చేశాడు. ఎన్నో యిబ్బందులు పడ్డాడు. కొన్ని పదుల ఇళ్లు మారాడు. ఏనాడూ ఏ యింటిమీదా తనకు స్వాతంత్ర్యం లేదు.

“ఈ యిల్లు నాది. నా ఇష్టం వచ్చినట్లు చేసుకుంటాను” అని ఎన్నడూ అనుకున్న పాపాన పోలేదు.

“ఇది అద్దె యిల్లు—అద్దె యిల్లు” ఎప్పుడూ యీ భయమే.

రాత్రిళ్లు ఎక్కువసేపు లైటు వెలిగిస్తే యింటి యజమాని వచ్చి దెబ్బలాడాడు.

తన దగ్గర ప్రయివేటు చెప్పుకునే పిల్లలు కొంచెం గొడవ చేస్తే యింటి యజమాని ఆ యిల్లు ఖాళీ చేయమన్నాడు.

కొన్ని కొన్ని ఇళ్లలో యిష్టం వచ్చినప్పుడు బయటకు వెళ్లటానికి వీలు లేదు. ఇష్టం వచ్చినప్పుడు లోపలకు రావటానికి వీలు లేదు.

ఎదురింటి వాడితో జగడాలు, ప్రక్క యింటి వాడితో విరోధాలు, పంపుదగ్గర దెబ్బలాటలు, అద్దె దగ్గర దెబ్బలాటలు.

అప్పులు, అవమానాలు, వైమనస్యాలు, పగలు.
ఇంకా ఎన్ని? ఎన్ని?

ఆ దృశ్యాలన్నీ ఈనాడు తలలో తిరుగుతున్నాయి. ఎన్ని యిబ్బందులు పడ్డాడు! ఎందుకు పడ్డాడు? తనకు అద్దె ఎక్కువ యిచ్చే తాహతు లేదు. చిన్న యిళ్లే తీసుకోవాలి. చౌకబారు యిళ్లలోనే కాపరం చెయ్యాలి. సరిపోక పోయినా సరిపెట్టుకోవాలి.

యాభయి అయిదేళ్ల జీవితం తనది. నిన్నగాక మొన్న ఉద్యోగం నుంచి రిటైరైన జీవితం తనది.

ఉద్యోగమే; బతకలేని బడిపంతులు పని.

అయిదు వేలు అందిచ్చి తనను వదిలిన బడిపంతులు పని.

ఇన్నాళ్లయాక, జీవితం యింత మొద్దుబారాక, అద్దె బ్రతుకు అలవాటు పడ్డాక మనసు ఇప్పుడెందుకో తిరగబడుతోంది. ఉద్యోగంనుంచి స్వేచ్ఛ లభించింది. ఇహముందు ఈ మనిషి తెల్లవారు ఝామునే తప్పనిసరిగా మేలుకోనక్కర్లేదు. కాలకృత్యాలు తీర్చుకుని ఆదరాబాదరాగా నాలుగు మెతుకులు నోట్లో వేసుకుని, రెండుమైళ్ళ దూరం కాళ్లీడ్చుకుంటూ నడవనక్కర్లేదు. అధికార్ల చీవాట్లు తిననక్కర్లేదు. రాత్రుళ్లు పన్నెండు వరకూ మేలుకుని కాంపోజిషన్ పుస్తకాలు దిద్దనక్కర్లేదు.

అంతటితో ఆగక మనసు ఇంకా స్వేచ్ఛ వెదుకుతోంది. అద్దె బ్రతుకుకు స్వస్తి చెప్పాలని చూస్తోంది.

తనూ ఓ యిల్లు కొనాలి.

చిదంబరానికి మేనంతా ఒక్కసారిగా గగుర్పొడిచింది. ఎంత తియ్యని అనుభూతి!

నిన్న తన స్నేహితుడు; అతనికీ తనకీ పాతికేళ్ల స్నేహం; అతనిది బ్రతికిచెడ్డ జీవితం — తన దగ్గరకు వచ్చి:

నాకో సహాయం చెయ్యాలి?"

"ఏమిటి?"

"చేస్తావా?"

అప్పుడే భయంవేయటం మొదలు పెట్టింది. ఏం సహాయం చేయగలడు తను? అశక్తుడే.

"చెప్పు" గొణుగుతున్నాను.

"నాకు డబ్బు కావాలి"

"ఎంత?"

అతను వికటంగానవ్వి అన్నాడు. జుట్టు నెరసినా, శరీరం ముడతలు పడినా, జ్వరం పీడిస్తూన్నా అతని నవ్వు యింకా యౌవనపు తీవితోనే వుంది. బ్రతికిచెడ్డవారి నవ్వులు అలానే వుంటాయి కాబోలు.

"నాకు ఎంత అయినా అవసరం వుంది. కాని అంత నాకెవ రివ్వగలరూ?"

కాని తను కొంత అయినా యివ్వలేడుగా. —

"నా దగ్గ రెక్కడుంది?"

"విను" అంటూ వచ్చిన స్నేహితుడు తాపీగా అన్నాడు: "మా తండ్రి తండ్రి రాజాబ్రతుకు బ్రతికాడు. మా తండ్రీ అంతే. నేనూ అంతే. కాని వాళ్ళంతా రాజాచావే చచ్చారు. కాని నాకా అదృష్టం లేకపోయింది. నా ఆస్తంతా యిప్పటికే నశించింది. ఒక్కోరోజు తినటానికి తిండికూడా వుండదు. నా గుడ్డలు మాయగా ఎప్పుడైనా నువ్వు చూశావా? ఇప్పుడూ చూడవు. లోకానికి దరిద్రుడిగా కనిపించటం భరించలేక యిలా దొంగబ్రతుకు బ్రతుకుతున్నాను. నువ్వు నా ఆప్తమిత్రుడివి కాబట్టి చెబుతున్నాను. నీ ముందు నేనెటువంటి రహస్యమూ దాచను. నీ ముందుమాత్రం నాకు సిగ్గు, అభిమానం లేవు. చంటిపిల్లకు జబ్బుచేస్తే నిన్న మందు యిప్పించేందుకుకూడా చేతిలో దమ్మిడీ లేకపోయింది. కంఠస్వరం వొణుకుతోంది. వేడి నిట్టూర్పు చలిగాలిలో కలిసిపోయింది. ఈ బ్రతుకు దుర్భరంగా వుంది. పదిమందిలో నా పరువు ఎలా పోగొట్టుకోను? ఇహ యీ వూళ్లో నిలవలేను. నాకు...నాకు...మిగిలింది ఒక్క యిల్లే. అది అమ్మేద్దామనుకుంటున్నాను"

భుజాలెగురవేశాడు తను. ఏం చేయగలడు తను?

"పరాయివాడికి బేరంపెట్టి నా పరువు ప్రతిష్ఠల్ని వేలం వేసుకోలేను. నువ్వే నన్ను కాపాడాలి!"

ఏమాశ్చర్యం? ఎటువంటివాడు తనని వచ్చి బ్రతిమాలుతున్నాడు? కాపాడగలిగే శక్తి తనకు వుందా?

"నీకు ప్రావిడెంట్ ఫండ్ వచ్చిందికదూ"

తలవూపక తప్పలేదు.

"ఎంత?"

"అయిదు వేలు"

"నేను చెప్పేది బాగా ఆలోచించు. నా యిల్లు నువ్వు చూశావుగా. దాని ఖరీదు యెంత చేస్తుందో కూడా ఆలోచిస్తే నీకు తెలియకపోదు. ఇంకా మూడు వేలు యెలాగయినా సంపాదించు. నీకిచ్చేస్తాను"

"నాకెందుకు యిల్లు?" అని గొణిగాడు.

"ఎందుకేమిటి? ఈ రోజుల్లో స్వంత యిల్లు వుండటంకన్న వేరే సౌఖ్యం ఏముంది? నాలో నమ్మకముంటే నా మాటల్ని విశ్వసించు. నాకు వేరేగత్యంతరం లేక యిల్లు అమ్ముకుంటున్నా కాని, మరేం లేదు. నేను యెటువంటివాడినో నీకు తెలిసి వుండకపోదు. నన్ను బహిరంగపరచి, నలుగురిలో నవ్వులపాలు చేయడం నీకు యిష్టమూ ఏమిటి?"

తల అడ్డంగా తిప్పాను.

"మరి! బేరానికి పెడితే నేను చెప్పిన ధరకన్నా యింకో రెండుమూడు వేలు యెక్కువ రాకపోవు. కాని నా పరువూ, మర్యాదా..."

ఎప్పుడూ యిదేమాట. ఈలోకంలో యితనికి యీరెండే ప్రీతిఅయిన పదార్థాలు కాబోలు.

"ఏమంటావు?"

ఏమనాలి? ఈడబ్బు వచ్చినదగ్గరనుంచీ యేం చెయ్యాలో తనకూ బోధపడటంలేదు. వడ్డీకి తిప్పు దామని ముందు అనుకున్నాడు. కాని ఆ వ్యాపారం తనకేం చాతవును? తనదృష్టిలో ఇంకా రెండుమూడు వున్నాయి. ఏవీ పాలుపోవటంలేదు. భార్యసలహా తీసుకోటానికే భయం. ఆడవాళ్ల తెలివితేటల్లో తన కంత నమ్మకంలేదు. ఇప్పుడు హఠాత్తుగా యీ చిర కాలమిత్రుడు నూతన సమస్య తెచ్చి పెట్టాడు. ఇందులో లాభంవుందో, నష్టంవుందో తనకేం తెలుసు? వ్యవహారాలు తనకు అంతగా తెలియవు.

"ఆలోచించాలి"

"ఆలోచించు. ఒకగంటసేపు టైముఇచ్చాను."

బ్రతికి చెడినవాళ్ల మాటలు ఇలా నేవుంటాయి కాబోలు.

"గంటా?" అని తెల్లబోయి "కాదు, రేపు చెబుతాగా" అని అప్పటికి తప్పించుకున్నాడు.

"రేపుసాయంత్రం మీయింటికి వస్తాను. అర్థం టయిన విషయంసుమా."

"ఎందుకూ? నేనేవచ్చి ఏ సంగతీ చెబుతాను."

అతను వెళ్ళిపోయాడు.

రాత్రంతా ఆలోచనలు. ఒకానొక పెద్దసమస్య ఎలా పరిష్కరించాలి. ఆ మాటలు స్నేహితుడి నోటిలోంచి విన్నప్పుడు ఎక్కువ చలించలేదుగాని, లోతుగా ఆలోచించిన కొద్దీ ఊహలన్నీ హాయిగా, తీయగా వున్నాయి. స్వంతయిల్లు. ఇన్నాళ్లకు ఓ స్వంతయిల్లు. ఎడా తెరిపీ లేకుండా అద్దెయిళ్ళలో గడిపిన వ్యక్తికి, స్వంతయిల్లంటూ రావటం వింత అనుభూతే. మొదట కొద్దిగా భయం, తరువాత ఆందోళన, ఆ తరువాత కుతూహలం, యింకా తరువాత ఆనందం యివన్నీ కలుగుతున్నాయి.

ఇన్ని మెట్ల తరువాత వుంది ఆనందం. ఇంటి యజమాని అయితే అంత ఆనందమూ అనుభవించ వచ్చన్నమాట.

చివరకు కొందామనే కోరికే బలమవుతోంది. కాని అంతడబ్బు తను భరించగలడా? మూడు వేలు అప్పు. అసంభవం.

రాత్రంతా కలిగిన ఆలోచన ఫలితమే యీనాటి యీ దృఢనిశ్చయం. అందుకే యీ అదుర్దాను అణుచుకోవటం కష్టంగావుంది. పాడువర్షం పగసాధిస్తోంది. ఈ వానలో ఎలా తడిసి, బయటకుపోయి అతనికి యీ విషయం వెల్లడించటం.

ఒక్కరోజులో పుట్టి పెరిగిన వాంఛకు ఎంత బలం? తనని యింత ఆకర్షణలో పెట్టిందే. మిగతి విషయాలపట్ల శ్రద్ధను పూర్తిగా విస్మరింప చేసిందే.

అంతేకాదు. ఎన్నడూ యింత చిరాకుపడ లేదు. ఈరోజు యీ అద్దెయింటిమీద ఎనలేని అసహ్యం కలుగుతోంది.

ఈ యింట్లో పంపులేదు. శానిటీ లేగతి. ఎలక్ట్రిసిటీ లేదు. వానవస్తే యిల్లంతా తడుస్తుంది. చెప్పలేని యిరుకు. ఇన్నాళ్లు యీ యింట్లో తనూ, భార్య పిల్లలూ యింతమంది ఎలా కాపురమున్నారు?

అమ్మకానికి వచ్చిన యిల్లు తనకు పరిచితం. ఇంతకు మూడురెట్లు వుంటుంది. డాబాయిల్లు. ఎలక్ట్రిసిటీ, పంపు యీ సౌకర్యాలన్నీ వున్నాయి. మంచి లొకాలిటీ. ఇంతకన్నా ఏంకావాలి? అంతేకాదు. తాము కాపురముండగా మరొకరికి అద్దెకుకూడా యివ్వవచ్చు.

ఏమిటి? తనుయిల్లు అద్దెకు యిస్తున్నాడా?

వళ్లు పులకరించింది. ఆనందబాష్పాలు రాలటానికి అట్టే వ్యవధి లేదు. ఎంతటి ఘనకార్యం చేయబోతున్నాడు? తను ఓయింటియజమాని అవుతున్నాడు. తనయిల్లు అద్దెకిస్తున్నాడు. తన చుట్టూ అద్దెకిమ్మని అనేకమంది ప్రాధేయపడుతూ తిరుగుతారు. ఎంత కథా? ఎంత కమామీషూ?

వీధితలుపు ఎవరో తట్టినట్లు అనుమానం కలిగింది. ఈ వానలో తన యింటికి ఎవరువస్తారనే అపనమ్మకంతో లేవలేదు. రెండు నిమిషాలాగి తలుపు మళ్ళీ అస్పష్టంగా మోగింది. అనుమానం తీరింది. తనతలుపే. ఆ కొట్టేవాడు స్పష్టంగా కొట్టరాదూ? ఆయన లేచి వెళ్లి, తలుపుతీశాడు. చప్పున జల్లు లోపలకు వచ్చింది. సన్నని, పొడుగాటివ్యక్తి గుమ్మంలో నిలబడివున్నాడు, చేతిలో గొడుగు.

చిదంబరం వెంటనే సంతోషంతో "ఓ లోపలకు రా" అన్నాడు. ఆ వ్యక్తి లోపలకువచ్చాక, తలుపు మూశాడు.

ఇద్దరూపోయి చాపమీద కూర్చున్నాక ఆ వ్యక్తి "ఏ మాలోచించావు?" అన్నాడు.

వస్తూనే వ్యవహారంలోకి లాగుతున్నాడు. ఎంత ధీమా?

తనూ ఖచ్చితంగానే మాట్లాడాలి. మొహమాటం కూడదు. స్నేహాన్ని కొంతసేపు అవతలకు పెట్టాలి. నేర్చుకోవాలి.

"అంత యివ్వలేను."

"ఎనిమిది వేలు!"

"అవును."

అతను ఓసారి వికటంగా నవ్వి "అంత ఇంటిని ఎనిమిది వేలకు తక్కువ కొనటానికి ఎలా ఆశించావు?" అన్నాడు.

"నా శక్తికి మించినపని చెయ్యలేను."

"అప్పు చెయ్యి."

"ఎంతని? మూడు వేలా? నావల్ల కాదు."

"పోనీ ఎంతకు కొందా మనుకుంటున్నావు?"

"ఆరు వేల కన్నా దమ్మిడీ ఎక్కువ యివ్వలేను."

అతను వెంటనే లేచి నిలబడ్డాడు. "ఆశకు అంతం ఉండాలి. సరే నీ ఉపకారాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటాను లే. తప్పేదేముంది? నా పరువు ప్రతిష్ఠల్ని వేలం వేస్తాను" అన్నాడు.

"అది చాలా పాతయిల్లు" అని చిదంబరం హీన స్వరంతో గొణిగాడు.

"అయినా ఎనిమిదికంటే ఎక్కువ విలువే చేస్తుంది.

చిదంబరం మౌనం వహించాడు. "సరే— అయితే వెళుతున్నాను" అని అతను రెండు మూడు అడుగులు వేశాడు.

వెళ్ళిపోతున్నాడే. తన కలలు!

దురాశ పీకుస్తోంది. "పోనీ—ఇంకో అయిదు వందలు.

"లాభం లేదు"

వెళ్ళిపోతున్నాడు. చిదంబరానికి కోపం వచ్చింది. పౌరుషంతో కూడిన కోపం కాదు యిది. నిరాశవల్ల కలిగిన కోపం. దుఃఖ పూరితమైన కోపం.

"నాకు అక్కర్లేదు. వెళ్లిపో" అని అరిచాడు. మళ్లీ అన్నాడు. "నీ స్థితే నీకు తెలుసు. ఇవతలివాడి సాధకబాధకాలు నీకు అక్కర్లేదా? అంత నిర్లక్ష్యమా? మూడు వేలు నే తెస్తే ఎలా తీర్చేది?"

పోబోతున్నవాడల్లా ఆగి, వెనక్కి తిరిగి వచ్చాడు. ఎంత గాంభీర్యం ఆ మాపుల్లో! "సరే. అంగీకరించాను."

చిదంబరం సంతోషంతో లేచి నిలబడ్డాడు.

అతను చేయిజాపి "అయిదువేలు ముందు తే."

రాజా మాటలు. మాటల్లో ధీమాకు తక్కువ లేదు.

కాని చిదంబరం తట్టుకుని "నాదగ్గరెక్కడున్నాయి? బ్యాంకిలో వేశాను. రేపు ఫైసలు చేసుకుందాం. కాని...అని సందిగ్ధంతో ఆగాడు.

"ఏమిటి?"

"నాకు పదిహేను వందలు ఎవరిస్తారు?"

"ఆ పూచీ నాది. ఇంటి తాకట్టు మీదే, నీకు యిప్పిస్తాను."

"తాకట్టా?" అని చిదంబరం నివ్వెరపోయాడు.

"అవును. భయమేముంది? నిమ్మదిమీద తీర్చుకోవచ్చు?

మనసు పని చేయటం మానింది. ఎలానూ రంగంలోకి దిగాడు. ఏం జరుగుతుందో జరగనీయి.

"సరే. రేపు ఉదయం వస్తాను" అని వెళ్ళిపోయాడు. చిదంబరం మళ్లీ చాపమీద కూలబడ్డాడు. ఇన్ని ఆలోచనలను భరించటమెలా? ఒకటే... ఒకటే ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. భయాన్నీ కలిగిస్తోంది. ఇంత పెద్ద విషయాన్ని, ఎవరికీ చెప్పకుండా, స్వంతంగా, యింత తేలికగా ఎలా పరిష్కరించుకున్నాడు. ఈ ధైర్యం తనకు ఎలా వచ్చింది.?

జవాబు లేదు. జవాబు రాదు.

* * *

మచ్చుటగా మూడురోజుల్లో వ్యవహారం అంతా ముగింపుకు వచ్చింది. ఇల్లు కొంత బాగు చేయవల్సింది వుంది. అందువల్ల అప్పు రెండు వేలవరకూ ఎగ్రబాకింది. మూడోరోజుకు యిల్లు చిదంబరం స్వాధీనం అయింది.

ఈవిషయం ఆయనభార్యకూ తెలియదు. పిల్లలకూ తెలియదు. పెళ్లికి వెళ్ళినవాళ్లు తిరిగి వచ్చేటప్పటికి కనీసం యింకో మూడురోజులు పడుతుంది. వాళ్లు యిక్కడికివచ్చి ఆశ్చర్యపోవాలి. అభినందించాలి. తర్వాత సుఖించాలి.

ఇల్లు ఖాళీ అయింది. తన చేతిలోకి వచ్చింది. దీనికి మరమ్మత్తు చేయవలసిన అవసరం వుంది. ఈపని కూడా భార్యా, పిల్లలూ వచ్చేలోగానే సంపూర్తి చేయాలి.

ఈ మూడురోజులూ ఆయన నిద్రాహారాలు లేకుండా కష్టపడ్డాడు. క్రొత్తయింటికి మరింత అందం అంటగడుతున్నాడు. చాలామంది మిత్రులువచ్చి అభినందించి వెడుతున్నారు. తనతో పనిచేసిన వాళ్లలో, తనస్నేహితుల్లో ఎవరికి వుంది స్వంత యిల్లు?

మరమ్మత్తు పూర్తిఅయ్యాక డాబామీద నిల్చుని గర్వంగా, నలువైపులా చూశాడు. ఎటువంటి పరిసరాలు!

ఇహముందు తను అద్దె యింట్లో బాధపడ నక్కర్లేదు. "ఇంకా కొన్నాళ్లు పోనీయండి" అని ఎవరిన్

ప్రాధేయపడనక్కర్లేదు. చాలీ చాలని దీపం వెల్తుర్లో చత్వారపుకళ్ళతో పుస్తకాలు చదవలేక యిబ్బంది పడనక్కర్లేదు. నీళ్ళకోసం బావిదగ్గర అవస్థపడనక్కర్లేదు. ఇహముందు తనయింట్లో నీళ్లు కురవవు. ఇహ ముందు తనకు మనశ్శాంతికి కొదవలేదు. తన పిల్లలందరూ ఒకేచాపమీదపడి దొర్లరు. ఇల్లు చాలటం లేదని భార్య విసుక్కోదు. ఎంతశాంతి!! ఎంతహాయి? ఎంతసౌఖ్యం?

ఈ స్థితిలో వెలువడే నిట్టూర్పులో ఎంత సొగసు వుంది?

ఇటువంటిస్థితిలో నడిచే నడకలో ఎంత ఠీవి వుంది?

ఇట్టిస్థితిలో నవ్వే నవ్వులో ఎంత గాంభీర్యం వుంది?

ఎంత కమ్మని అనుభూతి? యాభయి అయిదేళ్ల తర్వాత ఎంతటిప్రయోజకుడు అయ్యాడు.

తను యిల్లు కొన్నాడు.

తను యిల్లు అద్దెకిస్తాడు.

ఆరోజే కాదు, ఈవిధమైన ఆలోచనతో మరో రెండురోజులు గడిచాయి. ఓరోజు ఆయన ఇదివరకటి యింటిముందు బండీవచ్చి ఆగింది. అందులోంచి నలభైయేళ్ళ ముత్తైదువ, ఇరవై రెండేళ్ల యువకుడు పదహారేళ్ళ అమ్మాయి, ఇద్దరు చిన్నపిల్లలు, ఒక చిన్న పిల్లవాడు దిగారు. వాళ్లు దిగేసరికి ఆ యింటికి తాళం పెట్టివుంది.

"ఎక్కడికో పోయార్రా అబ్బాయి" అంది ఆవిడ.

అతను చిరాకుపడటం ప్రారంభించాడు. ముసలాయనకు యీ వేళ కాని వేళలో పెత్తనాలు ఏమిటి? తన యింట్లో హాయిగా పడుకోరాదూ? రాత్రంతా చచ్చీ చెడీ ప్రయాణంచేసివచ్చి, యిప్పుడింటిబయట ఎవరు పడిగాపులు కాస్తారు? గొణగటం మొదలు పెట్టాడు. తండ్రి ఏమాత్రంపొరబాటుచేసినా సహించటం అలవాటులేని పద్ధతి అతనిది.

పిల్లలు ఎక్కువసేపు 'ఆకలో' అని గోలచెయ్యకుండానే, తల్లి మరింత విసుక్కోకుండానే. యువకుడి సణుగుడు తిట్లలోకి యింకా మారకుండానే చిదంబరం అక్కడికి అవతరించాడు.

"ఉత్తరం రాయకుండా యెందుకు వచ్చారే?" అన్నాడు.

"బాగుంది నిర్వాకం. తొందరగా తాళం తియ్యండి" అందావిడ. మరో రెండునిమిషాల్లో అంతా లోపలకు చేరుకున్నారు.

"ఎలా జరిగింది పెళ్ళి?" అని ప్రశ్నించాడు చిదంబరం.

"పెళ్ళికేం? నిక్షేపంలా జరిగింది! మీరు రాలేదని వాళ్లంతా ఒకటేదెప్పి పొడిచారు" అంది భార్య.

"రెండు సంవత్సరాల క్రితం అతనంత మాట అన్నాక నాకు రా బుద్ధిపుట్టలేదు"

"చాల్లెండి. అతనింకా మనసులో ఆ విషయం పెట్టుకుని కూర్చున్నాడనే అంటారేమిటి?" అని ఆవిడ కాళ్లూ చేతులూ కడుక్కునేందుకు లోపలకుపోయింది.

తర్వాత చాలాసేపు పెళ్లి కబుర్లలో అంతా మునిగిపోయారు. చిదంబరం యింకా ఆ విషయం బయటపెట్టలేదు. హఠాత్తుగా బల్లగుద్ది వాళ్లందరినీ సంభ్రమాశ్చర్యాలలో ముంచివేద్దామని అతని ఉద్దేశం. తర్వాత ఆవిడ వంటప్రయత్నంలో మునిగిపోయింది. వంట చేస్తుంటే చిదంబరం అక్కడికి ఓసారి వచ్చిచూశాడు. పెద్దకూతురు తల్లికి వంట ప్రయత్నం చేస్తోంది. చాలీచాలని వంటిల్లు. బోలెడు పొగాను. మనిషి కదలటానికి కూడా వీలులేనంత ఇరుకు. అట్లా యిబ్బంది పడుతున్న భార్య మీద చెప్పలేని జాలి పుట్టుకొచ్చింది అతనికి.

భోజనం చేస్తూండగా భార్య అంది హఠాత్తుగా "అన్నట్టు చెప్పటం మరిచిపోయానండోయి. కొంప మునిగింది?"

చిదంబరం ఉలిక్కిపడి "ఏమిటే?" అన్నాడు.

అంతవరకూ గుమ్మందగ్గర నిలబడివున్న పెద్దమ్మాయి చప్పున లోపలకు వెళ్ళిపోయింది.

"కట్నం యివ్వందే వాళ్లు జానకిని చేసుకోరుట."

చిదంబరానికి ముద్ద మింగుడుపడలేదు. ఒక్కక్షణంలో ముఖమంతా వివర్ణమైంది. గబగబ మంచి నీళ్లుతాగి "మరి మొన్నటిదాకా అలా అనలేదుగా" అన్నాడు.

"కట్నమిస్తామంటూ వాళ్లకింతకంటే మంచి సంబంధాలొస్తున్నాయట"

చిదంబరానికి తల తిరిగినట్లయింది. ఏమిటీ దుర్వార్త? ఇంతవరకూ కూతురి పెళ్ళిగురించి తన కెటువంటి చింతా లేదనుకున్నాడు. దమ్మిడీ కట్నమివ్వకుండా సంబంధం సిద్ధంగావుందని సంతోషించాడు. కాని చివరకు కథ యిలా అడ్డం తిరిగిందా? తన పరిస్థితి తెలిసికూడా అలా అడిగేందుకు వాళ్లకు మనసెలా వొప్పింది?

"నువ్వేమన్నావు?" అన్నాడు కీచు గొంతుకతో.

"బ్రతిమిలాడి, భంగపడ్డాను"

"మరి, యిప్పుడెలాగ" అన్నాడు చిదంబరం దిగులుగా.

కొంచెం ఆగి ఆవిడ అసలు విషయం మెల్లగా బయట పెట్టింది "వాళ్ళంటారూ? మొన్న నేకదా——'అకేవిఃటమ్స్త్ర అఫండ్ నోరు తిరగదు నాకు' అయిదు వేలు వచ్చిందికదా. కూతురి పెళ్ళికోసం ఆ మాత్రం ఖర్చు చేయలేడా?" అని.

చిదంబరం నెత్తిమీద పిడుగు పడ్డట్లయింది. బంధువులు అనుకున్నవాళ్ళు చివరకు యింతటి కుతంత్రానికి పూనుకున్నారా? ఎంత దారుణం?

"దమ్మిడీ యిచ్చేది లేదు" అన్నాడు.

ఆయన ధోరణి చూసి, ముందు భార్య కొంచెం బెదిరినా, తర్వాత తెలివిగా అంది: "మనం కూడా అలా పట్టుబడితే ఎలా? ఆడపిల్లలు కలవాళ్ళం."

"అయితే, అడుగులకు మడుగులొత్తాలా?"

"అదికాదు, నేననేది, మనం ఒక మెట్టు క్రింద వుండాలి."

"ఇవన్నీ నాకు తెలుసు. చస్తే నేను కట్నం యివ్వను"

"అంత పట్టుదల అయితే ఎలాగండీ? మనమ్మాయి పెళ్ళి కావటం మనకు ముఖ్యం కాదా?"

"అయినప్పుడే అవుతుంది. కట్నం యివ్వకుండా చేసుకునేవాడు వచ్చినప్పుడే చేస్తాను."

"అవన్నీ కలలోని మాటలు. ఇంత దగ్గర సంబంధం వొదులుకుంటే మళ్ళీ మన తరం కాదు, దాని పెళ్ళి చెయ్యటం."

చిదంబరం విసుగ్గా "అయినా నా దగ్గర డబ్బేదీ?" అన్నాడు.

"అదేమిటి? అయిదు వేలూ..."

"ఇల్లు కొన్నాను" మానవుడు నోరు జారాడు.

వడ్డిస్తూన్న భార్య, తలవంచుకు తింటూన్న పెద్ద కొడుకూ, గోడ చాటునుంచి చాటుగా వింటూన్న పెద్ద కూతురూ ఒక్కసారిగా కొయ్యబారి పోయారు. చిదంబరం నాలిక కొరుక్కుంటున్నాడు. చెప్పక తప్పని విషయమే. ఎటువంటి పరిస్థితుల్లో చెబుదామనుకున్నాడు? ఎటువంటిస్థితిలో చెప్పాడు? ఒక్కసారిగా వాళ్ళందరి హృదయాలకూ కొరడా చురుకు అంటించాడే వాళ్ళలా తెల్లబోవటం, ఆ ముఖాల పేలవం తనకు మరీ హృదయ విదారకంగా వుంది. ఇహ యీ అన్నం నోట్లోకి ఎలా పోతుంది? ఇక్కడినుంచి తప్పనపోయి ఎక్కడైనా దాక్కుంటే బాగుండును. ఇహ అనుకోని సంఘటనలు ఎదురౌతాయి కాబోలు. ఎటువంటి ఘాతాన్ని కలిగించే మాటలు వినిపిస్తవో!

నిశ్శబ్దం—రెండు...మూడు క్షణాలు భయంకరమైన నిశ్శబ్దం.

"ఇలా ఎందుకు చేశారండీ" అంది ఆవిడ. "నాతో ఒక్క మాటయినా చెప్పకుండా కొంప కూల్చారే."

చిదంబరానికి కోపం వచ్చింది. అసమర్థతతో కూడిన కోపం. "కొంప కూలవలేదు. కొంప కొన్నాను."

భార్య వెంటనే అందుకుంది. "ఎవరి కోసం? ఏ సుఖం కోసం?"

"ఏ సుఖం కోసమా?" చిదంబరం కటువుగా అన్నాడు. "ఇన్నేళ్ళు వచ్చాక ఆ విషయం నీకు చెప్పాలన్నమాట. ఆహా. నీ బుద్ధి చూపించావే. ఇన్నాళ్ళూ నా రక్తం పోద్సి సంపాదించాను. మీ అందర్నీ పోషించాను. వీడు పెద్దవాడయ్యాడు. ప్రయోజకుడయ్యాడు. నెలకో నూటయాభయి తెస్తున్నాడు. ఇప్పటికైనా నేను సుఖానికి నోచుకో లేదా?"

"ఎవరు వద్దన్నారు? కాలుమీద కాలు వేసుకుని కూర్చోండి మహారాజులాగా. కాని యిదేంపని? ఎవరితో చెప్పా పెట్టాకుండా?"

ఆయన యీ సారి ఆకాశమండలానికి లేచాడు. "ఏమిటే నీకు చెప్పేది. ఈ బోడి సలహా చెబుతావనేనా? ఆ మాత్రం తెలివి తేటలు నాకూ లేకపోలేదు. డబ్బుని ఏవిధంగా సద్వినియోగం చెయ్యాలో నాకూ తెలుసు. ఇంకా...ఇంకా..." అని గాద్గదికంగా "యిలా అద్దెయిళ్ళలో పడి వాళ్ల చేత వీళ్ల చేత మాటలు పడుతున్నావా? ఎవడైనా చుట్టం వస్తే కదిలేందుకు, మెదిలేందుకు కూడా చోటు లేని ఈ కొంపలో కుళ్లి కుళ్లి జీవించమంటావా? ఇన్నాళ్లు ఉద్యోగం చేశాను. ఇంత అనుభవం సంపాదించాను. నాకు తెలుసంటావా నీకు తెలుసంటావా? కష్టపడి సంపాయించిన డబ్బుతో యిల్లుకొని అందులో హాయిగా వుందామంటే మీకు కంటగింపైందీ. ఈ సమయంలో కాకపోతే సప్త జన్మాలకైనా అటువంటి యిల్లు కొనగలుగుతామా?"

ఆ తరువాత మాటలు పెగల్లేదు. ఆ సన్నివేశంలో మరి అక్కడ నిలవగలగటం అసంభవం. అప్పుడు ఒకటే సంభవం. బయటకు నడవటం. అదీ చేయగలిగాడు.

బయట తిరిగి ఆలోచన్లు అలుముకుంటున్నాయి.

ఎంత పని చేశాడు? ఆ వింతైన ఉద్రేకం ఎందుకు ప్రదర్శించాడు? నిజంగా అది నిజమైన ఉద్రేకమేనా? కాజాలదు. తెచ్చిపెట్టుకున్నదీ కాదు. అంత కృత్రిమ ఉద్రేకాన్ని ప్రదర్శించే అవసరం తనకు లేదు. ఏదో భావాన్ని ఉద్రేక రూపంలో చూపించాడంతే.

భార్యతో యిలా మాట్లాడటం మంచిదో, కాదో తనకు తెలియదు. కాని ఆ సంభాషణ యింట్లో చాలా గొడవ లేవదీయగలదని మాత్రం ఊహించగలడు. కన్నీళ్లకు కొదవ వుండదు. ఊహ తెలిసిన ఆడవాళ్లు ఒకరికి యిద్దరున్నారు గనుక. నిజానికి ఆలోచిస్తే తను చేసిన తప్పేమిటో కూడా బోధపడటం లేదు. బహుశా కొద్ది రోజుల్లో తన మాటల్లోని సత్యం వాళ్లే తెలుసుకుంటారు.

నిజానిజాలు ఇప్పుడే బోధపడుతున్నాయి. కొడుక్కి కూడా కోపం రావటం అసహజం కాదు. ఇంటికీ ఆఫీసుకూ ఎంతో దూరం. సైకిలు కొనుక్కోవాలని వాడు చాలా కాలంనుంచీ అభిప్రాయపడుతున్నాడు. ఆ కోరిక రెండుమూడుసార్లు పరోక్షంగా తెలియపర్చాడు కూడా. ఈ విషయాన్ని తను పూర్తిగా విస్మరించాడు. మనసులో వాడు చాలా మథనపడుతూ వుండాలి.

అదీగాక భార్య యీ విషయానికీ, కూతురు పెళ్లికీ ముడిపెడుతుందని తను కలగనలేదే.

చిదంబరం ఆ మధ్యాహ్నం యింటికి పోలేదు. ఎంత అరికట్టుకుందామన్నా ఏదో తెలియని భయం వెన్నాడుతూనే వుంది. తను చేయని తప్పుకు, కొన్ని గంటల క్రితం వరకూ ఘన కార్యం అని ఉప్పొంగిన పనికి యీ క్షణంలో భయపడుతున్నాడు. బెదురుతున్నాడు. చలిస్తున్నాడు.

కాళ్ళలో మునుపున్న బలం లేదు. ఎక్కువ దూరం తిరగలేడు. మనసుకు నిగ్రహశక్తి లేదు, స్నేహితుల యిళ్లలో ఎక్కువసేపు గడపలేడు.

కాబట్టే రాత్రి ఏడు అయేసరికి తిరిగి యింటికి చేరాడు.

కొడుకు యింట్లోనే వున్నాడు. తలెత్తి తనని చూడలేదు. ఎందుకు వాడికంత కసి? వాడి మదిలో యింకా తీరని కోరికలు ఏమయినా వున్నాయా? మాట్లాడకుండా పోయి. కాళ్ళూ చేతులూ కడుక్కు వచ్చి పీటముందు కూర్చున్నాడు. భార్య నిశ్శబ్దంగా వచ్చి వడ్డించసాగింది. ఇద్దరిలో ఎవరూ మాట్లాడటం లేదు. జరిగిపోయిన విషయాన్ని గురించి రేపితే ఉదయంలా, తను మళ్ళీ ఎంగిలిచేత్తోనే బయటకు వస్తాడని ఆవిడకు భయం కాబోలు.

భోజనం అయాక, చేతులు కడుక్కొని, తువ్వాలతో తుడుచుకుంటూండగా వెనకనుంచి వచ్చింది.

"ఏయిల్లు కొన్నారు?" నిదానంగా వుంది. కంఠస్వరం.

"గోవిందరావుగారిది."

కొన్ని క్షణాలు నిశ్శబ్దం.

"ఎంత?"

"ఆ..." అప్పుచేశానని చెప్పటానికి నాలిక బంకించి. ఈ నిజం చెప్పటానికి పూర్తిగా అధీనుడయ్యాడు.

"అయిదు వేలు సరిగ్గా."

ఆమె ఏమీ మాట్లాడకపోయేసరికి మళ్లీ తనే "ఎల్లుండి మంచి రోజు, గృహప్రవేశం" అన్నాడు.

తలూపి ఆవిడ లోపలకు వెళ్లిపోయింది.

* * * *

స్వంతయింట్లోకి ప్రవేశించి పక్షం రోజులు గడిచాయి. మానసిక బాధలు మళ్ళీ అంతరిస్తున్నాయి. మాసిపోయిన గర్వం, ఆనందం మళ్ళీ చిగురిస్తున్నాయి.

ఓరోజు "ఈ భాగము అద్దెకివ్వబడును" అని తనే స్వంతంగా కూర్చుని ఓపిగ్గా బోర్డు రాశాడు. దాన్ని గోడకు తగిలించి, దానివంక ఓసారి నిటారుగా చూసి, హాయిగా నవ్వుకున్నాడు.

ఇక రేపటినుంచీ తన యింటిచుట్టూ అద్దెకోసం మనుషులు విసుగులేకుండా తిరుగుతారు కాబోలు. తను వారిని యక్షప్రశ్నలు వేస్తాడు కాబోలు. వాళ్లు అద్దె తగ్గించమని తనని బ్రతిమలాడుతారు కాబోలు.

ఒకభాగం తన కుటుంబానికి చాలు. ఎడంవైపు వున్న చిన్నభాగం అద్దెకు యివ్వబడుతుంది.

"ఈ భాగము అద్దెకు యివ్వబడును."

ఈ భాగం తన స్వంతం. తనకు సామాన్యంగానే కనబడుతోంది. కాని కొంతమందికి యిది దాహం వేసిన వాడికి మంచినీళ్లు కనిపించిన చందాన కనిపిస్తుంది కాబోలు. దీనికోసమే వాళ్లు తపిస్తారు కాబోలు. అద్దె యిళ్ళకోసం తిరుగుతున్న వాళ్లకు యిది వెదుకబోయిన తీగ కాళ్ళకు తగిలినట్లు అనుభూతి కలిగిస్తూ, గిలిగింతలు పెడుతుంది కాబోలు.

అనుకున్నట్టుగానే ఆయన కలలు నిజమౌతున్నాయి. తీర్థప్రజలా కాకపోయినా రోజుకు ఒకరూ యిద్దరూ యింటికి వచ్చి చూసి, మాట్లాడి వెడుతున్నారు. అద్దెముప్పయిరూపాయలు. ఏ మాత్రమూ తగ్గవద్దని ఒకరిద్దరు స్నేహితులు సలహాలు యిచ్చారు. ఆ ప్రకారమే కఠినంగా వుండటానికి మనసు కొంచెం ఎదురు తిరుగుతున్నా పాటిస్తున్నాడు. ఇద్దరు ముగ్గురికి యిల్లు నచ్చలేదు. ఇద్దరు ముగ్గురు అద్దె భరించలే

మన్నారు. ఇద్దరు ముగ్గురు హిరణ్యాక్ష వరాలు కోరి, ఆయన్ని విసిగించి తిరస్కరింపబడ్డారు. తను అను కున్న విధంగా ఎవరూ తనని హృదయపూర్వకంగా బతిమిలాడక పోవటం కొంచెం బాధాకరంగానే పరిణ మించింది ఆయనకు. తన దగ్గరకు అటువంటి వాళ్లు రారు కాబోలు. కొద్దిరోజులవరకూ, సరియైనవాళ్లెవరూ కుదరకపోతే చిరాగ్గానే వుంది.

చివరకు ఓ ప్లీడరుగారు ఆ యింట్లో వుండటా నికి ఖాయం చేసుకున్నారు. మరో రెండు రోజులకు భార్యా, ఒక యింటర్మీడియట్ చదువుతూన్న కొడు కుతో సహా వచ్చి దిగారుకూడా.

ఈ గొడవల్లో ఆయన అప్పు విషయం మరిచి పోలేదు. నీడలా ఆ భయం అనుక్షణం వెన్నాడు తూనే వుంది. ఒకళ్ళకు చెప్పుకునే బాధ కాదు. భార్యకు తెలియదు. కొడుక్కు తెలియదు. కొడుకు సంపాదిస్తున్న నూట యాభయి రూపాయలతో సంసారం యీదుకురావచ్చు. అద్దె మీదవచ్చే ముప్ఫయి పదిలంగా దాచాలి. తను ఇప్పుడు అయిదుగురు కుర్రాళ్లకు ప్రయివేటు చెప్తున్నాడు. దానిమీద ఓ నలభైరూపాయలు వస్తాయి. వీటిలో ఓ దమ్మిడీ ఖర్చుచేయటానికి వీల్లేదు. వీటిద్వారానే ఆ అప్పును రద్దుచేయాలి.

ఒకరోజు సాయంత్రం అలా బజారు పనిచూసు కొని వస్తూంటే బలరామయ్య కనిపించాడు. దారిలో ఆపి చాలాసేపు కబుర్లు చెప్పాడు.

"నీకేమిటి? అదృష్టవంతుడివి దర్జాగా కొట్టే శావు" అన్నాడు.

లోపల సంతోషం ఉబుకుతున్నా, బయటకు తేల్చేస్తూ "ఆఁ ఏం దర్జాక? పాతయిల్లు. రిపేర్లు చేయ టానికే మూడు నాలుగువందలు అయింది" అన్నాడు.

"ఎన్నయినా అను. అదృష్టవంతుడివి."

చిదంబరం విచారంగా నవ్వి "ఏం లాభం? దీనికోసం నీదగ్గర రెండు వేలు అప్పుచేయాల్సివచ్చింది" అన్నాడు.

"దానికేముంది? నీకు వీలయినప్పుడు తీర్చేద్దువు గాని."

"నువ్వు కాబట్టి తాకట్టులేకుండా అంత డబ్బు అప్పు యిచ్చావు, లేకపోతే నాపాట్లు ఉండేవి" అని చిదంబరం సకోసారో, సదిహేసో సారో అభినందనలు తెలియజేశాడు.

"నావిధి నేను నెరవేర్చుకున్నాను. నీమీదనాకు నమ్మకం అమాత్రం లేదా?"

కృతజ్ఞత నిండిన కళ్ళతో చిదంబరం చూశాడు మరికొంతసేపు మాట్లాడి తనదారిన వచ్చాడు.

ఈమధ్య భార్యకూడా ఏమీ గొడవచేయటం లేదు. మనసులో ఏమి అనుకుంటూందో ఏమో. కాని యీ యిల్లు అందరి సంతోషం కోసం కొన్నప్పుడు అందరికీ కాక సంతోషం తనకు ఒక్కడికే కావటం వల్ల కొంత విచారంగానే ఉంది. బయటకు ఆవేశాలు పొక్కటం లేదు. ఏనాడో ఒకనాడు మనసులో దాగు కున్న యీ దుఃఖాలూ, ఆవేశాలూ బయటకు విరజిమ్మవు గద?

చిదంబరం ఇంటికి వచ్చేసరికి ప్లీడరుగారి భార్య తనభార్యా హోరాహోరీగా పోట్లాడుకొంటున్నారు.

ఆ మాటలు వినరానివి. ఇంకా విచిత్రమైనవి.

తనరాకతో యిద్దరినోళ్ళూ కట్టుబడ్డాయి. వారటూ, వీరిటూ వేంచేశారు. విశాలమైన మధ్య గదిలో కొత్తగాకొన్న కుర్చీమీద చిదంబరం కూలబడి "ఏమిటే యీ దెబ్బలాట?" అన్నాడు.

"అదికాదండీ. మన పంపులో నీళ్లుపట్టుకున్నంత సేపూ వాళ్ళవైపుకు నీళ్లురావుట అందుకని మనల్ని నీళ్లు పట్టుకోకుండా వూరుకోమంటే ఊరు కుంటామా?"

"అందుకని నలుగురిలో నవ్వులపాలు అయేటట్లు అరుచుకుంటారా? అప్రతిష్ఠ వాళ్ళకు కాదు. మనకు. ఫలానా యింటివాళ్లు మంచివాళ్లు కాదంటారు."

"మీకేం? అలానే చెబుతారు. అదిషమాటలు వింటూ ఊరుకోవటం నాకు చేతకాదు."

"ఏం చాతవును? వాళ్ళింకా యింట్లో చేరి పదిరోజులు కాలేదు. అప్పుడే జగడాలా?"

భార్య గొణుక్కుంటూ లోపలకు పోయింది. తను యెంతోకాలం అద్దె యిళ్లలో నివసించాడు. ఎప్పుడూ పైచెయ్యిగా యింటివాళ్లదే వుండేదిగాని తనదిమాత్రం కాదు. ఇప్పుడు యీ యింటి యజమాని తను. ఈ అధిక్యతని ఎందుకని నిరూపించుకోకూడదు? ఒక వేళ బానిసత్వం అలవడ్డ బతుకు అధికారం చెలా యింపటానికి వెనుకంజ వేసినట్లు తనూ వెనక్కి తగ్గి పోవటల్లేదుకదా. మరి ఆ చొరవ రాదేం?

* * *

రోజులు గడిచిపోతున్నాయి ఆయన అను కున్నది సరిగ్గా ఒక్కటీ నెరవేరుతున్నట్లు కనబడటం లేదు. చీటికీ మాటికీ రెండువేల అప్పు కళ్ల ముందర మెదుల్తోంది. ఎవరికీ తెలియని అప్పు, ఎవరికీ తెలియ కుండానే తీర్చాలి. మొదట నెలకు డెబ్బై రూపా యలు దాద్దామని అంచనా వేశాడు. కాని పాతిక రూపాయలకంటే మిగలటల్లేదు. ఎక్కడలేని డబ్బు ఖర్చు అయిపోతోంది. తన అవసరం వాళ్ళకు తెలియక పోవటంవల్ల వాళ్లె అవసరాలకు ఖర్చు పెట్టేస్తున్నారు.

కాదని అనటానికి నోరు రావటం లేదు. పెద్దకూతురుకి ఎప్పుడైనా మూడు చీరెలకన్నా ఎక్కువ వున్నాయా? పెద్దకొడుకు ఎప్పుడయినా ఇంట్లో నాటకపాటిక రూపాయలేఇచ్చాడా? చిన్నపిల్లలు ఒక్కొక్కరికీ రెండు మూడులాగూచొక్కాలకన్నా ఎక్కువవున్నాయా? ఈ క్రొత్తకోర్కెలు అన్నీ అధికమౌతున్నాయి. ఈ ప్రకారం బాకీ ఏనాటికి తీర్చేటట్లు? ఈ తన బాధను ఎవరు గుర్తిస్తారు"

ప్లీడరుగారు మంచివాడేమో అని మొదట అనుకున్నాడు. ఆయన మంచితనం బొగ్గులైనట్లేవుంది. అద్దెకున్న వాళ్లలో యింత లేకి మనుష్యులు కూడా వుంటారన్న సత్యం యీనాటికి బోధపడుతోంది. తనలాగే తన భార్య ఏ మాత్రమైనా అధికారాన్ని అభిలషించి వుండవచ్చు. తనవలెనే ఆమెకూడా యిన్నాళ్ళూ అద్దె బ్రతుకు బ్రతికి విసిగివుంది కదా. ఆ మాత్రం హోదా చూపించకుండా ఎలా వూరుకుంటుంది?

ప్లీడరుగారు లాపాయింట్లతో వేపుకు తినేస్తున్నాడు. రానురానూ నెత్తిమీదకు ఎక్కి కూర్చుంటున్నాడు. "ఇది యిక్కడ బాగు చేయించాలి అది అక్కడ బాగు చేయించాలి" అని ఆయన పోరు పెట్టని రోజు లేదు. అస్తమానం స్పర్థలే. ఇదేనా శాంతిఅంటే? ఇదిలా వుండగా ప్లీడరుగారి యిరవై ఏళ్ల అబ్బాయి తనవంక అదోరకంగా చూస్తున్నాడనీ, వెక్కిరిస్తున్నాడనీ కూతురు తల్లితో రహస్యంగా చెప్పిందట. ఇదేనా అద్దెకు యిచ్చినందువల్ల వచ్చే సౌఖ్యం?

ఈ దెబ్బలాటలు విని యిరుగూ, పొరుగూ వారు గుసగుస లాడుకుంటున్నారు. తాను రిటైరైన బడిపంతులు. సైలు లేకపోయినా ఆయన ప్లీడరుగారు. ఇరుగుపొరుగు ప్రజ లంతా ఆయన పక్షం అవలంబిస్తున్నారు.

వీళ్ళంతా యీ విధంగా ఎందుకు తనమీద కత్తిగడుతున్నారో తనకు అర్థం కావటంలేదు. తనయింటి ఎదురుగా ఓ క్రొత్త వెచ్చాల షాపు వెలిసింది. ఆ షాపుకారు తనని యిదివరకు యిలు అడిగి తిరస్కరించబడిన వాడే. తనవంక కోరగా చూడటం, తను దారిన పోతున్నప్పుడు వెకిలిగా నవ్వుతూ ప్రక్క వాళ్లతో ఏదో గుసగుసలాడటం, యివంతా చిదంబరం చాలా సార్లు పసిగట్టాడు.

ఇది యిలావుండగా బలరామయ్య ఎవరితోనో అన్నాడట. "చిదంబరం కాలాంతకుడు. పదిహేను వేలు ఖరీదు చేసే యింటిని ఆరు వేలకు కొట్టేశాడు"ని.

ఏమిటి? బలరామయ్య యిలా అన్నాడా? కనిపించినప్పుడల్లా తన శ్రేయోభిలాషిలా కబురు చెబుతున్నాడే. ఆ తర్వాత బలరామయ్య చాలా సార్లు కనిపించాడు. ఇంకా శ్రేయోభిలాషిలాగానే కబుర్లు చెబుతున్నాడు. చిదంబరానికి నిజానిజాలు తెలియవు. అందుచేత మెదలకుండా ఊరుకున్నాడు.

తనపై మరో బాధ్యతవుంది. పెద్దకూతురి పెళ్ళి చేయాలి. దమ్మిడీ కట్నం యివ్వకుండా పెళ్ళి చేస్తానని భార్యముందు ప్రగల్భాలు కూడా పలికాడు? అది కేవలం బుకాయింపు క్రిందే తయారయింది. తనకేమి పరపతివుంది? తనకి ఎంతమందితో పరిచయంవుంది? పెళ్ళికొడుకులు అని పిలువబడేయువకులు ఎక్కడెక్కడ దాక్కునివున్నారో, వెదికిపట్టుకోవటం తనకు ఎలా సాధ్యం? ఒకరిద్దరు తారసిల్లినా కట్నాలు అడిగారు. ఒకటి కాదు, రెండు కాదు. వ్యవహారం మూడుపైన వుంది. తను ఏలా తూగగలడు?

ఆనాడు బావమరిది, తన భార్యతో అంతమాట అన్నాక యిప్పుడు మళ్లీ మొగ్గుతాడని ఆశలేదు. ఇంకా కొంతకాలం ఊరుకుంటే వ్యవహారం చేయికూడా దాటిపోవచ్చు. జానకికి యుక్త వయస్సు వచ్చిన మాట ఎవరూ కాదనరు. తనస్థితిలో వున్న వాడికి యింకా కొంతకాలం పోతే దాని పెళ్లి చేయటం కూడా కష్టమైన విషయంగా పరిణమిస్తుందనటంలో అబద్ధం ఏదీ లేదు. అన్నీ తెలిసే తను తప్పటడుగు వేస్తున్నాడు. కొడుకు ఏవిషయంలోనూ తనకు సహాయపడడు. వాడిదంతా అదో వింత ప్రకృతి. ముభావంగా వుంటాడు. గట్టిగా అడిగితే తీరిక లేదంటాడు. తను వృద్ధుడు. ఒంటరి. చొరవలేని మనిషి. ఇన్ని విభిన్న ప్రకృతులకూ, పరిస్థితులకూ ఏవిధంగా తట్టుకోగలడు?

ఇన్ని సమస్యలతో యీ మధ్య ఇల్లు కదలటం కూడా మానేశాడు. రోజుకు నాలుగయిదు గంటలు ప్రయివేటు చెప్పటంలో గడిచేది. మిగిలిన కాలమంతా ఏమీ చేయకపోవటం.

ఒకరోజు పది గంటల వేళప్పుడు పోస్టుమేన్ వచ్చి ఒక ఉత్తరం అందిచ్చి వెళ్ళాడు. చదివాడు.

బావమరిది రాశాడు. తనకొడుక్కి సంబంధాలు ఎక్కువగా వస్తున్నాయట. తాము ఏవిషయమూ సరిగ్గా తెలియజేస్తే దాన్నిబట్టి వేరే సంబంధం చూసుకుంటాడట. లేకపోతే ఎవరికి ఏమాట చెప్పాలో కష్టంగా వున్నదిట.

"నీ తమ్ముడు రాశాడు" అన్నాడు ప్రక్కన నిలబడివున్న భార్యతో.

ఆవిడ ఉలక లేదు, పలక లేదు.

"ఏమని జవాబు ఇవ్వమంటావు?"

ఈసారీ పలక లేదు ఆవిడ.

"మాట్లాడవేం?"

మళ్ళీ మాట్లాడలేదు. అంతేగాక లోపలికి పోతూంటే ఆయన కసిగా ఆపి "ఏమిటే నీ ఉద్దేశం? ఇందులో నీ బాధ్యత ఏమీ లేదనుకున్నావా?" అన్నాడు.

తల ఎత్తి భర్త ముఖంలోకి ఓసారి విసురుగా చూసి "నాకేముంది? మీ కేం తోస్తే అది చెయ్యండి" అని లోపలకు వెళ్ళిపోయింది.

చిదంబరం అంతటితో వదల్లేదు. గబగబ తనూ వెనకనే పోయి ఆవిడ భుజం పట్టుకుని ఆపి "నా కేం తోస్తే అది చేస్తే నువ్వు సంతోషిస్తావా?" అని అడిగాడు.

"ఎందుకు సంతోషించను? అన్నీ తెలిసినవారు"

"ఆక్షేపిస్తున్నావా?"

"అయ్యో కర్మ. మిమ్మల్ని ఆక్షేపించే పాటి తెలివితేటలు, ధైర్యం భగవంతుడు నాకు ఇవ్వలేదు."

"మరయితే ఏమిటి ఈ మొండితనం?"

"నే నేం మొండితనం చేశాను? అనుకుంటే పిస్గ. చిన్నదానా? చితకదానా? అలా నాటకాలు ఆడడానికి."

"నాకు నీ ఉద్దేశం తెలుసులే. అన్నాడు చిదంబరం."

"తెలిస్తే యింకా ప్రశ్నించడ మెందుకు?"

"ఎలా అయినా యీ సంబంధం చేసుకోవాలని నీకు వుంది"

ఆవిడ జవాబివ్వలేదు.

"రెండు వేల అయిదొందలూ యిచ్చుకోవాలనే"

ఆవిడ మాట్లాడలేదు.

"అప్పో సప్పో చేసి, అయిన కాడికి యీ పెళ్ళి జరిగించాలి. ఏం?"

ఆవిడ పలకలేదు.

"జవాబివ్వమని అడుగుతున్నాను"

జవాబు రాలేదు.

"జవాబివ్వటం నామర్దా అనుకున్నావా?

ఉలకలేదు, పలకలేదు.

"మాటాడ వేమిటే?" అని ఈచిపెట్టి ఒక చెంప కాయ కొట్టాడు. లోపలనుంచి యిందాకటి నుంచీ వింటూన్న పెద్ద కూతురు "అమ్మా" అంటూ బావురుమంటూ వచ్చి తల్లి కళ్ళో వాలకముందే, విసవిస నడిచి బయటకు వెళ్ళిపోయాడు.

ఒక వైపునుంచి కోపం, మరో వైపునుంచి దుఃఖం, ఒక వైపునుంచి ఆవేశం, మరో వైపునుంచి ఆవేదన ఆరోజంతా ఆయన్ని కాల్చుకు తిన్నాయి.

భార్యను యిదివరకు కొన్నో సార్లు కొట్టాడు. కాని ఆ కొట్టటానికి, యీ కొట్టటానికి ఎంతో వ్యత్యాసం కనిపించింది. ఇదివరకు తనకు అన్నం పెట్టడం ఆలస్యమయిందని కొట్టాడు. చొక్కా చిరిగితే కుట్టలేదని కొట్టాడు. సినిమాకి వెడదామని పేచీ పెట్టిందని కొట్టాడు. కాని ఇప్పుడో? కూతురి కోసం కన్నతల్లి హృదయం రోదిస్తూంటే కొట్టాడు. ఛీ ఛీ ఛీ. తను పాపాత్ముడు. నిజంగా పాపాత్ముడే.

అయినా తన మనస్తత్వం అంత ఎందుకు అర్థం చేసుకోకపోవాలని మరుక్షణంలో కోపం కూడా వచ్చింది.

ఏమిటి అర్థం చేసుకునేది? ఏ తల్లి మాత్రం ఆసమయంలో సహనం కోల్పోదు?

చిందరవందరగా అల్లుకు పోతూన్న యిన్ని ఆలోచనల్లోనూ చీకటిలో మెరుపు మెరిసినట్లు ఆయనకు ఓ ఉపాయం తట్టింది.

తన కొడుక్కి కూడా కట్నం తీసుకుంటే?

అవును. ఆ డబ్బుతో కూతురు పెళ్ళి చేయవచ్చు.

కాని ఆలోచన యింకా అసంపూర్తిగా వుండగానే, పెదవులపై దరహాసం యింకా ఉదయించకుండానే ఎవరో అజ్ఞాత వ్యక్తి వెన్నుమీద ఛెళ్లున చరిచినట్లయింది.

ఎంత ద్రోహం తలపెట్టాడు! తన చెల్లెలికి యింత అన్యాయం చేయటానికి మనసెలా వొప్పింది? ఆమె పోతూ పోతూ తనచేత ప్రమాణం కూడా చేయించుకుందికదా. "ఎల్లాఅయినాఆనందు నా అల్లుడు కావాలన్నాయ్" అంది. "అలాగేనమ్మా." అన్నాడు తను. ఆనాడు చనిపోతున్న ఆ అమాయకురాలికి అంత ఆశ కల్పించి యీనాడు ఆడి తప్పటానికి సంసిద్ధపడతాడా? వాళ్ళు తమలాగే బీదవాళ్ళు. వీలులేదు. వీలులేదు. ఇంత ద్రోహం చేయటానికి తన అంతరాత్మ అంగీకరించదు.

కాని తన బావ మరిదీ తనకు యిదివరలో మాట యిచ్చినంత పని చేశాడు. అతను ద్రోహం చేయలేదా తనను?

అది వేరు. తను బావమరిది కాడు అతనిలో వున్న కాఠిన్యం లేదు. పదహారేళ్ళ పిల్ల అది. ఇంకో రెండేళ్ళలో పెళ్లీడుకు వస్తుంది. వాళ్ళు తను మీదనే ఆశలు పెట్టుకు కూర్చున్నారు. ఇటువంటి స్థితిలో "కట్నం యివ్వందే చేసుకోను" అని తను వెల్లడిస్తే వాళ్ళ గాలిమేడలు కూలిపోవా? తనకుండే యీ రోజుమంచి పోతున్నట్లే వాళ్ళ గుండెలు ఆ రోజు మండి, మాడిపోవా?

లేదు. వీల్లేదు. అంత దురన్యాయం తను చేతులారా చేయలేదు. తను బాధ పడనీ. కష్టాల పాలు కానీ, చావనీ. ఆ అమాయకుల్ని బాధలపాలు చేయటంకూడదు. కనీసం కొందరైనా సుఖించాలి.

తిరిగి తిరిగి, అలిసి అలిసి, విసిగి విసిగి అప్పుడు యింటిదారి పట్టినప్పుడు విద్యుత్ తగిలినట్లు మరో ఆలోచన తోచింది.

"ఈ మనశ్శాంతి లేకపోవటం, యీ మనస్పర్థలు యివన్నీ తను యిల్లు కొన్నందుకే."

ఒక్క క్షణం "నిజమేనా?" అనిపించింది.

ఎందుకు కాదు? ఆ డబ్బువుంటే కూతురు పెళ్లి చేసేవాడు. కొడుక్కి సైకిలు కొనేవాడు. ఇంట్లో యీ కలతలు వుండేవి కావు.

తను యిల్లు కొనటమన్నమాట యిన్నిటికీ మూలమైంది.

తను యిల్లు కొనకుండా వుంటే యీ అవస్థలన్నీ వుండకుండా ప్రశాంతంగా వుండేవాడన్నమాట.

అబ్బ. ఈ ధాటికి తను తట్టుకోలేదు. రాను రానూ ఓపిక సన్నగిల్లుతోంది. ఒక్కో క్షణంలో "పిచ్చి ఎత్తుతుందేమో" అన్న భయంకూడా కలుగుతోంది.

ఆ రాత్రి చిదంబరానికి నిద్రపట్టలేదు. తెల్లవారు ఝామున కాబోలు ఓ కునుకు తీశాడు. ఇంతలో ఎవరో భుజాలమీద . చేతుల్తోతట్టి లేపితే మెలకువ వచ్చింది. కళ్ళు నులుపుకుంటూ లేచాడు.

ఎదురుగుండా భార్య. ఆవిడ ముఖమంతా వివర్ణమై, కన్నీళ్ళు తిరువాయిగా వుంది.

"ఇదిగో చూడండీ. ఈ ఉత్తరం."

చిదంబరం గబగబ చదివాడు. అది ప్రేమలేఖ. తను జానకిని ప్రేమిస్తున్నాడట. ఆమెకోసం తనహృదయంలో విశాలమైన చోటు ఖాళీచేసి వుంచాడట. తనని కనికరించాలట. లేకపోతే బ్రతికలేడట.

చిదంబరం కళ్ళెర్రజేశాడు. "ఎవరి పని యిది?"

"ప్లీడరు గారబ్బాయి పనిమనిషిచేత పంపించాడు."

మారుమాట మాట్లాడకుండా ఆయనలేచి గబగబ ప్లీడరుగారి భాగంలోకి వెళ్ళాడు. ఆ సమయానికి ఆలస్యంగా లేచిన ప్లీడరుగారు బ్రష్‌తో పళ్ళుతోముకుంటూ బయటకు వస్తున్నాడు.

చిదంబరం ఎక్కువకాలం వ్యర్థంచేయకుండా "ఇదిగో చూడండి; మీ అబ్బాయిచేసిన ఘనకార్యం" అన్నాడు.

ప్లీడరుగారు ఆ ఉత్తరం ఆసాంతం చదివాడు. క్షణకాలం ఆయన ముఖం పాలిపోయినా, గాంభీర్యత తిరిగి వచ్చింది.

"మా అబ్బాయి యిటువంటి పన్లు చేయడే?"

"అందరి తలిదండ్రులూ ఇలానే అనుకుంటారు. ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నారుగా?"

ప్లీడరు తాపీగా "మా వాడు ఇంత తొందరపడ్డాడంటే ఏదో కారణం వుండి వుంటుంది కదా" అన్నాడు.

చిదంబరం కోపం ఆపుకోలేక "ఇంకేం కారణం? ఒకటే. యౌవన మదం" అని అరిచాడు.

"అదే. ఎవరి మదం" అని

చిదంబరం ఒక్కసారిగా నివ్వెరపోయి "ఏమిటి?" అన్నాడు.

"అవునయ్యా. మీ అమ్మాయి ఏమీ అలుసు యివ్వందే మావాడు యిలా తొందరపడ్డాడంటావా?"

చిదంబరానికి మతిపోయింది. ఏమి మాట్లాడుతున్నాడో అన్న జ్ఞానంకూడా లేకుండా "పైగా యిదా! నాయింట్లో అద్దెకు వుండి నాకే ద్రోహం తలపెడతామని చూస్తున్నావా? తప్పుచేసినవాడిని దండించటంపోయి నాకే తప్పు అంటగడుతున్నావా? ఇదేనా నీవు చేయవల్సిన ప్రత్యుపకారం?" అని అరవటం ప్రారంభించాడు.

ప్లీడరు వెంటనే సమాధానం చెప్పకుండా గంభీరమయిన మౌనం ధరించి నిల్చున్నాడు. ఈలోగా యిరుగుపొరుగు వాళ్ళు నలుగురూ అక్కడికి పోగయ్యారు. ప్లీడరుగారు యీ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకున్నారు. అడిగినవాళ్ళకు కాదనకుండా విషయాన్ని సవిస్తరంగా వివరించాడు.

ఆడపిల్లలకు లోకంలో పూర్తిగా న్యాయం జరుగుతుందని ఎవరయినా అంటే వాళ్ళు యీ సమయంలో అక్కడ నిల్చుని జరిగేది పరికించవచ్చు. ఆడపిల్ల తండ్రిమీద కూడా లోకం యింత కఠినంగా ఎదురు తిరుగుతుందని కలలోకూడా తలపోయలేదు.

"ఆ అమ్మాయి విషయం నాకు బాగా తెలుసును" అని ఒకరన్నారు.

"గుమ్మంలో నిల్చుని వచ్చేపోయే వాళ్ళవంక ఒకటే యిదిగా చూపులు"

"ఆ అబ్బాయి తొందరపడ్డాడంటే అతనిదేం తప్పు?"

"ఆ స్థితిలో ఎవరున్నా అలానే చేస్తారు."

చిదంబరానికి మతి చెడింది. ఈ స్థితిలో తన కన్నా శవం నయం. ఒక్కమాట ఆయన నోటెనుంచి

నిలువలేదు. ఆవేశం, ఆగ్రహం ఎప్పుడో యెగిరి పోయాయి. మిగిలింది ఒకటే. అవమానం...అవమానం...

వెనక్కి తిరిగాడు.

వెనకనుంచి వెకవెకలు, పకపకలు.

లోపలకు వస్తూంటే గదిలో పరుపుని వేసుకున్న పెద్దకూతురూ, గోడకు ఆనుకుని కళ్లు మూసుకుని నిల్చున్న భార్యా, కుర్చీలో తల పట్టుకుని కూర్చున్న పెద్దకొడుకూ లీలగా కనిపించారు. అంతే. పోయి చాపమీద పడ్డాడు.

తొమ్మిదయినా లేవలేదు. పదయినా లేవలేదు. పదకొండు, పన్నెండు, వొంటిగంటయినా లేవలేదు.

చివరకు పాదాలమీద మెత్తగా తగిలితే యెర్రబడ్డ కళ్ళు విప్పి బలహీనంగా చూశాడు.

"మీ పాదాలమీద పడి ప్రార్థిస్తున్నాను అమ్మాయి పెళ్ళి అయేమార్గం చూడండి."

చిదంబరం ఉలకలేదు, పలకలేదు.

"డబ్బుకోసం చూడకండి. దాని జీవితం నాశనం చేయకండి."

చిదంబరం మళ్ళీ కళ్లు మూసుకున్నాడు. ఆవిడ మరో పదినిమిషాలు అలానే పడివుండి భారంగా లేచి లోపలకు వెళ్ళిపోయింది.

ఆలోచన, మౌనం, ధ్యాన. ఆరోజునుంచీ చిదంబరానికి యిదేపని. ఇల్లు - పెళ్ళి, పెళ్ళి - ఇల్లు. ఇదే ధ్యాస.

క్లెర్కు మరో రెండురోజుల్లోనే యిల్లు ఖాళీ చేసి వెళ్ళిపోయాడు. కొన్నిరోజులు ఆ భాగం అలా ఖాళీగా పడి ఉంది. తనభాగం అది. దాని అద్దె వృధాగా పోతోంది. అంత బాధలోనూ వెళ్ళి పాత బోర్డు దులిపి దానికి తగిలించివచ్చాడు.

"ఈ భాగము అద్దెకు యివ్వబడును"

లోపలకు వస్తూంటే యెదుటి షాపులోని షావుకారు నవ్వినట్లు వినిపించింది ఆయనకు. లెక్క చేయకుండా లోపలకు వచ్చేశాడు.

ఇది మరీ విచిత్రం. ఈపాటి యింట్లో అద్దెకు వుండేందుకు యెవరూ రావటంలేదు. ఒకరిద్దరు వచ్చి అద్దె యెక్కువయిందని వెళ్ళిపోయారు. ఒకరిద్దరు ఇల్లు బాగాలేదని వెళ్ళిపోయారు. ఒకరిద్దరు వచ్చి చేరుతామని చెప్పికూడా రాకుండామాయమయ్యారు. ఇంకా మరీ విచిత్రమైన సంగతి. ఒకరిద్దరు వచ్చి ఇంట్లో ఒకటిరెండురోజులు వుండి "అబ్బే, దెయ్యాల కొంపలావుంది" అని వెళ్ళిపోయారు.

ఎప్పుడైనా చిదంబరం కిటికీలోంచి బయటకు చూసినప్పుడు యెదుటిషాపులోనుంచి షావుకారు విషపు నవ్వుతో ప్రత్యక్షం.

ఈ నవ్వుకూ ఆ విచిత్రానికి యేమీ సంబంధం లేదుగదా.

ఇకేనా చివరకు ఫలితం? ఇందుకోసమేనా ఇల్లు కొన్నాడు? ఈ యింట్లో సుఖం లేదు, శాంతి లేదు. ఈ యింట్లో అధికారం చెలాయించే హక్కు లేదు. కనీసం మాట్లాడేవారు లేరు. ఈ యింట్లో ఎప్పుడూ కన్నీళ్లు. ఎడమొహాలు, పెడమొహాలు.

ఒకవేళ...ఒకవేళ...ఈ యింటికన్నా ఆ పాత యిల్లే, నీళ్లుకురిసే ఆ యిల్లే నయమేమో.

అవును కన్నీళ్ళకన్నా అదే నయంకదూ.

ఆయింట్లోవుంటే యింతటి విరోధానికి గురికాడు. ఇన్ని కష్టాలు వుండవు. ఇంతకంటే మనశ్శాంతి హెచ్చు. కూతురి పెళ్ళికి అడ్డువుండదు.

కూతురు పెళ్ళికీ, యిల్లుకొనటానికీ సంబంధం.

అంటే...అం...టే ... ఇల్లు అమ్మడానికీ, కూతురి పెళ్ళికీకూడా సంబంధం.

వళ్లు ఝల్లుమంది. ఇల్లు అమ్మటం—ఇల్లు అమ్మటానికేనా కొన్నాడు.

అంతేకాక చిదంబరానికి తను చేసిన రెండు వేల అప్పు మనోనేత్రం ముందు గోచరించింది. ఇంతవరకూ తీర్చింది వడ్డీకికూడా సరిపోదు. రెండు వేలూ రెండు వేలలాగానే వుంది. ఆరోగ్యం పూర్తిగా పాడయింది. ఈస్థితిలో ఏంకష్టపడి అబాకీ తీర్చేందుకు ప్రయత్నిస్తాడు? కలలోనిమాట. ఇంకా కొన్నాళ్లుపోతే చేసిన అప్పుకోసమే యిల్లు అమ్మాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

ఏయింటికోసం అప్పుచేశాడో? ఆ అప్పుకోసం ఆయింటిని అమ్ముతున్నాడు.

భరించలేడు. ఈ ధాటిని తట్టుకోలేడు.

బావమరిదినుంచి బెదిరిస్తూ వచ్చే ఉత్తరాల ధాటికీ తట్టుకోలేడు.

హఠాత్తుగా ఓరోజు దృఢనిశ్చయంతో చిదంబరం లేచాడు. ఏడిచేభార్యా, ఏడిచేకూతురూ హృదయంలో చెరిసగం పంచుకున్నారు. బలరామయ్య యింటికేసి ఫర్లాంగుదూరం నడిచేసరికి కళ్లు తిరిగాయి. శరీరం తూలింది. రిక్షాలో యింటికి తిరిగి వచ్చాడు.

ఆరోజే అనుకుంటే మరునాడుకూడా లేవటం కష్టమైంది. లోపలినుంచి పొంగి పొర్లే ఉత్కంఠను అణచుకోవటం కష్టంకాగా, చిన్నకొడుకును బలరామయ్య యింటికి కబురుపంపించాడు.

మరో అరగంటలో- "ఎందుకు చిదంబరం పిలిచావుట" అంటూ బలరామయ్య వచ్చాడు.

"కూర్చో" అని చిదంబరం సౌంజ్ఞ చేశాడు. మళ్ళీ కొంచం ఆగి "ఆ తలుపులు వేసెయ్యి" అన్నాడు.

బలరామయ్య తలుపులు వేసి వచ్చి చిదంబరానికి చేరువలో కూర్చున్నాడు.

"నా యింటిని అమ్ముతున్నాను."

"ఇదేమిటి ? ఎందుకు ?"

"అంతే. అలా కావలసి వచ్చింది. పదిమందిలో బేరం పెట్టి, ధర పెంచేటంతటి ఓపిక లేదు. నా యిల్లు కొనటం నీ కిష్టమేనా ?"

ఈ మాటలు అంటూంటే జరిగిపోయినదేదో చప్పున మనసులో స్ఫురించింది. చరిత్ర తిరుగుతోంది.

బలరామయ్య కొంచం ఆలోచించి "నాకు యిష్టం లేనిమాట నిజమే. కాని డబ్బు నీ కంతగా అవసరమైతే అలాగే చేదాం" అన్నాడు.

"ఈ యిల్లు చాలా ఖరీదు చేస్తుందని ఒకనాడు నువ్వు నాతో అన్నావు. కాని నేనేమీ లాభాలు ఆశించటం లేదు. కొన్నధరే యిచ్చి తీసుకో."

బలరామయ్య వెంటనే ముఖం చిట్లించాడు. "ఇప్పుడు యిళ్ళధరలు పడిపోయాయి. అదీగాక నా దగ్గర అంత డబ్బెక్కడిదీ?" అన్నాడు.

"ఎంత యిస్తానంటావ్ ?"

"అయిదు వేలకన్నా నేను దమ్మిడీ యెక్కువ యివ్వలేను."

చిదంబరం పెదవులు వొణికాయి. "నేను అన్ని విధాలా నాశనం అవుతున్నాను. నన్ను ద్రోహం చేయటానికి ప్రయత్నించబోకు బలరామయ్యా" అని గొణిగాడు.

బలరామయ్య కొంచెం ఆలోచించి "ఇంకో అయిదు వందలు. అంతకంటే నాకు శక్తి చాలదు" అన్నాడు.

చిదంబరం అయిష్టంగా తల ఊపాడు.

బలరామయ్య వెంటనే లేచి నిలబడి "అయితే నీ యిష్టం. నా శక్తి నేను చెప్పాను. నిన్ను కష్ట పెట్టుకోమని ఎవరన్నారు? వేరే ఎవరిదగ్గరైనా లాభం వచ్చేదాకా ప్రయత్నించి చూడు" అంటూ వెళ్ళిపోసాగాడు.

చిదంబరం కళ్ళలో నీళ్లు తిరిగాయి. "ఆగు" అని సౌంజ్ఞ చేసి "అయితే రేపే అన్ని యేర్పాట్లూ చేస్తావుగా" అన్నాడు.

"నేను చెప్పిన ధరకు యిష్టమేనా?"

చిదంబరం తల ఊపాడు.

"రేపు వస్తాను" అని బలరామయ్య వెళ్ళిపోయాడు. "అదృష్టం పండింది. నా బాకీకోసం రిజిస్టర్ నోటీసు యివ్వకుండానే సులభంగా పని జరిగిపోయింది" అని వెళ్ళిపోతూ మనసులో ఊహించుకుని సంతోషించడం అసహజమని ఎవరూ అనరు.

మూడు రోజుల్లో యింట్లో ఎవరికీ తెలియకుండానే పని సక్రమంగా జరిగిపోయింది. బాకీ తీరిపోనూ చిదంబరానికి మూడు వేల రెండు వందలు మాత్రం చేతికివచ్చింది.

ఆయనలో బలహీనత నానాటికీ ఎక్కువయిపోతోంది. కదలడం కూడా కష్టంగా ఉంది. ఆరాత్రి ఆయన చాలా రోజుల తర్వాత భార్యను ప్రేమతో దగ్గరకు పిలిచాడు.

"ఇదిగో. ఇలారా."

ఆవిడ చెంతకువచ్చి నిల్చుంది.

"ఇలా కూర్చో."

"కూర్చుంది."

"నా పరుపుక్రింద డబ్బువుంటుంది చూడు" ఆయనమాట తడబడుతోంది.

ఆవిడ తడిమి తీసింది.

మూడు వేల...రెండు వం...ద...లు."

"ఎక్కడిదండీ?"

"ఇల్లు అమ్మాను"

ఆవిడ పమిట చెంగుతో కళ్ళు తుడుచుకుంది.

"అమ్మాయి పెళ్ళి సలక్షణంగా జరుగుతుంది. వాళ్ళకు ... కట్నం ... యిస్తానని ఉత్తరం... రాయించు"

తెల్లవారి కొద్ది సేపటిలో స్మారకం తప్పింది. పెద్దకొడుకు వెళ్ళి డాక్టరును పిల్చుకు వచ్చాడు. ఆయన పరీక్షచేసి ఇంత ఆలస్యం ఎందుకు చేశారు? చాలా ప్రమాదస్థితిలో వున్నాడు అని చెప్పాడు.

"ఏమిటి?" ఇల్లంతా ఓసారి ఉలిక్కిపడ్డది.

"అవును" నా చేతనైనంతవరకూ ప్రయత్నిస్తాను.

*　　*　　*　　*

ఆరోజు మరునాడూ గడిచింది. మూడోదినం తెల్లవారుఝామున రోగిచుట్టూ అంతా కూర్చున్నారు. ఇద్దరు ముగ్గురు బంధువులు కూడా వున్నారు.

ఉన్నట్లుండి ఆయనకు గురక పుట్టింది.

"అమ్మా" అంటూ తల్లిఒళ్లో తలపెట్టి బావురుమంటోంది పెద్ద కూతురు.

సరిగ్గా ఆసమయానికే బలరామయ్యగారి మనుషులు యిద్దరు వచ్చారు.

ఇంట్లో చచ్చిపోవటానికి వీల్లేదు: బయట పెట్టాలి"

ఎవరూ ఏమీ మాట్లాడలేదు. పెద్దకొడుకు కళ్ళు తుడుచుకుని బంధువుల సహాయంతో రోగిని, బయట చలిలోకి తీసుకుపోతూంటే "తల్లీ" అంది ఆవిడ కూతుర్ని బిగ్గరగా కౌగలించుకుని ఏడుస్తూ.

చెరగని అక్షరాలు

శ్రీ ఇసుకపల్లి దక్షిణామూర్తి

వాన తుంపరలు కన్నీటి చుక్కల్లా నేలమీదకు బరువుగా రాలుతున్నాయి. అమావాస్య చందమామ భూమికి అడుగునే వుండిపోయింది. ఆకాశమంతా ఆవరించిన చీకటి తెరలోనుంచి చిల్లులు చేసుకుని స్వర్గం సుషుప్తిలో వున్న భూభాగాన్ని పరికిస్తోంది. వీధిలోని చీకటి, తలుపులు లేని కిటికీగుండా లోపల ప్రవేశించి, గోడమీదవున్న ఆముదం దీపాన్ని భయపెడుతోంది. అప్పుడప్పుడు చెదురువాటుగా వీస్తున్న గాలికి వూగులాడుతున్న దీపశిఖ, ఆ గాలి తెర తగ్గగానే ధైర్యం కూడగట్టుకుని సూటిగా నిలబడి చూస్తోంది—కొనను సూటిగా పైకి వదిలేస్తూ. దాని మీద చలి ప్రభావం పడ్డట్లు కనిపించటంలేదు గాని ఎదురుగా కూర్చున్న పార్వతిమాత్రం మోకాళ్లకు తల వాలించి గజగజా వణికిపోతోంది. పైనకప్పుకున్న దుప్పటి ఆమెలోంచి వస్తున్న వణుకును ఆపలేకపోతున్నట్లుంది.

"తలుపు తియ్యమ్మా పారూ..." బయటనుంచి తలుపును బాదుతూ లలితమ్మ గట్టిగా అరిచింది.

"మరీ చోద్యంగా వుందే వ్యవహారం.. యింత కంగారయిపోతే ప్రతిదానికీ ఎట్లాగే...మనిషన్న తర్వాత రోగం నొప్పి రాకుండా వుంటుందా..." లలితమ్మ తలుపు కవతలనుంచి పార్వతి నుద్దేశించి సముదాయింపు పూర్వకంగా అంటోంది. పార్వతి తడిసిపోయిన చేతిగుడ్డను మంచంకిందకు తోసేస్తూ "వస్తున్నానమ్మా" అని తలుపు తీసింది. తలుపు తెరుచుకోటంతోటే పార్వతిని చేతుల్లోకి తీసుకుని "వెర్రిపిల్లా అని... ఛీ..." అంది.

"మరీ యిదిగా వుంటేమిటే...మీ మామయ్యకు యింతకంటే పెద్ద సుస్తీ చేసిందిగాని యింత కంగారు ఎవ్వరూ పడలేదమ్మా...తిమ్మడిని అనుకోరాదుగాని యిప్పుడుచూడు మనిషి ఎట్లా వున్నాడో..." పార్వతి కళ్లకు కొంగు అద్ది "కొద్దిగా మెతుకు ఎంగిలి పడమ్మా...మామయ్యేమో విస్తరిముందు కూర్చున్నాడు...నువ్వు రాందే అన్నం తినడట...పోనీ వాడికోసమైనా రారాదుటే..."

పార్వతి మెల్లిగా లలితమ్మకౌగిలి వదిలి వంటింటివైపుకు కదిలింది. కాళ్లు కొద్దిగా నీరసించి తడబడుతున్నా తల్లి భుజంమీద చెయ్యివేసి అడుగులు మెల్లిగా వేస్తూ వచ్చింది.

"ఏం పారూ...అట్లా బేజారయిపోతారుటే... ఆ...నాకంత సుస్తీ చేసిందో నీకేం తెలుసు...మీ అత్తయ్య ఏమైనా మనిషి కదిలిందా...మనిషి అంటే అట్లా వుండాలి...ఏమే సావిత్రీ....' గోపాలరావు నోటివెంట మాట పూర్తికాగానే పార్వతి చిరునవ్వు నవ్వబోయి సావిత్రిని చూసి వూరుకుంది. సావిత్రి చేతిలో గరిటె కిందపడేసి పార్వతిని చూసి పకపకా నవ్వింది.

'అన్నానికి కూర్చుంటాను గాని...ఆ ప్రమిదలో చమురుందేమో చూసిరావే అమ్మా!

'ఏం? చీకట్లో రాములవారికి గదిలో పామన్న కనపడదనా...వుంటే వుంటుంది...పోతే పోతుంది గాని...నాకొంచెం అన్నం పట్టుకు రావే అక్కయ్యా...'

పార్వతి చివాలునలేచి గోపాలరావువంక వకసారి తీవ్రంగా చూచింది. తన గదిలో వెలుతురు లేకపోయినా ఫరవాలేదనే టప్పటికి గుండె జల్లుమంది పార్వతికి.

'నువ్వు అన్నం సంగతే చూసుకో అమ్మా... నా దీపం సంగతి నేనే చూసుకుంటానులే' అంటూనే పార్వతి గదివైపు గబగబా నడిచింది.

వీధితలుపు నెవరో బాదినట్లు చప్పుడయింది. గోపాలరావు అన్నం కలుపుకోవటానికి ఉద్యుక్తుడవుతూ,

'వాకిట్లోకి ఈ వానలో పడివచ్చా రెవరో... చూసి రావే సావిత్రీ' అన్నాడు. సావిత్రి గడపలోనే నిలబడింది. లలితమ్మ వీధి తలుపు వైపుకు పోవటం చూసి.

'వస్తున్నానండీ...ఎవరో వక్కక్షణం ఆలస్యం అయితే సరి...తలుపు నట్లా బాదుకుంటారు...ఊ...' అంటూ సణుగుతూ వెళ్లింది. తలుపు యింకా చప్పుడు అవుతునే వుంది లలితమ్మ గడియతీసి తలుపు తెరిచే వరకూ. బయటి చీకటిలో దీపంలేని సైకిలుమీద

గొడుగు వేసుకుని వచ్చిన వ్యక్తి ఒక కాలును నేల మీద మోపుతూ సైకిలుమీద నే కూర్చుని కనపడ్డాడు. లలితమ్మ చీకటిలో బయటికి పోవటానికి సందేహించింది. బయటి మనిషి గొడుగును మెడతో గట్టిగా పట్టుకుని సైకిలు దిగి,

'అయ్యగారున్నారా' అన్నాడు. సావిత్రి వంటింటి గుమ్మంలోనుంచే,

'అన్నం తింటున్నారుగా...కాసేపు అరుగు మీద కూర్చోమని చెప్పండి అత్తయ్యా!' అంది. పార్వతి ప్రమిదమాట మరచిపోయి కిటికీలోనుంచి వస్తున్న చలిగాలికి కొద్దిగా కంపిస్తూ.

'ఏమి కావాలో కనుక్కోరాదుటే అమ్మా' అంది.

గోపాలరావు కంచం ముందరనుంచి లేచి వాకిట్లోకి వస్తూ 'ఎవరండీ వాకిట్లో...లోపలకు రండి' అన్నాడు. లలితమ్మవైపుకు తిరిగి 'అక్కయ్యా... అట్లా వాకిలి కడ్డంగా నిలబడకపోతే ఆయన్ని లోపలకు రానీయరాదుటే' అన్నాడు.

'దణ్ణాలండీ....అయ్యగారికి అర్జెంటు కాగితం యిచ్చేరుంటే' నసిగాడు వాకిట్లో మనిషి. అక్కడి నుంచే, చలి విచక్షణలేకుండా గోపాలరావునుగూడా గజగజ లాడించింది. వాకిట్లోకి వచ్చి టెలిగ్రాం అందుకుని కాగితంమీద సంతకం పెట్టి "మామూలు రేపొద్దున్న యిస్తాలేరా...మళ్ళీ రా" అన్నాడు. బయటి బంట్రోతు సైకిలుమీద ఎక్కుతూ "పాపిష్టోణ్ణి...నాకు మామూలుఎందుకులే అయ్యా" అన్నాడు.

పార్వతి పరుగెత్తుకుంటూ వచ్చింది. సావిత్రి చెయ్యి కడుక్కుని కొంగుకు తుడుచుకుంటూ మెల్లగా సావిట్లోకి వచ్చింది.

"ఏరా గోపీ...ఈవాల్టప్పుడు మనింటికి వుత్తరం వచ్చింది..." అంది లలితమ్మ ప్రతి అక్షరాన్ని సాగదీస్తూ.

"మీతో ప్రతీదానికి చావొస్తోందే...ఎందుకు యీ హడావుడి...గుబగుబలూనూ...ఆ..." గుండె దడను మాటలలో దాచుకోలేక తడబడుతూ అన్నాడు, కవరు వక్రపక్కన వంకరగా చించేస్తూ.

పార్వతి సావిత్రికి వెనకాలగా నిలబడి రెండు సార్లు "అత్తయ్యా...అత్తయ్యా" అంటూ పిలిచింది. గోపాలం టెలిగ్రాం పూర్తిగా చదవకుండానే "అక్కయ్యా..." అంటూ లలితమ్మ కాళ్లమీదకు వరిగిపోయాడు. లలితమ్మ గుండె బాదుకుంటూ:

"ఏమయిందిరా గోపీ...నా కొంపకు ఏం యిక్కట్టు వచ్చిందిరా దేవుడా" అంటూ రాగాలు తీయటం మొదలుపెట్టింది. సావిత్రి అతని చేతిలోని ఉత్తరం ఒక్కసారిగా గుంజి:

"ఏమయిందండి...మాట్లాడరేం" అని టెలిగ్రాం గబగబా నాలుగు ముక్కలూ చదివేసి పార్వతికోసం వెనక్కు తిరిగింది. పార్వతి కళ్లు ఎర్రగా జ్యోతుల్లాగా వెలిగి పోతున్నాయి. సావిత్రి ఏదో మాట్లాడటానికి పెదవి కదల్చబోయింది. పార్వతి:

'అత్తయ్యా...యిప్పుడే వస్తా ప్రమిదలో నూనె పోసి వక క్షణం ఆగు...' అంటూ గదిలోకి పరుగెత్తబోయి జారిపోయిన చీరె కొంగు కాలికి తగులుకుని గభాలున గది ముందర పోయి పడ్డది. ఆ గాలికి అసలే నూనె లేని దీపం గబుక్కున ఆరి పోయింది. కొడిగట్టిన దీపాన్ని ఆసరా చేసుకుని నివసిస్తున్న పొగ దానిని వదిలి పైకి వెళ్లిపోయింది.

'అమ్మా దీపం పోయిందే' అంటూ పార్వతి బిగ్గరగా అరిచింది. లలితమ్మ పార్వతిని లేవతీసి వళ్లోకి తీసుకుని,

'అప్పుడే తల్లీ మన దీపం ఆరిపోయిందే...తల్లీ దేవుడో' అంటూ బిగ్గరగా రోదించటం మొదలు పెట్టింది. పార్వతి తల్లివైపు చూసి విషాదంగా నవ్వుతూ 'నేననుకున్న నేనమ్మా' అంటూ గొణిగింది.

సావిట్లో గచ్చుమీద మూలగా పడుకున్న పార్వతి పగిలిపోయిన గాజు పెంకులవంక చూస్తోంది నిలువుగుడ్లు పెట్టుకుని. ఎడంచేతి పని అయిపోగానే కుడిచేతి గాజులవంక చూస్తూ లలితమ్మ ఏమనాలో తోచక పార్వతిమీద పడి 'అయ్యో...నేను బ్రతికుండగానే యిటువంటి కష్టం వస్తుందని అనుకోలేదే తల్లీ' అంది. పార్వతి నిర్లిప్తంగా అటువైపు చూస్తూ కుడి చెయ్యి బలవంతంగా లేపి పక్కకు తిరిగి ఎడం చేతి పక్కన పెట్టింది. కంగు కంగు మంటూ గాజులు చితికిపోతుంటే పార్వతి కంటి వెంట వకొక్క బొవ్వంరాలి చెక్కిళ్ల కిందకు జారకుండానే ఆరిపోతున్నాయి.

"పదిగంటల బండికి రామాపురం పోదాం అక్కయ్యా...పెట్టెలో నాలుగుబట్టలుసర్దు" గోపాలరావు యింట్లో హడావుడి కొంచెం సర్దుకోగానే మెల్లిగా లలితమ్మతో అన్నాడు. పార్వతి అతనివంక నిర్లక్ష్యంగా చూసి ముఖం లలితమ్మ వళ్ళోకి దాచుకుంది.

"నేను బజారుకుపోయి వచ్చేలోపుగా అన్నీ సర్ది సిద్ధంగా వుంచండి..." గోపాలరావు వుత్తరీయం భుజాన వేసుకుని:

"సావిత్రీ...ఆ సంచీ యిటు తీసుకురావే... బజారుకుపోయి పదినిమిషాల్లో వస్తాను" అన్నాడు. సావిత్రి దణ్ణెంమీద వేసిన సంచీవంక చూస్తూ 'అంద దన్నట్లు' నిలబడింది. గోపాలరావు సంచీని పైనుండి అందుకుంటూ.

"ఏమక్కయ్యా...వచ్చేపొద్దా...పోయేపొద్దా. తొందరగా లేచి ఆ పనేమిటో చూడరాదూ... రెండు మెతుకులు నోట్లో వేసుకుని మళ్ళీ బయలు దేరాలయ్యే...మనకోసం బండీ ఏమన్నా ఆగుతుంది గనకనా" అన్నాడు. లలితమ్మ కళ్ళనీళ్లు కొంగుకి తుడుచుకుంటూ:

"నీతిండి పాడయిపోను...యిక్కడ వకమూల దచ్చి యేడుస్తుంటే నీ తిండి తాపత్రయం...యిదై పోతుందా...యివ్వాళ పొయ్యిమీద బియ్యంయెక్క డానికి ఏళ్లేదు."

"అయ్యో నా తల్లీ....ఎంత ఆపదవచ్చిందే..." పార్వతి తల్లిని ఇంకా గట్టిగా కౌగలించుకుని "అమ్మ ...అమ్మ" అంటూ శావురు మంటోంది.

"సావిత్రీ నువ్వన్నా చూడవే...తిండి సంగతి.. వాళ్లనట్లా కానేవు కదలకుండా వుండనీ..."

"అయ్యో...మరీ వుప్పులాయిగా వుంటేమండీ.. మీ మొండిపట్టు యిటువంటప్పుడు మానకపోతే ఎట్లా గండీ...ఛీ..." అంటు విసుక్కుంటూ వంటింట్లోకి వెళ్ళింది.

"అంతా కట్టకట్టుకుని ఏడవండి...ఏడిస్తే తీరే దుఃఖమా...నేను గూడా ఆడదానిలా ఏడవలేక వూరుకున్నా గాని...నా దుఃఖంలో వకవంతు—" గోపాలం వుత్తరీయంతో ముఖం గట్టిగా తుడుచుకుని సావిట్లో ఒకమూలకి గిరవాటు వేశాడు.

"మనం ఏం చెయ్యగలం అక్కయ్యా..." లలితమ్మ దగ్గరకు పోయి చతికిల బడ్డాడు. లలితమ్మ అతని భుజంమీద చెయ్యివేసి "త...మ్ముడూ" అంటూ ఆవురుమంది.

"మనం ఏం చేస్తాం అక్కయ్యా...నాకూ యింతరోగమూ వచ్చిందా...ఏమయింది...యింత యిక్కట్టు వస్తుందని కలలో గూడా అనుకోలేదు" పార్వతి ... అతని కళ్లల్లోకి సూటిగా చూసింది. ఆమె కనురెప్పలు వల్లగుడ్డును గాలికి వదిలేసి నిశ్చింతగా నిలిచి వున్నాయి. నుదురు అదురుతోంది. పెదవులు అస్పష్టంగా వణుకుతున్నాయి.

"అట్లా చూడకపారూ...నావంక....వద్దుపారూ అట్లా నావంక చూడకు..." గోపాలరావు పార్వతి వంక చూస్తూ రెండు చేతులూ కళ్లకు అడ్డం పెట్టు కున్నాడు. సావిత్రి మెల్లిగా పార్వతి ప్రక్కకు చేరింది.

"పారూ...నావంక చూడమ్మా..." పార్వతి సావిత్రివంక చూడకుండానే తల్లి వళ్లో ముఖం దాచుకుంది.

"సావిత్రీ...కాసిని మంచి నీళ్లు తీసుకురా అమ్మా...గొంతు ఆర్చుకు పోయినట్లుంది పార్వతికి!..

"అట్లాగే అత్తయ్యా..."

"పారూ...ఏడవకమ్మా...మనం ఏం చెయ్య గలం యిప్పుడు" అన్నాడు గోపాలరావు.

పార్వతి తల్లివడిలో నుంచి విడివడి కూర్చుంది గోపాలరావు వంకకు తిరిగి. ఆమె బలవంతాన పెదవులు కదిపి:

"అవును, యిప్పుడు చెయ్యగలిగింది ఏముంది... చెయ్యగలిగిన దంతా అదివరకే చేసేశారు..." అంది ఆగ్రహంగా.

"ఆ..." అంటూ అదిరిపడ్డాడు గోపాలరావు. అతని మెదడులో గతించిన చరిత్రంతా పుటలు తిరగ వేస్తూ ప్రత్యక్షమయింది. పార్వతి ముఖంలో రోగిష్ఠి ప్రతిబింబం కనపడుతోంది.

"చెయ్యగలిగిందంతా అదివరకే చేశారు. చిన్న తనంలోనే గొంతుకకు వురిపోశారు ... యిప్పుడు చెయ్యగలిగినదేముంది వురి బిగిసిపోయిన తర్వాత....'

'అదేమిటే పార్వతీ...అదేమిటే కన్న కూతు రుకు వురిపోసుకుంటారుటే...అదేం మాటలే...'

'అడుగు మీ తమ్ముణ్ణి అడుగు'—తమ్ముడు అంటూ వ్యంగ్యంగా వచ్చినమాట శూలంలా గుచ్చు కుంది గోపాలం హృదయానికి. పార్వతి వంక అతను చూడటానికి భయపడ్డాడు. అక్కడినుంచి లేచి వంటింటి వైపుకు ముఖం తిప్పి:

'నేనేం చేశాను...' అంటూ గొణిగాడు. పార్వతి హృదయం బ్రద్దలైంది. ముఖం జేవురించింది.

'అంతా నువ్వే చేశావు...నా పచ్చని జీవితంలో నిప్పుల కుంపటి పెట్టావు...ఆయనకా సుస్తీ మొదటి నుంచీ వుందని మీ అందరికీ తెలియదూ...అతని ఆస్తికి ఆశపడి...ఎదురువచ్చే సౌఖ్యాలకు వ్యసనపడి...అమ్మా ...నా గొంతు కోశారే...' అంటూ బిగ్గరగా అరుస్తూ లలితమ్మ వళ్ళోకి వరిగిపోయింది పార్వతి. గోపాల రావు పిచ్చెత్తినవాడిలా అయిపోయాడు. లలితమ్మ అతనివంక తీవ్రంగా చూస్తూ 'ఏంరా...ఆయనకి

సుస్తీ వున్న సంగతి తెలుసురా నీకు ... మాట మాత్రంగానైనా చెప్పలేదేంరా నాకు' అంది గట్టిగా.

"అదేం లేదక్కయ్యా" మాట తడబడిపోతోంది గోపాలరావుకు. "కొద్దిగా దగ్గువచ్చేదిట చిన్నప్పుడు...జలుబు మనందరికీ వున్నట్లే అతనికీ వుండేదిట...అంతే"

"అంతేనా"—పార్వతి కయ్యి మంటూ లేచింది. "అతనికి రోజూ జ్వరం వచ్చేదిగాదూ...నోటి వెంబడి నెత్తురు పడేదిట గాదూ..యివన్నీ అబద్ధాలా?" సావిత్రి ముఖం తిప్పించుకుంది. లలితమ్మ అందుకుని,

"ఏరా మాట్లాడవేం" గోపాలరావుని గట్టిగా గద్దించి అడిగింది.

"ఎప్పుడన్నా వచ్చేదిట అక్కయ్యా"

"అవన్నీ తప్పుకున్నవాడివి...అతనికి క్షయ వున్నదని చెప్పడానికి దాపరికమెందుకు...నా జీవితాన్ని నీ సౌఖ్యంకోసం నాశనం చెయ్యటానికి సాహసించావుగాని, కావాలంటే నీవు కోరిన పైకం ఎక్కడైనా ముష్టెత్తుకుని యిచ్చేదాన్నిగాదూ నీకు..." పార్వతి ముఖం వివర్ణమైపోయింది. పూరికే రొప్పుతోంది. పిచ్చిదానిలా జుట్టు చేతుల్లోకి తీసుకుని "మీరంతా దొంగలు...నన్ను చంపుతున్నారు...వురి బిగుసుకు పోతోంది...అమ్మా...అమ్మా..." అంటూ అరవటం మొదలు పెట్టింది.

లలితమ్మ కంగారుపడ్డది. ఎన్నడూ నోరెత్తి మాట అనని పార్వతి ఎందుకు అట్లా గొంతు చించుకుని అరుస్తోందో అర్థంగావటంలేదు. దుఃఖంలో అవురావురుమని ఏడవటం ఎరుగుంది గాని యిటువంటి వెర్రి కేకలను వింటుంటే పార్వతికేదైనా మతి భ్రమించిందేమోనని భయపడింది.

'ఒరేయి గోపాలం...నా కొంపకేదో ముప్పు వచ్చిందిరా నాయనా...డాక్టరును పిలుచుకురా... రా...ముందర... తొందరగా పోయిరారా నాయనా...' లలితమ్మ పార్వతిని కదలకుండా ఒళ్లో పెట్టుకుని అదుముకుంటోంది.

"నాకేం పిచ్చెత్తలేదు...దయ్యం గూడా పట్టలేదు...నన్ను పిచ్చిదాన్ని చేసి నా జీవితాన్ని నాశనం చేశారు...మల్లెచెట్టు పీకివేసి తుమ్మచెట్టు నాటారు...యింకా డాక్టరు గూడా ఎందుకు..." పార్వతి ముఖంలో ఎరుపుదనం తగ్గి కొద్దిగా తెల్లబడింది. చిరునవ్వు పొడచూడా కనపడింది. ఒక్కసారిగా విరగబడి నవ్వుతూ 'ఏం మామయ్యా నన్ను పెళ్ళి చేసికోరాదూ...నువ్వు...సావిత్రి అత్తయ్యను వీధిలో వదిలి పెట్టేద్దు గానీలే....' అంది. సావిత్రి కంగారు పడింది. పరుగెత్తుకుంటూ పార్వతి దగ్గరకు పోయి 'నన్నేమనక పారూ...నాకేమీ తెలియటం లేదు...అంతా అయోమయంగా వుంది' అంది. లలితమ్మ మాట్లాడలేదు. గోపాలరావు స్తంభీభూతుడైనాడు. సావిత్రి పార్వతి నానుకుని 'బిగ్గరగా మాట్లాడకూడదమ్మా' అంది. 'నాకు తెలుసులే' అన్నట్లు పార్వతి పెదవి విరిచి కళ్లు మూసుకుంది.

గోడగడియారం గంటలుకొట్టలేక కొట్టలేక విషాదంగా మూలిగింది. దానితాలూకు చప్పుడు గంటలు ఆగిపోయిన తర్వాతి కొద్దిసేపటిదాకా గదిఅంతా మూగ ధ్వనినిచ్చింది. పార్వతి కళ్లు తుడుచుకుని "అమ్మా రామాపురం తప్పకుండా పోవలసిందేనా?" అంది. లలితమ్మ అక్కడలేదు—అప్పటిదాకా యింట్లో జరిగిన సంగతు లేవీ పార్వతికి తెలియవు. ఆ పదినిమిషాల నిద్రలోనూ ఆమె కలలో చనిపోయిన భర్త నీడగా వచ్చి "నన్ను ఒకసారివచ్చి చూసిపోవూ" అంటూ ప్రాధేయపడ్డట్లు కనిపించింది. అతనివంక చూసి ముఖం ముడుచుకుంది గాని అతను ప్రాధేయపడటం చూసేటప్పటికి ఆమెగుండె నీరయింది.

"సుస్తీ నయమయి బాగుపడతా నని అనుకున్నా గాని యిట్లా అర్థాంతరంగా కథ ఆగిపోతుం దనుకోలేదు పార్వతీ...అటువంటి సంశయం లేశమాత్రంగా నయినా వుండివున్నట్లయితే...నీ జీవితంలో తెలిసి నిప్పులు పోస్తానా పార్వతీ...నన్ను నమ్మవూ" అతను యింకా ప్రాధేయపడుతున్నట్లు పార్వతి కళ్లముందర కనపడుతోంది.

"పార్వతీ...నువ్వు అన్యథా భావించకపోయినట్లయితే నా ఆత్మశాంతికోసం ఒక్కపని చెయ్యవూ. నేను ఎప్పటికీ నీకు కృతజ్ఞుడనై వుంటాను...నా శాంతికోసం పారూ....అదీ స్వార్థమేఅనుకో....నువ్వు మళ్ళీ పెళ్లి..."

పార్వతి కళ్లవెంబడి నీరు జాలువారుతున్నాయి. మళ్లీ పెళ్లిమాట తలపుకు వచ్చేటప్పటికి కళ్ళు బాగా గట్టిగా నులుముకుని చేతులు కళ్లముందర వూపింది ఆ నీడను వదిలించు కోవటానికి. ఆమెభర్త నీడ, వచ్చినట్లుగానే గాలిలో కలిసిపోయింది.

"ఏమిటి పారూ...యిందాకటినుంచీ కలవరిస్తున్నావు..." లలితమ్మ పార్వతి దగ్గరకు వచ్చి బుజ్జగిం

పుగా అడిగింది. వాకిట్లో వంటెద్దుబండి చేస్తున్న గజ్జెల గలగల పార్వతికి కాలయముని గజ్జెల ఘుంఘుణాలా విని పించింది.

"అక్కడికి వెళ్ళక తప్పదా అమ్మా..."

గోపాలరావు బండీలో పెట్టె పెట్టివచ్చి చేతులు దులుపుకుంటూ.

"ఇంకా ఏమిటి అక్కయ్యా ఆలస్యం...బండికి టైమయి పోతుంటేను..." హడావుడిగా అన్నాడు. పార్వతి లేచి మెల్లిగా అడుగులు వేసుకుంటూ బయటికి వచ్చింది. లలితమ్మ భుజంమీద చెయ్యి వేసుకుని.

బండి స్టేషనుకు చేరేటప్పటికి రైలు రానే వచ్చింది. బండిమనిషి ఎద్దు మెడతాడు బండిచక్రానికి కట్టేశాడు. బండి అటూ యిటూ కదలకుండా వుండటానికి. గోపాలరావు జనసమూహంలోనుంచి తోసుకుంటూ పెట్టెను ప్లాటుఫారం మీదికి చేరవేశాడు. బండిమనిషి గోపాలరావు చేతిలో పెట్టెని కిందకు అందుకుంటూ:

'మీరు పోయి టిక్కట్లు నూక్కరండి... నేను పెట్టెలట్టకొస్తాగందా' అన్నాడు. పార్వతి బండీ దిగి పెద్ద పెద్ద అంగలు వేస్తూ గోపాలరావు దగ్గరకు వచ్చి:

'నాకు సెకండు క్లాసు టికెట్టు తీసుకో మామయ్యా...మూడో క్లాసులో నేను కూర్చోలేను' అంది. గోపాలరావు మారుమాట్లాడకుండా బుకింగ్ ఆఫీసుకు బరువుగా అడుగులు వేసుకుంటూ వెళ్ళి పోయాడు.

పార్వతిని సెకండుక్లాసు కంపార్టుమెంటులో ఎక్కించి బండీకి టయం అయిపోవటంవల్ల 'అమ్మా వాళ్ళ దగ్గరకు పోతాను పారూ. బండి టయం అయింది మరి...మళ్ళీ పై స్టేషనులోవచ్చి కలుసుకుంటానులే.' అన్నాడు. ఆమె చింపిరి జుట్టు, కుంకుమ లేక వెల వెల బోతున్న ఆమె ముఖం, బోసిపోయిన ఆమె చేతులూ అతన్ని వెక్కిరిస్తున్నాయి ముఖం వెనక్కి తిప్పేసుకుని ఆర్ద్రమైన స్వరంతో 'పోతున్నా పారూ' అన్నాడు. పార్వతి అతని మాట వినిపించు కోకుండానే దళ్ళున తలుపువేసి లోపలకు వెళ్ళి పోయింది.

బండి బయలుదేరినప్పటినుంచీ లలితమ్మా సావిత్రీ అదే పనిగా మాట్లాడటం మొదలు పెట్టారు. రామాపురంలో చూడబోయే పరిస్థితులు, జరుగుతున్న పరిస్థితులు పార్వతి భావి జీవితం మొదలైనవి చర్చలోనికి వస్తున్నాయి. సావిత్రి మటుకు లలితమ్మ ఏ మాటన్నా ఊకొట్టి వూరుకొంటోంది. గోపాలరావు రెట్టిస్తున్నాడు ప్రతిమాటకీ. ఆ పెట్టెలోనే యిద్దరు ముగ్గురు ముసుగులు పెట్టి పడుకున్నారు. ఆడవాళ్ళో మొగవాళ్ళో గూడా తెలియటంలేదు. మధ్య మధ్య ముసుగులోనుంచే అటూ యిటూ మసులుతున్నారు. మధ్య మధ్య కలవరిస్తున్నారు గూడా. ఆ ముసుగులను చూస్తుంటే అంతకుముందు జరిగిన ఏదో విషాద సంఘటన ఛాయామాత్రంగా స్ఫురిస్తోంది. లలితమ్మకు నిద్రఉండుండి మగతగా వస్తోంది. సావిత్రి ప్రక్కకు జరిగి లలితమ్మ నిద్రపోవటానికి చోటిచ్చింది. లలితమ్మ జారి పడిబోయి వులిక్కిపడి లేచింది.

"ఏరా గోపాలం...పార్వతి నొకసారి చూసి రారా...ఎట్లా వుందో ఏమిటో...ఎంత వద్దన్నా దాని మొండిపట్టేగాని వక్కతే అక్కడా...నలుగురికీ ఆ క్లాసే కావలా అంటే డబ్బు లేదో అని నీ గొడవ...ఛీ...సరే నామాటలకేం గాని వకసారి చూసిరారా" లలితమ్మ దవడలు నొక్కుకుంటూ నాలుగు పక్కలా పరికించింది. అంతా మగత నిద్రలో వున్నారు. బయటినుంచి చలిగాలి రివ్వుమంటూ వస్తోంది. మధ్య మధ్య మిణుగురు పురుగులు గాలికి ఎగిరిపడి వస్తున్నాయి లోపలకు. రైలు వేగంతోపాటు హెచ్చుతూ తగ్గుతోంది లోపలి ఎలెక్ట్రిక్ దీపం.

"స్టేషను వస్తున్నట్టుందే...యిక్కడ దిగి చూసి రారా...వీలయితే అక్కడే కాసేపుండి...ఏదైనా మంచిమాటలు నాలుగు చెప్పిరా..." అంది.

"ఇది అప్పుడే మనవూరినుంచి నాలుగోస్టేషను. ఇప్పుడే స్టేషను వచ్చినట్లు మాట్లాడుతున్నావు... చూసివస్తాలే...'' అన్నాడు గోపాలరావు కూర్చున్న చోటినుంచి లేచి వాకిలివైపు పోతూ.

"నాలుగు స్టేషన్లువస్తే యిందాకటినుంచీ ఏం చేస్తున్నావురా" అంది లలితమ్మ విసుగ్గా మెటికలు విరుస్తూ.

బండి కూతకూస్తూ వేగం తగ్గించి మెల్లిగా పోతోంది. చూస్తుండగానే సిగ్నలు దాటిపోయి స్టేషనుగూడా వచ్చేసింది. తన పెట్టెలోకి ఎక్కటానికి వచ్చేవాళ్ళను తోసుకుంటూ కిందకు దిగి. పార్వతివున్న పెట్టెదగ్గరకు మెల్లిగా అడుగులు వేసుకుంటూ వెళ్ళాడు. తలుపులోపల వేసివుంది. బయటనుంచి తీయటానికి సర్వవిధాలా ప్రయత్నం చేశాడు. తలుపును నాలుగైదుసార్లు కొట్టిచూశాడు. అప్పటికీ తలుపు రాకపోయే టప్పటికి గాబరాపడుతూ గార్డునుపిలుచుకు రావటానికి పరిగెత్తాడు. ప్లాటుఫారం ఆ మూలనుంచి ఈ మూలదాకా రెండు సార్లుతిరిగినా

ఒక్కడూ కనపడలేదు. టిక్కెట్టు కలెక్టరుతో చెపితే పని వుందంటూ ఫ్లాటలు లోకి చొరబడ్డాడు. గోపాలరావు అయోమయంలో పడ్డాడు. ఏం చెయ్యటానికీ తోచక బండి బయలు దేరేటట్టుగా వుండే టప్పటికి పార్వతివున్న పెట్టె వాకిలి దగ్గరకు పరుగెత్తాడు. ఫుట్‌బోర్డుమీద నిలబడి కడ్డీ పట్టుకున్నాడు. బండీ బయలుదేరింది.

బండీ ప్లాటుఫారం దాటగానే తలుపు దానంతట అదే తెరుచుకుంది. 'అమ్మయ్యా' అనుకుంటూ బండీలోపల అడుగు పెట్టి తలుపును పూర్తిగా తోసేసి లోపలకు వెళ్ళాడు. గప్పుమని అత్తరువాసన ముఖానికి కొట్టేసింది. నిర్ఘాంతపోయాడు తను పొరపాటున తప్పు పెట్టెను ఎక్కాడేమోనని. వాకిలినుంచి తల బయటకు పోనిచ్చి పెట్టె నెంబరు చూశాడు. తను గుర్తు పెట్టుకున్నదే. సంశయంతో బెరుకుగా అడుగులు వేస్తూ లోపలకు వచ్చాడు.

'ఏం మామయ్యా....అట్లా కంగారు పడుతున్నావు' పార్వతి నింపాదిగా సోఫాలో పడుకుని అడిగింది. గోపాలరావు కళ్లు తిరిగిపోయినాయి. ఎర్రటి తిలకం నుదుట ఎలెక్ట్రిక్ బల్బు కాంతిలో మిలమిల లాడుతోంది. మల్లెపూలు సోఫానిండా విరజిమ్మబడి వున్నాయి. పెద్ద మల్లెపూల చెండు చుట్ట చుట్టుకుని పార్వతి కొప్పులో కూర్చునివుంది. ఆ పూలన్నీ గాత్రం విప్పి గానం చేస్తున్నట్లు కనపడుతున్నాయి గోపాలరావుకు. ఘుమఘుమలాడుతున్న ఆ పెట్టె... ఆ వాతావరణం... పెట్టె తలుపులన్నీ మూయబడి వుండటంవలన పెట్టెలో గాలికి రాకపోకలు లేక మలి వెచ్చగా ఉంది. స్విచ్ బోర్డులో అగరువత్తుల కట్ట ఒకటి నిలువునా కాలిపోతోంది.

పార్వతి చిరునవ్వునవ్వుతూ "ఏంమామయ్యా .. బాగుందా" అంది. ఆమె ముఖం విప్పారింది. ఆమె తలలోని పూలన్నీ కిలకిలా నవ్వుతున్నాయి. గోపాలరావు కళ్లు నులుముకున్నాడు. పార్వతికి తెలియకుండానే ఎడంకాలిని కుడికాలి గోరుతో గిరుకుని చూశాడు, అతను చూస్తున్నది కలా...నిజమా అనే సంశయంతో.

"పారూ....యిదంతా ఏమిటి...." అన్నాడు అమితాశ్చర్యం పడుతూ.

"కూర్చో మామయ్యా.... చెపుతానుగా.." అంది పార్వతి. ఆమె ముఖం యింకా నవ్వుతునే వున్నది.

"నేను మళ్ళీ పెళ్లి చేసుకుంటానుమామయ్యా... ఈసారి మంచి సంబంధం చూసి పెడతావుగదూ."

గోపాలరావుకు పిచ్చెత్తినట్లయింది. పార్వతికి పిచ్చెత్తిందేమోనని భయపడ్డాడు.

"పార్వతీ!" అంటూ బిగ్గరగా అరిచి గొలుసు లాగటానికి లేచాడు దానివంక చూస్తూ. పార్వతి గభాలున అతని చెయ్యి పట్టుకుని "కూర్చో మామయ్యా...తొందరపడకూ..." అంది ప్రతీ అక్షరాన్నీ సాగదీస్తూ. గోపాలరావు మాట్లాడకుండా సోఫాలో కూలపడ్డాడు.

"నేను పెళ్లి చేసుకుని సుఖపడటం యిష్టంలేదా మామయ్యా"

"పార్వతీ...ఒక్క గంటలో యిలా మారి పోయా వేమిటు..."

"నిజం చెప్పు మామయ్యా ... గుండెల మీద చెయ్యి వేసుకుని చెప్పు...నా సుఖం నువ్వు కోరటం లేదా...?"

"మళ్ళీ పెళ్లా...మన శాస్త్రాలు ఎలా ఒప్పుకుంటాయి" గోపాలరావు మూర్ఖంగా వెలుగుతున్న బల్బువంక చూస్తూ అన్నాడు. పార్వతి అతనిచేయి పట్టుకుని "మన శాస్త్రాలన్నీ మనం రాసుకున్నవేగా మామయ్యా...మనల్ని బాధపెట్టేవి మన కెందుకు?" అంది. గోపాలరావు ఆలోచనలో పడ్డాడు. అతని ఆలోచనలో స్మృతులూ, శ్రుతులూ వరుసాగ్గా నీడల్లాగా కనబడుతున్నాయి.

"వీల్లేదు పారూ...మళ్లీ పెళ్లి వీల్లేదు...మన మతం హర్షించదు...మన పెద్దలు ఒప్పుకోరు...వీల్లేదు పారూ...నన్నిలాంటి ప్రశ్నలు మళ్లీ అడగవద్దు..." అన్నాడు. పార్వతి సంచీలోనుంచి అద్దంతీసి ముఖం చూసుకుని కుంకుమ సర్దుకుంది సగర్వంగా చూసుకుంటూ.

"ఈ సామానంతా ఎక్కడిది పారూ" వెలుగుతున్న అగరువత్తుల కట్టవంక చూస్తూ అడిగాడు.

"ఈ పెట్టెలో నేనెక్కినతర్వాత చాలా స్టేషనులు వచ్చాయి మామయ్యా..."

గోపాలరావు మౌనం దాల్చాడు. అటూ ఇటూ చూస్తూ ఆ పూలవాసన దొంగతనంగా ఆఘ్రాణిస్తున్నాడు. అగరువత్తుల మీదనుంచి వస్తున్న సువాసన మత్తును కలిగిస్తోంది.

పార్వతి గోపాలరావుకు యింకా దగ్గరగా జరిగి 'మామయ్యా' అంది. ఆమె గాత్రంలోని తొట్రుపాటు గోపాలరావు గ్రహించక పోలేదు. అతనికేదో మైకం కమ్మినట్లయింది. పిచ్చిగా ఆమెవంక చూస్తూ

'ఇకంతా ఏమిటి పారూ...నన్నిట్లా ఎందుకు హింసిస్తావు' అన్నాడు. ఆమె అరచేతులను మృదువుగా తాకుతూ.

'ఏం మామయ్యా...నాశనమయిన నా జీవితంలో ఒక్క మధుర రాత్రాన్ని కూడా సహించలేక పోతున్నావా...బీటలు వారిన నా హృదయక్షేత్రంలో ఒక్క మల్లె మొక్క నాటటానికి వెనుకాడుతున్నావా...నాకు మనశ్శాంతి కావాలి మామయ్యా...ఈ ఒక్క రాత్రీ నా జీవితంలో వసంతంగా వెళ్లి పోనియ్యవూ...నీ కెప్పటికీ కృతజ్ఞురాలినిగా వుంటాను.' పార్వతి చెప్పిన మాటలన్నీ విని గోపాలరావు ఒక్కసారిగా లేచి నిలబడ్డాడు.

'ఇప్పుడే వెళ్ళిపోతా...నన్ను వదిలి పెయ్యి...నన్నిలా బ్రతకనీ' అంటూ బిగ్గరగా అరిచాడు. పార్వతి లేచి అతని చెయ్యి గట్టిగా పట్టుకుంది.

'బాగా ఆలోచించుకో...నా మాట మన్నించలేక పోయినట్లయితే...నీ మీద....అపనింద వేసి నీ జీవితాన్ని నాశనం చెయ్యటానికయినా వెనుదీయను .. అపనింద...మొగుడు చచ్చిన ఆడదాన్ని...నీ జీవితం నాశనం చేసికోకు మామయ్యా....నా జీవితం శాంతంగా వెళ్ళనీ....చెయ్యిలో చెయ్యి వేసి చెప్తున్నాను...నామాట మన్నించవూ..." పార్వతి గాత్రం గీరపోయింది. గోపాలరావు చలించిపోయాడు. పార్వతి కన్నీళ్ళు తుడుచుకుంటూ "మా....మ....య్యా' అంది గంభీరంగా, గోపాలరావు ఆమెను ఒక్కసారిగా హృదయానికి హత్తుకుని 'పారూ' అన్నాడు. ఆ పెట్టెలో దీపం ఆ క్షణమే ఆరిపోయింది. పార్వతే లైటు తీసి వేసిందని గోపాలరావుకు తెలియదు...

లైటు వెలిగేటప్పటికి గోపాలరావు బద్ధకంగా ఆవలిస్తూ సోఫామీదనుంచి లేచాడు. పార్వతి పంపుదగ్గరకు పోయి ముఖం కడుక్కొని వచ్చింది. కుంకుమ చెరిగిపోయిన నీళ్ళు ఆమె చెక్కిలిపక్కగా జారి ఎర్రటిగీతలా కనపడుతోంది. తలలో నలిగిపోయిన పూలనన్నిటినీ వుండచుట్టి కిటికీలోనుంచి బయటకు పారేసింది. వెలుగుతున్న అగరువత్తుల కుత్తిని అపాటున కిటికీలోనుంచి విసిరిపారేసింది. అత్తరు తడిసిన జేబురుమాలును సునాయాసంగా కిటికీలోనుంచి వదిలిపెట్టింది. గోపాలరావు విశ్చేష్టుడై "ఉంచనీ పారేద్దువు గానిలే" అన్నాడు. పార్వతి అతనివంక కఠినంగా చూస్తూ:

"ఇంకా ఎందుకు...వీటిపని అయిపోయింది" అంది. ఇంతవరకూ సుకుమారంగా మాట్లాడిన గొంతు అంత కర్కశంగా మారేటప్పటికి గోపాలరావు తల క్రిందు లయిపోయాడు.

"ఇప్పటికయినా అర్థమయిందా"—పార్వతి అతనివంక చూస్తూ పకాలున నవ్వింది. అతనికి నవ్వాలో ఏమిచెయ్యాలో తెలియలేదు. ముఖం గంభీరంగా పెట్టి:

"ఏమిటి" అన్నాడు. పార్వతి విరగబడి మళ్లీ నవ్వుతూ ఒక్కసారిగా ఆగ్రహం తెచ్చుకుంది.

"నాజీవితం సర్వవిధాలా నాశనం చేసినందుకు...నీ జీవితాన్ని కూడా నాశనం చెయ్యగలిగాను మామయ్యా...నాకు అదే తృప్తి...మొగుడు చచ్చిన ఆడదాన్ని" అమాట అంటూనే పార్వతి బిగ్గరగా పిచ్చిదానిలా నవ్వింది.

"ఆ పాపం నిన్ను వదిలి పెట్టదులే మామయ్యా...నీజీవితాంతంవరకూ నిన్ను వెంటాడుతూనే వుంటుంది. నీకు యిక్కడే కాకుండా స్వర్గంలో కూడా స్థానం లేకుండా చేశాను...మొగుడు చచ్చిన...నాకేం... నేను సూటిగా స్వర్గానికే పోతాను...స్వర్గం అంటూ ఒకటి వుండేటట్లయితే... నేనేం పాపం చెయ్యలేదు.. నాకు ఒక్కటే తృప్తి...ఈ రోజే నా జీవిత వసంతం...ఆ చచ్చినవాడిని నేను కోరి చేసుకోలేదు...ఆస్తికోసం...పరపతి కోసం ఆశించి...మీరు చేసుకున్నారు ఆ పెళ్లి. దానితో నాకేం సంబంధం... నువ్వో కట్టుకున్న పెళ్లాన్ని వదిలి మొగుడుచచ్చిన... ఆ పాపం నిన్ను వదలదులే మామయ్యా..." పార్వతి గంభీరం వదిలి తిరిగి బిగ్గరగా నవ్వుతోంది గోపాలరావు కంగారు పడిపోయాడు.

"అపనింద వెయ్యనని హామీ ఇచ్చావుగా రాక్షసీ...మళ్ళీ బిగ్గరగా అరిచావంటే" గోపాలరావు పెద్దపులిలాగా మీదకు వురికాడు ఆమె గొంతును గట్టిగా పట్టుకుంటూ.

'తొందరపడకు మామయ్యా...నన్ను హత్యచేసినా దాగదులే...ఇప్పుడు జరిగిందంతా జరుగుతుందని ముందుగానే తెలుసు నాకు... నేను చెప్తున్నాగా నాకు తెలుసు...అందుకనే రాశాను ఒక తెల్లకాగితంమీద ... నా చరిత్రంతా రాశాను... తొందరపడకు..నీ చరిత్రకూడా రాశానులే దాంట్లో.. అది నలుగురికీ తెలియదూ...నవ్వరూ నలుగురూ.... ఊ...ఏం మామయ్యా అట్లా చూస్తున్నావు' గోపాలరావు ఆమెను సోఫామీదకు ఒక్క తోపుతోసి.

'ఆ కాగితం ఎక్కడ...ఎక్కడ దాచావు...' అంటూ అరవడం మొదలుపెట్టాడు. పెట్టె అంతా, సంచీలోనూ, పరుపుకిందా వెదికాడు గాబరా పడుతూ.

'ఏం మామయ్యా...నీకు కనపడనిచోట దాచి పెట్టాననుకున్నావు కదూ... అంత తెలివితక్కువ దాన్ని గాదులే... తెలిసి రావద్దని చేసిన అన్యాయా నికి తెలిసి వచ్చిన తర్వాత ప్రతీకారం తీర్చుకు న్నాను...అయినా కాగితంమీద కాదులే రాసింది.. ఒక నల్లరాతిమీద రాశాను....చెరుపుదామంటే చెర గదులే...అది కఠినశిలగదూ మామయ్యా...అందుకని 'కఠిన శిల' అంటుంటే ఆమె గాత్రం గరగరలాడింది. ఆమె నేత్రాలు అశ్రుపూరితాలయిపోయినాయి

"రాక్షసీ...నిన్నేం చేస్తానో చూడు...అది దొరక్కపోతే పోయిందిలే" కాగితం దొరకని ఆవే శంలో ఆమెను గట్టిగా ఒకచేత్తో దగ్గరకు లాక్కుని రెండు చేతులతో గొంతు పట్టుకోబోయాడు.

"వృథా శ్రమపడకు మామయ్యా...నాకే సంగతీ తెలుసు...అందుకనే నీకు శ్రమలేకుండా నేనే పోదామనుకున్నాను...ఇదుగో ఈ సీసా చూడు... తాగేశానులే ... పాయిజన్ ... అంటే తెలుసు అనుకుంటా...నీ కెందుకు శ్రమ... దానంతట అదే పోతుందిలే ప్రాణం..." గోపాలరావు సందిగ్ధావస్థలో పడ్డాడు. విషంతాగి మరణావస్థలోవున్న మనిషితో ఎట్లా వేగాలో తెలియటంలేదు. పార్వతి తూలు పాటువచ్చి సోఫామీద విరుచుకు పడిపోయింది. రైలు ధనధనామని చప్పుడుచేస్తూ నిర్లిప్తంగా పోతునే వుంది.

"పార్వతీ ... పారూ ... ఆ కాగితం ఎక్కడ పెట్టావో చెప్పవూ...నీ కేం కావాలంటే అది చేస్తాను" గోపాలరావు ఆమె గడ్డం పట్టుకు బ్రతిమి లాడుతున్నాడు.

"నాకేం చేస్తావు మామయ్యా...వెళ్ళిపోతున్న దానికి...కాగితం ఎక్కడపెట్టానో చెపితే చించి వేద్దామనిగదూ...ఆ...కాగితం మీద కాదని చెప్పా నుగా రాసింది...నల్లరాతిమీద రాశాననిగూడా చెప్పానుగా...అదిగూడా చెప్పమంటావా"

"పార్వతీ ... నాకేం అర్థం కావటంలేదు ... నన్ను క్షమించలేవా ... ఎక్కడా నువ్వు రాసింది చెప్పవా పారూ..."

'క్షమించలేను మామయ్యా...నా పేరు పదే పదే ఉచ్చరించి కలుషితం చెయ్యకు...అయినా చెబుతానులే...చూసుకో...నీ రాతి గుండె మీద రాశాను...చేతనయితే హృదయాన్ని చీల్చుకుని చెరిపి వేసుకో...' పార్వతి ఆయాసపడుతూ ముఖం పక్కకు తిప్పుకుంది. ఆమె ముఖం రంగు మారి పోయింది. వళ్ళు చల్లబారుతోంది. గోపాలరావు బరువుగా నిట్టూర్చాడు. పార్వతి గిలగిలా తన్నుకోవటం మొదలు పెట్టింది. అతను కంగారు పడుతూ గొలుసు లాగుదా మని దానిని చేతిలో పట్టుకోగానే బండి దానంతట అదే ఆగిపోయింది.

బయటినుంచి కిళ్ళీ, టీ వాళ్ళు పూరీకీ అరుస్తు న్నారు. గోపాలరావు గబగబా కిందకుదిగి స్టేషను మాస్టరు దగ్గరకు పరుగెత్తుకు వెళ్లి ఆయన్ని పిలుచుకు వచ్చాడు. ఆయన వచ్చేటప్పటికి ఫస్టు ఎయిడ్ బాక్సు పట్టుకువచ్చాడు. ఇద్దరు పోర్టర్లు గబగబా పెట్టెలోకి ఎక్కి పార్వతిని బలవంతంగా దించారు. కింద అప్ప టికే జనం రద్దీ ఎక్కువయింది. చుట్టూరా మూగి హడావుడి చేస్తున్నారు. లలితమ్మ, సావిత్రీ గూడా సామాన్లు దింపుకువచ్చారు వీరున్న చోటికి. ఆ స్టేషను రామాపురం అని తెలుసుకున్నారు. జనంలోనుంచి డాక్టరుని పార్వతి దగ్గరకు చేర్చటం ప్రయత్నం అయి పోయింది.

పార్వతి మూలుగు ఎక్కువైంది. ఆ ధ్వని ఎక్కడో పాతాళంనుంచి వస్తున్నట్లుంది. రెండు మూడుసార్లు బలవంతాన పెదిమలు కదల్చటానికి ప్రయత్నం చేసింది. ఆ వచ్చినాయన ఏదో సీసాలో నుంచి మందు చెంచాతో తీసి పెదిమలు తడిపాడు. పార్వతి పెదిమలు బలవంతాన కదుపుతూ 'విషం... నేనే...చచ్చి...నూ...పుచ్చుకున్నాను' అంది. గోపాలరావు స్టేషనుమాస్టరుగారి భుజం పట్టుకుని:

'వినండి డాక్టరుగారూ...నాకేం తెలియదు... నేనేం చెయ్యలేదు' అన్నాడు. పార్వతి ముఖంలో రేఖామాత్రంగా చిరునవ్వు పొడ చూపింది గోపాల రావు వంక చూస్తూ. లలితమ్మ సావిత్రీ, పార్వతి దగ్గ రకు చేరి హోరు హోరున ఏడుపు ప్రారంభించారు. రైలు స్టేషను మీదుగా రాలిపోయిన నక్షత్రం గోపాలం దృష్టిలో పడింది. అతని హృదయం జల్లు మంది. వెక్కిపారిగా వణికిపోతూ అతని రెండు చేతులూ హృదయానికి హత్తుకున్నాడు. అతని చేతి కేమిటో అక్షరాల్లాగా గుచ్చుకున్నాయి.

శిథిలాలయం

శ్రీ అంగర సూర్యారావు

గత సంచిక తరువాయి

2

* * అదే స్థలం, కొండశిఖరంమీద దేవాలయంముందు; సంధ్యాసమయం; సూర్యకిరణాలు చెట్లమీద, పూలమొక్కల మీదపడి మెరుస్తున్నాయి. దేవాలయం తలుపులు తెరచి వున్నాయి. చిరంజీవి వేదికపైకూర్చుని పుస్తకం చదువుతూవుంటాడు. ఆలయంలోనుంచి రాముడు వస్తాడు. అతని ముఖంలో యీసారి ప్రశాంతత కనిపిస్తూ వుంటుంది.

రాముడు: (వేదికమీద కూర్చుంటూ) యామిని యేదీ?

చిరంజీవి: కొండవాలులో పూలమొక్కల దగ్గర తిరుగుతోంది. ఇక్కడికి వచ్చిన యీ మూడు రోజులలోను ఆమెలో ఏదో మార్పు కనిపిస్తోంది.

రాము : జీవిత సంగ్రామంలో అలసిపోయిన వాళ్లకు యీ ప్రదేశం స్వర్గం వంటిది. ఇక్కడినుంచి వెళ్ళడానికి నాకే కాళ్లు ఆడటంలేదు. (నిట్టూర్చి) తప్పదు! వెళ్ళిపోవాలి! ఇక్కడే మరికొంతకాలం వుంటానం అటస్థించినట్లయితే నా లక్ష్యాన్ని నేనే మరిచి పోవలసి వస్తుంది.

చిరం : ఎక్కడికి వెడతావు?

రాము : ఎక్కడికా? ఇక ఎక్కడికి వెడతాను! ప్రపంచం మీదికి (అతని ముఖంలో క్రౌర్యం కనిపిస్తుంది) నా జీవితసౌఖ్యాలు కొల్లగొట్టిన లోకంమీద దండయాత్ర చేస్తాను.

చిరం : లోకాన్ని సవాల్‌చేసి ఒక్కడవూ ఏం చెయ్యగలవు?

రాము : అది నాకూ తెలుసురా తమ్ముడు! లోకాన్ని నేనొక్కడినీ యేం చెయ్యలేను. నేను లోకం మీద దండయాత్ర చెయ్యటం కొండను ఢీకొన్నట్లే అవుతుంది. అలా అని పిరికివాడనై ఒక మూల కూర్చోలేను. జీవితంలో ఆనందాన్ని సౌఖ్యాన్ని అనుభవించే అర్హతను నేను కోల్పోయాను. నాపతనానికి కారణభూతమైన యీ ప్రపంచంతో నా యీ జీవితం సంఘర్షణ తప్పదు.

చిరం : మనల్ని హింసించిన వాళ్లపై పగ పట్టడం కంటే మనకు మార్గాంతరం లేదా? (ఆలోచిస్తూ) అవును! అప్పుడప్పుడూ నా మనస్సు నాకు ఎదురు తిరిగి పగ తీర్చుకోమని హెచ్చరిస్తూ వుంటుంది. నా కళ్ళముందు నా తల్లిదండ్రులు పడిన కష్టాలు నాలో నిద్రాణమై వున్న ప్రతిహింసాభావాన్ని మేల్కొలుపుతున్నై.

రాము : తమ్ముడూ! నిన్ను చూస్తూవుంటే నా మనస్సు కరిగి పోతుంది. నువ్వు కళ్లు తెరవక ముందే కష్టాలకు గురి అయ్యావు. సమాజపు కఠోర శాసనాలకు బలియై నీ తల్లిదండ్రులు నీ కళ్ళముందే అంతరించారు. వెర్రి తలలు వేసిన కుల మతాభిమానాలకు నీ కుటుంబం ఆహుతి అయిపోయింది. తమ్ముడూ! ఒక్క మాట చెబుతాను. నువ్వు నాకలె మారి పోవాలని నేను కోరలేను. నేనెలాగూ చెడి పోయాను. నా హృదయం తూట్లు పడి పోయింది. నేను యిక ఎప్పటి మనిషిని కాలేను. (విచార స్వరంతో) కాని తమ్ముడూ! నువ్వు మాత్రం దారి తప్పవద్దు.

నీ రేత మనస్సును గాయపరచుకోవద్దు. నేను నడిచే కంటకావృతమైన మార్గంలో నువ్వు నడవలేవు. నీవు యిక్కడ ఆగిపో.

చిరం : అయితే నీవు వెళ్లడం తప్పదా?

రాము : తప్పదు. నేను వెళ్లి తీరాలి. ఈ మూడు రోజులు యిక్కడ ఎలా వుండగలిగానా అని నాకే ఆశ్చర్యంగా వుంది. నేను ఎత్తిన కత్రను ఎన్నడూ దించి ఎరుగను. మొన్న నే మొదటిసారి దించాను. ఇక్కడ మరికొన్ని రోజులు వుంటే నా మనసు పయూలంగా మారిపోతుందేమో నని భయంగా వుంది.

[కుటీరపు చెట్ల వెనుకనుంచి యామిని వస్తుంది. ఆమె ముంగురులు గాలికి చెదిరి చిందరవందరగా ముఖంమీద పడివున్నాయి. ముఖంలో ఆనందం, ఉత్సాహం నిండి వున్నాయి. ఒడినిండా పూలువున్నాయి. వేదికమీద ఒక మూల కూర్చొని ఒడిలోని పూలను ముందు వేసుకుని మాల అల్లుతూ వుంటుంది.]

రాము : ఆ పూలన్నీ ఎందుకు యామినీ?

యామిని: మనుషులు పువ్వులంటే ఎందుకు అంత యిష్ట పడతారో నీకు తెలియదా రాముడూ? (ఒక అందమైన పువ్వు తీసి చూపిస్తూ) చూడు! యీ పువ్వు ఎంత అందంగా వుందో! ఇది నిన్ను ఆకర్షించడంలేదూ?

రాము : ప్రపంచంలోని ఏవస్తువుకూ నన్ను ఆకర్షించే శక్తిలేదు.

యామి : అలాగా! నువ్వు నీ జీవితంలో ఎన్నడూ ఏ స్త్రీని ప్రేమించలేదా?

రాము : ప్రేమా? దానినిగురించి ఆలోచించే తీరిక కూడా నా కింతవరకూ కలగలేదు.

యామి : (కొంటెగా) పోనీ యిప్పుడు కలిగిందా?

రాము : ఇక్కడ అడుగు పెట్టినప్పటినుండి నాకు ఎన్నడూ రాని ఆలోచనలు వస్తున్నాయి. తలపైనున్న పెద్ద బరువు తొలగించి తీరికగా కూర్చున్నట్టు అనిపిస్తోంది.

యామి : విశ్రాంతి, సౌఖ్యం, వున్నప్పుడే మనిషి మనసు వికసిస్తుంది. అప్పుడు దానంతట అది కొత్త కోరికలను కోరుకుంటుంది.

చిరం : ఆ పూలమాల లెందుకు?

యామి : దేవుడికోసం.

రాము : (హేళనగా) పూలమాలలతో దేవుణ్ణి పూజించు! అందుకు ప్రతిఫలంగా యీ జన్మాంతం నీకు కష్టాలను ప్రసాదిస్తాడు. ఆ తర్వాత పునర్జన్మలో నీకు చక్కని భర్తను, ఐశ్వర్యాన్ని ప్రసాదించి నీ జీవితాన్ని పూలపాన్పుగా మారుస్తాడు.

యామి : (కోపంతో) నువ్వు నాస్తికుడ వని నాకు తెలుసు! నీ ఉద్దేశాలను ఏ స్త్రీ గౌరవించ లేదు! పరాధీనపు బ్రతుకు బ్రతికినంత కాలం స్త్రీకి దేవుడికంటే వేరే శరణ్యంలేదు. దేవుడనే భావమే ఆమె కష్టాలకు తాత్కాలికోపశమనాన్ని కలిగిస్తుంది. ఆ దేవుణ్ణి కూడా నీలాంటివాళ్లు తొలగిస్తే ఆమెకు వున్న ఒక ఆశారేఖా అంతరించి ఆమె జీవితం దుఃఖభాజన మౌతుంది.

రాము : స్త్రీలకే కాదు. పరాధీనులైజీవించే మానవు లందరికీ దేవుడేగతి. వాళ్లందరూ తమ అధ్వాన్నపు జీవితానికి ఆకాశంలో వుండే భగవంతుడే కారణ మని నమ్ముతారు. తమ నికృష్టజీవితాలకు తమతోటి మానవులే కారణ మని వాళ్లు ఎంతమాత్రం విశ్వసించరు. (క్షణంఆగి) నేనిలా అంటున్నానని యేమీ అనుకోకు యామినీ! నీవు లోనికివెళ్ళి నిశ్చల భక్తితో నీ దేవుణ్ణి పూజించుకో!

యామి : నేనొక ప్రశ్న వేస్తాను. జవాబు చెబుతావూ?

రాము : ఒక ప్రశ్న కాదు. లక్ష ప్రశ్న లడిగినా జవాబు చెబుతాను!

యామి : నిజంగా మరొక జన్మవుంటే — ఆ జన్మలో ఏమై జన్మించాలనుకుంటావు?

రాము : జన్మసిద్ధాంతమే మన కొంప తీస్తోంది యామినీ! నిజానికి పునర్జన్మగనక వుంటే ఆ జన్మలో దుర్మార్గులను, వంచకులను, స్వార్థపరులను హతమార్చే యమదూతగా జన్మించాలని నా ఆకాంక్ష!

చిరం : (నవ్వుతూ) హాయి! హాయి! చాలా బాగుంది. భలే మాట చెప్పావు రాముడూ?

యామి : (కోపంతో) ఉహుఁ! అలాగా! రాముడు చెప్పిన మాటలు నీకు నచ్చిన వన్నమాట! (అనునయంగా) మామయ్యా! చిరంజీవి! నువ్వింకా చిన్నవాడవు! అటువంటి మాటలు వింటే నువ్వు చెడిపోతావు. ఇదిగో యీ పూలమాల తీసుకువెళ్లి దేవుడిమెడలో వేసిరా! (పూలదండ చిరంజీవికి యిస్తుంది. చిరంజీవి మారు మాటాడకుండా మాలతీసుకొని దేవాలయంలోకి నిష్క్రమిస్తాడు. యామిని మరోమాల అల్లుతూ వుంటుంది. రాముడు లేచి దీర్ఘంగా ఆలోచిస్తూ అటూ యిటూ తిరుగుతూ వుంటాడు.)

యామి : రాముడూ!

రాము : ఏం? యామినీ!

యామి : ప్రేమ అంటే ఎలా వుంటుందో నీవు ఎన్నడూ ఎరుగవు కదూ!

రాము : చిన్నప్పుడు పుస్తకాలలో చదువుకున్నాను. ఆ తరువాత దాన్ని గురించి ఆలోచించే తీరిక నాకు కలగ లేదు.

యామి : పోనీ తల్లి ప్రేమ ఎటువంటిదో తెలుసా?

రాము : అందుకు కూడా నేను నోచుకోలేదు. నేను కళ్లు తెరిచే సరికే నా తల్లి యీలోకాన్ని విడిచి పెట్టింది.

యామి : అందుకే నువ్విలా మారిపోయావు! తల్లి ఒడిలో పెరిగిన బిడ్డకు దయాదాక్షిణ్యాలు తప్పకుండా అలవడతాయి.

రాము : నాలో దయాదాక్షిణ్యాలు లేనందుకు నేను చాలా గర్విస్తున్నాను. యామినీ! (ఆశ్చర్యంతో) కాని! యింతకు పూర్వం నా మాటకు ఎదురుచెప్పినవాళ్లను ఎన్నడూ విడిచిపెట్టలేదు. నేటికి నామాటలకు ఎదురు చెప్పేవాళ్లు యిద్దరు కనిపిస్తున్నారు.

యామి : (చిరునవ్వుతో) ఎవరా యిద్దరు?

రాము : (దేవాలయం వేపు చూపిస్తూ) ప్రాపంచిక విషయాలను ఏమాత్రం పట్టించుకోకుండా కళ్ళు మూసుకొని ఈ పాడుదేవాలయంలో కూర్చున్న విరాగి ఒకడు. రెండవ వాడివి నువ్వు.

యామి : నీ మాటలకు ఎదురు చెబుతున్నందుకు నీకు నామీద కోపం కలగడం లేదా?

రాము : లేదు! అందుకే నేను ఆశ్చర్యపోతున్నాను.

యామి : దాని అర్థం యేమిటో తెలుసా రాముడూ? (రహస్యంగా) నీలో ప్రేమ, సహనం ఏర్పడుతున్నాయి.

రాము : (కోపంతో) వీల్లేదు. నాలో ప్రేమా సహనం కలగడానికి ఎంతమాత్రం వీల్లేదు. నా ప్రధానాశయమయిన ప్రతిహింసను మరిచిపోవడానికి వీల్లేదు. (ఆలోచిస్తూ) మరొక రోజు యిక్కడ వుంటే నా పతనం తప్పదు. ఈ చోటును ఎంత తొందరగా విడిచిపెడితే అంత మంచిది. (లేచి తొందరగా వెళ్ళబోతూ ఉంటాడు.)

యామి : (ఆజ్ఞాపించే ధోరణిలో) రాముడూ! ఆగు! (రాముడు ఆగి వెనక్కు తిరిగి చూస్తాడు.) నువ్వు ఇప్పుడు వెళ్లడానికి నేను అంగీకరించడం లేదు. కూర్చో!

[మంత్ర ముగ్ధునివలె వెనుకకు తిరిగి వచ్చి రాముడు వేదికమీద యామినికి దూరంగా ఒక కొసను కూర్చుంటాడు.]

రాము : (దీనంగా) యామినీ! నేను యిక్కడ ఉన్నందువల్ల ప్రయోజనం ఏమిటి?

యామి : (సూటిగా) నువ్వొక్కడివూ ప్రపంచంమీద తిరుగుబాటు చేసినందువల్ల ప్రయోజనం ఏమిటి?

రాము : నీ మాటలలోని అయస్కాంత శక్తి నన్ను కదలనివ్వడం లేదు. నేను పరాజయాన్ని అంగీకరించవలసిందేనా? నేను నిజంగా పతనమౌతున్నానా? నా తల తిరుగుతోంది. ఎన్నడూ లేని వికారం ఏదో నాలో కలుగుతోంది.

[దేవాలయ జీర్ణప్రాకారానికి జేరబడి కళ్లు మూసుకుంటాడు]

యామి : విశ్రాంతి తీసుకో! ఇహలోకపు కల్మషాలకు దూరంగా వున్న యీ ప్రదేశంలో నిశ్చింతగా విశ్రాంతి తీసుకో! ఒక మనిషిలోని కర్కశత్వాన్ని తాత్కాలికంగా

నైనా తొలగించ గలిగినందుకు చాల సంతోషిస్తున్నాను.

రాము : (కళ్లు తెరచి దీనంగా) నాలో యింతటి దుర్బలత్వం వుందని నేనెన్నడూ అనుకోలేదు. నా మనోవికారానికి కారణం తెలియడం లేదు. (యామినిని తేరిపార జూస్తూ) నిన్ను చూస్తుంటే నాలో విచిత్రమైన భావాలు కలుగుతున్నై యామినీ!

యామి : (ఒక నిశ్వాసం విడిచి) హమ్మయ్య! ఇప్పటికి నీలో పూర్తి మానవత్వం వచ్చింది. ఆ లోకంలో నన్ను చూచిన ప్రతి యువకుడు వికారానికి లోనయ్యేవాడు. ఆ రోజుల్లో నా సౌందర్యాన్ని చూసుకొని ఎంతో మురిసిపోయేదాన్ని. చివరకు నా సౌందర్యమే నా పతనానికి కారణమయింది.

రాము : ఎప్పుడూ నీతోనే వుండిపోవాలని అనిపిస్తోంది.

యామి : అందరు యువకుల వలె నీవు కూడా ప్రేమలో చిక్కుకున్నావు. కాని నేను పతనమైన స్త్రీని. నేను ప్రేమించే అర్హతను కోల్పోయాను.

రాము : ఆ లోకపు కొలబద్దతో చూస్తే నేను కూడా పతితుడనే యామినీ!

యామి : (హేళనగా నవ్వుతూ) అయితే మనం చక్కని జంట! యిద్దరం వెళ్ళిపోయి ఏటి ఒడ్డున యిల్లు కడదాం.

[ఆలయంలోంచి విరాగి వస్తాడు.]

విరాగి : ఈ రోజు నీలో ఉత్సాహం కనిపిస్తోంది యామినీ!

యామి : స్వామీ! మోడు అయిపోయిన లతను మీరు చిగురింపచేశారు. కాని అది కేవలం చిగురించి వూరుకోలేదు. పూవులు పూయడానికి, కాయలు కాయడానికి ప్రయత్నిస్తోంది.

విరాగి : నీలో ఎంత ఉత్సాహం కనిపిస్తోందో యీ రాముడిలో అంత నిరుత్సాహం కనిపిస్తోంది.

యామి : (నవ్వుతూ) అతను కొత్తగా ఒక ఆపదలో చిక్కుకున్నాడు స్వామీ!

విరాగి : ఓహో! అలాగా! రాముకు ఏ ఆపదలనూ లెక్క చెయ్యడే!

యామి : ఈ ఆపద వేరు స్వామీ! దానినుంచి ఏ మానవ మాత్రుడు తప్పించుకోలేడు.

చిరం : (ఆలయద్వారం దగ్గరకు వచ్చి) రాముడూ! ఒకసారి యిలా రావూ?

[రాముడు ఆలయంలోనికి నిష్క్రమిస్తాడు.]

విరాగి : రాముడికీ చిరంజీవికీ రోజురోజుకూ స్నేహం ఎక్కువ అవుతోంది.

యామి : చిరంజీవి కూడా రాముకి ప్రతిహింసా సిద్ధాంతం వైపు మొగ్గుతున్నాడు స్వామీ!

విరాగి : అది నాకు తెలుసు యామినీ! లేత మనసు తాత్కాలిక ప్రయోజనాల వైపు తల వంచుతుంది.

యామి : వీళ్ళిద్దరూ ఏకమై ఏ దురంతానికి పూనుకుంటారో అని నాకు భయంగా వుంది.

విరాగి : నా సమక్షంలో అటువంటివి ఎన్నడూ జరగవు యామినీ!

యామి : ఒకడు యౌవనంలో కళ్లు కనిపించక సంచరించే యువకుడు. మరొకడు కళ్లు పూర్తిగా తెరవని పసివాడు. ఇద్దరూ సహజంగా ఎంతో మంచివాళ్లు. ఒక్కొక్కప్పుడు ఎంతో సౌమ్యంగా ప్రవర్తిస్తూ వుంటారు. కాని ఉత్తర క్షణంలోనే విచిత్రంగా మారిపోతూ వుంటారు.

విరాగి : మానవునిలో మార్పు పరిసరాలను బట్టి వుంటుందమ్మా! మానవుడు పుట్టుకతో నిష్కల్మషాత్ముడు. కాని అతను పెరిగే వాతావరణాన్ని బట్టి అతనిలో దయ, నిర్దయ, జాలి, క్రౌర్యం స్థావరాలను ఏర్పరుచుకుంటూ వుంటాయి. ఉదాహరణకు రాముణ్ణి చూడు! మన మధ్య వున్నంత కాలం సాధువు అయిపోతాడు. పై మనిషి ఎవరైనా వచ్చి దౌర్జన్యానికి పూనుకుంటే పులి అయిపోతాడు. (ముందుకు నడుస్తూ) నువ్వు ఒంటరిగా యిక్కడ కూర్చోవడం మంచిది కాదు. లోనికి వెళ్ళిపో యామినీ!

[విరాగి ఎడమవైపు చెట్లగుంపులోనికి నిష్క్రమిస్తాడు. యామిని మాల అల్లడానికి

తిరిగి ఉపక్రమిస్తుంది. దూరాన్నించి మనుషుల మాటలు వినిపిస్తాయి. ఆమె భయంతో కుడి వైపు చూస్తుంది.]

రత్నాకరం: (నేపథ్యంలో) అదుగో! ఆ పాడు దేవాలయంలోనే వుంది.

[యామిని భయకంపితురాలై పూలన్నీ చెల్లా చెదరుగా పారేసి ఆలయంలోకి పారిపోతుంది. కుడివైపునుంచి రత్నాకరం, పార్వతీశం మాట్లాడుకుంటూ వస్తారు. పార్వతీశం తెల్లగా, లావుగా వుంటాడు. నొసట విభూతి రేఖలు వున్నై. విలువైన శాలువ కప్పుకుని వున్నాడు. మనిషిని చూడగానే పూర్వాచారపరాయణుడని తెలుస్తుంది.]

పార్వతీశం: ఈ గుట్టలు, డొంకలు అన్నీ దాటి ఇక్కడికెలా రాగలిగిందోయ్?

రత్నా : అదే నాకు ఆశ్చర్యంగా వుంది.

పార్వ : (చుట్టూ కలయజూస్తూ) ఇక్కడ ఎక్కడా మనుష్య సంచారం వున్నట్లు కనిపించదే!

రత్నా : యిదుగో! యీ గుడిలో వుంటారు. (ఆలయ ద్వారందగ్గర నిలుచొని) ఏమయ్యోయ్! బైరాగీ!

[లోపలనుంచి చిరంజీవి వస్తాడు. అతని ముఖంలో కోపం కనిపిస్తూ వుంటుంది.]

చిరం : (కోపంతో) ఏం? ఎందుకు?

రత్నా : పోయి మీ బైరాగిగారిని యిక్కడికి పంపించు! అతనితో మేం మాట్లాడాలి!

చిరం : వారు అలా పైకి వెళ్లారు. ఇప్పుడే వస్తారు.

పార్వ : (చిరంజీవిని నఖశిఖ పర్యంతం పరికించి చూసి) హోరి వెధవా! నువ్వటరా!—నువ్వు కూడా యిక్కడ చేరేవు?

చిరం : (కోపంతో) ఏమండోయ్ పార్వతీశం గారూ! మీరు కొంచెం మర్యాదగా మాట్లాడాలి. ఇది మీ దేవాలయం కాదు నోటికి వచ్చినట్లు మాట్లాడ్డానికి.

పార్వ : (కోపంతో) నన్నే ధిక్కరిస్తున్నావటరా?

చిరం : ధిక్కరించకపోతే చేతులెత్తి మొక్కమంటారా? ఒకనాడు నేను మీ ఆలయంలోకి వస్తే ఏం చేశారు?

పార్వ : (కోపంతో) ఏం చేశారు? మెడమీద కర్ర వేసి బయటకు గెంటారు?—ఓరి వెధవా? నన్నే ఎదిరించే పాటి వాడివయ్యావ్రా? జాతీ నీతీ లేని దౌర్భాగ్యుణ్ణి దేవాలయంలో అడుగుపెట్టనిస్తార్రా?

రత్నా : నూతిలోపడి చచ్చిపోయిన లక్ష్మికొడుకు కదటండీ వీడు?

పార్వ : వాడే! ఇంకేవాడయ్యాడు! దానికి నీతి వుందిగనక నూతిలోపడి చచ్చింది. ఈ వెధవకు అదీ వున్నట్లు లేదు.

చిరం : ఈ విధంగానైనా మా అమ్మకు నీతివుందని ఒప్పుకున్నారు. సంతోషం. నా తల్లి దండ్రులు ఎందుకు చచ్చిపోయారో మీరొక్కసారి ఆలోచించండి.

రత్నా : మేం అవన్నీ ఆలోచించడానికి యిక్కడకు రాలేదు. మీ బైరాగిని వెంటనే యిక్కడకు పంపించు.

చిరం : ఆయన వచ్చేవరకూ మీరిక్కడ కూర్చోవచ్చు. (ఆలయంలోకి తిరిగివెళ్ళిపోతాడు)

పార్వ : ఎవరో త్రాగుబోతు వున్నాడని చెప్పేవు. వాడు ఎక్కడా కనిపించడేమోయ్ రత్నాకరం!

రత్నా : యామినీ వాడూ కలిసి యీ గుడిలో దాక్కొని వుంటారు. ఆ పొగరుబోతు అడ్డుకోకపోతే మొన్ననే యామినిని యింటికి తీసుకుపోయి వుండేవాణ్ణి.

పార్వ : వాడు ఎవడైవుంటాడు? ఇక్కడ ఎందుకున్నట్లు?

రత్నా : అదే తెలియడంలేదు. ఎవడో దారినపోయే మనిషనుకుంటాను.

పార్వ : వాడు బాటసారి అయితే అప్పుడే పోయి వుంటాడు.

రత్నా : నేనూ అలాగే అనుకుంటున్నాను. వాడు తిన్నగా కూర్చునే ఘటం కాదు. ఇక్కడ వుంటే యీ పాటికి మనతో ఘర్షణపడివుండే వాడు.

పార్వ : నువ్వు అనవసరంగా భయపడ్డావు. వాడు ఆ రోజే వెళ్ళిపోయివుంటాడు.

రత్నా : వాడి పొగరు అణచేశక్తి నాకువుంది. పోలీసులను తీసుకువచ్చి వాణ్ణి జైలుకు ఆ రోజే నే పంపించి వుండేవాణ్ణి. కాని యింటిగుట్టు రచ్చకెక్కడం యిష్టంలేక ఆ పనికి నేను పూనుకోలేదు. యామిని యింటినుంచి పారిపోయిన విషయం, లోకానికి తెలియకూడదు. తెలిస్తే నాకు అప్రతిష్ఠ తప్పదు. ఈ రాత్రి ఆమెను రహస్యంగా తిరిగి యింటికి తీసుకుపోవాలి.

పార్వ : ఇక్కడ ఎవరో సాధుపురుషుల్లో ఆమె వుందన్నావు కదూ! అతను వర్ణాశ్రమ ధర్మాలకు కట్టుబడిన నిజమైన సాధువు అయినట్లయితే నా మాట తప్పక వింటాడు

రత్నా : మర్యాదగా మనతో పంపుతాడా సరేసరి! లేదా బలప్రయోగంవల్లనైనా ఆమెను యిక్కడనుంచి తీసుకుపోయి తీరతాను.

పార్వ : నేనా సాధువుతో మాట్లాడేటప్పుడు నువ్వు తొందరపడి నోరు జారకూడదు సుమా!— చూడు రత్నాకరం—ఉపాయంతో ఎటువంటి పనినైనా సాధించవచ్చు.

రత్నా : ఆ దుర్మార్గురాలికోసం మనం ఎన్ని పాట్లు పడవలసి వస్తున్నదో చూడండి (కోపంతో పళ్లు బిగించి) కులట! నా పరువును నిలువునా తియ్యడానికి పూనుకుంది.

పార్వ : నీకు ఆలోచనకంటె ఆవేశం హెచ్చు! నువ్వు మొదటే మీ మరదలు విషయంలో మంచిగా ప్రవర్తిస్తే యిన్ని చిక్కులు ఎందుకు వస్తాయి చెప్పు!

రత్నా : అటువంటి కపట ప్రవర్తన గల స్త్రీని కనికరించకూడదు. దాన్ని నిలువునా చీరినా పాపం లేదు. కుటుంబ ప్రతిష్ఠను దృష్టిలో పెట్టుకొని దాన్ని క్షమించవలసి వచ్చింది. కనికరించి విడిచినందువల్ల కలిగిన ప్రతిఫలం యిదీ!

పార్వ : (ఎడమ వైపు చూస్తూ) ఇటు ఎవరో వస్తున్నట్లున్నారు చూడు!

రత్నా : అతడే యిక్కడ వుండే బైరాగి!
[ఎడమవైపు నుండి విరాగి వస్తాడు. ఇద్దరినీ పరిశీలనగా చూస్తాడు]

విరాగి : (రత్నాకరంతో) మొన్న రాత్రి వచ్చింది మీరే కదూ?

రత్నా : అవును! నేనే! యిప్పుడు మీతో మాట్లాడ్డానికి (పార్వతీశాన్ని చూపిస్తూ) మా వూరి దేవాలయ ధర్మకర్త పార్వతీశంగారు వచ్చారు.

విరాగి : ఆ వేదికపై కూర్చొని తామెందుకు వచ్చారో నిస్సంకోచంగా చెప్పవచ్చును.

పార్వ : చూడండి! మీరు సర్వసంగ పరిత్యాగులైన సాధువులా కనిపిస్తున్నారు. అటువంటి మీరు ఒక సంసారస్త్రీని తీసుకువచ్చి మీ మఠంలో చేర్చుకోవడం ధర్మమా?

విరాగి : జీవితంపై విరక్తి కలిగి ఆత్మహత్యకు ఉపక్రమిస్తున్న ఒక స్త్రీని రక్షించి ఆశ్రయమివ్వడం అధర్మమా?

పార్వ : ఓహో! అలాగా! ఆమె యిక్కడకు ప్రాణత్యాగం చెయ్యడానికి వచ్చిందా? అదే నిజమయితే మీరామెను రక్షించినందుకు మిమ్మల్ని అభినందించవలసిందే!

విరాగి : నేనీ ఆలయంనుంచి వెలుపలికి రావడం ఒక క్షణం ఆలస్యమయితే ఆ రోజు ఆమె యీ కొండ శిఖరం మీదినుంచి దూకి సముద్రంలో కలిసి వుండేది.

పార్వ : ఆమె ప్రాణాన్ని కాపాడినందుకు మీకు హృదయపూర్వకంగా కృతజ్ఞత తెలియజేస్తున్నాం. ఆమెను యిక దయచేసి మాతో పంపించండి.

విరాగి : ఆమె మీతో రావడానికి అంగీకరిస్తుందని నేను అనుకోను.

పార్వ : అన్ని ధర్మాలూ తెలిసిన మీరు యిలా మాట్లాడ్డం ఏమీ బాగా లేదు. ఒకరి స్త్రీ మీద హక్కు మరొకరికి ఎన్నటికీ వుండనేరదు. పొలం, యిల్లు, స్త్రీ, మున్నగునవి పురుషుని ఆస్తిలో భాగాలని శాస్త్రేతిహాస పురాణాలు ఘోషిస్తున్నవి. ఇతరుల స్త్రీలపై హక్కు మీకు ఎంత మాత్రమూ లేదు.

విరాగి : అటువంటి సిద్ధాంతాలవల్లనే నేటి సమాజం శిథిలమైపోయింది. పురుషునివలె స్త్రీకి

కూడా ఆలోచించడానికి మస్తిష్కం, ద్రవించడానికి హృదయం వున్నాయి. స్త్రీని బానిసగా చూచినంత కాలం సమాజానికి ముక్తి లేదు.

పార్వ : (కోపంతో) ఆడదానికి స్వేచ్ఛ వుండాలని చెప్పి ఒక పెద్దయింటి స్త్రీని మీ మఠంలో దాచి వుంచుతారా?

విరాగి : (ప్రశాంతంగా) మీరు అక్కడే పొరబాటు పడుతున్నారు. ఇది మఠమూ కాదు. నేను వైరాగినీ కాను. జీవిత సర్వస్వం కోల్పోయి విరక్తితో నేను యిక్కడకు వచ్చాను. ఇక్కడి ప్రశాంత వాతావరణాన్ని చూచి యీ దేవాలయంలోనే నివాసం ఏర్పరుచుకున్నాను. మరికొంత కాలానికి కళ్ళు పూర్తిగా తెరవని ఒక కుర్రవాడు వచ్చాడు. అతను కూడా యిక్కడనే వుండిపోయాడు. తరువాత యామిని వచ్చింది. ఇక్కడ నిర్మల పరిసరాలకు ఆకర్షింపబడి వాళ్ళంతట వాళ్ళే యిక్కడ వుండిపోయారు.

పార్వ : (హేళనగా) ఓహో! ఎంత పవిత్రస్థలం యిది! సంఘంనుంచి బహిష్కరింపబడిన వాళ్ళు, దుర్మార్గులు, విద్రోహులు చేరే పవిత్రమైన పాడుదేవాలయమన్నమాట యిది!

విరాగి : (ప్రశాంతంగా) యీ దేవాలయపు శిథిలాలు బహిరంగంగా కనిపిస్తాయి. అందువల్ల ఎవరికీ కీడుకలిగే అవకాశం లేదు. కాని మీరు నివసించే ఆ ప్రపంచపు శిథిలాలను కంటికి కనిపించకుండా దాచడానికి మీరు ప్రయత్నిస్తారు. అది ఒక శిథిలాలయం. దాని ప్రాకారాలు మీ కళ్ళముందు నేల కూలుతున్నా మీరు చూడనట్లు నటిస్తున్నారు.

రత్నా : (పార్వతీశంతో) యీ అనవసర ప్రసంగం కట్టిపెట్టి ఆమెను మనతో పంపిస్తాడో లేదో కనుక్కోండి.

పార్వ : మనలో మనకు విరోధం మంచిదికాదు. ఆమెను మాతో పంపించండి.

విరాగి : ఆమె మీతో రావడానికి యిష్టపడితే ఆమెను నిరభ్యంతరంగా మీరు తీసుకుపోవచ్చు.

రత్నా : మహారాజులా యిష్టపడుతుంది. ఎందుకు ఇష్టపడదు? సుఖంగా యింట్లో కూర్చొని తినడం చేదా?

పార్వ : ఆమెను యిక్కడకు ఒకసారి పిలిపించండి.

విరాగి : (ఆలయం ద్వారం వైపు తిరిగి) యామినీ! యామినీ!!

[యామిని ఆలయంలోంచి వచ్చి తలవంచుకొని ఒక ప్రక్క నుంచుంటుంది. ఆమె ముఖంలో భయసందేహాలు కనిపిస్తూ వుంటాయి]

పార్వ : (మందలించే ధోరణిలో) ఏమమ్మా! యామినీ! నువ్విలా యిల్లు వదలిపెట్టి రావడం ఏమైనా ధర్మమే! మీ వంశం ఎంత గొప్పది! మీ కుటుంబంలో యింతవరకూ ఎవరూ వేలుపెట్టి చూపించుకోలేదు. జరిగినదేదో జరిగిపోయింది. రా అమ్మా! యింటికి పోదాం. నువ్విలా పారిపోయి వచ్చినట్లు యింకా ఎవరికీ తెలీదు. ఏమీ జరగనట్లు ఎప్పటిలా హాయిగా యింటికి వచ్చి వుండు!

యామి : (గద్గద కంఠంతో) ఇక నేను ఆ యింట్లో అడుగు పెట్టలేను.

పార్వ : నా మాట విను! నీకు ఏ కష్టమూ కలగకుండా నేను చూస్తాను.

యామి : (దృఢనిశ్చయంతో) ఆ యింట్లో అడుగు పెట్టి పాడు జీవితం సాగించేకంటే యీ కొండ శిఖరంమీదనుంచి దూకి చావడం మంచిది.

రత్నా : (ఉగ్రుడై) ఏమన్నావ్? ఇంటికి రాకుండా యిక్కడే వుట్టికట్టుకొని వూగులాడదామనుకొంటున్నావా? నిన్ను జుత్తుపట్టుకొని యీడ్చుకు వెళతాను. ఎవడు అడ్డు వస్తాడో చూస్తాను. (క్రోధావేశంతో యామిని మీదికి వస్తాడు. యామిని భయంతో కెవ్వున అరుస్తుంది. దేవాలయం

తలుపులు పెద్ద ధ్వనితో తెరుచుకుంటాయి. ముందు రాముడు వెనుక చిరంజీవి రౌద్రాకారాలతో ఆకస్మికంగా ప్రవేశిస్తారు. యిద్దరి చేతులలోను కర్రలు వుంటాయి.)

రాము : (కర్ర పైకెత్తి) ఒరేయ్! రత్నాకరుడూ! నన్ను మరిచిపోయేవ్రటా?

చిరం : (కర్ర పైకెత్తి) మెత్తగా వూరుకుంటే మొత్తడానికి వచ్చావా?

[రత్నాకరం భయంతో విరాగి వెనకకు వెళతాడు.]

విరాగి : (రాముణ్ణీ, చిరంజీవినీ తీక్షణంగా చూస్తూ) ఏమిటిది? (యిద్దరు మంత్రముగ్ధులవలె కర్రలు క్రిందికి దించుతారు) హింసతో మనం యే కార్యాన్నీ చక్కపెట్టలేం నాయనా! హింసవల్ల తాత్కాలిక ప్రయోజనం కలిగినా దానివల్ల శాశ్వతమైన దుష్ఫలితం కలిగే అవకాశం వుంది.

పార్వ : (రత్నాకరంతో) ఆ పిల్ల రాను మొర్రో అంటున్నప్పుడు మనం మాత్రం యేం చెయ్యగలం. రా! పోదాం! (పార్వతీశం, రత్నాకరం కుడివైపు నిష్క్రమిస్తారు.)

రాము : కొందరు దుర్మార్గులు మన మీదికి వచ్చి హింసించడానికి పూనుకుంటే మనం అహింసా సిద్ధాంతాలను వల్లిస్తూ చేతులు ముడుచుకు కూర్చోవలసిందేనా?

విరాగి : ప్రతిహింసకు పూనుకునేకంటే హింసను సహించి వూరుకోవడం మంచిది. నిన్నొకడు హింసిస్తాడు. అతనిని నువ్వు తిరిగి హింసిస్తావు. అతను మరింత పగపట్టి ప్రతిహింసకు సిద్ధమవుతాడు. ఇక దానికి అంతు ఎక్కడ? హింసను ఎదుర్కొవడానికి అహింసకంటే గొప్ప సాధనం మరొకటి లేదు నాయనా!

యామి : వాళ్లి యిక్కడకు రాగానే రాముడు ఉగ్రుడై పోయాడు. స్వామీ! నేను అతి ప్రయాసమీద మీరు వచ్చే వరకూ యితనిని ఆపగలిగాను.

చిరం : అంతటి దుర్మార్గులను మంచి మార్గంలో సాధించలేం.

రాము : నిజం చెప్పేవుగా తమ్ముడూ! (విరాగితో) చేతులు ముడుచుకు కూర్చుంటే నేటి పరిస్థితులు ఎన్నటికీ మారవు స్వామీ! దుర్మార్గులను, వంచకులను, స్వార్థపరులను, క్రూరజంతువులవలె వేటాడి చంపాలి. అప్పుడే లోకంలో సుస్థిరశాంతి సౌభాగ్యాలు స్థావరం ఏర్పరుచుకుంటాయి. ఆదర్శ సమాజంలోనే మీ అహింసా సిద్ధాంతానికి పట్టాభిషేకం జరుగుతుంది.

విరాగి : ఆవేశంవల్ల పరిస్థితులను అర్థంచేసుకోలేకపోతున్నావు నాయనా! ప్రతి మానవ ప్రాణికి హృదయముంటుంది. కొందరు కర్కశహృదయులు వుంటారు. వారిలో పరివర్తన తీసుకు రావడం కష్టమైన పని కాదు. ఎంతటి దుర్మార్గుడికైనా కొన్ని సమయాలలో హృదయం ద్రవించక మానదు. హృదయ పరివర్తనవల్ల కలిగే విప్లవమే శాశ్వతమైనది.

రాము : మీ సిద్ధాంతాలను నేను అంగీకరించలేను స్వామీ! నేటి ప్రపంచంలో జరుగుతున్న హింసాకాండను, పీడనను చూస్తూ సహించి వూరుకోలేను. ఎక్కడ ఏ మాత్రం దౌర్జన్యం కనిపించినా నాలో ఉడుకు రక్తం పొంగి ప్రవహిస్తుంది.

విరాగి : ఉద్రేకపడకు నాయనా! కూర్చో! అహింస గొప్పదని నీవు స్వయంగా అంగీకరించే సుదినం తప్పక వస్తుంది.

యామి : రాముడి మాటలు వింటూవుంటే నేటి ప్రపంచంలో ప్రతిహింసను అవలంబించేకంటే గత్యంతరం లేదనిపిస్తోంది. వెనువెంటనే మీ మాటలలోని లాలిత్యం మనస్సుల్ని అహింసామార్గంవైపు లాగుతోంది. అహింసా సిద్ధాంతం సరసనే హింసా సిద్ధాంతం కూడా వర్ధిల్లుతూ వుంటుందనిపిస్తోంది.

[కుడివైపు నుంచి చంద్రయ్య ప్రవేశిస్తాడు. ముఖంలో దైన్యం కనిపిస్తూ వుంటుంది. మాసినబట్టలు, సంస్కారంలేని జుత్తు కష్టాల మధ్య చిక్కుకున్న మనిషి అని తెలియజేస్తూవుంటాయి.]

చంద్రయ్య: (దీనంగా) యిక్కడ ఎవరో చాలా మంది వున్నారు. (విరాగితో) బాబూ! యీ రాత్రికి నన్ను యిక్కడ తలదాచుకో నిస్తారా?

విరాగి : ఈ స్థలంపై హక్కు ఎవరికీ లేదు నాయనా! యిక్కడ అందరూ సమానమే! నువ్వు నిరభ్యంతరంగా వుండొచ్చు.

రాము : (ముందుకు వచ్చి) ఎవరు నువ్వు? ఇలా ఎందుకు వచ్చావు?

చంద్ర : నేను చాలా కష్టాలలో వున్నాను బాబూ! నా ఆస్థి అంతా అప్పుల వాళ్లు దోచుకు పోయారు. అన్నీ వదులుకొని ఆ మహా సముద్రంలో నుంచి కట్టు బట్టలతో గట్టెక్కాను. ఏ పొరుగూరో పోయి పొట్ట పోషించు కుందామని బయలు దేరాను. దారి తప్పి యిలా వచ్చాను.

యామి : పాపం! చాలా కష్టాలు అనుభవించి నట్లున్నాడు.

[చీకటి దట్టమవుతుంది. చిరంజీవి లోనికి వెళ్లి లాంతరు వెలిగించి తీసుకువచ్చి వేదిక మీద వుంచుతాడు]

రాము : అపరాధి హృదయం అతికోమలమైనది. అది దొంగమాటలకు కూడా యిట్టే కరిగి పోతుంది. (చంద్రయ్యతో) నీ పేరేమిటి?

చంద్ర : (భయంతో) చంద్రయ్య అండి?

రాము : పాపం! నువ్వుదారి తప్పి యిలా వచ్చావా?

చంద్ర : అవునండి!

రాము : చూడు! చంద్రయ్యా! నువ్వు కూడా గట్టి మోసపోయిన మనిషిలా కనిపిస్తున్నావు. ఈ ప్రొద్దున్న ఏమైనా అవసరం వస్తే నువ్వు ఒక భుజం వెయ్యాలి! తెలిసిందా!

యామి : (నవ్వుతూ) రాముడు యిద్దరు శిష్యుల్ని సంపాదించాడు.

చంద్ర : నేను రేపు ఉదయమే వెళ్ళి పోవాలమ్మా!

రాము : అలాగే పోవయ్యా! నిన్ను యిప్పుడు వుండి పొమ్మని ఎవరు బ్రతిమాలేరు!

యామి : ఈ రోజు లేచింది మొదలు అన్నీ చిక్కులే! తినడానికి ఏమీ లేవు. అన్నీ అయిపోయినై

చిరం : (విరాగితో) వూళ్లోకివెళ్లి ఏమైనా తీసుకు రమ్మంటారా స్వామీ!

విరాగి : ఈ రాత్రివేళ నీవు వొక్కడవూ వెళ్ళడం మంచిదికాదు. నాయనా! (చంద్రయ్యతో) నువ్వుకూడా చిరంజీవితో వెళ్లు చంద్రయ్యా! [చంద్రయ్య, చిరంజీవి కుడివైపు నిష్క్రమిస్తారు. విరాగి ఆలయంలోకి వెళ్ళి పోతాడు.]

యామి : పాపం! చంద్రయ్య కూడా కష్టాలలో చిక్కుకున్న మనిషిలా కనిపిస్తున్నాడు.

రాము : యామినీ! నాకీ లోకంలో ఏ మనిషిమీదా నమ్మకం లేదు. నేను యిక్కడ అడుగు పెట్టీ పెట్టగానే మిమ్మల్ని అనుమానించాను.

యామి : నువ్వు యిక్కడికి ఎలా రాగలిగావు?

రాము : (క్షణం ఆలోచించి) అప్పుడు నాకు ఆకలి దహించుకు పోతోంది. ఊళ్ళో అడుగు పెడితే తిరిగి ఏ దుర్మార్గానికైనా నేను ఒడి కట్టవచ్చు అనే అనుమానం నాకు కలిగింది. ఆ సమయంలో నాకు యీ కొండమీది శివాలయం కనిపించింది. ఒంటరిగా ఆ రాత్రి యిక్కడ గడపవచ్చు కదా అని ఇక్కడకు వచ్చాను మీరు కనిపించారు.

యామి : నువ్వు సమయానికి యిక్కడకు రావడం దైవనిర్ణయం రాముడూ! నువ్వే గనక అప్పుడు ఇక్కడకు రాకుండా వున్నట్లయితే నన్ను యీ సరికి మా వాళ్లు యీడ్చుకు వెళ్ళి ఆ నరకకూపంలో పడవేసి వుండే వారు.

రాము : (కోపంతో) దైవనిర్ణయ మట! దైవ నిర్ణయం! నీకీ దుర్గతి రావడానికి దేవుడు కారణమా? నిన్ను బలవంతంగా తీసుకు పోవడానికి రత్నాకరం రావడం కూడా దైవ నిర్ణయమేనా? బుద్ధి వక్రించి మనిషి చేసే ప్రతిఘోర కృత్యానికీ దేవుణ్ణి అడ్డు పెట్టుకోవడం ఎంతటి దురన్యాయం?

యామి : దేవుడు పేరు విన్నప్పుడు నువ్వెందుకు అంత ఉగ్రుడవై పోతావు?

రాము : దేవుడి మీద నాకేవిధమైన ద్వేషం లేదు. దేవుడున్నాడో లేడో అంతకంటే తెలీదు. దైవ నిర్ణయం అనే ముసుగులో మానవులు సాగించే దోపిడీ చర్యలను, హింసాకాండను నేను చూస్తూ సహించి వూరుకోలేను.

యామి : భగవంతుడు వున్నాడు. నాకు కనిపిస్తున్నాడు. పసిపాప చిరునవ్వులోను, వికసిస్తున్న పువ్వులోను నాకు దేవుడు కనిపిస్తున్నాడు. (అరమోడ్పు కళ్ళతో) నా కష్టాల నుంచి ఆ దయామయుడు నన్ను తప్పక దరి చేరుస్తాడు.

రాము : పాపం! మానవుడు కష్టాలను సృష్టిస్తూ వుంటే దేవుడు వచ్చి వాటిని తొలగిస్తూ వుంటాడు!

[ఆలయంలోంచి విరాగి వస్తాడు]

విరాగి : ఆలోచించి చూస్తే నువ్వు యిక్కడ వుండడం మంచిది కాదనిపిస్తోంది యామినీ!

రాము : అయితే యామినిని ఆ కసాయివాడితో పంపుదామంటారా స్వామీ!

విరాగి : ఆమె వుండవలసిన స్థానం యిది కాదు. కష్టాలను సహించి మంచిరోజుల కోసం ఎదురు చూస్తూ ఆమె పోయి తన యింటిలో వుండడమే మంచిది.

యామి : (దృఢ నిశ్చయంతో) పులి నివసించే గుహలోకి వెళ్ళమన్నా సంతోషంతో వెళ్ళగలను గాని ఆ ఇంట్లో మాత్రం తిరిగి అడుగు పెట్టలేను.

రాము : ఆమె ఇక్కడ వున్నందువల్ల నష్టమేమిటి స్వామీ!

విరాగి : మనకేమీ నష్టం లేదు నాయనా! ఆమె క్షేమం కోరి నేను చెబుతున్నాను. మనం అన్ని బంధాలు త్రెంచుకొని బయటకు వచ్చాం. మనం దేనికీ భయపడం. నేను కాకపోయినా రేపైనా ఈమె సమాజంలో నివసించవలసిన స్త్రీ.

రాము : (హేళనగా) పురుషుల కొకనీతి, స్త్రీల కొకనీతి. ఏం లోకం! ఏం న్యాయం!

యామి : నాకు యిక యీ జీవితం మీద ఆశలేదు స్వామీ! ఆశలను కోల్పోయి ఆత్మహత్య కంటే శరణ్యం లేదని నేను యిక్కడకు వచ్చాను. మీమాటలు విని నా ప్రయత్నాన్ని తాత్కాలికంగా విరమించుకున్నాను. నేను తిరిగి యింటికి పోవడానికి ఎంత మాత్రం అంగీకరించను. అంతకంటే యీ కొండశిఖరం మీదినుంచి హృదయపూర్వకంగా సంతోషంతో ఆ అనంతసాగరంలోకి దూకగలను.

రాము : భేష్! మంచిమాట చెప్పావు. నువ్వు పిరికి దానివి కనక కొండమీదినుంచి దూకి చస్తానంటున్నావు. నా ఆశయం ఏమిటో తెలుసా! మన సంకల్పానికి అడ్డు వచ్చిన కొండనయినా పిండిచేసి ముందుకు పురోగమించాలి!

[కుడివైపునుంచి తొందరగా చంద్రయ్య ప్రవేశిస్తాడు. భయంతో వణుకుతూ వుంటాడు.]

చంద్ర : స్వామీ! కొంప మునిగింది!

రాము : (లేచి ఆతృతతో) ఏం? ఏం జరిగింది? చిరంజీవి యేడీ?

చంద్ర : (ఆయాసంతో) మేం కొండ దిగీ దిగగానే పలుగురు మనుషులు వచ్చి మామీద పడ్డారు బాబూ! నేను అతి ప్రయాసమీద వాళ్ళను తప్పించుకొని పారిపోయి వచ్చాను. చిరంజీవి వాళ్ళకు దొరికిపోయాడు.

రాము : (ఉగ్రుడై కర్ర తీసుకొని) ఎవరు వాళ్ళు? ఇప్పుడే వాళ్ళను యమసదనానికి పంపించి చిరంజీవిని విడిపించుకు వస్తాను. నేను వచ్చే వరకూ నువ్వు యిక్కడే వుండు. కాలు కదిపితే నిన్ను కైలాసానికి పంపుతాను. జాగ్రత్త!

[రాముడు కోపోద్రేకంతో కుడివైపుకు తొందరగా నిష్క్రమిస్తాడు. విరాగి, యామిని, "రాముడూ! రాముడూ!" అని పిలుస్తారు]

యామి : (నిట్టూర్చి) లాభం లేదు! తన పని పూర్తి అయ్యేవరకూ రాముడు యిక వెనుకకు తిరగడు. ఎటువంటి ఘోరపరిణామాలు కలుగుతాయో! (దుఃఖంతో) దీని కంతటికీ

కారణం నేనే! ఆ రోజే నేను యీ కొండ శిఖరంమీదినుంచి దూకి శాశ్వతంగా కళ్లు మూసివుంటే యీ సంఘర్షణ యీ రక్తపాతం తప్పివుండేవి.

విరాగి : (చంద్రయ్యతో) కూర్చుని విశ్రాంతి తీసుకో నాయనా! (యామినితో) విచారించకమ్మా! ఆ ప్రపంచంతో బంధనాలను త్రెంచుకొని మనం ఎంత దూరంగావున్నా అది మనలను విడిచిపెట్టదు. యావజ్జీవితం యీ సంఘర్షణ తప్పదు. (లేచి నడుస్తూ) రాముడు ఏ ఘోరానికి పూనుకుంటాడో! లేక రాముని నే వాళ్లు శాశ్వతంగా మననుంచి దూరం చేస్తారో! — యామినీ! ఇక నీవు లోనికి వెళ్ళిపో! నువ్వు యిక్కడ వుండడం మంచిది కాదు.

యామి : దీనితో నాకు జీవితంమీద అనురాగం పూర్తిగా నశించిపోయింది స్వామీ! ఇటువంటి పరిణామాలు కలుగుతాయని తెలిస్తే మీ మాటలను లెక్క చెయ్యకుండా అనాడే నా జీవితాన్ని ముగించుకొని వుండేదాన్ని. (ఏడుస్తుంది)

విరాగి : జరిగిపోయిన విషయాలను తలచుకొని దైన్యపడడం విజ్ఞుల లక్షణం కాదమ్మా! నీ మనసు పూర్తిగా కలగిపోయింది. లోనికి పోయి పడుకో!

యామి : నావల్ల మీకు యింకా కష్టాలు కలుగుతాయేమో నని నాకు భయంగా వుంది.

విరాగి : నేను కష్టాలకు భయపడేవాణ్ణి కాదమ్మా! రా లోనికి పోదాం. (చంద్రయ్యతో) రా నాయనా! ఆలయంలో కూర్చుందాం.

చంద్ర : (భయభక్తులతో) రాముడి మాట జవదాటడానికి వీల్లేదు బాబూ! నేను యిక్కడ కూర్చొని కాపలా కాస్తూవుంటాను. మీరు లోనికి వెళ్ళండి!

[విరాగి, యామిని, ఆలయంలోకి వెళ్ళిపోతారు. ఆలయం తలుపులు దగ్గరకు మూతబడతాయి. చంద్రయ్య లేచి తిరుగుతూ వుంటాడు. కుడివైపునుంచి బెదురుచూపులు చూస్తూ రత్నాకరం ప్రవేశిస్తాడు. అతని చేతిలో పెద్దకర్ర వుంటుంది. అతనిని చూడగానే చంద్రయ్య సంతోషంతో అతనిని సమీపిస్తాడు]

రత్నాకరం : (నెమ్మదిగా) వాళ్ళేరీ?

చంద్ర : (రహస్యంగా) ఆలయంలోకి పోయారు.

రత్నా : ఆ దొంగవెధవ ఒకడూ లేకుండా వుంటే చాలు! ఇక ఎంతమంది వున్నా మనకేం భయం లేదు. ఈ ప్రయత్నం కూడా చెడిపోతే యిక మనం ఆశ వదులుకోవాలి.

చంద్ర : ఆలస్యం చేస్తే ప్రమాదం! నువ్వు తొందరగా లోనికి వెళ్ళి ఆమెను లాక్కురా! నేను యిక్కడవుండి చూస్తూవుంటాను.

[రత్నాకరం ఆలయంలోకి వెళ్లి, ఉత్తరక్షణంలో యామినిని చెయ్యిపట్టుకొని యీడ్చుకువస్తాడు.]

రత్నా : (కోపంతో కళ్లెర్రజేసి) నా సంగతి తెలిసి కూడా నన్ను తప్పించుకు తిరుగుదామనుకున్నావుకదూ! బుద్ధిగా యింటికి నడు! ఎదురు తిరిగావా! చిత్రహింస తప్పదు!

యామి : (గట్టిగా అరుస్తూ) నేను రాను! నన్ను విడిచిపెట్టు!

[రత్నాకరం ఆమెను బలవంతంగా ముందుకు యీడ్చుకు పెడుతూవుంటాడు. ఆమె ఆలయంకేసి చూస్తూ] స్వామీ! స్వామీ! రక్షించండి! (విరాగి తొందరగా ఆలయంలోంచి బయటకు వస్తాడు).

విరాగి : (దూరాన్నుంచి) ఎవరది? (సమీపించి) ఎందుకు నాయనా! ఆమెను హింసిస్తావు?

రత్నా : (కోపంతో) ఏయ్ బైరాగీ! ఆమెనే కాదు! నాదారికి అడ్డువచ్చిన ప్రతివాణ్ణీ హింసిస్తాను! (కళ్ళెర్రజేసి కర్ర పైకెత్తి) మాయింటి వ్యవహారాలలో జోక్యం కలగజేసుకున్నందుకు నీకు యిదిగో ప్రతిఫలం (కర్రతో గట్టిగా విరాగి తలమీద కొడతాడు. రక్తం ఒక్కసారిగా పైకి చిమ్ముతుంది. విరాగి బాధతో నేలమీద పడతాడు. యామిని కెవ్వున అరచి విరాగిని సమీపించబోతుంది. రత్నాకరం, చంద్రయ్య ఆమెను బలవం

తంగా యీడ్చుకుంటూ కుడివైపు నిష్క్రమిస్తారు. రెండు నిముషాలు నిశ్శబ్దంగా గడిచిపోతాయి. కుడివైపునుంచి రాముడు, చిరంజీవి ప్రవేశిస్తారు. ఇద్దరి చేతులలోను కర్రలు వుంటాయి. ఒక మూల పడివున్న విరాగిని వాళ్లు చూడరు.)

రాము : (చిరంజీవిని ప్రశంసిస్తూ) ధైర్యం అంటే నీది రా తమ్ముడూ! రాముడికి తగిన శిష్యుడవు దొరికావు.

చిరం : దీనిలో ఏదో మోసం వున్నట్లుంది రాముడూ! వాళ్లు నన్ను ఒక్కణ్ణి పట్టుకొని చంద్రయ్యను ఎందుకు వదిలేశారూ?

రాము : (చుట్టూ చూస్తూ) ఏడీ? వాడెక్కడా కనిపించడేం?

చిరం : ఆలయంలో వున్నాడేమో చూద్దాం! పద!

[యిద్దరు రెండడుగులు వేస్తారు. రక్తసిక్త వదనంతో నేలమీద పడివున్న విరాగిని చూసి ఆకస్మికంగా ఆగిపోతారు. రాముడు ఆతృతతో విరాగి ప్రక్క కూర్చొని అతని తలను తన ఒడిలోకి తీసుకుంటాడు].

రాము : (ఉగ్రుడై బిగ్గరగా) మోసం! మోసం! నన్ను మోసంతో యిక్కడినుంచి తప్పించి స్వామిని హింసించారు. (చుట్టూ చూస్తూ) మరి యామినిని యేం చేశారో!

[చిరంజీవి తొందరగా ఆలయంలోకి పరుగెత్తి తిరిగి బయటకువస్తాడు.]

చిరం : ఆమె ఆలయంలో కూడా లేదు.

రాము : (విరాగిముఖంలోకి చూస్తూ) స్వామీ! స్వామీ! (విరాగి కళ్లు తెరిచి చూస్తాడు) మీవంటి ధర్మాత్ముణ్ణి హింసించిన దుర్మార్గుడెవరో చెప్పు స్వామీ! వాణ్ణి క్షణంలో హత మార్చివస్తాను.

విరాగి : (హీనస్వరంతో) తొందరపడకు నాయనా! నాకేం ప్రమాదం లేదు. (మెల్లిగా లేచి కూర్చొని) నువ్వు ఎక్కడికీ వెళ్లవద్దు! ఎవరినీ హింసించవద్దు.

చిరం : యామిని ఏమయింది స్వామీ!

విరాగి : ఆమె కేమీ ప్రమాదం కలగలేదు. ఆమెను వాళ్లు తీసుకుపోయారు.

రాము : (ఉగ్రుడై లేచి) ఏమిటి! యామినిని వాళ్లు తీసుకుపోయారా? వీల్లేదు! (కర్రచేత్తో పట్టుకొని) ఎంతటి రక్తపాతమైనాసరే! ఆమెను ఆ చెరపాలనుంచి విడిపించుకు వస్తాను. ఆమె లేని యీ ఆలయంలో నేను క్షణమైనా వుండను. ఆమెను మృత్యుకోరల నుంచి విడిపిస్తాను. అడ్డువచ్చినవాణ్ణి హత మారుస్తాను.

[రాముడు తొందరగా కుడివైపు నిష్క్రమిస్తాడు చిరంజీవి "రాముడూ!" "రాముడూ!" అని పిలుస్తాడు]

చిరం : (నిస్పృహతో విరాగి ముఖంలోకి చూస్తూ) రాముడు యిక తిరిగి వస్తాడా స్వామీ!

విరాగి : (మెల్లిగా నిలుచుని) యీ సంఘర్షణకు యిక అంతం లేదు నాయనా!

[విరాగి, చిరంజీవి, ఆలయంలోకి నిష్క్రమిస్తూ వుంటారు.] (తెర)

వజ్రహారము

శ్రీ నండూరి బంగారయ్య

ఇటీవల, ఆంధ్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీ కోకా సుబ్బారావుగారి అధ్యక్షతను జరిగిన, రాజమహేంద్రవర న్యాయవాదసంఘం వజ్రోత్సవ సందర్భంలో చదివి, శ్రీ బంగారయ్యగారు, సభికులను ఆహ్లాదపరచిన హాస్య రచన. దీనిలో హాస్యంతోపాటు ఆదేశాన్నికూడా మిళాయించారు.

* * *

నిన్న గాక మొన్న నే స్వర్ణోత్సవము; ఇంకనూ జరుగుతు న్నట్లుంది. అప్పుడే పదేళ్లు గిరగిర తిరిగి వచ్చాయి! మన మాతృదేవత అయిన సంఘమును నాడు సువర్ణ పుష్పాలతో అర్చించడానికి ప్రయత్నించాను. జేబులో లేకపోయినా పేరులోనైనా సువర్ణం ఉన్న వాడిని అవటంచేత పెద్దల ఆశీర్వచన బలంవల్ల ఏ మాత్రమో కృతార్థుణ్ణి కాగలిగాను. ఈ వజ్రోత్సవ సమయమున వజ్రహారం సమర్పించాలంటే తాహతుకు మించిన సాహసం. అయినా సహృదయుల సానుభూతి నే చేయూతగా గొని ఉపక్రమిస్తాను.

ఒక్కమారు సింహావలోకనం చేసి చూసుకుంటే దేశములో నాటికి నేటికి ఎంత వ్యత్యాసం కనబడుతుంది!

నాడు భరతమాత నిండు చూలాలు. స్వాతంత్ర్యము ఇంకా జన్మించలేదు. కాని ప్రసవ వేదన మారంభమయినది. నేడు భరతమాత పచ్చి బాలెంతరాలు. లేక లేక కలిగిన స్వపరిపాలన మనే వెయ్యేండ్ల నోముల పంటను చూసుకొని మురిసిపోతూ ముద్దు పెట్టుకుంటోంది.

చీకట్లు పటాపంచలయి ఉదయభానుని నూత్న కిరణములు బంగారమును ప్రసరిస్తున్నాయి. దేశములో ఎక్కడ చూచినా నూతనోత్సాహమే! క్రియాశూరత్వమే! ఆత్మవిశ్వాస విజృంభణమే! అటు భాక్రా నంగాల్ మొదలుకొని ఇటు నాగార్జున సాగరం వరకూ ఎక్కడ చూచినా క్రొత్త నిర్మాణాలే. అటు ఇండోనైషా మొదలుకొని ఇటు రష్యావరకూ ఎక్కడ చూచినా భారతీయుల యశోగానమే. ఉపదేశము ఇవ్వడానికో లేక పుచ్చుకోవడానికో అమెరికా, రష్యా, చైనా, సౌదీఅరేబియా మున్నగా ఖండ ఖండాంతరములనుండి ప్రతిదినము భరతఖండమును దర్శించడానికి వచ్చే యాత్రికుల సందడిలో—ఎత్తేగంప దింపేగంప అన్నట్టు—మన నాయకులకు ఎక్కడా తీరుబడిలేకుండా పోతున్నది.

స్వర్గీయ బారు రాజారావు పంతులుగారు నాతో చెప్పేవారు. అప్పటికింకా జవహర్‌లాల్ ఒక్కమారయినా కాంగ్రెసు ప్రెసిడెంటు కాలేదు. ఒకనాడొక పోనీ (Pony) నధిష్ఠించి ఎక్కడికో పోతూ వుంటే తండ్రిగారయిన మోతీలాల్ నెహ్రూగారు రాజారావుగారిని పిలిచి "రాజారావు! చూడు! చూడు! అతడొక రాజకుమారునివలె లేడా?" (Rajarao ! See ! See ! Does he not look like a Prince ?) అని ఉత్సాహాతిశయమును ప్రకటించినారట. నేడు స్వర్గమున ఉన్న మోతీలాల్ తనకుమారుని దిగ్విజయము చూచుకొని ఎంత మురిసిపోతూవుంటాడో ఎవరు చెప్పగలరు? బుద్ధభగవానుని అవతారమునకు అంతర్జ్యోతియై వెలుగు సర్వభూతహిత సిద్ధాంతమును పుణికి పుచ్చుకుని సర్వనాశనమునకయి అంకెలు వేయుచు విజృంభించు రష్యా అమెరికాలను రెండు అబోతుల నడుమ నిలచి చిరునవ్వులు చెంగలించు ముఖారవిందములో వేణుగానము చేయుచు ఆ యాబోతులను రెండింటిని మంత్రముగ్ధులు గావించి ప్రపంచమున సౌహార్దము నెలకొల్పుటకయి శాంతిగీతము నాలపించు

కుమారరత్నమును జూచుకొని కన్న తల్లిదండ్రులే గాక, భారతఖండము మాత్రమే గాక, మానవజాతి యెల్ల నిలువున పులకింపవలసి యున్నదిగదా!

* * *

మనలో ఒక నమ్మకమున్నది మలయమారుతము వీచినప్పుడు మామూలు చెట్లుకూడా మంచి గంధపు వృక్షము లౌతాయట! నేడు కళలలో స్వాతంత్ర్యమనే మలయమారుతము వీస్తోంది. అందుచే ఎక్కడ చూచినా చందన సౌరభమే ప్రత్యక్షమౌతూ వున్నది. వేపచెట్టూ, ప్రత్తిచెట్టూ మాత్రము మలయమారుతమునకుకూడా మారవట. ఎన్నాళ్లకూ ఎదుగూ బొదుగూ లేకుండా వుండటమే గాక, "నా నాటికి తీసికట్టు నాగంభట్టూ" అన్న మాదిరిగా స్వాతంత్ర్యము వచ్చిన తరువాత మరీ కుచించి పోతూవున్న మన లాయరు వృత్తిని వేపచెట్టుతో పోల్చుకోవచ్చునా? ప్రత్తి మొక్కతో పోల్చుకోవచ్చునా? ఈ మధ్య 'వడకడము' (Spinning) లో మనకు వున్న ప్రావీణ్యము, లోకసభాధ్యక్షులు కూడా అంగీకరించినారు కాబట్టి ప్రత్తిమొక్కతోనే పోల్చుకుందాము.

* * *

మొన్న గుంటూరులో అప్రెంటిస్ (apprentice) లకు ఉపదేశమిస్తూ, మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి 'షాక్ ట్రీట్‌మెంటును' (Shock treatment) ను ప్రశంసించారు. తదనుగుణముగా అరవైయేండ్లు నిండిన మన సంఘము కూడా షాక్ ట్రీట్‌మెంటు (Shock treatment) పుచ్చుకుంటే శ్లేష్మప్రకోపమునకు (Rheumatism) కాపుదలగా వుంటుందేమో!

* * *

ఆత్మపరీక్ష చేసి చూసుకుంటే న్యాయశాఖ గాని దీనిలో అంతర్భాగమయిన లాయరు ఉపశాఖ గాని నేడు అవలంబిస్తూవున్న ఆచారములు గాని అత్యాచారములు గాని ఉగ్గడింప తగ్గవిగా కనబడవు. వెనకటి రోజులతో పోల్చిచూస్తే ఈ శాఖలలో యిప్పుడు స్వర్ణయుగం నడుస్తోందా అనిపిస్తుంది.

మున్ముందుగా న్యాయాధికారులను పరిశీలిద్దాం. వెనుకటి న్యాయాధికారులలో కొందరిని గూర్చి:

'లంచయో రలంచయోర్మధ్యే
యతో లంచ స్తతో జయః
ఉభయోర్లంచయోర్మధ్యే
యతో౽ధిక స్తతో జయః

అనే మొదలయిన కారికలు కొన్ని ప్రచారములో వుండేవి. ఇప్పుడలా వ్రేలుపెట్టి చూపడానికి వీలులేదు. ఉచితార్థముగా ఉద్యోగము మంచినీళ్లయినా పుచ్చుకోవాలనే కుతూహలం న్యాయాధికారులలో మృగ్యము. వారు వహించవలసిన భారమునుబట్టి చూస్తే వారికిచ్చే జీతము కిట్టదనే చెప్పాలి. మనము ఒక కక్షి భారమే వహిస్తాముగాని వారు రెండు కక్షుల భారమూ వహించాలి ఒక్కొక్క ప్లీడరుకు, కోర్టులో వున్న పనిలో కొంతభాగమే వుంటుంది. కాని కోర్టులో వున్న యావత్తు పనీ వారిదే.

మినిస్టీరియల్ లెవల్ (Ministerial level)లో లంచగొండితనము నిర్మూలిద్దామని కొందరు పెద్దలు పూనుకున్నారు. మిక్కిలి సంతోషావహమయిన విషయం. కాని ఈ తరగతిలో కూడా లంచగొండితనము సకృత్తే అని చెప్పాలి. నేను ప్రాక్టీసుకు రాకముందు అనుకునేవారు. "ఆచార్లూ దీనిలో అర్జీ వెయ్యవచ్చునా?" అని గుమాస్తా అనుమతి పుచ్చుకొనిదే అర్జెంటు అర్జీలు పడేవి కావట. అంతేకాదు, పొరపాటున ఒక్కొకసారి బెంచిగుమాస్తాచేతినుండి రూపాయి జారి క్రిందపడి ఖంగున మ్రోగేసరికి, "ఆచార్లూ! నిద్రపోతున్నావా ఏమిటి?" అని మేలుకొలుపులు కూడా పాడేవారట. ఇప్పుడో కొన్ని డిపార్టుమెంటులతో పోల్చిచూస్తే ఈ న్యాయశాఖలోని క్రింది ఉద్యోగులకు నిత్యమూ మ్రొక్కవలసి వుంటుంది బస్తా 1 కి రు. 48-0-0 లకు తగ్గకుండా వున్న ఈ రోజులలో పదిమంది పిల్లలున్న స్వల్పోద్యోగులు వచ్చే జీతములతో "ఎలా మానసంరక్షణ చేసుకుంటున్నారా" అని ఆశ్చర్యపడవలసివున్నది.

లాయర్ల ప్రతిభా పాండిత్యములు వెనకటికంటే తగ్గిపోయాయి అనడము యిప్పుడు ఒక ఫ్యాషన్. ఇది ఎంతమాత్రమూ సత్యసమ్మతముగా కనబడదు.

ఇప్పుడున్నంత తీర్పుల బాహుళ్యము (case law) వెనక లేదు. ఇప్పుడున్నంత చట్టబాహుళ్యము (legislation) కూడా వెనుక లేదు. ఇంత విజృంభణ దశలో నున్న న్యాయశాస్త్రమును "తుచ"లు తప్ప

కుండా అవగాహన చేసికొని, స్వల్పమయిన ఫీజు తోనే సంతృప్తిపడి ప్రజలను సేవించాలని తహతహ లాడుతూ వున్న నేటి న్యాయవాదులు పాండిత్యము లోనూ ప్రతిభలోను వెనుకటివారికి పైచేయి గాని క్రిందిచేయి గాదని ఘంటాపథముగ చెప్పగలను. అప్పటికీ ఇప్పటికీ పద్ధతులే (technique) మారిపోయాయి. క్రాసుపరీక్ష తీసికోండి. అసంగతము గానైనా సరే వెనుకటి రోజులలో ఎంత దీర్ఘముగా క్రాసుచేస్తే అంత గొప్ప. ఇప్పుడైనన్నదో సంగతము గానూ సూటిగాను వుంటున్నది. వెనుకటివారు స్తఃశల్య పరీక్షగా స్వల్పాంశములను అన్వేషించేవారు (Searching details) ఇప్పటివారో ఏనుగు కుంభస్థలములను కొట్టినట్లు ఘటనాసంఘటనలను విడగొట్టడానికి (Shaking the probabilities) విజృంభిస్తారు. కేసు నిర్ణయములో వెనుక చాలాభాగం గాత్రపాటమీదనే ఆధారపడి వుండేది. ఇప్పుడు సాక్ష్యమయినంతవరకు దస్తావేజుల మీద ఆధారపడి వుంటుంది. ఆర్గుమెంటులో కూడా "Brevity is the soul of wit" అనే కవి వాక్యాన్ని ఇప్పటివారు సాధారణముగా విస్మరించరు. ఇట్టి నవీన పద్ధతులకు నీతి, పాండిత్యము, ప్రతిభ సమ్మేళనపరచి ఇప్పటివారిలో కొందరు పనిచేస్తూ వుంటే చూడటానికి ఎంతో ముచ్చటగా వుంటుంది..

ఎన్ని సుగుణములు అలవరచుకొని పనిచేస్తూ వున్నా "మంది ఎక్కువైనకొద్దీ మజ్జిగ పలుచన" అన్నట్లుగ జనబాహుళ్యము హెచ్చి రాబడి పలుచబడడముతోనే లోకానికి మనము పలుచబడిపోయాము —రాబడినిబట్టే వ్యక్తుల విలువను నిర్ణయించే అధమాధమ స్థితిలో లోకము వున్నది కాబట్టి.

వెనుకటి అత్యాచారాలు కొన్ని గమనించండి. "వారు ప్లెయింటుకు వెయ్యిరూపాయల స్టాంపు బెట్టి వచ్చారు. మనము రిజైండర్ స్టేటుమెంటుకు కనీసము రెండు వేల రూపాయలైనా పెట్టకపోతే మర్యాదగా వుండదు" అనే వారట. "వెండిగిల్టు వున్న పుస్తకమునుండి సెక్షను వేస్తే ఒక ఫీజు, బంగారపు గిల్టువున్న పుస్తకములో నుండి సెక్షను వేస్తే మరివొక ఫీజు, అని అలమారులో వున్న 'బైబులు' (Holy Bible) ప్రతులకేసి చూపి ద్రవ్యాకర్షణ చేసేవారట. హీనక్రయానికి భాషాంతరీకరణంగా. "It is a most heinous sale your honour" అనే వారున్న, కోర్టుకు జ్యూరిస్ డిక్షన్ లేదనే వాదము స్టేటుమెంటులో వుంటే, "ఘనత వహించిన కోర్టువారికి జ్యూరిస్ డిక్షన్ లేదనటమేనా? ఎంత సాహసము! అనరాదు, వినరాదు. కోర్టు వారు దివ్యాంశ సంభూతులు, వారి చేతులకు అడ్డేమిటి? వారి జ్యూరిస్ డిక్షనుకు హద్దేమిటి?" అని ఆర్గుమెంటు చెప్పే వారునూ ఉండేవారు. ఇప్పుడెట్టి మహా మహులు కంటిలో కలికానికైనా కనబడరే? అయితే కర్మసిద్ధాంతము అనతిక్రమణీయం కాబట్టి వెనుకటి వారి అత్యాచారాలవల్ల సిద్ధించిన అనర్థాలన్నీ నేటి కాలపువారి మెడకు చుట్టుకొన్నాయి. కన్నులు తెరవని పసికూనకూడా ప్లాటుఫారముమీద కెక్కి బల్ల గుద్ది లాయరు వృత్తిని నిందించడమే! "ఈ అక్టుకు సంబంధించిన విషయములలో లాయర్లకు జోక్యముండరాదు." అని బాహాటముగా చట్టములు నిర్మించడమే! చూచి చూచి లాయరు వృత్తిని నిర్మూలిస్తే సంస్కృతికి భంగమేమో నని ఒకవంక సంకోచము. స్వేచ్ఛా విహారమునకు అడ్డుగ ఎక్కడికక్కడకు లావా యిట్లు లేవదీస్తూ పావకములో పుడకలా ఈ ప్లీడరు పిశాచ మెక్కడ దాపురించినాదురా యని మనసు నిండా కసి. అందుచే దీనిని పస్తుపడుకోబెట్టడమే ఉపాయమన్నారు. క్షయరోగివలె చావకుండా బ్రతకకుండా శల్యగత ప్రాణముతో ఈ వృత్తి నడుస్తూ వున్నదీ అంటే పెద్దలు విశ్రాంతిపొందనే నా నిశ్చయము.

"దాసుడి పాట్లు పెరుమాళ్ళ కెరుక" అన్నట్లు ఈ వృత్తి నవలంబించేవారు పొందే ఆరాటము పడే యమయాతనా ఆ పరమాత్మకే తెలియాలి. ఇచ్చే ఫీజు మాట అలావుండనీ—తలవెంట్రుకల చిక్కులెన్నో వుండి కొన్ని శతాబ్దముల వయస్సుకలిగిన వారసత్వపు దావాలో ఇరవై మంది సాక్షులను వెంటబెట్టుకొని కన్ను పొడుచుకున్నా కనిపించని పూర్వ చాళుక్యుల నాటి దస్తావేజుల దస్తరమొకటి నెత్తినిబెట్టుకొని విచారణ వాయిదానాడు సరిగా ఉదయము 10-45 కు పార్టీ వకీలుగారి కచేరీ సావడిలో అడుగు పెడతాడు. 11 గంటలకు కోర్టు కదా? దస్తావేజులలో ఏమివున్నదో సాక్షు లేమి చెబుతారో తెలియకుండా ఏలాగో ఓలాగున కథ నడిపెయ్యడమా? మానడమా? 'నసేమిరా' అన్నా అవతల వాయిదా యివ్వరు! రెండు బీరువాల రికార్డువున్న అప్పీలు నలభయి వాయిదాలకయినా ఎప్పటికప్పుడే క్షుణ్ణముగా చదువుకొని మంచి తియారీలో పాడిచేద్దామని మహోత్సాహముతో కోర్టుకువస్తే "సెషన్సు! అడ్జర్నడ్" (Sessions Adjourned) అని పకడుగా వాయిదా పడిపోవడము నలభయిఒకటో సారి "ఈరోజున సెషన్సు వున్నది కదా. అయినదా ఏమన్నా నా" అని అశ్రద్ధచేసి కోర్టుకువస్తే ఆ సెసర్లు దొరక్కనో కారణాంతరము చేతనో సెషన్సు నిలువునా నీరయిపోయి (Collapse) పట్టుపట్టు మంటారు.

ఎవరితో చెప్పను నేను? "You have no business to be unready" (విచారణకు సన్నద్ధులై ఎందుకు రాలేదు) అని పైగా గద్దింపులు. "నేనూ మానవ మాత్రుణ్నే" అని లోపల తాను కూనురాగము తీసుకొలసినదే గాని బాహాటముగా రాగాలాపన చేస్తే అల్లో నేరము. అధికారి అనవధాన చిత్తత చేత గాని సాక్షి అక్రమ ప్రవర్తన చేత గాని పార్టీ అసమర్థత చేత గాని లేక ఈ మూడూ కలసిన త్రివేణీ సంగమం చేత గాని దిక్కే వక్రించినా పాపాలకల్లా భైరవుడు న్యాయవాదియే ఉత్తరవాది.

"నీది స్వతంత్ర వృత్తి గదా? నిన్ను నీవు 'దాసుడు' అనుకోవడము ఉచితంగా వుంటుందా?" అని ప్రశ్నిస్తారేమో. మా స్వాతంత్ర్యమును గూర్చి రవంత మనవి చేస్తా; చిత్తగించండి. సకాలమునకు కోర్టుకు హాజరు కాకపోతే కేసుల కెక్కడి మాంగల్య మహార్షి ప్రత్యక్షమౌతాడో అని పెందరాళే వంట చేసి పెట్టడం విషయంలో ముందుగా ఇంటావిడకో వంట లక్కలున్న వారు వంటావిడకో దాసులు కాక తప్పదు. మాకంటె ముందుగా కోర్టుకు హాజరయి సాక్ష్యమియ్యవలసినవారికు ప్రమాదం రాకుండా కాపాడగలందులకు మాకుమాస్తా మహాశయులకు మేము దాసులము. నిజం చెబుతాను ఈ న్యాయవాద వృత్తి అనే వడిసముద్రంలో మమ్మల్ని ముంచినా తేల్చినా వీరిదే భారము. ఆసమయంలో మా కాగితాలను అర్దక్కి పెట్టకుండా వుంచగలందులకు నిత్య సన్నిధాన వర్తులయిన కోర్టు గుమాస్తాలకు దాసులము. అధికారుల దర్శనానికి పోయినప్పుడు వల్లాల కుర్చీ వేయకుండా వుంచగలందులకు నందకు డిలాయతులకు కూడా మేము దాసులము. సరే. పైసాయిచ్చే పార్టీలకు దాసులమని వేరే చెప్పనక్కరలేదు. ఇన్ని దాస్యాలకు అంగీకరించినా ఉదకు రెండు తిలలూ విర్చడి ముంతెడు నీళ్లూ పోసుకొని ఇవతల బయటగలమన్న నమ్మకము సంశయాస్పదమే. ఎంతో ఆడావుడిపడి ఉడికీ ఉడకని మెతుకులు నోట్లో వేసికొని, పరమ సాహసికుడైన సైకిలు రిక్షా వాలా చేతిలో పంచప్రాణములూ వుంచి గంపెడు పని వున్నదనుకొని పరుగు పరుగున కోర్టుకువచ్చిన రోజున అన్ని వాయిదాలుపడి గోళ్లు గిల్లుకుంటూ కూర్చోవడమూ, "ఉన్న పని స్వల్పమే కదా" అని సావధానముగా మీసములు దువ్వుకుంటూ—ఇప్పటి మీసాలు నా వాటికి ప్రహస్వీకరించిపోయి దువ్వుకోవడానికి విలివ్వడం లేదు లెండి—వచ్చిన రోజున అస్వల్పమూ కూడా డిఫాల్టుకు సర్వమంగళము కావడమూ, నైకల్పికంగా కాక బహుళంగా కలిగే అనుభవాలు. అందుచే దాసులమే కాకుండా దాసానుదాసులము అనుకున్నా తప్పు కనబడదు. కులశేఖరులు పాయించినట్లు "త్వద్భృత్య భృత్య పరిచారక... ఇత్యాదిగా" అని బెంపలు వేసుకుంటున్నాము. విధూతిపంకంలో రసమెంత వుంటుందో న్యాయవాదవృత్తిలో స్వాతంత్ర్య మంత వుంటుంది. ఏ వృత్తికయినా అలవాపాలవా వుంటాయి గాని మా వృత్తిది కేవలము అరణ్య రోదనము.

ఒకప్పుడు మన వృత్తి సంఘానికి శిఖరం. లక్ష్మీ సరస్వతులు పరస్పరవైరము మరచిపోయి చేతులు కలుపుకొని మన కచేరీ సావళ్ళలో లాస్యము చేసేవారు. ఊళ్ళో ఏ దండాలు వేయవలసివచ్చినా ముందు వస్తు మనది. పెంకితనం కావలసిన ఏ వుద్యమం లేవదీయవలసి వచ్చినా ముందంజ మనదే. నేటి దేశనాయకులలో సగంమందికి పైగా మనలోనుంచి వచ్చినవారే. మళ్ళీ వెనకటి ఔన్నత్యము మనకు రాదా?

గాలిలో మేడలు కట్టడంవల్లా లాభం లేదు, అలాగని పాతాళానికి క్రుంగిపోవడంవల్లా లాభం లేదు. ఈ రోజున మన సంఘము అరవైయేళ్ళ వంటుగ చేసికొంటూ వున్నది గదా అని పల్లాకిపోయిన ముసలి అవ్వ అనిమాత్రం చింతించవద్దు. అప్సరసవలె ఇది నిత్యయౌవనవతి. ఎప్పటికప్పుడే దీని సౌందర్యము చేవదేరుతూ వుంటుంది. జీవనదివలె పాతనీరుపోతే కొత్తనీరు వరదలు గట్టుకొని వచ్చిపడుతూంటుంది.

క్రొత్తగా లాయర్లుగా చేరినవారు భావికతిని గూర్చి దివాస్వప్నములూ కనక్కరలేదు. భయకంపితులూ కానక్కరలేదు. యథార్థమునకు సన్నిహితంగానే ఆలోచిద్దాము. ఎందరు ఎన్నివిధాల మనకు శాపం పెట్టినా సవతితల్లి ప్రేమతో ఎన్ని గవర్నమెంటులు మనలను దిగ్గరకు రానీయకుండా తరిమికొట్టినా లాయర్లకు స్వర్ణయుగము భావికాలములోనే వున్నదని నా తాత్పర్యము.

నానాటికి ప్రజానీకము పెరిగి సంఘమునకు వైశాల్యము హెచ్చిపోతున్నది. రాకపోకలకు అనుకూల్యము ఏర్పడి వివిధజాతులు తెరచు తారసిల్లుచున్నవి. ఈ రెండింటివల్ల క్లిష్టమైన పరిస్థితులు (Complex situations) ఎన్నో బయలు దేరుతున్నవి. క్లిష్టత హెచ్చినకొలదీ ప్రత్యేక కృషి (Specialis. ation) అనివార్యమగుచున్నది.

వైద్యవృత్తి తీసికొందాం. ఇదివరలో ఒకేఒక ఆసామీ పురుటిల్లు మొదలుకొని దర్భశయ్యవరకూ తంతు నడిపించేవాడు. కంటికి రోగము వచ్చినా చెవికి రోగము వచ్చినా హృదయానికి రోగము వచ్చినా మెదడు రోగము వచ్చినా అన్నీ వొక చేతి మీదనే చికిత్స పొందేవి. ఇప్పుడలా కాదు. మెటర్

నిటీ స్పెషలిస్టులు, హార్టు స్పెషలిస్టులు, హార్ట్ లెస్ స్పెషలిస్టులు, హెడ్ స్పెషలిస్టులు, హెడ్ లెస్ స్పెషలిస్టులు (Maternity specialists, Heart specialists, Heartless specialists, Head specialists, Headless specialists) శాఖోపశాఖలుగా విజృంభించి పోతూన్నది. కంటి వార్డు (Eye Ward) లోనికిపోయి పీనసరోగి తుమ్మడం ఆరంభిస్తే అతని బాధ భరించలేక "ఇ. ఎన్. టి. (E N T. Ward) అక్కడ వున్నదిపో" అని దారి చూపిస్తారుగాని కన్ను కోసే కత్తితోనే కంఠం కోయడానికి కంటి వైద్యుడు (Eye Surgeon) ఉపక్రమించడు. శూర్పణఖకువలె కర్ణనాశికాచ్ఛేదనము చేయడానికైనా పూనుకోడు. "నాన్సెన్స్! ఇంత స్పెషలైజేషన్ ఏమిటి? ఇంత వైద్యశాస్త్రమేమిటి? అంతా సింప్లిఫై చేసేద్దాం" అని జబర్దస్తీగా ఏ పాలకవర్గ (Legislature) మేనా పూనుకుంటే దానిని పిచ్చి ఆసుపత్రిలో చేర్చవలసి వుంటుంది. ఇదివరకు లేని ఎన్నో క్రొత్త క్రొత్త రోగములు వచ్చి పడుతున్నాయి. ఆ రోగములకు నిదానమునుగూర్చి, చికిత్సనుగూర్చి పరిశోధన చేసే శాఖలు కూడా హెచ్చిపోతున్నాయి. ప్రకృతి పెట్టిన ఈ మహాప్రవాహాన్ని అరికట్టడానికి ఎవరితరము?

ధర్మశాస్త్ర విషయము కూడా అంతే. పంచాంగాలు చింపేస్తే నక్షత్రాలుపోవు. లోకుల పరస్పర సంబంధములలో ఎంతో వైవిధ్యము ఏర్పడుతూ వున్నది. అసంఖ్యాకముగ క్రొత్తక్రొత్త చట్టములు ఎన్నో అవసరమౌతున్నాయి. ఇదివరకు ఫ్యాక్టరీ చట్టములు లేవంటే ఫ్యాక్టరీలూ లేవు కంపెనీలా ఇంత గట్టుతెగి పొర్లడంలేదూ అంటే కంపెనీలు కూడా సకృత్తే. ప్రొద్దున్న లేచినది మొదలుకొని రాత్రి మేనువాల్చేదాకా ఊపిరి విడవడానికైనా తీరుబడి లేకుండా ఇతర వ్యక్తులతో లంటాలుపడేవారికి — కోతలు కోయడంలో నిమగ్నులైవుండే సర్జనే అనండి, జగత్తంతా కల్తీ మేళ్ళ కలయికే అని కల్తీ సిద్ధాంతమును సాధించే వర్తకుడే అనండి పెర్మిట్ల సందర్భములో స్వలాభం చూసుకోకుండా ప్రాలుమాలిక లేక పని చేసే రాజకీయవేత్తే అనండి వీరికి మహాసముద్రమువలె పెరిగిపోయిన ధర్మశాస్త్రం కూడా జపోశనం పట్టడానికి అవకాశం వుంటుందా? మరి దీని మర్మాలతో ప్రమేయం లేకుండా జీవితం ఎలా నడుస్తుంది? రోజుకు నిత్యమూ ధర్మశాస్త్రములో దండాగొండీలు పడే న్యాయాధికారినే తీసుకోండి. ఇరుకక్షుల పక్షమున న్యాయవాదులు అరటిపండొలిచి చేతబెట్టినట్లు ఎంతో కృషిచేసికొని వచ్చి ధర్మశాస్త్రమునందలి సుంటచిక్కులు విశదపరిస్తేనే వారి పని సుకరమౌతూంది కాని లేకపోతే ఎవరి తరము?

ఈ సుంట చిక్కులన్నీ లాయర్లు కల్పించేవే అని కొందరు అమాయకుల అపోహ. ధర్మసంకటాలనేవి ఈనాడు వచ్చి పడినవికావు. ఎప్పుడూ ఉంటునే వున్నాయి అతి ప్రాచీనమైన ఒక ఉదాహరణ మనవి చేస్తా. "ఎన్నోడి తన్నోడినాడా? తన్నోడి ఎన్నోడినాడా?" అని ద్రౌపదీదేవి కౌరవ సభలో ప్రశ్నించినది. "ఎన్నోడి తన్నోడినారంటారా తానుండగా స్త్రీనైన నన్ను ఒడ్డెముకు అధికారము ఎక్కడ వున్నది?" "తన్నోడి ఎన్నోడినారంటారా ఓడిపోయి పరులకు దాసుడు అయిన వానికి మళ్ళీ యింకొకరిని ఒడ్డెముకు అధికారము ఎక్కడ వుంటుంది?" చూసిండి ఎటువంటి 'లా పాయింటు' తీసినదో! నాటి ధర్మవేత్తలలో (Jurists) అగ్రగణ్యులయిన భీష్మద్రోణాదులు కూడా దీనికి సమాధానం చెప్పలేక పోయారు.

లా రిపోర్టులు అంటే ఇప్పటి రాజకీయవేత్తలకు మంట. నాకు కూడా వీనిని చూస్తే తలనొప్పే — శ్రమపడలేక. ఒక్కమారుగ ఇవన్నీ భస్మమైపోతే బాగుండుననిపిస్తుంది. దీనికి ముఖ్యకారణము నూతన సిద్ధాంతము లేని కేసులన్నీ రిపోర్టు చేసే పత్రికలు (Journals) ప్రబలడమే, కాని నిబ్బరంగా ఆలోచిస్తే "శిష్టాచారము" అనే ఉత్తమ సిద్ధాంతము ఇందు ఇమిడివున్నది. ధర్మసూత్రానికి పెద్దల ఆచరణమే వ్యాఖ్యానమని ఈనాడు కనిపెట్టిన రహస్యము కాదు.

శ్రుతి॥ అథ యది తే కర్మవిచికిత్సా వా వృత్తవిచికిత్సా వా స్యాత్। యే తత్ర బ్రాహ్మణాః సమ్మర్శినః। యుక్తా ఆయుక్తాః। అలూక్షా ధర్మకామాస్స్యుః। యథా తే తత్ర వర్తేరన్। తథా తత్ర వర్తేథాః॥

(తైత్తిరీయోపనిషత్ శిక్షావల్లి ఏకాదశానువాకము. మంత్రము 7)

గురుకులవాసము ముగించుకొని వెళ్ళే శిష్యునికి గురువు ఉపదేశించుచున్నాడు:—

తరువాత (ఇటుపైని) నీకు కర్మవిషయమునగాని నడవడి విషయమునగాని సందేహము కలిగినయెడల అచ్చట (సమీపమున) విమర్శనావేత్తలును జ్ఞానయుక్తులును లౌకిక వ్యవహారవేత్తలును క్రౌర్యములేనివారును ధర్మాసక్తులును అగు బ్రాహ్మణులు (పెద్దలు) ఎవరు కలరో వారు అట్టి పరిస్థితులయందు ఎట్లు వర్తించెదరో (తెలిసికొని) ఆ ప్రకారము ప్రవర్తింపుము.

‘ప్రిసీడెంట్సు’కు ప్రాముఖ్యము యివ్వడములో వున్న సిద్ధాంతము యావత్తూ యీ వేద మంత్రములో యిమిడివున్నది. పెద్దల ఆదరణ మినహాయిస్తే ధర్మ శాస్త్రానికి వ్యాఖ్యాన మెట్లా?

స్మృతి (భారతము)లో కూడా శిష్టాచారము నకు పలుతావుల ప్రాముఖ్య మివ్వబడుట సువిదితము. "అయిదుగురు పురుషులు ఒక స్త్రీని వివాహం ఆడడం విడ్డూరము కాదా?" అనే ప్రశ్న వస్తే కొన్ని ‘ప్రిసీడెంట్సు’ వుదాహరించి ధర్మరాజు సమర్థిస్తాడు. శాంతిపర్వములోని ధర్మోపదేశ మంతా చాలావరకు (Precedents) మీదనే ఆధారపడివున్నది. అట్టి పాండిత్యప్రకర్షకు పోతే మీకు తలనొప్పి, నాకాయాసము. దిక్ప్రదర్శనముగా సూచించినాము.

ఏతావతా స్పష్టమయ్యేది ఏమంటే ధర్మజిజ్ఞాస ధర్మశాస్త్రములో ప్రత్యేక కృషిచేసిన లాయరు లేనిదే సమగ్రము కానేరదు. పూర్వముకూడా తద్జ్ఞుల నడిగి ధర్మము తెలిసికోవడమే సంప్రదాయము. సంస్కృతి విజృంభణదిశలోనున్న ప్రతి సంఘమునందును లాయరుకు అపరిహార్యమయిన విశిష్టస్థానము ఏర్పడివున్నది. భారతమునకు విదురు డెట్టివాడో సంఘమునకు లాయ రట్టివాడు.

అయితే మోతీలాల్ నెహ్రూవలెగాని, రస విహారిఘోష్‌వలెగాని, సమీపానికి వస్తే శ్రీనివాసయ్యంగారివలెగాని, సర్ అల్లాడివలెగాని, ఇంకా సమీపానికి వస్తే న్యాపతి సుబ్బారావుపంతులు, నిడమర్తి దుర్గయ్య గార్లవలెగాని లక్షలార్జించడానికి ఇప్పుడు సావకాశము లేదు. ఏఒక్క వ్యక్తికూడా వెట్టితిలలు వేసిన మొదుగుడోంకవలె ఇతరులకు యిబ్బంది కలిగిస్తూ విజృంభించరాదని ఇప్పటి సాంఘికాశయం. ఒకడు ఏడంతస్తుల మేడలో బంగారం తూగుటుయ్యాల లూగడం, ఇంకొక్కడు ప్రక్కనే డ్రైనేజికాలువ నాశ్రయించుకొని త్రాగడానికి గంజిలేక పస్తు పడుకోవడము—ఇట్టి విషమస్థితిని అరికట్టాలని సంఘము దీక్ష వహించింది. సంతోషమే. ఈ దీక్షకు మనము కూడా స్వాగతం యిద్దాము. మానవజాతికంతకూ అభ్యుదయం ఆకాంక్షిస్తూ మంగళగీతము పాడాలని భారతవర్షము ఉద్యమిస్తూంటే దానిలో కంఠం కలపకుండా వేరు పడిపోయేది లాయరేనా?

మన భావి ఔన్నత్యము త్యాగముమీద ఆధార పడివున్నది గాని భోగముమీద ఆధారపడి లేదని ముమ్మాటికి నమ్మండి. ధనలక్ష్మి మిమ్మల్ని వరించక పోయినా గుణలక్ష్మి వచ్చి స్వయంగా వరిస్తోంది. ఈ సంయోగమువలన జనించే ఆనందము ఎంత ఉత్తమమైనదో ఆలోచించుకోండి. "మనము ప్రజలకు స్నేహితులము—సేవకులము" అని గుర్తించి నప్పుడే మన న్యాయవాదిశాఖ మళ్ళీ తలయెత్తగలుగుతుంది. "నేను పల్లకీ ఎక్కుతాను. మీరు మొయ్యండి" అంటే లాభంలేదు. "మాకు క్షేమము - మీకుక్షామము" అన్నా లాభంలేదు. సర్వజన క్షేమము నాలోచించి మనము పని చెయ్యాలి. "సర్వజనా స్సుఖినోభవంతు" అనడమే మన ప్రకృత కర్తవ్యము. నేటి రాజకీయ నేతల ఆదరణకు అనుగుణ్యంగానే ఈ మహామంత్రాన్ని జపించ నక్కరలేదు. అంతఃకరణ శుద్ధితోనే జపిద్దాము.

పూర్వపక్షి యిక్కడ వొక్క ప్రశ్న వేస్తున్నాడు. "సుఖంగా వుండవలసినది సర్వే డిపార్టు మెంటు ఒక్కటేనా? మరి తక్కిన డిపార్టుమెంటు లన్నీ ఏంగాను?" అని. దీనికి సిద్ధాంతి సమాధానము చెబుతున్నాడు. "ఈ రోజుల్లో ముఖ్యంగా కావలసింది సర్వే ఒక్కటే. ప్లానింగు (Planning) అంతా సర్వేమీదనే ఆధారపడి వున్నది. ఎవరికివారు తమ్ము తాము సర్వేచేసి చూచుకుంటే లోకం ఇట్టే బాగుపడుతుంది. గురువిందపూసవలె స్వదోషములు గుర్తించుకోక పరదోషములపైకి హైడ్రోజన్ బాంబువలె విజృంభించడమే వ్యక్తులలోనైనా జాతులలోనైనా ఇప్పుడు కనబడే ప్రధానదోషం. కాబట్టి ఈ పద్ధతిని విపరీతి మొనర్చి స్వదోషములను పరగుణములను సర్వేచేసి చూచుకునే మహాజను లందరికి సౌఖ్యము కోరడమే అభ్యుచితము" అని.

ఈ సిద్ధాంతమునందలి పరమార్థమును గ్రహించి "మన పతనమునకు మనమే ఉత్తరవాదులము, మళ్ళీ మన అభ్యున్నతికి కూడా మనమే ఉత్తరవాదులము" అని విశ్వసించి భూనభోంతరము పూరటిల్లునట్లు "సర్వే జనా స్సుఖినోభవంతు" అని మంగళా శాసనము గావింతము.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

విద్యార్థి

శ్రీ వేదుల లక్ష్మణమూర్తి

ఆ రోజు ఉదయం రమారమి ఎనిమిది గంటలౌతుంది.

జడివాన పడుతోంది. ఆకాశమంతా బూడిద రంగుగా ఉంది. ఆకాశంలో సూర్యుడున్న చిహ్నాలు కనుపించడంలేదు. ప్రకృతికాంత పురుషునిమీద కోపగించి నల్లని వలువను కప్పుకొని కన్నీరు కారుస్తున్నట్లుంది. పురుషుడు ఆమెను బ్రతిమాలుతున్నాడు. ఎంతకూ వినకపోతే విసుగెత్తి తన గంభీర గర్జనతో ఆమెను బెదిరిస్తున్నాడు. ఆమె హాసంచేస్తూ ఇటునటు కదులుతోంది. కదిలేటప్పుడు కన్నులు మిరుమిట్లుగొలిపే ఆమె శరీరలావణ్యం, కప్పుకొన్న వలువసందులనుండి మెరుస్తోంది. మానవుని మనోఫలకంమీద ఆవరించిన అజ్ఞానంలాగ ఆకాశంమీద మేఘం ఆవరించింది. అజ్ఞానఫలితంగా సంభవించే ప్రమాదాలవలె గాలి తెరలు, జడివాన ప్రాణికోటికి చికాకును కలుగజేస్తున్నాయి.

నేను మా వీధి అరుగుమీద చాప పరచుకొని గోడకు జేరబడి కూర్చున్నాను. మా యింటి తాటాకు చూరు క్రిందికి దిగివుంది. అరుగు మట్టైది; విశాలంగా ఉంది. మా యింటిముందు కంకర వేసిపోగా తయారైన చౌచౌరోడ్డు. దాని తరువాత కొన్ని వరిచేలు. అవి దాటాక మామిడిచెట్ల బారుతో కాలువగట్టు. దాని కావల మళ్లీ వరిచేలు. ఇంకా దూరానికిచూస్తే ఆకాశం భూమీ కలిసే క్షితిజం. జడివానవచ్చేశబ్దం మనస్సుకి మైకాన్ని కలుగజేస్తోంది. చదువుదామని ఎదుట పెట్టుకొన్న దినపత్రిక అలాగే పడివుంది. ఎదుటికి చూస్తూ ధ్యానిస్తూ కూర్చున్నాను. వర్షంనుండి రక్షించుకొంటూ ఒక కుక్క మా యింటి రెండో అరుగు యెక్కింది. శరీరమంతా టకటకమని చప్పుడు చేస్తూ ఒంటిమీది నీటిని దులుపుకొంది. మూలకుపోయి పడుక్కొంది నాకు యెదురుగా మామిడిచెట్టు మొదలు దగ్గరకు రెండు గాడిదలు చేరి, తలలు వంచుకొని దగ్గర దగ్గరగా నిలబడ్డాయి. ఇంతలో నా దగ్గర చదువుకొనే సుబ్బారావు పుస్తకాలసంచి చొక్కా క్రింద పెట్టుకొని వంగి వంగి చురుగ్గా నడిచివచ్చి మెట్లెక్కాడు. వాడి బట్టలు, తల తడిశాయి. చొక్కా క్రింది సంచితీసి అరుగుమీద పెట్టాడు. "ఏమిరా! వర్షంలో తడుస్తూ వచ్చావు! ఏ మంత మించిపోయింది? ఇవేళ బడికి శెలవుకూడానూ!" అని అంటూ తొందరగా లేచాను. లోపలికివెళ్ళి రెండు తుండుగుడ్డలు తెచ్చి "లాగూ చొక్కా విప్పెయ్, తడిసి ముద్దయిపోయాయి" అంటూ వాటిని యివ్వబోయాను. "వద్దండి, వద్దండి, కాస్సేపటికి ఆరిపోతాయండి" అంటూ చొక్కా ముందుభాగం పిండుతున్నాడు. "ఏడిసినట్లేవుంది! గుడ్డలు తడిసి ముద్దయితే ఆరిపోతాయంటా వేమిటి? తడిగుడ్డల్తోవుంటే జలుబు చేస్తుంది. ఊఁ తీసుకో! త్వరగా విప్పెయ్, ఆ గుడ్డలు" అని కొంచెం గద్దించాను. విధిలేక తువ్వాళ్లు తీసుకొన్నాడు. ఒకటి చుట్టబెట్టుకొని రెండో దానితో తలా వళ్ళూ తుడుచుకొన్నాడు. ఇంతలో నాభార్య, రాధ "అయ్యో, అదేమిరా తడుస్తూ వచ్చావ్! పద, లోపలికి. నీళ్లపొయ్యిదగ్గర కూర్చో!" అంటూ గుమ్మంలోకి వచ్చి నిలబడింది. వాడు లాగూ చొక్కా పిండుతూ అరుగు చివర నిలబడ్డాడు. "త్వరగా కానియ్యి, రా లోపలికి!" అని మళ్లీ హెచ్చరించింది. వాడు మెల్లిగా సంచిలోని పుస్తకాలు బయటికి తీసి అరుగుమీద పెట్టి సంచి లోపలికి తీసుకొనివెళ్లాడు. సంచిలో ఇంకా యేవో ఉన్నాయి. వాడి వెనుక నేనూ లోపలికి వెళ్ళాను. వాడు లోపలి వసారాలో సంచిలోని వంకాయలు దిమ్మరిచాడు. "ఏమిట్రా, వద్దంటే అర్థంకాదూ, యేదోఒకటి తెస్తూంటావ్? వాటిని సంచిలోకి యెత్తు! సాయంకాలం తీసుకొనిపోదువుగాని" అని కొంచెం కఠినంగా మాట్లాడాను. వాడు బిక్కముఖంతో 'మా అమ్మ తీసుకు వెళ్ళమందండి" అన్నాడు.

"మీ అమ్మ, నువ్వు అడక్కుండా తీసుకెళ్ళమందా?" వాడు మాట్లాడలేదు. "మాకోసం యేమీ తేవద్దని చెప్పడం ఇది యెన్నోసారి. వద్దు, తీసుకు పొమ్మంటే యేడుస్తావు. నువ్వు యేవేవో తెచ్చి మాకిచ్చేస్తున్నావని, ఇల్లుగుల్లచేస్తున్నావని మీవాళ్లు గోలపెడతారు. ఎందుకు మాకీ లేనిపోని సంత. అదీ డబ్బులు పెడితే వచ్చే కాయగూరకి మేం అప్రతిష్ఠపాలు కావలసివస్తోంది. వాటిని పంచిలోకి ఎత్తేయ్! ఊఁ! చూస్తావేం?" అని గద్దించాను. "ఇంక తీసుకురానండీ" అని అలాగే తలవంచుకొని నిలబడ్డాడు. రెండు కన్నీటి చుక్కలు వాని పాదాలముందు పడి మట్టిలోకి ఇంకిపోయాయి.

వద్దని ఎన్నిసార్లు చెప్పానురా? మీ వాళ్ళకి యిష్టంలేనప్పుడు యెందుకు నాయనా తేవడం? నువ్వా, తిట్లూ దెబ్బలూ తింటున్నావు, మేమూ, అప్రతిష్ఠ పాలౌతున్నాం. వేళకి వచ్చి చదువుకోని పోక ఇవన్నీ యెందుకురా? నువ్వు పెద్దవాడివయి సంపాదించేటప్పుడు నీ యిష్టమొచ్చినవన్నీ తెచ్చియియ్యి, వద్దంటామేమో మేము. సరే వాటికేంగాని బట్టలు దండెంమీద ఆరవెయ్యి. పొయ్యి దగ్గరకూర్చో." అంది రాధ. వాడు వెంటనే కాయలు అక్కడే వదిలి దండెంమీద బట్టలు ఆరేశాడు. పొయ్యిదగ్గర కూర్చున్నాడు. "వర్షంలో ఎందుకు వచ్చావ్! చద్దన్నం తిన్నావా?" అని ప్రశ్నించింది రాధ. "సంగందూరం వచ్చాక వచ్చిందండివర్షం" అన్నాడు. "కాస్సేపు వర్షం తగ్గేదాకా యే పాకలోనైనా ఆగలేకపోయావా? ...మరి అన్నం తిన్నావా?" అని మళ్ళీ ప్రశ్నించింది. "తిన్నానండి" అని జవాబు చెప్పాడు. వాడి జవాబు పూర్తిగా వినిపించుకోకుండా, లోపలికి వెళ్ళి గ్లాసుతో కాఫీ తెచ్చి వాడి ముందుపెట్టి "ఈ కాఫీ త్రాగు! చలితగ్గుతుంది." అన్నది రాధ. "వద్దండి, వద్దండి కాఫీ ఎప్పుడూ త్రాగనండి" అని బిడియపడుతూ అన్నాడు. "త్రాగవని తెలుసులే, ఈ పూటికి త్రాగెయ్!" అంది. "వద్దండి త్రాగనండి" అంటూ ముడిచిపెట్టుకొని కూర్చున్నాడు. నేను కొంచెం దగ్గరగా వెళ్ళి "మేమిచ్చిన దాన్ని వద్దనకూడదు, త్రాగెయ్!...ఊఁ! తీసుకో" అని ఒత్తిడిచేశాను. తప్పని సరిగా గ్లాసు తీసుకొని బలవంతంగా త్రాగాడు. వెంటనే లేచి నూతి దగ్గర గ్లాసు కడిగి తెచ్చి వసారాలో పెట్టాడు. నేను మళ్ళీ వీధి అరుగు మీదికి వచ్చాను. నావెనక నే పిల్లిలా వాడూవచ్చాడు. "తెలుగుపద్యం, ఇంగ్లీషుపద్యం వచ్చాయండి. చూడకుండా వ్రాయగలనండి" అన్నాడు. "కాస్సేపు వర్షం ఆగి చలి తగ్గేవరకూ పొయ్యి దగ్గరకూర్చోరా, ఇంతలోకే చదువు చెడిపోదులే" అన్నాను. కాని వాడు కదల్లేదు. తలవంచుకొని పుస్తకాలు తిరగేస్తున్నాడు. వాడి ముఖంలో చదువు చెడిపోతోందనే భావం వ్యక్తమౌతోంది. "సరే, పొయ్యి దగ్గర కూర్చుని వ్రాయి, వెళ్ళు" అన్నాను. పుస్తకాలు తీసుకొని లోపలికి పోయాడు.

సుబ్బారావు తండ్రి పాతిక ముప్పై యెకరాల భూస్వామి. వాళ్ళయిల్లు మా అత్తగారింటికి యెదురుగా ఉంది. వాళ్లదో చిన్న గ్రామం. అది నే నివసిస్తున్న ఊరికి మైలున్నరదూరముంది. శిథిలమైపోయిన కంకర బాట అనేక వంకరలు తిరుగుతూ ఈ రెండు గ్రామాల్ని కలుపుతోంది. సుబ్బారావుకి ముగ్గురన్నలు ముగ్గురు తమ్ముళ్లు ఉన్నారు. వాళ్ళది స్వంత వ్యవసాయం. పాడి, పంట, సంతానంలో ఆ యిల్లు నిండుగా ఉంటుంది. సుబ్బారావు తండ్రీ, ముగ్గురన్నలూ వ్యవసాయపు పనుల్లో ఉంటారు. చేవలు తేరిన శరీరాలతో, బండబారిన బుద్ధులతో ఉన్న వాళ్ళని చూస్తే పశువులకీ వాళ్ళకీ ఎంతో తేడా లేదనిపిస్తుంది. వీని అన్నలలో ఒకనికో యిద్దరికో పెళ్ళిళ్ళయాయనుకొంటాను.

రెండేళ్ళ క్రితం, సంక్రాంతి పండుగకు పదిపన్నెండు రోజులు నేను మా అత్తవారింట్లో మకాం చేశాను. నేనక్కడికి వెళ్ళిన మరునాడు ఉదయం వీధి అరుగుమీద పడకకుర్చీలో పత్రిక చూస్తూ కూర్చున్నాను. పదిపదకొండేళ్ళ కుర్రాడు నెమ్మదిగా అరుగుదగ్గరకు చేరాడు. వీడు ఆ యెదుటి యింటి వారి పిల్లవాడని ఊహించాను. 'ఏం వచ్చావ్?' అన్నాను. 'యేంలేదండి' అన్నాడు. అరుగుమీదకు మోచేతులమీద వాలి వీధి వైపుకి చూస్తూ క్రింద నిలబడ్డాడు. నాదృష్టి పత్రికమీద లేదు. నల్లగా కళ కళలాడే వాని ముఖం చూస్తున్నాను. వాడు మధ్య మధ్య నావైపు చూచి మళ్ళీ ముఖం తిప్పుకొంటున్నాడు. వాడు యేమీ లేదని నాతో చెప్పినా వాని ముఖం తీరు చూస్తే నాతో యేదో మాట్లాడాలనే ఉద్దేశం ఉన్నట్టు

స్పష్టపడుతోంది. పది పదకొండేళ్ళ కుర్రాడు పనేమీ లేకుండా అంత బుద్ధిగా నా యెదుట నిలబడ్డం నాకు కొంచెం వింతగా ఉంది. నేను అయిదారు వందల మంది పిల్లలు చదువుకొనే హైస్కూల్లో పని చేస్తున్నప్పటికీ తరగతిలో తప్ప మరెక్కడా యే పిల్లవాడూ నన్ను పలుకరించి మాట్లాడడు, నా యెదుట నిలబడడు. సాధ్యమైనంతవరకూ పిల్లలు నన్ను చూసి తొలగిపోతారు. ఎదుట బడితే ఒక్కొక్కడు ఒక నమస్కారం చేసి పోతాడు. 'వీడు మా స్కూల్లో చదివే కుర్రాడు కాడుగా' అనుకొన్నాను మనస్సులో. వీళ్ళ కుటుంబంలో ఉన్న వాళ్లందరిలోకీ వీడు తప్పబుట్టినట్లున్నాడు. నల్లగా, బలహీనంగా ఉన్నాడు. కాని విశాలమైన వాని కళ్లు, నుదురు వాని సూక్ష్మ బుద్ధిని వ్యక్తం చేస్తున్నాయి చదువుకొంటే బాగా అభివృద్ధికి వచ్చేవాడిలా కనుపిస్తున్నాడు. వాణ్ణి గురించి ఆలోచిస్తున్నానే గాని మాట్లాడలేదు. కొంత సేపటికి వాడు 'మీరు హైస్కూల్లో మాస్టారాండి?' అని ప్రశ్నించాడు. "ఆఁ" అన్నాను యింకా యేమైనా అడిగితే చెప్పడానికి కుతూహలపడుతూ. 'వచ్చే యేడు మీ స్కూల్లో చేరతానండి' అన్నాడు మెల్లగా. 'ఓ తప్పకుండా చేరు; ఇప్పుడేం చదువుతున్నావ్' అంటూ చేతిలోని పత్రిక క్రింద పెట్టాను. 'ఐదో క్లాసండి. మా క్లాసులో నేనే ఫస్టండి. నన్ను చేర్చుకొంటారాండి మీ స్కూల్లో?' అని ఆత్రుతతో నా వైపు చూశాడు. "క్లాసులో ఫస్టుగా ఉంటున్నావుగా? బాగా చదివేవాళ్లను తప్పకుండా చేర్చుకొంటారు." అని వానికి సంతోషం కలిగించాను. అది మొదలు వాడు నన్ను వదలిపెట్టలేదు. మధ్యాహ్నం తన పుస్తకాలన్నీ నాకు చూపించాడు. వాటిలోని పద్యాలూ, పాఠాలూ తనకు బాగా వచ్చునన్నాడు. తన లెక్కల పుస్తకంలోని ప్రతీ లెక్కా తను చేస్తానన్నాడు. ఫస్టుఫారం ఇంగ్లీషు పుస్తకంలో సగం పాఠాలు తనకు వచ్చునన్నాడు. 'ఏమైనా అడగండి చెప్తాను' అన్నాడు. చదువులో వానికుండే ఉత్సాహం ఆసక్తి నన్ను చకితుణ్ణి చేశాయి. అన్ని విషయాల్లోనూ ఒకటి రెండేసి ప్రశ్నలు వేశాను. అన్నింటికీ చక్కగా జవాబులు చెప్పాడు. 'యే క్లాసులో చేరతావు?' అని అడిగాను. "ఈయేడు అయిదో క్లాసు అయిపోతుంది కాదండీ, ఆరో క్లాసులో చేరతానండి" అన్నాడు. "వచ్చే వేసంగి శెలవుల్లో యెవరిదగ్గరైనా చదువుకొని ఈ యింగ్లీషు పుస్తకం పూర్తి చెయ్యి, ఫస్టుఫారం లెక్కలు కూడా నేర్చుకో, సెకండు ఫారంలో చేరొచ్చు" అన్నాను. వాని సంతోషానికి మేరలేదు. 'తప్పకుండా మీదగ్గరికి వచ్చి చదువుకొంటానండి." అని చెప్పి యింటికి వెళ్ళాడు. మరో అరగంటకి తిరిగివచ్చాడు. ఇందాకటి ఉత్సాహం ఇప్పుడు వానిలో లేదు. ముఖం యేడుపును సూచిస్తోంది. సాయంకాలం వేళ చేలగట్లంట తిరిగివద్దామని బయలుదేరాను. వాడు నన్ను వెంబడించాడు. "ఏం, నాతో వస్తావా?" అన్నాను. "వస్తానండి" అని దీనంగా అన్నాడు. పదిళ్లు దాటి ఊరిబయటికి వచ్చాం. "అలా ఉన్నావేం?" అని అడిగాను. "మాబాబు చదువెందుకు ఈ చదివింది-చాలే అన్నాడండి" అని కళ్లు చొక్కా ముందుభాగంతో తుడుచుకొన్నాడు. "ఈ మాత్రం దానికి యేడవడ మెందుకు? మీబాబుతో నేను చెప్తానులే" అని ఊరడించబోయాను. "మా బాబు వినడండి. నిరుడే చదువు మానెయ్యమన్నాడండి, పొలంపని చెయ్యమని తిడుతూంటాడండి. తిడుతూన్నా నేను బడికి వెళ్ళడం మానలేదండి" అని తన నిరాశను వెల్లడించాడు.

"పరవాలేదు, నేను మాట్లాడి నువ్వు చదువుకొనే ఏర్పాటు చేస్తానుగా" అని ధీమాగా చెప్పాను. నేను పిల్లకాలువ గట్టుయెక్కి ఒకవైపుకి నాలుగడుగులు వేశాను. "ఇటువైపుకి వెడదామండి" అని కొంచెం తొట్రుపడుతూ నా వెనుక నిలబడి అన్నాడు. నేను వెనక్కి తిరిగి "ఏం?" అన్నాను. "అబ్బే, యేమీలేదండి, ఇటు బావుంటుందండి" అన్నాడు. సందేహిస్తూ. "ఏం ఇటు బాగుండదా?" అని ప్రశ్నించాను. "అటు బాగానే ఉంటుందండి" అని నసిగాడు "ఇటెందుకు వెళ్దామంటున్నావ్?" అని వాడి ముఖంలోకి చూశాను. వాడు మాట్లాడక తలవంచుకొన్నాడు. "సందేహిస్తున్నావేం? చెప్పు" "అటు మా పొలం ఉందండి." "మరీ మంచిది, మీపొలం చూడొచ్చుగా?" "అక్కడ మా అన్నయ్యలున్నారండీ, తిడతారండి" "ఎందుకు తిడతారు? ఏం చేశావేమిటి?" "వాళ్ళు రోజూ పొలం రమ్మంటారండి, నేను చదువుకోడం వాళ్ళకి యిష్టంలేదండి" "ఇవాళ నేను దగ్గర ఉన్నానుగా? తిట్టరు, రా, ఇటే పోదాం" అని నేను నడక సాగించాను. విధిలేక నావెంబడి వస్తున్నాడు. నాలుగైదు ఫర్లాంగులు నడిచాక పెద్దపసువులశాల కనిపించింది.

"అదేనండి మా దూళ్లే పాల" అన్నాడు. మరి నాలుగడుగులు వేసి వెనక్కి చూచాను. వాడు బెదురుచూపులు చూస్తూ అక్కడే ఆగిపోయాడు. "ఆగిపోయావేం? రా! నేనుండగా నిన్నెవ్వరూ యేమీ అనరు, ఊఁ, రా!" అని హెచ్చరించాను. వాడు మెల్లిగా అడుగు లేస్తూ బయలుదేరాడు. పాక సమీపానికి వచ్చేసరికి వాళ్ళ అన్నలలో రెండోవాడు ఇనపమనిషిలా నేల అదిరేటట్లు అడుగులు వేసుకొంటూ మావైపు వస్తున్నాడు. తమ్ముణ్ని చూచి "యేరా, మధ్యాన్నంచీ యెక్కడ సచ్చావ్? ఇప్పుడెందుకూ సేతులూపు కుంటూ వచ్చావ్? మేం పొలంలోపడి సచ్చేట్టు సాకిరీ సేస్తోంటే వణ్ణం తేలేవూ?" అంటూ నన్ను దాటి నా వెనుక నాలుగుగజాల దూరంలో వున్న తమ్ముడిదగ్గరకు వెళ్లాడు. నేను వెనక్కి తిరిగి యేదో చెప్పబోయే లోగానే "మాట్లాడవేం యెదవా?" అని వాని దవడ మీద చెళ్లునకొట్టాడు. నేను తొందరగా దగ్గరకు వెళ్ళి మరి కొట్టకుండా అడ్డగించాను. నన్ను చూచి ఇంకేమీ చెయ్యలేక "సూడండి బాబూ! ఇంటికాణ్ణుంచి వణ్ణమేనా తేలేకపోతే మరెందుకండి యీ బక్కెదవ?" అంటూ విసురుగా వెళ్ళిపోయాడు. నాకు ముచ్చెమటలు పోశాయి. తల తిరిగింది. నా చదువూ, తెలివీ తుమ్మమోడులాంటి ఆ మనిషిముందు యెందుకూ పనికి రాలేదు. ఆ కుర్రవాడి తలను రెండుచేతులతోనూ పట్టుకొని నా కడుపుకి అదుముకొన్నాను. వాని కళ్ళ నుండి నీరు యేకధారగా కారుతోంది. నల్లని దవడ పొంగింది. ఏడుపును బలవంతాన అణచుకొంటున్న కారణంచేత ఎక్కిళ్ళు వస్తున్నాయి. కోమలమైన వాని లేతహృదయాన్ని నా చేతులతో నలిపి రక్తం పిండుతున్నట్లనిపించింది నాకు. ఇటు, వద్దంటే బలవంతాన తీసుకొచ్చాను యీ పసికందును — ఈ మాట గుహాలోని పులి గర్జనలా నా హృదయంలో ప్రతిధ్వనిస్తోంది. వాని చొక్కా యెదుటి భాగమంతా కన్నీరు తుడుచుకొంటున్న కారణంచేత తడిసి పోయింది. వాని చెయ్యి పట్టుకొని వచ్చిన త్రోవనే నడవసాగాను. వానికి యేదో చెప్పి ఊరట కలిగించాలని నా ఊహ. కాని వానితో యే ముఖం పెట్టుకొని మాట్లాడగలను. కొంతదూరం వెళ్ళాక "నేను చదువుకొంటున్నానని కోపమండి మా అన్నయ్యలకి. రోజా యేదో వంకపెట్టి తిడుతూ కొడుతూంటారండి" అని వాడు నన్ను మాట్లాడ్డానికి ప్రేరేపించాడు. "పోనురా బాబూ, వాళ్ళు అడివి జంతువులు" అని, మరి మాట్లాడలేక పోయాను.

ఆ రాత్రి భోజనాలయాక నేను అరుగుమీద కూర్చున్నాను. మా మామగారు, ఇంకా నలుగురైదుగురు పెద్దమనుషులు ఒక్కొక్కరుగా అరుగు మీదకు చేరారు. వారిలో మా మామగారే కొంచెం సంస్కృతం, తెలుగూ చదువుకొన్నారు. మిగిలినవారిలో ఇద్దరు ముగ్గురికి చదవడం వ్రాయడం మాత్రమే వచ్చును. మిగిలినవారికి అదీ రాదు. వారు రోజూ రాత్రి భోజనాలయాక యీ విధంగా చేరి యేదో లోకాభిరామాయణంతో కాలక్షేపం చెయ్యడం వారి అలవాటు. అప్పుడప్పుడు పది పదిహేను రోజులపాటు మా మామగారు పురాణం చదువుతూంటారు. ఆ చుట్టు ప్రక్కల ఆడా మగా వచ్చి పురాణం వింటూంటారు. అది లేని రోజుల్లో లోకాభి రామాయణం సాగుతోంటుంది. అక్కడకు చేరిన వారిలో యెదురింటి యజమాని జగ్గయ్య కూడా ఉన్నాడు. కొంతసేపు నేను వారి ప్రసంగాలు వింటూ కూర్చున్నాను. ఆ తరువాత "జగ్గయ్యా, మీ కుర్రవాడు చాలా బుద్ధిమంతుడూ తెలివైన వాడూ సుమా" అని వాని అభిప్రాయం రాబట్టడానికి అన్నాను. 'ఎవరండి?' అన్నాడు. "వాడే ఐదో క్లాసు చదివే కుర్రాడు" "సుబ్బారావాండి" "ఆఁ, ఆఁ" "ఎందుకొచ్చిన తెలివండీ కూటికా గుడ్డకా?" అని నిర్లిప్తంగా అన్నాడు. "అదేమిటయ్యా అలా అంటావు? శ్రద్ధగా చదివిస్తే చాలా అభివృద్ధిలోకి వస్తాడు." "వళ్ళొంచి పనిచేసి కడుపు నిండా తిని సుకపడక యెందుకొచ్చిన సదువులండీ యివి. ఒళ్లా యిల్లా గుల్ల సేసుకొని సూక్కాలు ఫైన్లా, బియ్యేలు సదవడం, ఆ తరువాత నౌకరీకోసం అడ్డమైన వోళ్ళ కాళ్ళూ పట్టుగోడం. ఇంతా యేడిస్తే అరవయ్యో డెబ్బయ్యో కడిగి సేతుల్లో పెడ్తారు. పట్నాల్లో ఆ జీతం సాలక మిగిలున్న యిల్లా వాకిళ్ళూ అమ్ముకోడం; అయికూడా అయిపోయాక లంచాలలో మా బోటిగోళ్ళని గద్దలూ రాబందుల్లా పీక్కు తినడం. వద్దు బాబూ! మాకు సదువులెందుకు, యిలా బతికితే సాలు" అని ఉచ్చైస్స్వరంతో విరామం లేకుండా మాట్లాడాడు. "మహ ఖేషుగ్గా చెప్పావోయ్," అన్నాడో ముసలాయన ప్రక్కను కూర్చుని. "నిజమే,

ఇప్పటి చదువు లలాగే ఉన్నాయి" అన్నాడింకో ఆయన. పుస్తకంమీద అక్కడున్న నలుగురూ జగ్గయ్య మాటల్ని సమర్థించారు. ఈ మాటలు వాని యాభై సంవత్సరాల అనుభవసారం. అశిక్షితమైన అతని మనస్సులో శిక్షితులనబడేవారి నిత్య జీవిత వ్యవహారాలను మథించగా వచ్చిన హాలాహలం. జీవిత సంగ్రామంలో వాని హృదయానికి తగిలిన గాయాల బాధవల్ల వెలువడిన ఆక్రందనం. అక్కడున్నవారు వారి వారి ప్రసంగాలను విస్మరించి నే నేమి చెబుతానో అని నా వైపు చూస్తున్నారు. వీధి తవాలీకి వ్రేలాడుతున్న హరికెన్‌లాంతరు వెల్తురులో నేను ఒకసారి జగ్గయ్యముఖం చూడబోయాను కాని అతను వీధివైపుకి చూస్తున్న కారణంచే వాని ముఖలక్షణాలేవీ నాకు కనుపించలేదు. "నువ్వు చెప్పిన మాటలు కాదనడానికి వీల్లేదు. కాని నువ్వు చెప్పినది, చదువుకొని నౌకరీలు చేస్తున్నవార్ని గురించి. వారు జీవనోపాధికోసం నౌకరీలలో ప్రవేశిస్తారు. ఆ జీతపురాళ్ళతో కడుపు నిండక అక్రమ ప్రవర్తనకు సిద్ధపడతారు. కొంత కాలానికి అది అలవాటై చివరికి పరమేశ్వరసృష్టి, అందులో మానవులికుండే విశిష్టతను మరచిపోయి మానవత్వాన్ని పోగొట్టుకొంటారు. నిజానికి వారు వస్తువులను ఉత్పత్తిచేసే యంత్రాల్లాంటివారు. వారిని చదువుకొన్నవాళ్ళనడం పొరపాటు. చదువును మరచిపోయినవాళ్లనడం మంచిది. కాని నౌకరీచేసేవాళ్లందరూ ఇల్లాగే ఉండరు. తన ఉద్యోగ ధర్మాన్ని గుర్తించి, నీతి నియమాలకు కట్టుబడి, ప్రజల శ్రేయస్సుకోసం పాటుబడేవారు నూటికొక్కడైనా లేకపోలేదు." అని యింకా నేను చెప్పబోతుండగా "అలాంటోడికి కూ డేదండీ?" అన్నాడు జగ్గయ్య. "నిజమే, అలాంటి వాళ్లకి కడుపు నిండే పరిస్థితులు యింకా యేర్పడలేదు మన దేశంలో. సరే, దానిమాట అటుంచు. అని నీతిగా ప్రవర్తించే ఆఫీసర్లు, గుమాస్తాలు, డాక్టర్లు, లాయర్లు మొదలైనవారిని మాత్రమే నువ్వు యెరుగుదువనుకొంటాను. వీరుగాక చదువుకొన్నవా రెందరో ఉన్నారు యెరుగుదువా?" అన్నాను. "ఇంకేమున్నారండి" అన్నాడు అమాయకంగా: "నువ్వు అప్పుడప్పుడు పురాణం వింటూంటావు. ఆ రామాయణం భారతం, భాగవతం వ్రాసినవారు చదువుకొన్నవారేనంటావా?" "సదుంకోపోతే అంత గొప్పగా రాయగల్గురాండి?" "మీ ఇంట్లో పటా లేమైనా ఉన్నాయా?" "లేకేమండి" "అందులో నీ కళ్లకి అందంగా కనుపించి నీకు ఆనందాన్ని కలుగజేసే పటాలేమైనా ఉన్నాయా? "లేకేమండి, ఆ మధ్య నేను కాకినాడెళ్లినప్పుడు పటాల దుకాణంలో గోడమీద మురళీ కృష్ణుడు, ఆంజనేయులోరి పటాల్ని సూచి రోడ్డుమీద పోతూన్నవాణ్ణి అట్టే ఆగిపోయాను. దుకాణంమీద కళ్ళు వెంట నే కొన్నానండి" "అయితే ఆ పటాలు రాసినవోళ్ళు చదువుకొన్నవారేనా?" "ఆ రాసినోళ్లు బియ్యేలు సదుంకొన్నారంటారా?" "లేదు. బి. ఏ. చదువుకొన్నవాళ్ళు మాత్రమే చదువుకొన్నవాళ్ళనుకోకు. మంచి మంచి కథలూ, నాటకాలూ, నవలలూ, కావ్యాలూ, వ్రాసేవారు, కన్నులవిందుగా బొమ్మలు వేసేవారు, చెవులకింపుగా పాడేవారు ఆయా విషయాల్లో చదువుకొన్న వాళ్ళే. హైస్కూల్లో చదువు సామాన్యజ్ఞానం కలుగజేస్తుంది. తరువాత ఎవనికి యే విద్యలో అభిరుచి ఉంటుందో ఆ విద్య నేర్చుకోవాలి. అందులో ప్రవీణత సంపాదిస్తే ప్రజలు వానిని మెచ్చుకొంటారు. వాని విద్యకు ఆనందిస్తారు. అనేకమంది వాని విద్యవల్ల జ్ఞానమూ, లాభమూ, ఆనందమూ పొందుతారు. భగవంతుడు అటువంటి వానిని మెచ్చుకొంటాడు. ఇహమందు, పరమందు వాడు ఆనందం పొందగలుగుతాడు. మీ కుర్రవాడు చదువుకొని నౌకరీయే యెందుకు చెయ్యాలి? ఏదో విద్యలో ప్రవీణుడై మీ వంశానికి కీర్తి సంపాదించగలడేమో! మీలో ఎవరికీ చదువు లేనేలేదు. ఉత్సాహమూ, తెలివీ ఉంది గనుక వాడికైనా చదివించడం మీకు ధర్మం. చదువో, చదువో అని యేడ్చేవాణ్ణి పశువులను కాయమనడం చాలా అన్యాయం' అని జగయ్య ముఖంలోకి చూచాను. నా ఉపన్యాసం నిష్ఫలం కాలేదు. చాలవరకు జగ్గయ్య మనస్సును మార్చింది. "ఏదో స్కూలు ఫైనలువరకూ అయితే డబ్బు పెట్టగలమనుకోండి. ఆ తరువాత వందలు కావాలంటే ఎక్కడినుంచి తేగలమండి డబ్బు" అన్నాడు. "ముందు అంతవరకూ చదివించు. ఆ తరువాతి వాడితోవ వాడే చూచుకొంటాడు. చదువులో మొదటివాడుగా ఉంటే గవర్నమెంటే యిస్తుంది వాడి చదువుకి డబ్బు." "అలాగాండి? మీ రెందుకు సెప్పారో, వచ్చేయేడు మీ స్కూల్లో చేరిపిద్దాం లెండి, కాలెంత కనిపెట్టి

చూస్తోండాలి మీరు" "అలాగే, వచ్చే వేసంగుల్లో శెలవుల్లో నా దగ్గరకు పంపిస్తాను. ఇంగ్లీషు, లెక్కలు చెప్పి సెకండు ఫారంలో చేర్పిస్తాను." "చిత్తం, అలాగేనండి" అన్నాడు. మిగిలిన పెద్ద మనుషులు 'తెలివైనవాడైతే తప్పకుండా చెప్పించవలసిందే చదువు' అని ఒకరూ, 'ఈ రోజుల్లో చదువు తప్పకుండా ఉండవలసిందేన మాష్టారూ' అని ఒకరు తలొకరీతిగా నిర్ణయాన్ని బలపరిచారు.

*　　　*　　　*

ఆ తరువాత వేసంగుల్లో రెండు నెలలూ సుబ్బారావు నా దగ్గరకి వచ్చేశాడు. స్కూలు తెరిచాక వాణ్ణి సెకండు ఫారంలో చేర్పించాను. ఆ తరువాత కూడా వాడు రోజూ ఉదయమూ, రాత్రీ రావడం, బళ్లోకి కావలసిన విషయాలు నేర్చుకొంటూ ఉండడం జరుగుతోంది. సెకండు ఫారంలోనూ, థర్డు ఫారంలోనూ ఫస్టు మార్కులు వాడివే. నేను హెడ్ మాస్టరు గారితో చెప్పి, గవర్నమెంటు స్కాలర్ షిప్పుకు దరఖాస్తు పెట్టించాను. స్కాలర్ షిప్పు యిస్తున్నారు. తరువాత ఒకనాడు ఉదయం, సుబ్బారావు రోజూకంటె ఆలస్యంగా వచ్చాడు. రోజూ ఉండే ఉత్సాహం వాడిలో లేదు. ముఖం వివర్ణంగా వుంది. వచ్చి అరుగు మీద కూర్చుని మాట్లాడకుండా పుస్తకంలోని కాగితాలు తిరగేస్తున్నాడు. "ఏమిరా, అలా వున్నావేం?" అని ప్రశ్నించాను. పొంగివచ్చే దుఃఖాన్ని దిగమ్రింగుతూ "ఏం లేదండి" అన్నాడు. "ఏమీ లేదంటావేమిటి, వంట్లో బాగాలేదా?" "బాగానే ఉందండి" "అయితే అలా యేడుపు ముఖం పెట్టావెందుకు? ఇంటి దగ్గిర దెబ్బలు తిన్నావా?" వాడు మాట్లాడలేదు. తల వొంచుకొని కూర్చున్నాడు. "చెప్పు మరి, యేం జరిగిందేమిటి?" అని మళ్ళీ ప్రశ్నించాను. "మా బాబూ, పెద్దన్నా తిట్టారండి. మా పెద్దన్న కొట్టాడు కూడానండి." "ఎందుకు?" "మాష్టారుకి ట్యూషన్ ఫీజు యిమ్మన్నానండి" "ఎందుకడిగావ్? నేను నిన్ను అడగమన్నానా?" "లేదండి, నేనే అడిగానండి" "నేను చెప్పనిదే ఎందుకడిగావురా? ఊఁ, అడిగితే యేమన్నారు?" "మీ మేష్టరు అడగమన్నారా? అన్నారండి లేదన్నానండి. అయితే డబ్బు యెక్కడపడి మూలుగుతోందనుకొన్నావా! అని బూతులు తిట్టి మా పెద్దన్న కొట్టాడండి. ఇంతోటి యెదవ చదువుకి ట్యూషను ఫీజు కూడానా, మా పెంయ్ ఆయనదగ్గరి కొళ్ళెం అని మా బాబు తిట్టాడండి." "సరే, యింకెప్పుడూ ట్యూషను ఫీజు కావాలని అడక్కు." "మరి గోపాలం, వెంకట్రావూ యిస్తున్నారు కాదండీ" "వాళ్ళ పెద్దవాళ్ళకు చదివించాలని ఉంది కనక డబ్బిచ్చి చదివిస్తున్నారు. మీ వాళ్ళకు నువ్వు చదవడమే యిష్టం లేనప్పుడు చదువు కోసం డబ్బెలాగ యిస్తారు?" "మరెలాగండి?" అన్నాడు తలవంచుకొని కళ్ళనీళ్లు తుడుచుకొంటూ. వాని అమాయకమైన ప్రశ్నకు నాకు జాలి కలిగింది. "ఏమీ లేదు, నువ్వు వచ్చి చదువుకొంటూ వుండడమే. చదువుకొనే వాళ్లంతా డబ్బు యివ్వగలరా? కొంత మందికి మేము ఉచితంగా కూడా చెబుతూండాలి. ఇవ్వటం పుచ్చుకోవటం గొడవ నీకెందుకు? నువ్వు వచ్చి చదువుకొంటూ వుండు" అని మందలించాను.

*　　　*　　　*

మరి రెండు రోజులు గడిచాక సుబ్బారావు తన వాడుక ప్రకారం తెల్లవారేముందు లేచి యింటికి వెళ్ళాడు. మళ్ళీ యేడుగంటలకి వచ్చాడు. వాడు చెయ్యవలసిన లెక్కలు తెలియజెబుతూ నేను అరుగు మీద కూర్చున్నాను. మా రాధ "ఒకసారి లోపలికి రండి"—అని పిలిచింది. నేను వీధి గుమ్మం దగ్గరకు వెళ్ళి 'ఏం?' అన్నాను. "బియ్యం మాటేమిటి? మొన్నా నిన్నా అప్పు చేశాను." అంది. "ఈ పూటకి కూడా ఎక్కడో తెప్పించు. సాయంకాలానికి ఎక్కడో తెస్తాను డబ్బు. ఇంకా వారానికి గాని రావు జీతాలు" అన్నాను. రాధ లోపలికి వెళ్ళిపోయింది. లెక్క సగం సగం చెబుతూ లేచి వచ్చాననే సంగతి మరచి అరుగుమీద పచార్లు చేస్తున్నాను. మా రాబడి గోచీకి ఎక్కువ గోశాకి తక్కువ లాంటిది. పూర్తిగా చావనియ్యదు, పూర్తిగా బ్రతకనివ్వదు. నెలకు అరవై ఒక్క రూపాయికి అణా తక్కువగా కడిగి చేతిలో పెడతారు. సంవత్సరం చివరి భాగంలో రెండుమూడు నెలలు ట్యూషన్లవల్ల నెలకు యిరవయ్యో పాతికో వస్తాయి. జీతం వచ్చిన రెండో రోజునుండీ ఒక రూపాయ మొదలు పది రూపాయల వరకూ అప్పులు చేస్తూ కాలక్షేపం చెయ్యడం మళ్ళీ జీతం రాగానే అప్పులు తీరుస్తూండడం పరిపాటి. ఈ రోజున చేబదులు ఎవరిని అడగడమా అనే ఆలోచనతో కొంతసేపు అరుగుమీద పచారు చేశాను. ఆలో

చనకు అంతు దొరకలేదు. ఇంతలో నా దగ్గర చదువుకొనే పుత్రాడు గోపాలం గుమ్మంలోకి వచ్చాడు. వాడి ట్యూషన్ ఫీజుకోసం వాళ్ళ నాన్నగారి దగ్గరకు పంపిద్దామనే ఆలోచన కలిగింది. కాని ఇంకా వారం గడిస్తేనే గాని నెల పూర్తికాదు. అయినా తప్పదు అనుకొని "గోపాలం! మీ నాన్నగారి దగ్గరకు వెళ్ళి నేనిమ్మన్నానని ట్యూషనుఫీజు తీసుకోనిరా, కొంచెం అవసరం ఉండి ముందుగా అడిగానని చెప్పు మీ నాన్నగారితో" అన్నాను. వాడు తలూపి పుస్తకాలు అరుగుమీద పెట్టి ఇంటికి వెళ్లాడు. ఇప్పటికి సుబ్బారావుకి లెక్క చెప్పాలని జ్ఞాపకం వచ్చింది. వాడు ఇంతసేపూ మాట్లాడకుండా నా వ్యవహారమంతా కనిపెడుతూ కూర్చున్నాడు కాబోలు. నేను యథాస్థానంలో కూర్చుని లెక్క చెబుతున్నాను. వాడు తలూపుతున్నాడే గాని నే చెప్పేది వింటున్నట్లు తోచలేదు. 'ఏంరా, అయిదుగురు మనుష్యులకు ఇరవై రోజులకు సరిపడే బియ్యమున్నాయి. అదే బియ్యం పదిమంది తింటే ఎన్ని రోజులకు వస్తాయి? రోజులు తగ్గుతాయా పెరుగుతాయా?" అని అడిగాను. నేను వేసిన ప్రశ్న వాడు వినలేదు కాబోలు, నా ప్రశ్నకు జవాబు చెప్పకుండా 'అయ్యా' అని ఊ కొట్టేడు. "అదేమిరా, నా ప్రశ్నకు సమాధానం చెప్పకుండా ఊ కొడుతున్నావేమిటి?" అన్నాను. "ఏమిటండీ?" అన్నాడు. "నీ తలకాయ" అని చిరాకు పడి మళ్లీ ప్రశ్న వేశాను. "రోజులు తగ్గుతాయని జవాబు చెప్పాడు. లెక్క పూర్తిగా చెప్పి చెయ్యమన్నాను. తప్పుచేసి చూపించాడు. నాకు ఆశ్చర్యం కలిగింది. నేను బోధించిన విషయం వాడు తప్పుచేసి చూపడం ఇది మొదటిసారి. మళ్ళీ బోధించిన తరువాత లెక్క సరిగా చేశాడు. ఇంతలో గోపాలంవచ్చి "రేపు ఇస్తానన్నారండి" అన్నాడు. "ఊహూఁ" అని ఒక బల్లని నిట్టూర్పు విడిచాను. ఇలాంటి ఆశాభంగాలు నాకు బాగా అలవాటే.

* * *

ఆ రోజున నేను ఇంటికి వచ్చేటప్పటికి బాగా చీకటిపడింది. అప్పటికప్పుడే సుబ్బారావువచ్చి అరుగుమీద కూర్చుని చదువుకొంటున్నాడు. నేను కాళ్ళూ చేతులూ కడుక్కొని గదిలో బట్టలు మార్చుకొంటున్నాను. ఎదురుగా మంచంమీద ఏదో కాగితంలా కనుపించింది. తీసి చూశాను. ఆశ్చర్యం కలిగింది. అది పదిరూపాయల నోటు. 'రాధా' అని పిలిచాను. గది గుమ్మంవరకూ వచ్చినరాధ "అదేమిటి, ఎక్కడ పుట్టించుకొచ్చారేమిటి డబ్బు?" అంది. "ఎక్కడా పుట్టక వాజముఖం వేసుకొని నేనొస్తే! ఇదెలా వచ్చింది మంచంమీదికి? నువ్వు పడేయ్య లేదూ?" "నేను అక్కడెందుకు పడేస్తాను? అయినా పది రూపాయలు నా కెక్కడనుంచి వచ్చాయి?" అంది. కొంతసేపు మౌనంగా యిద్దరం ఆలోచిస్తూ నిలబడ్డాం. "గోపాలంగాని వచ్చాడా?" అన్నాను. "అబ్బే, రాంలే! నేను దానిమీద పక్క దులిపి వేసి ఒక అరగంట అయింది. ఈలోగా సుబ్బారావూ మీరూ తప్ప యింకెవరూ రాలేదు" అంది రాధ. ఈ మాటతో ఇది సుబ్బారావు చేసినపనే అని నాకు దృఢపడసాగింది. నెమ్మదిగా వీధి అరుగుమీదకు వెళ్ళాను. సుబ్బారావు తల వాల్చుకొని లాంతరు ముందు కూర్చున్నాడు. పుస్తకంలో పేజీలు తిరగేస్తున్నాడు. "సుబ్బారావూ, గోపాలం వచ్చాడా?" అన్నాను. "లేదండి" అని తల ఎత్తకుండానే జవాబు చెప్పాడు. పేజీలు యిటూ అటూ తొందరగా తిరగేస్తున్నాడు. "ఈ పది రూపాయలనోటు నువ్వు పడేశావా మంచంమీద" "ఏటండీ?" అని ఒకసారి తలెత్తి మళ్లీ వాల్చాడు. "పరవాలేదులే, కంగారు పడకు. ఎక్కడిది నీకీనోటు?" "లేదండి, లేదండి నేను కాదండి" అని కంగారుగా అన్నాడు. "ఒరేయ్, ఇలా చూడు, నువ్వు ఇంతవరకూ ఎప్పుడైనా అబద్ధమాడావా? ఈ రోజుతో నీమీద నాకుండే నమ్మకం, అభిమానం, ప్రేమా, అన్నీ పోతాయి తెలుసా? నువ్వు అబద్ధమాడావంటే నన్ను మోసగించావన్నమాట నన్ను ఎప్పుడైతే మోసగించడానికి సిద్ధపడ్డావో అప్పుడింక ప్రపంచంలో ప్రతివాణ్ణీ మోసగించగలవు. మోసగించి చేసేపనులేమిటో తెలుసా?— దొంగతనం, లంచగొండితనం, జూదం, వ్యభిచారం, ఇవన్నీ మోసంమీద ఆధారపడి జరుగుతూంటాయి. నువ్వు మామూలుగా మా యింటికి రావలనుకొంటే యథార్థం చెప్పు. లేదా యీ నిమిషంలో నే నువ్వు మా అరుగు వదలిపెట్టవలసివస్తుంది." అని కొంచెం తీవ్రంగా అన్నాను. వాడు బిక్కముఖం వేసి "నేనే నండి" అన్నాడు. "అయితే ఎక్కడి

నుంచి తెచ్చావ్?" "మా బాబు పెట్టెలోదండి" "అంటే యెవరికీ తెలీకుండా దొంగతనంగా తెచ్చావన్న మాట!" అని గద్దించాను. వాడు మాట్లాడలేదు. తలవొంచుకొని కళ్లు తుడుచుకొంటున్నాడు. "సరే అయిందేదో అయింది. తెల్లవారు ఝామున ఈనోటు తీసుకెళ్ళి ఎక్కడనుంచి తీశావో అక్కడే జాగ్రత్తగా పెట్టు. ఇంక ముందెప్పుడైనా ఇలాంటిపని చేశావా, మా గుమ్మం ఎక్కనివ్వను, జాగ్రత్త!" అని మందలించి లోపలికి భోజనానికి వెళ్లాను.

మరునాడు వెల్తురు రాకుండా సుబ్బారావు పది రూపాయల నోటు తీసుకొని వెళ్లాడు. కాని ఆ రోజున మళ్లీ మా యింటికీ రాలేదు, బడికీ రాలేదు. వాళ్ల యింటికి సమీపంలో ఉండే పిల్లవాడొకడు మా క్లాసులో చదువుతున్నాడు. "సుబ్బారావు రాలేదేం చేత?" అని వానినడిగాను. "పెట్లో డబ్బు తీశాట్టండి, వాళ్ల బాబు చావకొట్టేశాడండి. ఏడుస్తూ కూర్చున్నాడండి." అని చెప్పాడు. నా మనస్సు పరిపరివిధాల పోయింది. నేనే ప్రేరేపించి డబ్బు దొంగతనంగా తెప్పించానని వాళ్లు అపోహపడితే? నా బ్రతుకు నవ్వులపాలౌతుంది. ప్రతీవాడూ వేలెట్టి చూపిస్తాడు నన్ను. ఆ రోజున క్లాసుల్లో పాఠాలు చెప్పకుండానే కాలక్షేపం చేశాను. బడి వదలగానే యింటికి వచ్చి కుర్చీలో కూలబడ్డాను. రాధ "ఏమిటి, అలా ఉన్నారేం? వంట్లో బాగాలేదా?" అని అడిగింది. సుబ్బారావు సంగతంతా చెప్పాను. "ఓస్, యింతేనా! మనం వాణ్ణి డబ్బు తెమ్మంటేగా, భయపడ్డం బాధపడ్డమూను? ఇదేమిటండీ, ప్రతీ చిన్న విషయానికీ తలగట్టుకుని కూర్చుంటారు?" అని సాగదీసింది ఎగతాళిగా. ఇంతలో "మేష్టారూ!" అని వీధిలో కేక. నా గుండెలు దడదడలాడాయి.

అది జగ్గయ్యగొంతుక. మా రాధ వెంటనే వీధిలోకి నడిచింది. జగ్గయ్య మా అత్తవారింటికి ఎదురింటి వాడవడం చేత, తరచు మావాళ్ల అరుగుమీద కూర్చుంటూ వుండడంవల్ల మా రాధకు చిన్నప్పటినుండీ అతని దగ్గర చనువు యెక్కువ. "ఏం బాబా, ఇలావచ్చావ్" అంది. "మేష్టారేరి రాధమ్మా?" అన్నాడు బిగ్గరగా. అంతవరకూ బయటకు వెళ్ళడమూ మానడమూ అని సందేహిస్తూ వాకిట కుర్చీలో కూర్చున్న నేను శ్వాసగట్టిగా గిలా గొంతుక సవరించుకొంటూ వీధి గుమ్మంలోకి వెళ్లాను. "ఏమయ్యా! మీరింతవరకూ పెద్దమనిషి వనుకొన్నాను. ఇదేం పనయ్యా, కుర్రాడిచేత దొంగతనంగా డబ్బు తెప్పిస్తావా?" అన్నాడు జగ్గయ్య. ఈ మాటలు వినేటప్పటికి నాకు కోపమూ ఆవేశమూ కలిగి శరీరమంతా కంపించింది. వాటి వెనువెంటనే దుఃఖం పొంగివచ్చింది. అన్నింటినీ అణచుకొని "ఎంత మాటన్నావు జగ్గయ్యా, నన్నెరగవూ నువ్వు?" అన్నాను. "ఎరక్కేం బాబూ! ఇప్పటికి బాగా తెలుసుకొన్నాను. మెత్తగా తియ్యగా మాట్లాడే వాళ్ళే కొంపతీసేత్తారు." వాడి ఆవేశం తీవ్రమయి నోటమాట రావడంలేదు. కాని మా రాధ నాఅంత చేతగానిది కాదు. "కారణం లేకుండా నిందమోపడం చాలా దుర్మార్గం. విషయం పూర్తిగా తెలుసుకోకుండా నీ నోటికి వచ్చినట్లల్లా మాట్లాడుతున్నావు. మీ కుర్రాడు నీతో యేం చెప్పాడు? మేం డబ్బు తెమ్మన్నామని చెప్పాడా?" అని ధీమాగా అడిగింది రాధ. "ఇంకేం చెప్పాలమ్మా, మాష్టారుకోసం తీశానని చెప్తేను?" అని గర్జించాడు. "మాష్టారుకోసం తీశానని వాడు చెప్తే మేష్టారు తెమ్మన్నారని అర్థం చేసుకొన్నావన్నమాట" అంది రాధ. "ఈయన చెప్పకపోతే ఆడెందుకు తెత్తాడు?" అని స్వరం తగ్గించాడు. మనస్సు ఆలోచనలో పడ్డం చేత కాబోలు. మనిషిలో ఉద్రేకం తగ్గింది. "నీ యిష్టంవచ్చినట్లు ఊహించుకొని మామీదకు జగడానికి రావడం చాలా పొరపాటు. వెళ్ళి వాణ్ణి వివరంగా అడుగు తెలుస్తుంది" అన్నాను నేను ప్రయత్నంతో. "వాడు డబ్బుతీసినట్లు ఎప్పుడు తెలిసింది నీకు?" అంది రాధ. "ఎప్పుడు తెలియడమేంటి, రాత్రే తెల్సింది. కూలోళ్లకి డబ్బు యిద్దామని పెట్టి తెరిత్తినగా, పెట్టి గల్లంతుగా ఉంది. అనుమానం కలిగి డబ్బు లెక్కెట్టుకొంటే పదిరూపాయలు తక్కువొచ్చాయి. పొద్దున్నే ఈడునవరి అడిగితే తెల్లమొగం పెట్టి నోటు చేతికిచ్చాడు" అన్నాడు. "అయితే రాత్రి నేను తెప్పించుకొన్న డబ్బు వాడు మళ్ళీ ఇంటికి యెందుకు పట్టుకొచ్చాడు?" అన్నాను నేను.

"యేమో! యెందుకు తీశావురా అంటే, మేష్టారికోసం అన్నాడు. నోటు పుచ్చుకొని యెదవని పావగొట్టి చెవులు మూశాను" అన్నాడు మెత్తబడి. "మంచిపని చేశావ్! వాడు యెందుకు తీశాడో,

ఏం చేశాడో, మాస్టారికోసం తీసుకెళ్ళిన డబ్బు మళ్ళీ యెందుకు తెచ్చాడో తెలుసుకోకుండా వాణ్ణి చావగొట్టి నా మీదికి యుద్ధానికి వచ్చావా? వాణ్ణి బళ్లో జేరిపించి, గవర్నమెంటు స్కాలర్‌షిప్పు యిప్పించి మూడేళ్ళనుంచి వాడివల్ల కానీ ఆశించకుండా చదువు చెబుతూన్నందుకు మంచి ప్రతిఫలం ముట్టజెప్పావు? చాలు, చాలు, ఉపకారానికి పోతే అపకారం యెదురుగా వస్తుంది." అని కఠోరంగానూ నిష్ఠూరంగానూ అని రాధ చరచరా లోపలికి పోయింది. ఏమనుకున్నాడో యింక జగ్గయ్య మాట్లాడలేదు. "మేం చెబితే నీకు నమ్మకం కలగడం కష్టం, వెళ్ళి నెమ్మదిగా వాణ్ణే అడుగు సమస్తం చెప్తాడు" అన్నాను. మరి మాట్లాడకుండా చివాలున లేచి వెళ్ళిపోయాడు జగ్గయ్య.

* * *

ఆ మరునాడు ఉదయమే నేను వీధి గుమ్మంలోకి వచ్చేటప్పటికి పుస్తకం చేతిలో పట్టుకొని అరుగు మీద కూర్చున్నాడు సుబ్బారావు. "ఏమిరా, ఇంత రభస జరిగినా ఇంకా నన్ను వదలిపెట్టవా?" అన్నాను యథాలాపంగా. వాడు మాట్లాడలేదు. "మీ బాబుతో చెప్పి వచ్చావా?" "మా బాబే వెళ్ళమన్నాడండి" "నువ్వు మీ బాబుతో యేమని చెప్పావ్?" "ఏమీ చెప్పలేదండి. పెట్టిలో డబ్బు తీశావా అని అడిగాడండి. జేబులోంచి నోటుతీసి యిచ్చానండి. ఎందుకు తీశావని తిట్టాడండి. మేస్టారు డబ్బుకి చాలా యిబ్బంది పడుతున్నారు, వారికి యివ్వాలని తీశానన్నానండి. అంతేనండి. తిట్టి కొట్టేడండి." "నేను తెమ్మన్నానని చెప్పలేదూ?" "లేదండి, లేదండి," అన్నాడు బిక్క మొహంతో. "నిన్న సాయంత్రం మళ్ళీ నిన్ను యేమని అడిగారు?" "మీ మేష్టారు డబ్బు తెమ్మనలేదా?" అన్నాడండి. లేదని చెప్పానండి. అయితే యెందుకు పట్టుకెళ్లావ్? అన్నాడండి. ఆయన ఇబ్బందిపడుతున్నారు. అంచేత ఇద్దామని పట్టుకెళ్లాను అని చెప్పానండి. నాతో యెందుకు చెప్పలేదన్నాడండి. చెబితే తియ్యనివ్వవని చెప్పలేదు అన్నానండి. నాకు తెలియకుండా, ఇంట్లోది యేదైనా తీశావంటే తన్ని పాతరేస్తానన్నాడండి." అన్నాడు. వాడు చెప్పే విధానం చూస్తే నాకు నవ్వొచ్చింది. అమాయకమైన వాడి మాటలకు జాలికలిగింది. "మా యింటికి వెళ్ళవద్దని చెప్పలేదూ మీ బాబు?" అని అడిగాను. "లేదండి, పొద్దున్నే మాస్టారు దగ్గరకి వెళతానన్నానండి." సరే, యెళ్లు, యెందువల్లనైనా చెయ్యక జాగ్రత్తగా ఉండు, లేకపోతే చదువు మానిపించి దూళ్లు కాడ పెడతాను అన్నాడండి" అని హావభావాలు వెల్లడిస్తో చెప్పాడు. తను నిన్న సంగతీ చూచిన సంగతీ సంభాషణ క్రమంతో తు చ తప్పకుండా విడిచిపెట్టకుండా అమాయకంగా చెప్తాడు సుబ్బారావు. వాని అమాయకత్వానికీ, నామీద వానికుండే భక్తి శ్రద్ధలకూ నా మనస్సు కరిగి నీరయింది. నిన్న, జగ్గయ్య అన్న మాటలకు ఇంక వీణ్ణి గుమ్మంలోకి రానివ్వకూడదని నిర్ణయించుకొన్నాను. కాని ఇప్పుడు వాని ముఖం చూడగానే నా నిర్ణయం పట్లు తప్పింది. వాని అమాయకమైన మాటలు వింటూ జగ్గయ్య మాటలు మరచిపోయాను. వాడు దొంగతనంగా డబ్బు తేవడానికి కారణం ఊహించుకొంటే నాకు కళ్లనుండి అశ్రువులు రాలుతున్నాయి. ఇంతలో మా రాధ బయటికి వచ్చింది. "ఏమిరా, పొద్దున్నే సిద్ధమయావ్? ఇంక నువ్వు మా యింటికి రాకు నాయనా. ఈ వచ్చిన నింద, అప్రతిష్ఠ చాలు మాకు అంది. "వాడేం చేశాడే?" అన్నాను నేను ఊరుకోలేక. "ఇన్ని చివాట్లూ తిని వాడేం చేశాడంటారేమిటి? వాడిమూలాన్నే కాదూ యీ రభసంతా?" అంది రాధ. "వాళ్ళ బాబుని నువ్వు యెరగవా యేమిటి? దూరం ఆలోచించకుండా ముందు ప్రతీ విషయానికీ అగ్గిలా భగ్గుమంటాడు. తరువాత నిజం తెలుసుకొని నీరౌతాడు. అతనిమీద కోపాన్ని, కక్షనూ వీడిమీద చూపిస్తే యెలాగ?" "ఇలా ప్రతీ విషయంలోనూ మెత్తమెత్తగా ఉంటే నెత్తికెక్కుతారు. ఏమీ లేని దరిద్రుడిమీద యీ కనికరం చూపిస్తే, వాడు జన్మాంతం సేవ చేస్తాడు. అయిందేదో అయిపోయింది. ఇంకనైనా వదలుకోండి వీణ్ణి." అని తీక్షణంగా మాట్లాడింది. ఆమె మాట్లాడే ప్రతీ మాటా నా హృదయాన్ని కలచివేస్తోంది ఎంచేతనో. మాటిమాటికీ సుబ్బారావువైపు చూస్తున్నాను. ఆమె మాటలు వినడం కష్టమైపోయింది నాకు. నేను కలవరపాటుతో "ఆఁ, ఆఁ! కట్టిపెట్టు మాటలు. మరేమీ మించిపోయిందిలేదు." అని చిరాకుపడ్డాను. తీర్పు

చెప్పబోయేముందు న్యాయమూర్తి ముఖంకేసి చూస్తున్న ముద్దాయివలె, వాడు మా సంభాషణ పర్యవసానం యేమి తేల్తుందో అని బెదురు చూపులతో చూస్తున్నాడు. ఆమె మాటలకి వాడి లేత హృదయం దుఃఖిస్తుందని నా ఆందోళన. ఆమె ఇంకా మాట్లాడితే దగ్గరకు వెళ్లి చేత్తో నోరు మూసేద్దామనిపించింది నాకు. "సరే మీ ఇష్టం. మీకు లేని అభిమానం ఆత్మగౌరవం నాకెందుకు?" అంటూ లోపలికి వెళ్ళిపోయింది రాధ. ఆమెను సముదాయించడానికి నేనూ లోపలికి వెళ్లాను. "ఇప్పటికే వాడు కుమిలి కుమిలి యేడుస్తున్నాడు. పాపం వాడు చేసిన అపరాధమేమిటి? మనమీద ఉండే భక్తి విశ్వాసాలవల్ల, మనం యిబ్బంది పడుతోంటే చూడలేక డబ్బు యెత్తుకొచ్చాడు. వాణ్ని చూస్తోంటే నీకు గుండె నీరవడం లేదుటే?" అన్నాను. నా మాటలతో ఆమె కొంచెం నిజం తెలుసుకొంటుందనుకొంటాను. "ఔననుకోండి. మరి వాడిమీద జాలిపడి మన పరువూ ప్రతిష్టా పోగొట్టుకొంటామా?" అంది. "జగ్గయ్య నిజం తెలుసుకొన్నాడుగా? మనల్ని అన్నమాటలకు పశ్చాత్తాపపడి ఉంటాడు. అంచేతనే ఉదయాన్నే కుర్రవాణ్ణి చదువుకొందుకు పంపించాడు. ఎవరెన్ని అన్నా, ఎంత అపకీర్తి వచ్చినా వాణ్ణిమాత్రం వదల్లేను రాధా!" అన్నాను ఉద్వేగంతో. ఆమె ఒకసారి నా ముఖంలోకి చూచింది. 'అయ్యో అదేమిటండీ, అలా బాధపడతారు? నేనేం తప్పుగా మాట్లాడలేదే!' అని ఆమె అన్న తరువాత తెలుసుకొన్నాను నా కళ్లు నీళ్లతో నిండాయని. చివాల్న ముఖం తిప్పుకొని గదిలోకి పోయి మంచంమీద వాలాను.

* * *

ఆ రోజున బడికి సెలవైన కారణంచేత యింటి దగ్గరే ఉన్నాను. మధ్యాహ్నం మా మామగారు వచ్చారు. "ఏమిటోయ్, యీ లేనిపోని గొడవ? ఆ కుర్రవెధవకోసం నీ పరువు పోగొట్టుకొంటున్నావు. మళ్లీ యెందుకు రానిచ్చావ్ వాణ్ని?" అని ప్రారంభించారు. "పాపం, వాడేం చేశాడండీ? జగ్గయ్య దూరమాలోచించకుండా తొందరపడ్డాడు. ఇప్పుడు నిజం తెలుసుకొన్నాడులెండి." అన్నాను. "అతడేం తెలుసుకొన్నాడో నాకు తెలియదుగాని, ఊరూ వాడా నువ్వు దొంగతనంగా డబ్బు తెప్పించావని గోలగా ఉంది. ఆ జగ్గయ్య కొడుకులు, పెద్దాడూ రెండోవాడూ నిన్ను నానా మాటలూ అంటూంటే నేను విని ఎలా ఊరుకోగలను? వాళ్లకి యేమైనా మంచీ చెడ్డా విచక్షణ ఉంటేగా? వట్టి పశువులు."

ప్రొద్దుట సుబ్బారావు మా యింటికి రావడంతో గొడవ సమసిపోయిందనుకొన్నాను. కాని యిప్పుడు మామగారు చెప్పే మాటల్ని బట్టి గొడవ యింకా మొదట్లోనే వుంది. ఈయన వాళ్ళతో యేదో ఘర్షణ పడినట్లుకూడా ఈయన మాటలవల్ల వెల్లడవుతోంది. అకారణంగా నిందపాలు కావలసి వస్తోందని మనస్సు బాధపడసాగింది. "జగ్గయ్య యేమన్నాడండి?" అన్నాను. "అతనేమీ మాట్లాడలేదనుకో. కాని వాళ్లు అడ్డమయిన కూతలూ కూస్తోంటే తను బుద్ధి చెప్పొద్దూ?" "అయితే వాళ్లకి జరిగిన యథార్థ విషయం తెలియదన్నమాట?" "నేను గంటసేపు కంఠం చించుకొని వాదించి చెప్పాను. అతనూ చెప్పే వుంటాడు. చెప్పినా అర్థం చేసుకోలేని మూర్ఖులు. అతని మాటమాత్రం వింటారా వాళ్లు?" "నిజం తెలిసీకూడా నన్ను ఎందుకు నిందిస్తున్నారంటారు?" "ఎందుకేమిటి మొరటు వెధవలకి, అసలు వాళ్ళకి వాడు చదువుకోవడం యిష్టంలేదు." ఇప్పటికి విశదమయింది నాకు విషయం. తమ్ముడిమీద వుండే ఈర్ష్య, ద్వేషంచేత, యీ అవకాశాన్ని దొరకపుచ్చుకొని తమ అక్కసు తీర్చుకొంటున్నారని నాకు స్పష్టపడింది. వాడి చదువుకి ప్రోత్సాహమిస్తున్న వాణ్ని నేనేగనుక, వాళ్లకి వాడిమీద వుండే ద్వేషం నామీదకూడా కలగడం సహజం. ఇంతకుముందు చాలాసార్లు వాళ్లు సుబ్బారావుయెడల అన్యాయంగానూ దుర్మార్గంగానూ ప్రవర్తించడం, వాడు నాతో చెప్పుకొని యేడవడంకూడా జరిగింది. వీడు యేడుగురు అన్నదమ్ములలో మధ్యవాడు. వీడి గోడు వినేవాడుగాని, వీని బాధ గ్రహించగలిగే వాడుగాని ఆ కొంపలో లేడు. మాయా మర్మం తెలియని పసివానిమీద వాళ్ళకెందుకో అంత ద్వేషం నాకు అర్థంకాలేదు. తల్లి, తండ్రి, అన్నలు, తమ్ములు ఉండీ తగినంత ఆస్తి ఉన్నవాళ్ల కడుపున బుట్టి వాడు దిక్కుమాలిన కుక్కలాగా చివాట్లూ చెప్పుదెబ్బలూ తింటూ నాబోటి నిర్భాగ్యుని ప్రేమకు ఆదరణకు పాత్రుడు కావలసివచ్చింది. వానిస్థితికి నా హృదయం శతధా భిన్నమౌతోంది.

కాని నామీద వాళ్ళు చేసే దుష్ప్రచారాన్ని అరికట్టడ మెలాగ? బహుశా వాడిని చదువు మానిపిస్తే వాళ్ల యీర్ష్య, ద్వేషం తగ్గవచ్చు. వాళ్లలాగే వీడుకూడా దున్నపోతులా తయారుకావాలి. అప్పుడు వాళ్లమనస్సు కుదుట బడవచ్చు. కాని రాత్రింబగళ్లు చదువుకోసం పరితపిస్తూ ఉండే వాడిచేత చదువు మానిపించడ మెలాగ? ఏమీ తోచలేదు. నాకు ఎదురుగా ఉన్న మామగారినే ప్రశ్నించాను — "అయితే, ఇప్పుడేం చెయ్యాలి?" అని. ఇంతవరకూ మా ప్రసంగంలో యేమీ కలగజేసుకోకుండా గుమ్మందగ్గర నిలబడ్డ రాధ— "వాడికి చదువు చెప్పడం మానుకోవడం తప్పండీ" అంది. "దానికి పెద్ద ప్రశ్నేముంది? ఇంక నేను చదువు చెప్పను పొమ్మని చెప్పు" అన్నారు మామగారు. ఆ మాట వాడితో చెప్పడం అసంభవ మని నాకు తెలుసు. కానీ నా అంతరంగిక విషయాన్ని తెలియజేస్తే, మామగారు సహించలేరని, నీకు మతిలేదా అని అంటారని కూడా నాకు తెలుసు. అందుచేత ఆయన్ని తృప్తిపరచ డానికి "అలాగే లెండి" అన్నాను. "దీనికింకా సంకోచ మెందుకు! అయ్యో వాడిచ్చే పదిరూపాయిలూ పోతాయన్న బెంగా? పొమ్మను వెధవని" అన్నా డాయన. నేను తలూపాను.

* * *

ఆ రాత్రి, మరుచటిరోజున కూడా సుబ్బారావు మాయింటికి రాలేదు. ఆ మరునాడు స్కూల్లో ముగ్గురు ఉపాధ్యాయులు నా అంతరంగిక మిత్రుల్లాగ చాటుకి పిలిచి "ఏమిటయ్యా, ఇలాంటి గొడవ బయలుదేరింది? ఆ సుబ్బారావు గాడిచేత నువ్వు డబ్బు తెప్పించావను కొంటున్నారేమిటి?" అని నేను అపవాదుకు గురియై నట్టు, తాము దానిని నమ్మక నాకు సానుభూతిని తెలుపుతున్నట్టు మాట్లాడారు. నేను విషయ మేమీ మరుగుపరచకుండా ఉన్నదున్నట్టు వివరించి చెప్పాను. "అంతేలే, మేమూ అలాగే అనుకొన్నాం. మన మెంత నిజాయితీగా ఉన్నా ఒక్కొక్కప్పుడు లేని పోని గొడవలు వచ్చిపడుతూంటాయి" అని యేమేమో నన్ను ఓదారుస్తూన్నట్టు చెప్పారు. కాని వారు మాట్లాడే మాటలకీ వారి ముఖలక్షణాలకీ యేమీ సంబంధం నాకు కనిపించలేదు. వారు చెప్పేమాటలు పెదిమలమీదనుంచి వచ్చినవే కాని హృదయంలోంచి వచ్చినవి కావని నాకు స్పష్టంగా తెలిసింది. వాళ్ళే మనుకొన్నా జరిగిన సంగతి యథార్థంగా చెప్పడం కంటె నేను చెయ్యగలిగిందేమీ లేదు.

ఆ మరునాడు ఉదయం ఎనిమిదిగంటలకు సుబ్బారావు మా యింటికి వచ్చాడు. వాణ్ణిచూడగానే నేను మెల్లగా ఇంట్లోకి వెళ్ళి మా రాధతో "వాడు వచ్చాడు. నువ్వు యేం చెప్పదలచావో చెప్పు" అన్నాను. "ఎవరు, సుబ్బారావా?" అంది. నేను తలూపాను. "నేను చెప్పడ మేమిటండీ? మీరు చెప్పండి" "నేను చెప్పలేను, నువ్వు చెప్పు." "సరే, నేనే చెప్తాను." అని బైటికి వెళ్లింది. "ఓరేయ్! ఇంక మా యింటికి రాకు, ఆయన నీకు చదువు చెప్పరు" అని ఖచ్చితంగా చెప్పింది. ఆమాట వాడి మనస్సుమీద ఎంతగా పనిచేసిందో తెలియదు గాని, నా హృదయానికి శూలంలా తగిలింది. వాడు వెళ్ళలేదు కాబోలు "చెప్పానుగా! వెళ్ళిపో!" అని చెప్పి తలుపు చేరవేసి లోపలికి వచ్చింది. ఒక అర గంటవరకు నేను వసారాలో పచార్లుచేశాను. వాడు వెళ్ళిపోయాడు, వాడి మనస్సు ఎంత బాధపడు తోందో! ఎంతగా యేడుస్తున్నాడో! అని ఊహించు కొంటూ మతి చెడినవానిలా అటు నిటు తిరిగాను. అలా తిరుగుతూ వీధిగుమ్మం తలుపు తెరచాను. హృదయం ఆగినట్లయింది. వాడు వెళ్ళిపోలేదు. క్రింది గుమ్మంలో అరుగును ఆనుకొని తలవంచుకొని నిలబడి ఉన్నాడు. నేను తలుపు తెరవగానే నావైపు చూశాడు. 'సుబ్బారావ్' అని పలకరించాను. వాడి కళ్లనుండి నీరు కారుతోంది. నేను అరుగుమీద పచారు చేయ నారంభించాను. రెండు నిమిషాలు వాడూ నేనూ మాట్లాడలేదు. తరువాత "మీ అన్నలకు నీమీద అంత కోప మెందుకు?" అని ప్రశ్నించాను. "ఏమో నండి ఎప్పుడూ యేదో వంకపెట్టి తిడుతూ కొడుతూ ఉంటారండి."

"మీ బాబూ అమ్మ యేమీ అనరా?" "వాళ్ల యెదుట యేమీ తిట్టరండి. నేను ఇక్కడికి వచ్చే టప్పుడో వెళ్లేటప్పుడో మా పొలందగ్గర కనిపిస్తారండి. పొలానికి రాలేదనో, అన్నం తేలేదనో, గేదెను తోలుకొని రాలేదనో తిడతారండి. ఇంకా కోపం వస్తే కొడతారండి." "వాళ్లు కొట్టారని మీ బాబుతో చెప్పవూ?" "గట్టిగా కొట్టినప్పుడు చెబుతానండి. నే నడుగుతాన్లే అంటాడండి మా బాబు. అడిగితే, వాళ్లు నేనేదో తప్పుచేశా నంటారండి. మా అమ్మ

వాళ్లెందుకురా అలా కొట్టుకుంటారు అని అంటుం దండి. 'నీకు తెలియదూరుకో నే ఈడి చదువుమూలాన పొగరెక్కి పోయాడు. ఇక్కడి సీపురిపుల్ల అక్కడ పెట్టమంటే పెట్టడు' అంటారండి. మా అమ్మా బాబూ వాళ్ళమాటలే నమ్ముతారండి". "పోనీ వాళ్ళు చెప్పిన పని కాస్తో కూస్తో చెయ్యకూడదూ?" "పని చేస్తే బడీ చదువూ పోదండీ? అయినా సెలవురోజున ఓ పూట పొలంలోనే ఉంటానండి. ఆ పూటల్లా పని సరిగా చెయ్యలేదని యెవడో ఒకడు తిడుతూంటాడండి."

"ఎవళ్లకీ యిష్టం లేనప్పుడు చదువు మానేసి ఆ పొలం పనులు చేసుకోకూడదూ?" "నాకు పొలం పని చెయ్యాలనుంటే యేడుపొస్తుందండి. రాత్రికి కాళ్ళూ చేతులూ లాగుతాయండి." "మరి యెన్నాళ్లని ఇలా బాధలు పడుతూ చదువుతావ్? నా మాట విని నువ్వు చదువు మానేస్తే నువ్వూ నేనూ కూడా సుఖపడతాం."

మీరేనా యీ మాటలంటూన్నది అన్నట్లుగా వాడొకసారి నా ముఖంలోకి చూచాడు. వాని చూపును తట్టుకోలేక ముఖం తిప్పుకొని పచారు చేయసాగాను. "వాళ్లు చంపినా చదువు మాననండి" అన్నాడు. నేను నివ్వెరపోయాను. అంత దుర్బలమైన శరీరంలో ఎంత నిబ్బరమైన గుండె ఉందా! అని. "నీ చదువుకి కారణం నేనే అని వాళ్లకి నామీద కోపం. అంచేత వాళ్ళు నామీద దుష్ప్రచారం చేస్తున్నారు. నేను నీచేత దొంగతనంగా రూపాయలు తెప్పించావని ఊరూ వాడా చెబుతున్నారు. నన్ను తిడుతున్నారుట కూడాను. అటువంటప్పుడు నువ్వు రోజూ మా ఇంటికి వస్తూండడం చదువుతూండడం జరుగుతూంటే నా పరపతి పోయి చివరికి ఉద్యోగం కూడా ఊడుతుంది." అని నా అంతరాత్మ నిరాకరిస్తూన్నా తప్పనిసరిగా చెప్పాను. ఈ మాటలు చెప్పేటప్పుడు నేను వాని ముఖం చూడలేదు. సంఘంలో నా గౌరవాన్ని లక్ష్యంలో పెట్టుకొని మాట్లాడాను. నా మాటలకు వాడు నిరుత్తరుడయాడు. ఇంతలో మా రాధ వచ్చి 'ఏమిరా వెళ్ళలేదూ?' అని 'తొమ్మిదిదాటుతోంది, మీరు స్నానం చెయ్యండి' అని చెప్పి లోపలికి వెళ్లింది. నేను నెమ్మదిగా లోపలికి వెళ్లాను. స్నానం భోజనం చేసి బట్టలు వేసుకొని బడికి బయలుదేరాను. సుబ్బారావు అక్కడే ఆ మెట్టుమీదనే నిలబడి ఉన్నాడు. "వేళయింది, బడికి పదు" అని నేను బయలుదేరాను. వాడు నా వెనువెనుకనే వచ్చాడు.

* * *

ఆ మరునాటి నుండి సుబ్బారావు నాదగ్గరకు చదువుకోవడానికి రావడం మానేశాడు. కాని ప్రతి రోజూ నేను బడికి వెళ్లేముందు వచ్చి గుమ్మంలో నిలబడేవాడు. నేను బడికి బయలుదేరగానే నా వెనుకనే వచ్చేవాడు. మళ్ళీ బడి విడిచిపెట్టిన తరువాత నేను యింటికి బయలుదేరేవరకూ యెక్కడో కనిపెట్టుకొని ఉండేవాడు. నేను ఇంటికి బయలుదేరగానే నా వెనుకనే మా యింటివరకూ వచ్చి నేను యింట్లోకి వెళ్ళాక తను యింటికి వెళ్ళేవాడు. మధ్య త్రోవలో ఎప్పుడైనా నేను ఎవరితోనైనా మాట్లాడుతూ నిలబడితే తను పది గజాల దూరంలో యేదో వేరేపని ఉన్నవాడిలా నిలబడేవాడు. ఒక్కొక్కప్పుడు బడి విడిచిన తరువాత అర గంట, గంటా కూడా నేను బడిలో ఆగేవాణ్ణి. ఇంతసేపూ ఎక్కడ ఉండేవాడో కాని నేను బయలుదేరగానే నా వెంటబడేవాడు. బడికి శెలవైననాడు ఉదయం ఒకసారి మధ్యాహ్నం ఒకసారి మా యింటిముందు వీధిలో పచారుచేసి పోతూండడం నేను చూశాను. "ఏమిరా, ఇలా వచ్చావ్?" అని రెండు మూడు సార్లు పలుకరించాను. "ఏమీ లేదండి" అని తలవంచుకొని వెళ్లిపోయేవాడు. మొదట రెండు మూడు రోజులు వాణ్ణి, ఏమని పలుకరించాలో, వాడితో యేమి మాట్లాడాలో నాకు అర్థం కాలేదు. వాణ్ణి యేమీ పలుకరించకుండానే నెమ్మదిగా బడికో యింటికో నడిచేవాణ్ణి. ఆ తరువాత "బాగా చదువుతున్నావా? ఇవేళ ఇంగ్లీషు యేం చెప్పారు? లెక్కలేం చెప్పారు? మొదలైన ప్రశ్నలు వేసేవాణ్ణి. నేను వేసే ప్రశ్నలకు సమాధానం మాత్రమే యిచ్చేవాడు. అంతకు మించి మాట్లాడ్డానికి వాడికీ నాకూ కూడా విషయాలేమీ లేకుండాపోయాయి. పదిహేను రోజులు యీ విధంగా గడిచాక ఒక రోజున బడికి వెళ్ళేముందు "ఏమిరా, మీ అన్నయ్యలు యిప్పుడు తిట్టడం లేదు గదా?" అన్నాను. "వాళ్లు నన్ను పలకరించడమే లేదండి. నాతో మాట్లాడ్డమే మానేశారండి." అన్నాడు. "ఏం?" అని ప్రశ్నించాను "మీరు చదువు మానెయ్యమన్న రోజున మా బాబుతోనూ అమ్మతోనూ వాళ్లు చేస్తున్నదంతా చెప్పానండి. మాస్టార్ని

అందరి దగ్గరా తీసుకున్నారు. అందుచేత మాస్టారు చదువుకోడానికి రావద్దన్నారు, అని యేడుస్తూ చెప్పానండి. వాళ్లు ఆవేళ రాత్రి మా అన్నయ్యల్ని గట్టిగా తిట్టారండి. ఒరేయ్ నువ్వు చదువుకోవాలంటే బళ్లోకి వెళ్లి చదువుకో. మాస్టారింటికి వెళ్లకు—" అన్నారండి.—మాస్టారేం చేశారు. ఆయనకు నేనంటే యెంతో ప్రేమ. ఆయన నాకు ఉచితంగా చదువు చెబుతున్నారు, అన్నానండి. ఆ యెదవ మెట్ట వేదాంతాలన్నీ కట్టిపెట్టి నేను చెప్పినట్టు చేస్తే చెయ్యి. లేకపోతే నువ్వు బడికి వెళ్లడం కూడా మానెయ్యి--అన్నాడండి మా బాబు." అని చెప్పాడు. "అయితే మీ బాబూ అమ్మా నేను నీ చేత రూపాయలు తెప్పించాలని అనుకొంటున్నారా?" అన్నాను.

"లేదండి. నేను స్పష్టంగా చెప్పేశానుకదండీ మాస్టారు తెమ్మనలేదు, నేనే పట్టుకెళ్లానని!" "అయితే నా దగ్గరకి ఎందుకు వెళ్లొద్దన్నారు." "మీ మామయ్యగారూ మావాళ్ళూ చాలాసేపు పోట్లాడుకొన్నారండి. ఆవేళ మీ మామయ్యగారు మీ కుర్రాడు మావాళ్ళ కమ్మంలోకి వెళ్లి దానికిపిల్లేనన్నారండి. ఆయన పంపమని బతిమాలాన్న పంపమయ్యేయ్ యేమనుకొన్నారో గాని అన్నాడండి మా బాబు. అందుచేత మా బాబు అమ్మ మీ దగ్గరికి వెళ్లవద్దన్నారండి" "అయితే ఆమర్నాడు పొద్దుటే వచ్చావెందుకు నువ్వు?" "మా వాళ్లు చూడకుండా వచ్చేశానండి." అన్నాడు. వాళ్ల వాళ్లు వద్దన్నా వీడు నావద్దకు రావడం మాన్లేదు. మా రాధ పొమ్మన్నా ఆ రోజున వీడు కదల్లేదు. అలాగే నిలబడ్డాడు. నువ్వు చదువు మానేస్తే నువ్వూ నేనూ సుఖపడతాం అని నేనంటే వాళ్లు చంపినా చదువు మాననన్నాడు. ఆ తరువాత, నువ్వు రోజూ మాయింటికి వస్తుండడం, చదువుకోవడం జరుగుతూంటే నా పరపతి పోయి చివరికి నా ఉద్యోగం కూడా పోతుంది అన్నాను. ఇంక వాడు మాట్లాడలేదు. తరువాత చదువుకొనేందుకు రాలేదు.

ఇక నేనేమీ ప్రశ్నించలేదు. బడికి బయలు దేరాను. నావెనక నే వాడూ వచ్చాడు.

* * *

ఆరు నెలలు గడిచాయి. ఈ ఆరు నెలల్లోనూ బడి ఉన్నా లేకపోయినా ప్రతిదినం సుబ్బారావు మా యింటికి వస్తూనే వున్నాడు. నన్ను వెంబడిస్తూనే వున్నాడు. అది పంతొమ్మిదివందల యాభైయారో సంవత్సరం ఆగస్టు నెల. గోదావరి గట్లు తెంచుకొని గ్రామాలకీ, పొలాలకీ, కాలవలకీ, చెరువులకీ వుండే భేదాన్ని దూరం చేసింది. అంతా జలమయం. గొయ్యెక్కడో, మెరక్కెక్కడో, చెరువెక్కడో, చేలెక్కడో తెలియడం లేదు. పల్లపు ప్రదేశాలలో వుండే పల్లెలూ, కూడేలూ నీటిలో మునిగిపోయాయి. మా గ్రామం వీధులలో మోకాల్లోతునా తొడలోతునా నీరు ప్రవహిస్తోంది. జాతి, కుల, మత భేదాలు తొలగిపోయాయి. ఊళ్ళో గట్టిగావున్న యిళ్ళూ మెరక మీద వున్న యిళ్ళూ జనంతో కిటకిటలాడుతూ వున్నాయి. బద్ధ వైరాలున్నవాళ్లు, ఒకే పంచలో చేరుకొని కలిసి వండుకొని తింటున్నారు. ఒకే చదరపు గజంలో పడుకొంటున్నారు. ఈ వీధివార్త ఆ వీధికికూడా తెలియడం కష్టమౌతోంది. ఆ పల్లె కొట్టుకుపోయిందనీ, ఈ గ్రామంలో యిళ్లల్లోకి నీరు వచ్చేసిందనీ వదంతులు బయలుదేరాయి. మా యింటి గుమ్మంముందు మూడు మెట్లు మునిగిపోయాయి. ఇంకో అంగుళం నీరువస్తే మాయిల్లు నీటితో నిండుతుంది. వీధి గడపమీద ఒక అంగుళం యెత్తున మట్టితో గోడకట్టాను. ఇంటికి బయట వున్న ద్వారాలన్నీ బిగించి కాలీలన్నీ మట్టితో మర్దించాను. మా రెండు అరుగులమీదనూ రెండు మాల వాళ్ళ కుటుంబాలు చేరాయి. మా అత్తవారి ఊరి సంగతి తెలియలేదు. వాళ్ళేమైపోయారో అని మా రాధ దిక్కుమొహం పెట్టింది. వాళ్లయిల్లు గట్టిది, ఎత్తైనది, వాళ్ళకేమీ పరవాలేదని ధైర్యం చెబుతూ ఉన్నాను. ఇంతలో ఆ ఊరినుండి యిద్దరు వ్యవసాయదార్లు తడిసిన బట్టలతో నీటిని తోసుకొంటూ వీధిలో వెళుతూ నన్ను పేరెట్టి పిలిచి "బాగున్నారా బాబూ? మీ మామయ్యగారు తెలుసుకొని రమ్మన్నారు" అన్నారు. "ఆఁ, బాగానే ఉన్నాం. వారంతా ఎలా ఉన్నారు? మీ ఊళ్లో నీరు ఎంతవరకూ వచ్చింది?" అని అడిగాను. ఇలాగే మోకాల్లోతూ తొడలోతునా వీధుల్లో నీరు పారుతోందండి. "మరి రోడ్డెలాగుంది. మీ రెలా రాగలిగారు?" "రోడ్డుమీద మోకాల్లోతున నీరుందండి" రోడ్డుపక్కనుండే చెట్లూ తుప్పలూ ఆనవాలుగా చూసుకొంటూ వచ్చామండి" "మా మామగారింట్లో కులాసాగా ఉన్నారా?" "అయ్య" అని చెప్పి వాళ్లు

వెళ్ళిపోయాడు. నిన్నా, ఈ వేళా సుబ్బారావు రాలేదు. మధ్యాహ్నం మూడు గంటలౌతుంది. నేను గుమ్మంలో పల నిలబడి ఎదుటికి చూస్తున్నాను. కాలువగట్టు నీటి మీద ఒక అంగుళ మెత్తున కనుపిస్తోంది. మామిడి చెట్టుకు కట్టి ఉన్న బల్లకట్టు స్పష్టంగా కనుపిస్తోంది. ఆ గట్టుకీ మాయింటికీ ఒక ఫర్లాంగు లోపుగా దూరముంటుంది. అదంతా జలమయం. కాలువగట్టు కావల ఎక్కడా గడ్డి పైనా మొలవకుండా ఉన్న పచ్చటి నేలగా కనుపిస్తోంది బురద నీటితో నిండిన పంటప్రదేశం. అక్కడక్కడ చిన్న చిన్న తాడి, ఈత మొదలయిన చెట్ల తలలు కనిపిస్తున్నాయి జలప్రళయమని పురాణాలలో వినడమే గాని చూచినవా డెవడూ లేడు. ఈ నీరు యిలాగే పెరిగిపోతే ప్రళయంగాక మరేమౌతుంది అని మనస్సులో అనుకొంటున్నాను ఇంతలో ఎవడో కుర్రాడు కాలువకి అవతలిగట్టు యెక్కాడు. నేను పరకాయించి చూస్తున్నాను. వాడు కాలువలోని బల్లకట్టు యెక్కాడు. తాడు లాగుతున్నాడు కాబోలు బల్లకట్టు మెల్లగా కదులుతోంది. కొంతసేపటికి వాడు యివతలిగట్టుకి వచ్చాడు కాలువగట్టునుంచి మా ఇంటికి వచ్చే బాట వుండేచోట నీటిలోకి దిగుతున్నాడు. నా నరనరమూ గజగజ వణికిపోయింది ఏవో వెర్రికేకలు వేసుకొంటూ ఒక్క గంతులో మా వీధిగుమ్మంలోంచి నీటిలోకి ఉరికాను. వాడు దిగేచోట పల్లం, వాడి కందని లోతుంటుం దక్కడ, మునిగిపోతాడు అని నా హృదయం హాహాకారం చేస్తోంది. మోకాళ్ళ మునిగే నీటిలో గెంతుకుంటూ పరుగెత్తుతున్నాను. అరవబోతున్నాను. మాట రావడంలేదు కాళ్ళు తడబడి పడి లేస్తున్నాను. నా వెనుక దగ్గరలో నే ఎవరో కేకలు వేస్తున్నారు. ప్రపంచమంతా హాహాకార ధ్వనితో మారుమ్రోగుతూన్నట్లుంది నా చెవులికి. ఇంతసేపూ కనుపించిన ఆ కుర్రాడు కనుపించడంలేదు. ఇంక కాలువగట్టు వలభైగజాల దూరముంటుంది. నేను మొలలోతు నీటిలో నిలబడి యేవో వెర్రి కేక లేస్తున్నాను. చుట్టూ చూస్తున్నాను. వాడు కనుపించడంలేదు. మా అరుగుమీద మకాం చేసిన మాలవాళ్లిద్దరూ మునిగిపోయాడు, కొట్టుకుపోయాడు అంటూ నా ప్రక్కనే కేకలు వేస్తున్నారు. ఇంకా ఎదుటికి వెళ్లాం. పీకలోతు నీరుంది. కాలువగట్టు ఎక్కడానికి యీదడం మొదలు పెట్టాం. బాటదాటి వందగజాలు ప్రవాహవేగానికి కొట్టుకొనిపోయి కాలువగట్టు యెక్కాం. ఒక ఫర్లాంగు, రెండు ఫర్లాంగులు, మూడు ఫర్లాంగులు పరుగెత్తాం. వాడు కనుపించలేదు. మా కంగారూ గోలా యెక్కువైపోయింది.

పిచ్చెక్కినవానిలా వెనక్కి ముందుకీ పరుగెత్తుతున్నాను. నేను యింకా ముందుకి పరుగెత్తాను. నా కూడా ఒకడు పరుగెత్తుకొని వస్తున్నాడు. ఒకడు మళ్లీ వెనక్కి వెళ్ళాడు. ఇంకో అరమైలు పరుగెత్తాం. ఇంక వెళ్లడానికి వీల్లేదు. కాలువగట్టు తెగి నీరు ఉరకలేస్తూ ప్రవహిస్తోంది "రండి బాబయ్యా, వెనక్కి వెళదాం. ఇక్కడిదాకా రాడు. కాలవలో నీరు బయటికి పోతూంది" అంటూ మాలాడు వెనక్కి పరుగెత్తాడు. వాని వెనకనే, నేనూ పరుగెత్తాను. కొంతసేపటికి యథాస్థానానికి చేరాం. రెండో మాలాడు చేలల్లో గుండెలోతు నీటిలో కుర్రాణ్ణి భుజాలమీద యెక్కించుకొని బాటవైపుకి వస్తున్నాడు. కుర్రాడి తల, వాడితలమీద వ్రేలబడి ఉంది. మే మిద్దరం నీటిలో ఉరికి వాడివైపుకి యీదాం. వాణ్ణి సమీపిస్తున్నకొద్దీ నా అనుమానం బలపడుతోంది. నా కాళ్లూ చేతులూ పట్టుతప్పుతున్నాయి నా ప్రక్కనున్న మాలవాడి భుజం పట్టుకొన్నాను. నా స్థితి చూచి "అజేం బాబయ్యా?" అంటూ నన్ను పట్టుకొని లాక్కెళ్లాడు. కుర్రాడి ముఖం స్పష్టంగా కనుపించింది. మా సుబ్బారావే, వాడు. 'సుబ్బారావూ' అంటూ యేమేమో అరిచాను. అప్పటి కప్పుడే పాతిక ముప్ఫైమంది జనం మోకాళ్లోతు నీటిలో నిలబడి యేవో గోలచేస్తున్నారు. సుబ్బారావును తీసుకొచ్చి మాయింటి అరుగుమీద పడుకోబెట్టాం. ఊళ్ళోని డాక్టరుగారు వచ్చారు. నాడి అందడంలేదన్నారు. కడుపునొక్కి త్రాగిన నీరంతా కక్కించారు. ఏవో ఇంజెక్షన్లు చేశారు. కుంపటి పెట్టి వళ్ళంతా అరకాస్తున్నారు. "కొనవూపిరుంది. యేం జరుగుతుందో చెప్పలేం" అన్నారు డాక్టరుగారు. నేను స్తంభించిపోయి వాడిదగ్గర బండరాయిలా కూర్చున్నాను సూర్యాస్తమయ సమయానికి కొంచెం కదిలాడు. చైతన్యంలేనివానిలా కూర్చున్న నాకు చైతన్యం కలిగింది. మరికొంతసేపటికి 'మాష్టారు' అని అస్పష్టంగా అన్నాడు. వాడి ముఖందగ్గర ముఖం పెట్టాను. మళ్ళీ అయిదు నిమిషాలకి కళ్లు కొంచెం తెరచి 'మాష్టారూ' అని నూతిలోంచి పిలిచినట్లు అన్నాడు. "ఏం నాయనా! సుబ్బారావూ!" అన్నాను. మళ్ళీ వెంటనే వాని కన్నులు మూతిపడి పోయాయి. నా కళ్లు నీళ్ళతో నిండిపోయాయి. వాడి ముఖం చూడ్డానికి వెంటనే తుడుచుకొన్నాను. రెండు మూడు ఎక్కిళ్లు వచ్చాయి వాడికి. అంతే, ఇక వాడు శాశ్వతంగా కన్నుమూశాడు. లోకమంతా అంధకారబంధురమైంది.

కన్నడ యక్షగానాలు

శ్రీ ముట్నూరి సంగమేశం

1

తెలుగులోలాగే కన్నడభాషలోకూడా యక్షగానాలు రెండు రకాలుగా దొరుకుతాయి. ఇంట్లో ఆడవాళ్లుగాని, కళ్లాల్లో కాపులుగాని ఏ మేళతాళాలు అక్కరలేకుండా హాయిగా పాడుకొని కాలక్షేపం చేయడానికి అనువుగా ఉండే యక్షగానాలు మొదటిరకం. వీథిలో పందిరి వేసి మేళంకట్టి మద్దెల తాళాలతోనూ వెనుక పాటకుల మద్దత్తుతోనూ రాత్రల్లా ఆడి పాడి అభినయించడానికి అనుకూలించే యక్షగాన నాటకాలు రెండవరకం. ఈ రెండిటలోనూ పాటలూ, పద్యాలు, గద్యాలు వగైరా లన్నీ ఉంటాయి. రెండూ దేశీకవితలే. రెండూ రచనాగతి సంప్రదాయాలలో అతి సన్నిహితాలుగా ఉండి, ఎటు కావాలంటే అటు, ఎలా అంటే అలా ఒకదాని కొకటిగా పిరాయించి పాడుకొనేందుకు లేదా ఆడుకొనేందుకు అనుకూలంగా ఉండేవే. కన్నడ సాహిత్యంలో 'యక్షగానం' అనే ముద్రతో వెలసిన రచన లేవి పదిహేడవ శతాబ్దానికి ముందున్నట్లు కనపడవు కాని యక్షగానానికని చెప్పిన లక్షణాలుగల జానపద గేయాలు, నాట్యాలు మాత్రం అంతకు వెయ్యేళ్లు వెనుక నుంచీ ఉన్నట్లు ఊహించడానికి తగిన సాహిత్యాధారాలు చాలా ఉన్నాయి.

కన్నడ సాహిత్యంలో దొరికినంతమేరకు అత్యంత ప్రాచీనతమమైన గ్రంథం 'కవిరాజ మార్గ' మనే లక్షణ గ్రంథం (850 క్రీ. శ.). ఇందులో ఆనాటి నాటు నాటకాలు 'నాళ్ పగరణా' లనే పేర ప్రస్తావించబడ్డాయి. నాళ్ అంటే నాడు అనీన్నీ, పగరణ మంటే ప్రకరణ మనే రూపక భేదమనీన్నీ, సంస్కృత రూపకాలకి నాటకమనే పేరు రూఢమైనట్లే దేశీయనాటకాలకి పగరణం లేక ప్రకరణ మనే పేరు రూఢమై ఉండవచ్చుననీన్నీ పండితుల అభిప్రాయం. ఈ నాటకాలకి లక్షణం చెప్తూ కవిరాజ మార్గకారుడు వీటిలో క్లిష్ట కల్పనాదులు దోషాలనీ, గ్రామ్యత్వాశ్లీలత్వాగులు హాస్యోక్తులుగా ఉపయోగిస్తాయి కనుక దోషాలనిపించుకోవనీ వ్రాశాడు.[1] ఆనాటి దేశీయగీతాలనుకూడ ప్రస్తావించి, కంద పద్యానికి మరొక జాతీయవృత్తం జోడించినట్లయితే 'బెదండె' లనే గేయరచనలు లభిస్తాయనికూడ యీ లక్షణకర్త నిర్వచించాడు.[2] ఛందోంబుధి (10వ శతాబ్ది) అనే మరొక లక్షణ గ్రంథంలో అక్కర, చౌపది, గీతిక, ఏల, ఉత్సాహ వగైరాలు ఆనాటికి ప్రసిద్ధమైన జాతీయ గీతి ఛందాలుగా పేర్కొబడ్డాయి.[3] కావ్యావలోకనంలో నాగవర్మ (1145 క్రీ. శ.) 'రఘటా' ఛందాన్ని వేర్వేరు మాత్రలలో పేర్చి నిల్పి రచించినట్లయితే వేర్వేరు తాళగతుల కనుకూలమైన గేయాలు లభిస్తాయని వ్రాశాడు.[4] ఇవి పాడుకొనేందు కనుకూలించే రచనలు గనుక వీటిని 'పాడుగబ్బా' లని వ్యవహరించి నాటకాలలోనూ నృత్యాలలోనూ తాళవాద్యాల పొందికతో పాడి అభినయించడాని కనుకూలించే మరొక తరహా రచనలను నాగవర్మ 'బాజనెగబ్బా' లని వ్యవహరించాడు. ఈ బాజనె గబ్బములలో పాటలు పద్యాలు వచనాలు వగైరాలన్నీ ఉంటాయనీ, యథాయోగ్యంగా నగరర్తు వన పర్వతాది వర్ణనలు కూడ ప్రవేశపెట్టుకో వచ్చుననీ, ముఖ ప్రతిముఖాది నాటక సంధులుకూడ ప్రయోగింపబడతాయనీ వ్రాశాడు.[5]

కాలంలో వెనుకవే అయినా తెలుగు లక్షణ గ్రంథాలుకూడ దేశీయ గీతి నాట్యాల లక్షణాలు పైన

(1) చూ. కన్నడ కవిరాజ మార్గ - ఆ 1 ప 66, 67, 68.

(2) చూ. కన్నడ కవిరాజమార్గ 1-34.

(3) చూ. కన్నడ ఛందోంబుధి 1-47.

(4) చూ. కన్నడ కావ్యాలోకనం. సూత్ర 222.

(5) చూ. కన్నడ కావ్యావలోకనం. 245-249 సూత్రాలు.

చూపిన కన్నడ గ్రంథాలపద్ధతినే అనుసరించి చెప్పాయి తెలుగులో తాళ్లపాకవారి సంకీర్తన లక్షణం నాటినాటకాలలో హాస్యానికి ఎంతైనా స్వేచ్ఛ ఉన్నట్లు సాక్ష్యమిస్తూంది.

క॥ పల్లవ నారీ శ్లేచ్ఛాద్యుల్లాపమనోజ్ఞ
బంధురోక్తులు చవిరై
చెల్లును గ్రామ్యములైనను హల్లీసక
ముఖ్య నాటకాదిక భణితిన్.

అని వ్రాయడమేకాక నాటకాలలో ఉన్న పదాలను ప్రస్తావించి, వాటికి ఉండవలసే లక్షణంకూడ విస్తరించి యీ లక్షణకర్త మన కందించేను. కందార్థగతులు, ఏలలు, చౌపదలు వగైరాలు నాటి జానపద గేయ నాట్యాలలో విరివిగా వాడబడేవని దీనివల్ల తెలుస్తూంది. అప్పకవి యక్షగానలక్షణమనే పేర 'రగడ' ఛందోభేదాలనే వర్ణించాడు.

లక్షణాలు దొరికినందున ఆనాటి లక్ష్యాలు దొరకకపోయినా యక్షగానాలు మన కపూర్వంగా సిద్ధించిన రచనలు కావనీ, ఇవి ఎనిమిదవ శతాబ్దం నాటికే దేశంలో ప్రచారంలో ఉన్నవనీ ఊహించవచ్చును. కన్నడ కవిరాజ మార్గలో కావేరినుండి గోదావరి వరకుగల దేశం కన్నడదేశంగా పేర్కొనబడింది 6 అంటే, ఆ ఎల్లలలో అణిగిపోయిన ఆంధ్రదేశంలో కూడ ఆకాలానికి ఈ తరహా గేయనాట్యాలు ప్రచారంలో ఉన్నాయనే సంగతి చెప్పక చెప్పినట్లే.

2

యక్షుల సంప్రదాయానికి చెందిన నాట్యగానాలే యక్షగాన నాట్యాల్లో వెలసేయనేది పురాణం, పుక్కిటి పురాణం, ఊహ, కల్పన, సంకేతం వగైరా లెన్నిటనో కూడగట్టుకొని కాని రూపొందని సత్యం. గంధర్వ కిన్నెరాదులకు వలెనే యక్షులకు కూడ ప్రత్యేకమైన ఒక గాన సంప్రదాయమున్నట్లు ఆంజనేయభరతంలో పేర్కొనబడిందని చెప్తూ 'యక్షేషు గీతమపి గాన శైలీం' అని గోవింద దీక్షితులవారు తమ సంగీత సుధలో పేర్కొన్నారు. గంధర్వగానం మార్గి అనీ, యక్షగానం దేశి అనీ పండితుల అభిప్రాయం. కన్నడ కవి అభినవ పంపడు (12 వ శతాబ్ది) వ్రాసిన మల్లినాథ పురాణంలో 'యక్షాందోళన' మనే నాట్యం ప్రస్తావించబడింది.[7] కన్నడ యక్షగాన నాట్యప్రదర్శనలలో 'యక్షిణీ' వేషం ఈ ఆందోళికా నాట్యాన్ని నేటికీ ప్రదర్శిస్తున్నందున, గానంలోవలెనే నాట్యంలో కూడ యక్షులది ప్రత్యేక సంప్రదాయమే అని ఊహించవచ్చు.

యక్షులు దేవయోనులుగా పేర్కొనబడ్డారు. యక్షేశ్వరుడైన కుబేరుడు ధనాధిపతిగా అంగీకరింపబడ్డాడు. ఇతడు లంకలో కొన్నాళ్లు రాజ్యం చేసినట్లు పురాణాలు చెప్తాయి. ఇతని తర్వాత లంకా రాజ్యమేలిన రావణుడు కూడ జైనుల పురాణాల్లో యక్షరాజుగానే పేర్కొనబడ్డాడు. జైనులు నేటికీ యక్ష యక్షిణీలను పూజిస్తున్నారు. బౌద్ధులు కూడ యక్షులపట్ల భక్తివిశ్వాసాలు చూపుతారు. బౌద్ధసాహిత్యంలో యక్షుల ప్రశంస ఎక్కువగా దొరకడమే కాదు, అసలు బుద్ధుడే మహాయక్షుడుగా పేర్కొనబడిన ఘట్టాలుకూడ దొరుకుతాయి. ప్రాసాద గోపుర ప్రాకార తోరణాలకి సంరక్షకులుగా యక్షులు శిల్పాలలోను చిత్రాలలోను మూర్తీభవించారు. మాయ మంత్రాలకీ, వినోదవిద్యలకీ విలాస విన్యాసాలకీ యక్ష మూర్తులు ప్రతీకలుగా గ్రహింపబడ్డాయి.

భట్టిప్రోలు స్తూపంవద్ద దొరికిన శాసనాన్ని బట్టి క్రీస్తు పూర్వం మూడవ శతాబ్దంలో ఆ ప్రాంతం ధనదుడనేవాని ఏలుబడిలో ఉన్నట్లు తెలుస్తూంది. తత్సమీపంలో ధనదప్రోలనే పట్నంకూడ కనిపిస్తూంది. వేంగీదేశపు మధ్యకాలీన దానశాసనాల్లో కొన్నిటిలో కొందరు దాతలు కుబేరవంశీయులుగా పేర్కొనబడ్డారు. యక్షశబ్దానికి తెలుగు కన్నడ భాషలు రెండింటిలోనూ తద్భవంగా చెప్పబడిన 'జక్క' శబ్దం నేటికీ ఒకానొక జాతిజనులకు నియతాభిధానంగా వినిపిస్తూంది.

యక్షులు పరాభూతులై నేలవిడిచి వేరొక చోటికి వలసపోయిన జాతి. వీరికి తన కొండమీద ఆశ్రయమిచ్చి ఆదరించిన జంగమదేవర శంకరుడు రాజబంధువు. యక్షరాజు ధనేశ్వరుడేకాని దరిద్ర దేవుడు. యక్షులు నగరు విడిచి వన పర్వత తటాకారామ గ్రామోపరిసీమలలో విహరించే జాంగలులు. సంకె

6. చూ. కన్నడ కవిరాజమార్గ. 1-36.
7. చూ. మల్లినాథ పురాణం. ఆ. 12, ప 47.

వేళలు యక్షులకు పక్షులకు సంచారవేళలు. లక్ష్మి వీరి కాగాభ్యదేవత. దీపావళి యక్షరాత్రి. యక్షిణీలు వెన్నెల విసనకర్రలు. ప్రసన్నులైతే యక్షిణీలెంతటి కార్యమైనా సాధించగలరు. ఆగతానాగతాలను చెవిలో చెప్పగలరు. ఏదైనా ఎత్తుకొనిపోవాలంటే యక్షిణీలకే ప్రజ్ఞ. క్షణంలో చాటుబడి మాటుమరిగి పోవడం వీరికి వెన్నతో బెట్టిన విద్య. పర్వతారణ్య భూములలో విహరించే వీరికి, వనలక్ష్మితోబుట్టువు ఆమెను వరించిన నృసింహస్వామి పరాచకాలాడదగిన బావగారు. ఇవన్నీ పరంపరాగతంగా వినవస్తున్న యక్షుల లక్షణ సంకేతాలు.

తెలుగు సాహిత్యంలో జక్కుల పురంధ్రుల పాటలు ప్రస్తావించబడినట్లుగానే కన్నడ సాహిత్యంలో 'ఎక్కలగాణ'ల నాట్యగానాలు పలుతావుల ప్రస్తావించబడ్డాయి. అగ్గళుడు. (12 వ. శతి) వ్రాసిన చంద్రప్రభాపురాణంలో వనవిహారం చేస్తున్న నాయకుడు, మేళతాళాలతో నిమిత్తం లేకుండా శకియగీతాన్నొకదానిని ఒక 'ఎక్కలగాణ' యింపుగా పాడుతూఉంటే విన్నాడని వర్ణించబడింది.8 అభినవ పంపని (12 వ. శతి) మల్లినాథ పురాణంలో కమలామోదియైన తుమ్మెద ఝుంకారం కమలాలయయైన లక్ష్మిని కీర్తిస్తూ పాడే 'ఎక్కల' గానంతో పోల్చి వర్ణించబడింది9. రత్నాకరవర్ణి (16 వ. శతాబ్ది) వ్రాసిన భరతేశ వైభవంలో వెనుక పాటకులతోనూ, మేళతాళాలతోనూ 'ఎక్కడిగలు' నాట్యమాడినట్లు వర్ణించబడింది.10 ఆ యీ వ్రాతలవల్ల యీ ఎక్కలగాణలు తెలుగు జక్కుల పాటకులవలెనే జానపదగాయకులనీ, లక్ష్మీప్రశస్తిని వర్ణించడమే వీరికి కూడ కులాచారమనీ, నృత్యంకూడ వీరెరుగుదురనీ, అందులో హంగుదారుల ఆటోపంకూడ వీరి కవసరమే అనీ బోధపడుతూంది.

ఆంధ్రదేశంలో వేరు కనిపిస్తున్న జక్కుల జాతి వారికి నృత్యగానాలు వృత్తిగా ఉన్నట్లు రూపించదు. కన్నడదేశంలో యీ ఎక్కలగాణలు గాని, ఎక్కడిగలు గాని యిదే పేరుతో ఉన్న జాతి గాని వేరు దొరకదు. శబ్దాన్ని విడదీసి చెప్తే యీ ఎక్కలగాణలనే పదానికి యింపైన గాయకులు అనే అర్థం చెప్పాలి. కాని ఎక్కడిగలు అనేది కేవలం జాతివాచకమైన శబ్దం. తెలుగులో నన్నెచోడుడు తన కుమారసంభవంలో ఎఱుకలవారు గొడుగీతాలు పాడినట్లు ఒకచోట వర్ణించాడు. ఈ ఎఱుకలజాతివారు విశాఖమండలంలో నేటికీ యక్షగానాలు ప్రదర్శిస్తున్నారు. వీరి ప్రదర్శనాలకి ఎఱుకల కీర్తన, ఎర్రగొల్లల భాగవతం, చెంచు నాటకం వగైరా పేర్లెన్నో వ్యవహారంలో ఉన్నాయి. అద్భుటి మన్యప్రాంతాలలో యీ నాటకాలాడేవారి సంఘాలు 'మేళా'లనే పేరున నేటికీ సజీవంగా ఉన్నాయి. ఈ ఎఱుకలు కొండజాతులకు చెందినవారు. ఎఱుక, యానాది, ఎర్రగొల్ల, చెంచు, కోయ, కొరవ, కురుబ, మందులమారి, రామజోగి వగైరా పేర్లతో పిల్వబడే యీ జాతులన్నీ మూలంలో ఆటవికజాతులే. స్థిరనివాసాలు లేకపోవడం, కొండకోనలలో తిరగడం, మందులు మూలికలు, అమ్ముకోవడం, చేతులు చూసి జోస్యాలు చెప్పడం, ఢక్క, డమరుక, కొయ్యచిలారు వంటి వాద్యాలు వాయించడంలో ప్రత్యేకమైన నేర్పుకలిగి ఉండడం, 'కొల్లాపురమ్మను గొలిచి తిరిగేము, ఎల్లవారికి నదే యిలవేలుపమ్మ' అని చెప్పుకోవడం, ఆయా జాతులన్నిటికీ సర్వసామాన్యమైన లక్షణాలు. పైన వివరించిన యక్షుల లక్షణాలు కన్నడ ఎక్కల లక్షణాలు కూడ వీరిలో ఎన్నో కనిపిస్తాయి. ఎఱుకలు యక్షగానాలు ప్రదర్శించడమే కాక, ఎఱుక, ఎఱుకత అనే పాత్రలు గల కొరవంజి రచనలన్నీ యక్షగానాలుగానే పేర్కొబడుతున్నాయి ఈ కారణాలవల్ల ఈ ఆటవికజాతుల నాట్యగానాలవల్ల స్ఫూర్తిగొని, వారి సంప్రదాయాలను చాలవరకు స్వంతం చేసుకొని, ఆనాటి కొనాట సాహిత్యకలక్షణాలను పెంపొందించుకొంటూ వెలసిన దేశిరచనలే యక్షగానాలని నమ్మవచ్చు.

3

యక్షగాన రచనలలో ఒక తరహా రచనలకి కొరవంజి రచనలనే పేరు తెలుగు, తమిళ, కన్నడభాషలు మూడింటిలోనూ వినిపిస్తుంది. కొరవలనేవారు ఎఱుకలు. ఈ జాతి స్త్రీలను కొరవంజులని పిలుస్తారు. ఈ

8. చూ॥ చంద్రప్రభా పురాణం. ఆ. 7, ప 95.

9 చూ. మల్లినాథ పురాణం. ఆ. 6, ప 98.

10. చూ. భరతేశ వైభవం - ఆస్థాన సంధి. పద్యం 68.

కొరవంజి లేక ఎఱుకత అనే పాత్ర వర్ణించబడిన యక్షగాన రచనలే కొరవంజి రచనలు.

కొరవంజి యక్షగానాలు మూడు విధాల కని పిస్తాయి. కొరవంజి, కొరవ నాయకుల ప్రణయవృత్తాంతాన్నే వర్ణించేవి మొదటి రకం. ఇందులో చెంచులక్ష్మి (కొరవంజి)ని నృసింహస్వామి (కొరవ) వలచి వరించిన గాథ వర్ణించబడుతుంది. కొరవంజిని సింగి అనీ, కొరవనాయకుని సింగడనీ యిందులో వ్యవహరిస్తారు. తెలుగులో గరుడాచలమాహాత్మ్యం, చోడిగాని కలాపం వగైరా రచన లిట్టివి. విశాఖమండలంలో ప్రదర్శింపబడే ఎఱుకల కీర్తన యీ చోడిగాని కలాపమే. ఈ కథలోగల ప్రణయఘట్టం, యీ పాత్రలు మిగిలిన కొరవంజి రచన లన్నిటికీ మూలాలు. లక్ష్మీనృసింహులకు బదులుగా పార్వతీ పరమేశ్వరులను ఎఱుక దంపతులుగా మార్చి వ్రాసిన యక్షగానాలు కూడ దీని ననుకరించి వెలసిన రచనలే. శహాజీ మహారాజుగారు తెలుగులో వ్రాసిన కిరాత విలాసమనే యక్షగాన మిట్టి అనుకరణమే. ఇందులో శివుడు పాచికలాడి, పార్వతికోడి, విరక్తుడై తపస్సు చేయబోవడం, పశ్చాత్తప్త అయిన పార్వతి భిల్లాంగనారూపం ధరించి శివుని వెదుకబోవడం, శివు డామెకు సుముఖుడై తిరిగి కైలాసానికి పోవడం అనే ఘట్టాలు వర్ణించబడ్డాయి.

నాయకుడు ఎఱుకత వేషంతో పోయి నాయికను కలసి, ఆమె హస్తరేఖలు పరీక్షించి, త్వరలో ఆమెకు మనోనుకూలుడైన భర్త దొరుకుతాడని చెప్పి, కొంత పూర్వరాగం ప్రదర్శించినట్లు వర్ణించిన రచనలు కొరవంజి రచనలలో రెండవ రకం. తెలుగులో రాముల వారి ఎఱుక, సీతాకల్యాణం వగైరాలు, కన్నడంలో అర్జున కొరవంజి, కృష్ణ కొరవంజి వగైరాలు యీ రకమైన రచనలు.

ముఖ్య కథతో ఏవిధమైన సంబంధమూ లేకపోయినా ఏదోవిధంగా ఎఱుకత పాత్రకు ప్రవేశం కల్పించి, ఆమెచేత నాయికకు సోది చెప్పించడం, తదుపరి ఎఱుకరాజును ప్రవేశపెట్టి పరిహాసపూర్వకంగా వర్ణించడం, ఆమీద నా ఎఱుక దంపతుల వాదవివాదాలు ముతుకగా ఏకరువుపెట్టి ప్రదర్శించడం అనే ఘట్టాలు కల రచనలు మూడవ రకమైన కొరవంజి రచనలు. ఈ రచనలో ముఖ్యకథలో పూర్వభాగం ఎఱుకల సంవాదానికి పీఠికగా ఉపకరిస్తుంది. వీరి సంవాదం ముగిసినపిదప ముఖ్యకథలోగల మిగతా భాగం ఏకో అయిందంటే అయిందన్నట్లుగా పూర్తిచేయబడుతుంది. ఉదాహరణకి కన్నడభాషలోగల పార్వతీ కొరవంజి అనే రచన చూడవచ్చు. ఇందులో కథ శ్రీరామ జననం. దశరథుని సంతానచింత, నారదుని ఉపదేశం, పుత్రకామేష్టి యాగం, కౌసల్యాదుల గర్భధారణ అనే ఘట్టాలు వర్ణించినపిదప కవి కైలాసం మీదికి తనదృష్టి మరలించాడు. పరమేశ్వరుడు పార్వతిని పిల్చి:

'కొరవంజి వేషమున భూలోక మరిగి
కౌసల్యకని సోది గణియింపు మెరిగి' 11

అని ఆజ్ఞాపించాడు. సరే అని పార్వతి ఎఱుకత వేషంతో అయోధ్యకు వెళ్లి, కౌసల్యను చూచి శ్రీరాముని జననం గూర్చి సోదిచెప్తూ:

"తరుణిరో నావాక్కు తగ నమృత వాక్కు
కొల్లాపురమ్మాన సొల్లు గాదమ్మ" 12

అని నమ్మకం కలిగిస్తుంది. ఈ లోపుగా సాక్షాత్ శివుడే ఎఱుక నాయకుడై భూమికవతరిస్తాడు.

"పిల్లి కళ్ళూ, భేరి పొట్టా, సప్పివారీజారు ముక్కు
పిల్లి గడ్డం పేకి మీసం, ఓ సింగీ అనుచూ
తల్లడిల్లీ వచ్చె సింగడూ." 13

తర్వాత యీ సింగీ సింగళ్లిద్దరూ కొంత వివదించుకొని, తిరిగి రాజీపడి కైలాసానికి వేంచేస్తారు. కథ కంచికి పోతుంది. మనమింటికి వస్తాం. ఇలా మన్యంతరాన కథకు మంగళహారతి పట్టడమే యీ పాటలలోగల విశిష్టత. తమిళ భాషలో గల 'తిరుక్కుత్రలక్కురవంజి' అనే రచనలో కూడ కథ ఇదే

(11) ಕೊರವಂಜಿ ವೇಷದಲಿ ಧರೆಗೆ ಪೋಪುದು
ಅರಸಿ ಕೌಸಲಿಗೆ ನೀ ಕಣಿಯ ಹೇಳುವುದು —
(ಪಾರ್ವತಿಯ ಕೊರವಂಜಿ ಮೂಲಂ.)

(12) ತರುಣಿ ರೊವ್ವ ಮಾತು ತವೆ ಯಮೃತ ವಾಕ್ಕು
ಕರೆಯ ಕಾಣಿಸದು ಕೊಲ್ಲಾಪುರದಮ್ಮ ನಾಣೆ.
(ಪಾರ್ವತಿಯ ಕೊರವಂಜಿ ಮೂಲಂ)

(13) ಚೆಕ್ಕುಕಣ್ಣು ಭೇರಿಹೊಟ್ಟೆ, ಚೆಕ್ಕಿದಂತೆ ನಾರೆಮೂಸು
ಚಿಕ್ಕವುಳ್ಳಿ ಗಡ್ಡೆ ಮೀಸದೊಯು ವೋಸಿಂಗಿ ರೆನುತಾ
ಅಕ್ಕರಿಂದ ಬಂದಾ ಸಿಂಗಾನು.
(ಪಾರ್ವತಿಯ ಕೊರವಂಜಿ ಮೂಲಂ)

విధంగా మధ్యలో ఆగిపోతుంది. అంటే యీ కొరవల గొడవే యీ రచనలలో ప్రధానమనీ, అందుకే వీటికి కొరవంజు లని పేరు వచ్చిందనీ స్వతస్సిద్ధంగా ప్రమాణించినట్లవుతుంది.

కన్నడ భాషలో యీ కొరవంజు లెన్నో ముద్రితాలై దొరుకుతున్నాయి. మైసూరు ఓరియంటల్ లైబ్రరీలో యింకా కొన్ని అముద్రితాలుగా ఉన్నాయి. కాని కాలంలో యీ రచనలేవీ పదిహేనవ శతాబ్దానికి మించి ప్రాచీన మనిపించుకోవు.

4

కన్నడ దేశంలో యక్షగాన నాటకాలకి బయలాటలు, దశావతారాలు, మేళాలు వగైరా పర్యాయ నామము లెన్నో వినిపిస్తాయి. ఈ నాటక సంఘాలను కూటాలనీ లేక మేళాలనీ పిలుస్తారు. నటులు భాగవతులు, సూత్రధారుడు భాగవతారు. నాటక సంఘపు యాజమాన్యం తరుచుగా దేవస్థానాలకి చెంది ఉంటుంది. ఆడే నాటకాలన్నీ పౌరాణికగాథలే. ప్రదర్శనలో గల సంప్రదాయ విభిన్నతను బట్టి దక్షిణ కన్నడ జిల్లాలో యక్షగాన నాటకాలు ఉత్తరాది, దక్షిణాది అనే రెండు పద్ధతులలో కనిపిస్తాయి.

పార్తిసుబ్బ (1760-1820) అనే ఆయన కన్నడ భాషలో 'యక్షగాన వాల్మీకి' గా పేరు పొందాడు. ఈయన రామాయణ కథకు సంబంధించిన యితివృత్తాలు తీసుకొని ఎన్నో యక్షగానాలు రచించాడు. ఇతడు కేవల కవిమాత్రుడే కాదు. గాయకుడు, నటుడు కూడ. పొరుగున గల కథాకళీ నాట్యాలనుంచి అనేక సంప్రదాయాలు గ్రహించి, యక్షగాన మేళాలు నెలకొల్పి నడిపించాడు. వేషధారణ, మూక నృత్యం వగైరాలలోనే కాక, చండీ వాద్యం, జేగంట వగైరా వాద్య సంగ్రహణలో కూడా కన్నడ యక్షగాన నాటకాలు, మళయాళపు కథాకళిని అనుకరిస్తాయంటే అది ఈయనవల్ల ఏర్పడిన సంప్రదాయమే. ఇతని నాటికే కన్నడ దేశంలో పూర్వరంగ ప్రదర్శనానికి కావలసిన కలాపం 'సభాలక్షణ' మనే పేరున గ్రంథ రూపంలో ప్రసిద్ధమై ఉంది. పార్తి సుబ్బ దీనిననుసరించి తన నాటక ప్రదర్శనాలలో పూర్వ రంగం జోడించుకొన్నాడు. ఈ సభాలక్షణంలో కొన్ని పాటలు, మాటలు తెలుగు యక్షగాననాటకాల పూర్వ రంగంలో వినిపించేవే. సంప్రదాయంకూడా సజాతీయమే.

కన్నడ యక్షగాన నాటకాలలో వీరరసాభినయానికి విలువ హెచ్చు. ఆరభటీవృత్తి ప్రదర్శనంలోను, యుద్ధ దృశ్యాభినయించడంలోను కన్నడ భాగవతులు ప్రత్యేక ప్రజ్ఞ గడించుకొన్నారు. దీనికి తగినట్టుగానే వీరాడే కథలు కూడ భీష్మవిజయం, విరాటపర్వం, ద్రౌపదీప్రతాపం, వాలి నిగ్రహం, అతికాయ వధ వంటి వీర రసోచితమైన యితివృత్తాలు కలిగి ఉంటాయి. లేనిచోట కూడ కల్పించుకొని వీర రసాభినయం చేయడం కన్నడనటుల విశేషం. మోహినీ రుక్మాంగద వంటి శాంత రసప్రధానమైన కథలో కూడా వీరు సాత్వతీ ఆరభటీ వృత్తులకి జాగా చేసుకొంటారు. ఇది కారణంగా శృంగారానికి ఆదరం తగ్గిపోయింది. స్త్రీ పాత్రలు ఉపేక్షింపబడ్డాయి. వేషంగాని ఆటగాని అభినయంగాని ఏదీ స్త్రీ పాత్రలలో చెప్పుకోదగిన స్థాయిలో కనపడవు. నాయకుని కంటె ప్రతినాయకుని వేషం సభారంజకంగా ఉంటుంది. ప్రతి నాయక పాత్ర తెర బయల్దేరడమే ఒక రసవంతమైన ఘట్టం. వేషధారణలో చాల వరకు కథాకళీ సంప్రదాయాలు కనిపిస్తాయి.

కన్నడ నటులంతా నాట్యంలో ప్రజ్ఞకలవారే. నాట్యం చాల శాస్త్రీయమైన పద్ధతిలో ఉంటుంది. మూకనృత్యం, ముద్రాభినయం, చారీ భ్రమణాది సంచారనృత్యాలు, మండల గోమూత్రిక, డోలపాదాది కరణాభినయాలు, యుద్ధాభినయంలో పాటించే నాట్యవర్గాలు వగైరా లెన్నో వీరు ప్రశంసనీయంగా ప్రదర్శిస్తారు. సందర్భానుసారంగా నమ్య, రాస, ఆందోళికాది జానపదనృత్యాలు కూడ వీరీ ప్రదర్శనాలలో అభినయిస్తూ ఉంటారు. తాండవనృత్యాలు, అద్భుత కరణాంగహారాలు వీరి సొమ్ము. లాస్యంలో వీరికి నేర్పు కనపడదు.

కన్నడ నటు లెవ్వరూ పాడరు. పాడవలసిన కలాప మంతా భాగవతారు (సూత్రధారుడు) పాడతాడు. అతడు పాడుతూన్నంతసేపూ నటులు మూక నృత్యాభినయాలు ప్రదర్శిస్తుంటారు. పాట ముగిసిన పిదప అదే పాటలోగల భావాన్ని నటులు తమ స్వంత వాక్యాలలో పేర్చి సంభాషణశైలిలో వినిపిస్తారు. అంటే మూకనృత్యం జరుగుతూన్నప్పుడు కథాకళిని, సంభాషణలు జరుగుతూన్నప్పుడు ఆధునిక స్టేజి నాటకాలను స్మరింపజేస్తూ ఉంటుం దీ నాటకం. మాటాడ

డంలో నటులకు కావలసినంతగా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉన్నందున అవి అప్పుడప్పుడు మితిమీరి రసభంగం చేయడంకూడా మామూలే. సంభాషణానంతరం భాగవతారు తిరిగి మరొకసారి పాట పాడడానికుపక్రమిస్తారు. నటులు మాటలుమాని, పాటలోగల భావాన్ననుసరించి నృత్యగతులు ప్రదర్శిస్తారు. తెల్లవార్లూ యిదే క్రమంలో యీ నాటకాలాడబడతాయి.

కన్నడ నాటకాలలో హాస్యానికేమంత విలువ లేదు. హాస్యగాడు ముఖ్యపాత్రలవద్ద నౌకరుగా రూపొందుతాడు. ఇతని హాస్యంకూడ స్టేజినాటకాలలో వినిపించే బఫూనుహాస్యం వంటిదే.

ఈ నాటకాలన్నిటిలోనూ పూర్వరంగం ప్రదర్శింపబడుతుంది. ఇష్టదేవతాప్రార్థన, బాలగోపాల ఇంద్ర అర్ధనారీశ్వర వేషాలప్రవేశం, కోడంగిహాస్యం, యక్షిణీ (స్త్రీ వేషం) నృత్యం, కథాప్రారంభం, పాత్రలు తెర బయల్దేరడం, వచ్చిన ప్రతీ పాత్రను పృచ్ఛించి ఊరు పేరులన్నీ రాబట్టి సభికెరుకపర్చడం, నృత్యగానాలతో ప్రవేశించి, నృత్యగానాలతోనే తమసొంపు వెల్లడించడం వగైరా లక్షణాలన్నీ తెలుగు వీధినాటకాలలో కనిపించేవే.

5

కన్నడ యక్షగాన నాటకాలు తమ పూర్వరంగంలో ప్రాచీన సంప్రదాయాన్ని నేటివరకూ భద్రంగా నిల్పుకున్నాయి. భరతోదితమైన పూర్వరంగాధ్యాయానికి వీరి యీ పూర్వరంగ ప్రదర్శనం ప్రత్యక్షోదాహరణగా ఉపకరిస్తుంది. భరతుడు చెప్పిన పూర్వరంగం సుదీర్ఘమైన తంతుకలిగి ఉంటుంది. కాని అతడే దానికి లఘుప్రక్రియకూడ చెప్పాడు. కన్నడ నాటకాలలో యీ లఘుప్రక్రియ నేటికీ తూచా తప్పకుండా అనుసరింపబడుతూంది. ఈ నాటకాలు నడివీధిలో పందిరివేసి ఆడబడడంవల్ల నేపథ్యమేదో రంగమంటపమేదో తెలుసుకోడానికి తగిన హద్దులేవీ అక్కడ ఉండవు. పందిట్లో ముందుభాగం రంగమంటపంగాను వెనకభాగం నేపథ్యంగాను వినియోగింపబడతాయి. ఈ కారణంచేత నేపథ్యంలో జరిగే పూర్వరంగాంగాలైన సమస్త ప్రక్రియలు సభికుల సమక్షంలోనే జరుగుతాయి.

సాయంకాలం ఆరేడు ఘంటలకల్లా ప్రదర్శ స్థలంలో చండవాద్యాన్ని ముమ్మరంగా వాయిస్తారు. ఇది మ్రోగుతూండగా మద్దెల, తాళాలు, శ్రుతి వగైరాలు పట్టుకొని వాద్యకులు, గాయకులు రంగస్థలానికి వస్తారు. ఇదే భరతోదితమైన ప్రత్యాహారమనే క్రియ. తరువాత గాయకులు, వాద్యకులు తమ తమ నియత స్థానాల్లో నిలుస్తారు. ఎవరు ఏ ప్రక్కగా నిలవాలో అనేది నిర్ణయించి, అలా వచ్చి నిలవడానిని భరతుడు అవతరణమనే పేర వ్యవహరించాడు. వాద్యకులు తమ తమ వాద్యాలను గాయకులు తమ తమ కంఠాలను శ్రుతి కూర్చుకోవడంతో ఆరంభం ఆశ్రావణం అనే క్రియలు నిర్వర్తించినట్లవుతుంది. ఆమీద బృంద గానంతో ప్రార్థన ప్రారంభిస్తారు. ఈ ప్రార్థన జరుగుతూ ఉండగా ఓ యిద్దరు పిల్లలు మంగళకలశాలు, మామిడిచిగుళ్లు పట్టుకొనివచ్చి నాట్యం చేస్తారు. వీరినే బాలగోపాల వేషాలని పిలుస్తారు. వీరి నృత్యం తాండవగతిలో జరిపి పరిఘట్టనా సంఘట్టనా అనే అంగాలు నిర్వహిస్తారు. తరువాత భాగవతారు (సూత్రధారుడు) యింద్రధ్వజాన్ని యెత్తి, దానికి పువ్వులు చుట్టి, ప్రక్కవాని చేతిలోగల మంగళ కలశంనుండి కొంత వసంతం గ్రహించి దానిమీద జల్లుతాడు. పిదప ఆ వసంతాన్ని తనమీద తదితర గాయకులమీద జల్లి పవిత్రత సాపాదించుకొంటారు. ఒక కొబ్బరికాయకొట్టి నైవేద్యంగా అర్పించి ప్రార్థిస్తారు. ఈ సందర్భంలో ఇంద్రవేషం ప్రవేశించి చారీగతులతో నృత్యం ప్రదర్శిస్తుంది. ఇలా పుష్పదానం అనే క్రియ నిర్వర్తించిన పిదప భాగవతారు నాందీ శ్లోకం చదువుతారు. తిరిగి మరొకసారి బృందగానంతో ప్రార్థన జరుగుతుంది. ఆ సమయంలో అర్ధనారీశ్వర వేషం వచ్చి నృత్యం ప్రదర్శిస్తుంది. ఇందులో కూడ చారీ మహాచారీగతులు ప్రదర్శిస్తారు. దీనికి రంగద్వార మని శాస్త్రీయ నామం. ఈ క్రియ ముగిసిన వెనుక కోడంగి వేషం ప్రవేశిస్తుంది. భాగవతారు కోడంగి వేషంతో కొంత హాస్యప్రసంగం జరిపి త్రిగత మనే క్రియ నిర్వహిస్తారు. తరువాత విదూషక వేషం ప్రవేశిస్తుంది. వాటితో సంభాషిస్తూ భాగవతారు కథాసూచన చేసి ప్రరోచన అనే క్రియనిర్వర్తిస్తారు. ఆ తర్వాత భాగవతారు (స్థాపకుడు) సభనూ సభికులనూ ప్రశంసించి, నాటకకథ, కవి వగైరాలను వర్ణించి,

ఆనాటి ఉత్సవాన్ని, ఆ దేవతను, తత్కాల ఋతువును వర్ణిస్తున్న గేయాలు వినిపిస్తారు. ఆపైన ప్రస్తావన, ఆముఖం, స్థాపన వగైరాలు యథావిధిగా నిర్వహింపబడతాయి. ఇవి నిర్వహించేటప్పుడు భాగవతారు విదూషకునితోను నటితోను సంభాషిస్తూ ఉంటాడు.

కన్నడ యక్షగానాల్లో నటి వేషాన్ని యక్షిణీ వేషమనీ, శ్రీ వేషమనీ, మోహినీ వేషమనీ పరిపరి విధాల పిలుస్తారు. ఈమె మొదటిసారి రంగస్థలానికి వచ్చినప్పుడు నడుమువరకు అట్టతో కట్టిన ఒక తొట్టె వంటి చౌకంలో నిల్చి నృత్తగతులు ప్రదర్శిస్తుంది. ఈ నృత్తాన్ని అందోళికానృత్యమనీ, మంచెచప్పర నృత్యమనీ పిలుస్తారు. రెండవసారి వచ్చినప్పుడే నటి వేషం ఆరంభ నృత్యం, కలాస నృత్యం అనే రెండు రకాల లాస్య నృత్యాలు నెరపుతుంది.

నటీ వేషపు నృత్యం ముగిసిన పిదప భాగవతారు విదూషకునితో సంభాషిస్తూ కథానాయిక ప్రవేశాన్ని సూచిస్తాడు. ఇక్కడితో పూర్వరంగం సమాప్తమౌతుంది. ఇద్దరు వ్యక్తులు వచ్చి తెర పట్టుకొని నిలుస్తారు. గ్యాసులైటు ఉన్నా రెండు దివిటీలు వెలిగించి తెర కిరుప్రక్కలా నిల్పుతారు. వచ్చిన పాత్ర తెరలో కొంతసేపు నృత్యం చేసి, తెర గజగజలాడించి, దివిటీల వెలుగున ముఖం చూపి, గ్రీవారేచక అడ్డీకూదులు ప్రదర్శించి, తిరిగి తెరమరుగున మాటు పడుతుంది. రెండవసారి తెర నడుమువరకు దించి ఉండగా పాత్ర తన కుడిచేతిని తెర యివతలకు చాచి నృత్యం చేస్తుంది. ఈ నృత్యం ముగిసిన పిదప మూడవసారి పూర్తిగా తెరతీసివేస్తారు. బాహాటంగా బయటకు వచ్చినపాత్రను, ప్రవేశగీతంపాడి, ప్రశ్నలు వేసి, ఊరుపేరు లడిగి, జవాబులు రాబట్టి సభ కెరుక పరిచే కార్యం భాగవతారు నిర్వహిస్తారు. ఆ తరువాత కథాభినయం జరుగుతుంది.

తెలుగు వీధినాటకాలలో సమయాభావం చేతనో ధనాభావం చేతనో బాలగోపాల, యింద్ర, అర్ధనారీశ్వర వేషాలకు చాలకాలం క్రితమే స్వస్తి చెప్పబడింది.14 అసలు భాగవతారే విదూషకుడుగా మారిపోయి ప్రక్క తాళగాని నొకనిని పారిపార్శ్వకునిగా పిరాయించుకొంటాడు. నటివేషం అవసరానుకూల్యతెరిగి రాధగానో రుక్మిణిగానో లేక మరేదో ఆ నాటి కథకు సరిపోయే ఆడవేషంగానో అవతరిస్తుంది. అయితేనేం, తెలుగు నటుడెవరూ మూగనోము పట్టి నటించరు. పాత్రలు స్వయంగా ప్రవేశగీతాలు పాడుకొని ప్రవేశ నృత్యాలు నెరపుతాయి. భరతుడు చెప్పిన ప్రవేశిక నిష్క్రమణాది ధ్రువాలు తెలుగు వీధి నాటకపు దశలలో నిర్వహింపబడినంత చక్కగా కన్నడ యక్షగాన నాటకాలలో నిర్వహింపబడవు. తెలుగులో పాటకు విలువ. కన్నడంలో మాటకు విలువ. తెలుగువారు లాస్యాన్నాదరించారు. కన్నడులు తాండవాన్నాదరించారు.

---

(14) కన్నడదేశంలో కూడ యిప్పుడిప్పుడు ఇంద్ర, అర్ధనారీశ్వర వేషాలకు స్వస్తి చెప్పబడుతూంది. నటివేషం కూడ నృత్యంలో మునుపటంత ప్రజ్ఞ చూపడంలేదు.

చి... కౌ... బు

విజయ రాఘవ

అర్థరాత్రక్కాలంలో బయలుదేరారు వాళ్ళయిదుగురూ!...

పత్రికాదేవి—వులిక్కిపడి, "ఎవరూ! బయలుదేరింది" అన్నది.

సర్కస్ సింహంలాగా గంతులు వేస్తూ, అటూ యిటూ తిరిగే యీదురుగాలి వాళ్ళ వాసనని మెలుగ్గొడ్డులాగా పీల్చి—

"వస్తున్నారు! యిటే వస్తున్నారు." అంది భయకంపిత స్వరంతో—

పత్రికాదేవి సరోజ నేత్రాలు, స్వాతి వానచినుకులకు నోళ్లు విప్పే ఆలుచిప్పల్లాగా సాగిలివిచ్చుకొన్నాయి. గుమ్మడి పూపుప్పొడి రంగువంటి నుదురుమీద, తామరాకుమీద నీటిబిందువుల్లాగా స్వేద బిందువులు ముత్యాల్లాగా మెరుస్తున్నాయి.

ఈదురుగాలి తడారిపోయిన గొంతుకతో—

"దగ్గర కొచ్చేసారు. జాగ్రత్త దేవీ!" అంటూ కిటికీగుండా శూన్యంలోకి దూసుకుపోయింది.

పత్రికాదేవికి ఉత్తర ధ్రువంలో ఉన్నట్లనిపించింది. నాసికారంధ్రాలగుండా, ఉష్ణ రక్తకాసారంలోంచి వచ్చే సెగల్లాంటి పొగలు, వుంగరాల మాదిరిగా తిరుగుతూ వస్తున్నాయి. అప్పటికి కాలం కందగడ్డలా తయారైంది. వాతావరణం అంతా వాతం కమ్మినట్లు బిగుసుకుపోయింది.

వీటన్నిటిని చీలుస్తూ వాళ్లయిదుగురి వింత వింత నవ్వుల మాటల మరకలు కనిపించాయి. వాళ్ల వేళాకోళాలు - వేషభాషలు చూస్తుంటే శోషొచ్చినట్లయింది పత్రికాదేవికి.

లేచి కిటికీ పరజా తప్పించి చూసింది.

వాళ్ళయిదుగురూ మెట్ల దగ్గర కొచ్చారు.

"ప్రచండ ఝంఝా ప్రభంజనంలో యెగిరే గాలిపటం తనకన్నా బలం గలదని వూహించుకొంది" - పత్రికాదేవి ఆ సమయంలో.

కిటికీదగ్గరనుండి వాకిట్లోకి రాగానే—

"వాళ్ళయిదుగురూ" పంచభూతాల్లాగా కనిపించారు.

దేవి ప్రశాంత వాతావరణం కోరుకొంటానికి ప్రయత్నిస్తోంది. నయాగరా జలపాతంలో నాగమణులు మెరుస్తున్నాయి. జలియన్ వాలాబాగ్‌లో ఘోరకృత్యాలు, మనఫిర్యాదుల ధ్వనులు; హాలాహలంలో కోలాహలాలు — కేరింతలు — ప్రేయసీ విరహగీతాలాపనలు—రాజహంసల నడకల చప్పుడులు - అగ్నిపర్వతంలోనుంచి ప్రవ

హించే 'లావా' కుతకుత ప్రలాపాలు దేవిని అయోమయం చేస్తున్నాయి.

ఎలాగో జాగృతిదశలోకి హృదయాన్ని జారవిడిచింది, దేవి. కళ్ళు వాళ్ళయిదుగురి శరీరాల్ని-మనస్సుల్ని గారవించినయ్ వుచి తానవాల్ని చూపిస్తూ.

వాళ్ళయిదుగురూ కొండమీద కొక్కిరాయల్లాగా కూర్చున్నారు దేవి కెదురుగా.

వలిగాలి తెరలకు వణికి రెపరెపలాడే లేత రావిఆకులాగా - దేవి అరుణాధరాలు కదులుతున్నాయి.

'నిశ్శబ్దం' మంచుగడ్డలాగా పది నిముషాలు కరగకుండా వుంది.

ఎడమవైపునుండి రెండో వ్యక్తిని దేవి పరకాయించి చూసింది.

సిల్కు లాల్చీ,—గ్లాస్కో పంచె—, కళ్లద్దాలు—కారా కిల్లీకి యెరుపెక్కిన నల్ల పెదవులూ—బ్రైల్ క్రీం, అమ్లా-స్వస్తిక్-తాతా ఆయిల్స్-రీటా-సీపా, కొబ్బరినూనె, బాయ్‌సిల్ మొదలైన పేర్లు కవచంలాగా తొడుక్కున్న వాసననూనెల రుచిచూడక, కుంకుడికాయ పులుసుతో సంతృప్తిపడే వుంగరాల జుట్టు, బెండకాయల్లాంటి చేతి వ్రేళ్లు, వంకాయ తొడిమలాంటి ముక్కు, వ్రేళ్ళమధ్య "జీవితం కూడా యింతే"—అన్నట్లు తార్కాణంగా కాలే విదేశీయ సిగరెట్ దేవిని పల్కరించమని ప్రోత్సహించాయి.

గొంతు సరిజేసుకోబోతూ మిగతా నలుగుర్ని చూచాయగా చూసింది.

ఎడమనుంచి మొట్టమొదటి అతను జేబురుమాలుతో మొగం తుడుచుకొంటూ విలన్‌లాగా కనిపించాడు.

రుమాల్ మీద "ఫిస్తోల్" గుర్తు వుంది.

దేవి గుండె గతుక్కుమని పిడచకట్టుకొనిపోయింది.

అయిదో అతను గోడకు వ్రేలాడుతున్న పటంవంక చూస్తూ పెదవులు కదుపుతూ—మధ్య మధ్య డైరీలో యేదో వ్రాస్తున్నాడు.

మూడో అతను దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు.

నాల్గో అతను టేబిల్ మీదవున్న తెల్ల కాగితంమీద యేవో గీతలు గీస్తున్నాడు.

ఎవ్వరూ యేమీ మాట్లాడటం లేదు.

వాళ్ల పేర్లేమిటో తెలుసుకోవాలనుకొంది దేవి.

కుతూహలం ఎవరెస్టుశిఖరం లాగుంది.

ఉత్సాహం సాగరతరంగాల్లాగా యెగురుతోంది.

ఇంతలో అయిదో అతను నిల్చున్నాడు.

దేవికి టి. బి. పేషంట్ గుర్తువచ్చాడు.

"వ్రాసినంత వరకూ చదువుతా" అన్నాడు అందరివంకా చూసి—ఎవ్వరూ జవాబివ్వలేదు.

దేవిమాత్రం చూస్తోంది, అతనివాలకం.

అతను మొదలెట్టాడు – సిగరెట్ ముట్టించి—

"పిగిలి-రగిలి
నలిగి-తొలిగి,

సీల్గి-మాల్గి
వెగటెగసిన హృద్వీథిలో
అరుణారుణ జయపతాక
కిరణాలను చిమ్మింది—,
కాగితాల మడతలలో
కీచురాళ్ల కలవరింత—,
సిల్కు-చీర కౌగిళిలో
పుల్కలాల సలపరింత—,
దిగజారిన వక్షోజమ్ముల నీడలలో-
పొగజూరిన కామోద్రేకపుమేడలలో-
నాణ్యం తిరుగాడుతోంది.
ప్రావీణ్యం పొర్లాడుతోంది-
అంత్యంలేనిది గమ్యం—,
సాంగత్యం లేని దగమ్యం—.

రచన:
"రుధిరోద్గారి"

అని చదివి వ్రేళ్ళమధ్య ఆరిపోయిన సిగ రెట్టుని చూసి నిర్వేదించాడు.

దేవి హృదయంలో యీ రచన ఎగుడు దిగుడుగా పడుకొంది.

మొదటతను "ఫిస్తోల్" గుర్తు జేబురు మాల టేబిల్ మీద వుంచుతూ, కుర్చీ లోంచి క్రిందకు వంగాడు.

దేవి అతన్ని చూసింది:

అతను సిగరెట్ కొడిని అరచేతిలోకి భద్రంగా తీసికొని, దేవికి చూపిస్తూ-

"బ్రతికి సాధించలేని ముక్తి చచ్చి సాధించింది" అన్నాడు. నాల్గో అతను అందుకొంటూ-

"ఫిస్తోల్ శర్మగారూ! అలా అనకండి" అన్నాడు.

ఫిస్తోల్ శర్మ, "యేమిటీ!" అన్నట్లు బొయినెట్ లాగా మొగంపెట్టాడు.

దేవికి నవ్వొచ్చింది.

ఫిస్తోల్ శర్మకు ఆ నవ్వు చూడంగానే తల తీసేసినట్లనిపించింది.

"శాస్త్రిగారూ!" అన్నాడు.

"నస్సెన్సు శాస్త్రి", ప్రక్కనే కూర్చొన్న "ప్లాట్ రావు"ని పరిచయం చేస్తూ-"శ్రీ" గారికి ఆమాటలు కూర్చొని వినిపించాడు.

'రుధిరోద్గారి' "ఏమిటీ!" అన్నట్లు కొండ శిలువలాగా నోరు తెరిచాడు.

"మిట్టమధ్యాహ్న శ్రీ" రుధిరోద్గారి ఆదుర్దా గ్రహించినవాడై:

"మిత్రులు - సహృదయులు అయిన ఫిస్తోల్ శర్మగారు ఒక క్షుద్రమైన విష యాన్ని, అపరాధ పరిశోధకుసిలాగా పరిశీ లించి, ఒక చక్కని మాటన్నారు. దానిలో నస్సెన్సు శాస్త్రిగార్కి నచ్చిన విషయం దాగివుంది. అట్టిదానికి ప్లాట్ రావుగారు తన మేధా సంపత్తి సామాగ్రితో వన్నెచిన్నెలు కూర్చే ప్రయత్నాలు జరగబోతు న్నాయి." అని యింకా చెప్పబోతూండగా, రుధిరోద్గారి "అన్నమాట్లేమిటీ?" అన్నాడు తిమింగలంలాగా—

"బ్రతికి సాధించలేని ముక్తి" చచ్చి సాధించింది"..."అని "చివర ప్రాసభాగం నీ కొదిలారు." అని నసిగాడు మిట్ట మధ్యాహ్న శ్రీ.

రుధిరోద్గారికి సాగరమథనంలోనుంచి చందనం పూసుకొన్నట్లయింది.

అష్టదిక్పాలుర్ని ఆరాధించాడు.

యీ క్రింది విధంగా పూర్తి చేశాడు చివరకు.

"బ్రతికి సాధించలేని ముక్తి చచ్చి సాధించింది రక్తి"-అని చెప్పుతూ-

"ఇంతకీ ఫిస్తోల్ శర్మగారికి యెలా వుంటుందో యీ ప్రాస సొగసు" అన్నాడు రుధిరోద్గారి.

వాళ్లూ-వాళ్లూ పిల్చుకునే ధోరణిలో దొర్లిన మాటల్నిబట్టి, వారికున్న సాంకేతిక నామాలేమిటో దేవి అర్థం చేసుకొంది.

ఒక్కసారి తనలో తాను వాక్చిత్రం చదువుకొంది.

"ఫిస్తోల్ శర్మ-"

మిట్టమధ్యాహ్నశ్రీ"-

"ప్లాటురావు"-

"సస్పెన్సుశాస్త్రి"

"రుధిరోద్గారి"

దేవిగుండెముసిముసి నవ్వులు నవ్వుకొంది.

రాల్చిన సిగరెట్ కొడిని గురించి బయలుదేరిన ధర్మసందేహాల్లో వాళ్ళవాళ్ళ మనస్తత్వాలు యెలాంటివో గ్రహించుకోగలిగింది దేవి.

ఇంతలో పత్రికా దేవి టేబిల్ మీద టెలిఫోన్ మ్రోగింది.

దేవి చెవిదగ్గర పెట్టుకొంది.

ఎవరో యేమో అడిగినట్లున్నారు.

"త్వరగా రావాలి" అని దేవి జవాబిచ్చింది. సస్పెన్సు శాస్త్రి యీ సమయంలో దేవిని మాట్లాడిద్దామనుకున్నాడు.

"వస్తానన్నారా!" అన్నాడు చివరకు.

"ఎవరూ?" అందా మనుకొంది దేవి. కాని సస్పెన్సు అవమానపడిపోతుందేమోనని వూరుకొంది.

"బూటు చప్పుడునిబట్టి వ్యక్తిని గ్రహించవచ్చు—

మనిషి కనిపించకపోయినా మాటను బట్టి వయస్సు చెప్పొచ్చు—

మనస్సు యెటువంటిదో తెలుసుకోవాలంటే, చేసే చేష్టలు చూస్తే చాలు—"

ఇట్లా ఫిస్తోల్ శర్మ, ప్లాట్ రావుకి వక్కపొడి పెడుతూ కాస్త, కాస్తగా చెప్పుకొస్తున్నాడు.

"ఇంత సేపూ కూర్చోబెట్టివుంచినందుకు యేమిటీ లాభం. యేదో కూర్చుని, పత్రికా కార్యాలయంలోనే, తన ప్రతిభను చూపి, ఒక గేయం వ్రాసి దేవదత్తంలాగా చదివినా, అప్పుచేసిన సిగరెట్లు అయిపోయినా, కాసిని కాఫీనీళ్ళయినా తెప్పించి యివ్వలేదే!" అని—

"సిందూరం"

"రక్తచందనం"

"బంధూకం"

"సంధ్యారాగం"

"ఫుల్లిఖంపిన లేసి నెత్తురూ"

ఇత్యాది నవ్యకవితా సామగ్రికి వుదాహరణగా, తయారై వూరుకొంది రుధిరోద్గారి వదనం.

ఫిస్తోల్ శాస్త్రి, ప్లాటురావువంక అపరాధ పరిశోధకుడిలాగా చూస్తున్నాడు. సస్పెన్సుగా చూస్తున్నాడు శాస్త్రి. రుధిరోద్గారికి సిగరెట్లు అయిపోయినయి. కాఫీ కషాయంకోసం గిజగిజలాడుతున్నాడు.

మిట్టమధ్యాహ్నశ్రీకి అప్రాప్త మనోహారి సౌందర్య లావణ్యం జ్ఞాపకమొస్తోంది.

ఇంతలో కందిరీగల అందలంలోంచి దిగివచ్చినట్లుగా వచ్చాడు పత్రికాదేవిని ఆధారంగాపెట్టుకొని బతికే "పూసరవెల్లి" గారు. వాళ్ళయిదుగురూ పూసరవెల్లిగార్ని చూసి నిల్చున్నారు.

దేవికూడా నిల్చుని వాళ్ళని పరిచయం చేసింది. పూసరవెల్లి రంగు మారుస్తూ - మందహాసంతో—

"ఫరవాలేదు కూర్చోండి."

అందరూ కూర్చున్నారు.

"మీ పేర్లు వినడమే గాని, స్వయంగా వ్యక్తుల్ని చూడగలిగే భాగ్యం నేటికి కుదిరింది. చాలా సంతోషం" అన్నాడు

తరువాత మాట "కాఫీలు తెమ్మని" చెపుతాడేమో అనుకున్నాడు రుధిరోద్గారి.

ఇంతలో ఫిస్తోలు శర్మకి చిరాకెత్తింది. "ఇటువంటి సంభాషణలవల్ల లాభం యేమిటీ! ఎందుకొచ్చాం యిక్కడికి?" అని చాణక్యుడిలా ఆలోచించాడు ఒక్కసారి.

పగబట్టిన త్రాచులాగా లేచాడు.

అతన్ని చూసి 'పూసరవెల్లి' అదిరి పడ్డాడు.

"ఇప్పటికి మీకు—

"గంధకంలో సుగంధం"—,

"కాళరాత్రిలో కత్తినవ్వు"—,

"చెలికత్తె రొమ్ముమీద చెరగని నిశాని"—,

"శశిరేఖలో సారాయి రుచి"—,

"రూపాయిలో నిరూపారాయ్" అనే అయిదు అపరాధపరిశోధక రచనలు మీ పత్రికకు పంపాను. వాటి గతి యేమైనట్లు? యెన్ని వుత్తరాలని వ్రాయడం? రచయితల్ని యిలాగేనా ఉత్సాహపరిచేది. ఎనిమిది సంవత్సరాలు దాటినా వాటిఅంతు తెలియదయ్యే" అంటూ ఫిస్తోలు గుళ్ళలాంటి మాటలు పూసరపెల్లిమీదికి వదిలాడు.

దేవి గజగజలాడింది.

ఫిస్తోల్ శర్మ - రుధిరోద్గారిని లేవమని చెప్పి, రొప్పుతో కూర్చున్నాడు.

రుధిరోద్గారి లేచీ లేవడంతోనే మొగం చించుకొన్నాడు. మొసలి నోరులాగా పళ్లు బయటికి పెట్టాడు. కిళ్ళీ నమిలిన నాలుక కత్తిలాగా తిరుగుతోంది—

"వజ్రాయుధంలాంటి కలంతో వ్రాసిన, అపూర్వ ప్రతిభాసంపత్తితో మేళవించబడే పదాలతో, నిత్యమూ జరిగే సంఘర్షణలో, ప్రగతికి పురోగమించడంలో, ప్రజాస్వామ్య యుగంలో, కాలచక్రాల గమనంలో, శ్మశానవీధిలో మొగిరే జీవాల వికటాట్టహాస రోషాలలో, నలిగిపోయే బీదసాదల గుండెల రుధిరస్రావాన్ని రుచిచూస్తున్న రాబందుల మనస్తత్వాన్ని చిత్రీకరించుతూ, దీపావళికి రెండు సంవత్సరాల క్రిందట పంపుకొన్న "మంత్రగబ్బ డొక్కల్లో మరులుగొన్న మస్తిష్కం" అనే నా గేయం ఏమైంది? ఎక్కడుంది? కాళరాత్రి కాగిలిలో కమిలి

పోయే నీలిరంగునితీసి, అధివాస్తవికత్వాన్ని నిరూపించా నా గేయంలో. అటువంటి రచన యింతకాలానికే ప్రపంచంలో ప్రచారానికి ప్రకాశానికి - ప్రభావానికి రాకపోతే, యింకా నా సాహిత్యసేవ దేనికి? నాకీ పేరు వుండి లాభం యేమిటి" అంటూ అలిసిపోయి కుర్చీలో కూలబడిపోయాడు - పత్రికాదేవివంక చూస్తూ.

'పూనరవెల్లికి' చింత నిప్పులమీద కూర్చున్నట్లనిపించింది.

మొగంలో రంగులు మారుతున్నాయి. ప్లాట్ రావు సావకాశంగా చూస్తూ, లేచి -

"ఊహించినా అందరాని విషయాలన్నీ ఏకరువుపెట్టి, అధిగమించలేని మార్గాలన్నీ అన్వేషించి, "ప్లాటు"కి సాహిత్యంలో ప్రధాన పాత్రనిచ్చి వ్రాసిన "మంగలిపిట్ట"- "దాలిగుంట" - "గొగ్గిపన్ను" - కుక్కతల్లి" మొదలైన నా అధునాతన కథానికలను ఏ వుద్దేశ్యంతో ప్రచురించకుండా వున్నారు? పోనీ యెందుకు తిప్పి పంపలేదు. చెప్పండి. భయంలేదు. ఫర్వాలేదు" అంటూ బాధనంతా నెమరువేసుకొంటూ ప్లాటురావు అడిగాడు.

పూనరవెల్లికి నవ్వొచ్చింది.

సస్పెన్సుశాస్త్రికి వొంటిమీద దురదగొండాకు సోకినట్లనిపించింది.

"పిస్తోల్ దెబ్బ - గుండె పగిలి కారిన పాలలో సేమ్యా తీగెలు కిలకిలమని నవ్వుతున్నాయి—"

"దూరంగా గులాబిరంగు జాకెట్ నవయౌవన యువతిది సిగ్గుపడుతూ, - దానిమ్మ కొమ్మమీద దాక్కొంది."

"ప్రేయసీ! లైలా!" అని పిల్చాడు మజ్నూ! సినిమాలో - ఇసుక తుఫానులో - ఎడారిలో గుడారం లేచిపోయింది. ఆ హోరు గాలి ధ్వనిలో మజ్నూ విలాపం ప్రేక్షకులికి రాజేశ్వరరావు సంగీతమైతే బాగుండేదనిపించింది—"

"అనార్కలీ, సమాధిలోంచి—

అల్విదా...అల్విదా అంటూ సలీమ్‌కి జిలేబీ - రసగుల్లాలు తామరాకుమీద పంపింది."—

"గుడ్లగూబ కోయిల్లాగా కూసింది. సెలయేరు మునిసిపాలిటీ మురుగు కాల్వ మాదిరిగా విషాదగీతాలాపన చేస్తోంది"—

"ప్రియురాలిని కలుసుకున్నాడొకడు. ఎదురుగా సాలెగూడు గుండ్రంగా కనిపించింది. ఆమెను హృదయానికి ముందు హత్తుకొన్నాడు. తరువాత బిగియార కౌగిలించుకొన్నాడు. తేలిగ్గా ముద్దుపెట్టుకొన్నాడు - యింతలో అగ్నిపర్వతం బ్రద్దలైంది. మెరుపులు - వురుములు - జాకెట్‌లో పేలిం దొక రాకెట్ - తరువాత ప్రళయం - మళ్ళా నవ్యసృష్టి"—

యిలా రకాలుగా - డైలాగ్సు పెట్టి, యింత సస్పెన్సుగా వ్రాసి పంపుకొన్న "బూడిదలో భూకంపం" అనే నా 'నవల' యెక్కడ దాక్కొంది? గుండుదెబ్బ తగిలి యెండిపోయిన నా హృదయానికి అదొక్క రచనే ముక్తిదాయకం. ఇంతకీ ఏమైంది?" అంటూ సస్పెన్సుశాస్త్రి కలవరిస్తూ కూలిపోయాడు కుర్చీలో.

ప్రతికా దేవి కుర్చీలో కూలిపోయింది. కాసేపటికి స్పృహ వచ్చి మామూలుమనిషైంది. ముక్కుమీద వ్రేలుంచుకొంది.

ఊసరవెల్లి నవ్వుతూ—

"మీరేం లేవా!" అన్నాడు మిట్ట మధ్యాహ్నశ్రీని చూసి.

ఆ మాట ఆకురాయిలాగా రాసుకొంది హృదయానికి.

చ్యూయింగ్ గమ్ తింటున్న వాడిలాగా నోరుపెట్టి-గోడకు ఎదురుగా తగిలించివున్న "ఊర్వశి" చిత్రాన్ని చూస్తూ-తేటగీతిలో-

"ఆమె నులివెచ్చ కౌగిలిఅంతు లేని
మృదు సుఖాల తరంగాలుముంచుకొచ్చి,
మేను మరపించి జీవితమే, వసంత
ఋతువు గావించు సుకుమారి
బ్రతుకు నెపుడు"—

అని అపర [redacted] తొలి రేఖలో.

పిండారబోసిన పండు వెన్నెల శారద రాత్రులు-ఉజ్వలతారకల వెలుగులో-సన్న జాజి పూలపందిరిలో - తూగుటుయ్యాలలో-కప్పురపువిడెము సేవిస్తూ - కలువమొగ్గలా వున్న నా అప్రాప్త మనోహారీ సౌందర్య లావణ్య సుకుమార, సుందర, స్వరూపాన్ని తల్చుకుంటూ - కలలుగంటూ— "సిగలో మొగలిరేకు" అనే ప్రబంధ కావ్యాన్ని సీరియల్‌గా ప్రచురించమని ప్రాధేయపడుతూ పంపాను రెండేండ్ల క్రిందట. తరువాత అలాంటి కావ్యం వ్రాయడానికి నామనస్సు తూగలేదు. నా ప్రియురాలి వయసులో వసంతఋతువు వెళ్ళిపోయింది. నా కలంలో నిర్ఝరిణీ ప్రవాహంలాగా పారే జీవధార సన్నగిల్లింది సడలని కౌగిలింతలు-ముద్దులు జాజిమల్లెల సురభిలాలు- సెలయేటి రొదలు- తుమ్మెద పాటలు - ఆనంద రసైకధుని— మొదలైనవన్నీ నాలో తడారిపోయినట్లనిపించింది. అయ్యో! ఒక్కసారి నా కావ్యంలోని 'తొలిరేఖ' అని పేరు పెట్టుకొన్న పద్యాల్ని చదువుకోవాలని వుంది. ఎక్కడుందో తీసివ్వండి. వ్రాత ప్రతిని చూసుకొని, అచ్చుప్రతిగా తృప్తిపడతాను సెలవివ్వండి. ఎక్కడుంది?" అని మిట్టమధ్యాహ్నశ్రీ దీన వదనుడై గాద్గదికంగా పల్కాడు.

దేవి గుండెలో జాలీ - కరుణ ద్రవించాయి. ఊసరవెల్లికి వికృతమైన నవ్వొచ్చింది. వాళ్ళయిదుగురి మొరలూ - మొక్కుబడులూ విన్నాడు వూసరవెల్లి. [redacted] దేవివంక చూసాడు.

ఆమె ముఖంలో విషాదచ్ఛాయలు దృగ్గోచర మవుతున్నాయి - కనుకొలకుల్లో అమృతధార లూరినయి. బాధను వ్యక్తం చేయలేక సతమతమవుతోంది.

ఊసరవెల్లికి వూపిరిసలపలేదు. అందరూ తనవంకే ఖూసీకోరుల్లాగా చూస్తున్నారు.

దేవి మొగంలో సానుభూతి అలుముకొంది. ఆమె వాళ్ళమాటలు నమ్మింది. గాద్గదికంతో వూసరవెల్లితో అంది.

"ఎందుకిలా చేస్తున్నారు. మిమ్మల్ని ఆధారంగా పెట్టుకొని, పేరు తెచ్చుకుంబా

మనుకొంటే, యిటువంటి పనేనా చేసేది! ఇలాగేనా నా మొగానికి కళంకం తెచ్చేది!" సాహిత్యాన్ని పోషించాలి. రచయితల్ని ప్రోత్సహించాలి" అని సంపాదకీయాలు - ఉపన్యాసాలు చెప్పిందీ-వ్రాసిందీ మీరేనా! ఏమి టిదంతా!" అంటూ పత్రికాదేవి వూసరవెల్లిని గట్టిగా నిలబెట్టి అడిగింది.

వూసరవెల్లికి మెదడులోనూ-గుండెలోనూ 'ఉషా' పంకాలు తిరిగినయి—కెనడా రైలింజను యీల వేసింది.-ఫ్యాక్టరీ పొగ గొట్టం మసిబొగ్గులు రవ్వలు చిమ్మింది-పసిపిల్ల పాలకోసం యేడ్చింది-ప్రియురాలి వక్షస్థలంలో త్రిశూలం దిగబడింది - ప్రియుడి నెత్తిమీద వజ్రాయుధం దెబ్బ టంగ్ మని మోగింది. అమాంతంగా లేచి ముందున్న టేబిల్ లేపి ప్రక్కకు పడత్రోశాడు.

"చి...కా...బు." కనిపించింది.

"పిస్తోల్ శర్మ" కళ్లు గుండ్లు రాల్చాయి.

"మిట్టమధ్యాహ్న (శ్రీ)"- హృదయారవిందం పుష్పాంజి రాల్చింది.

"ప్లాటురావు"- బుర్రలో గూడ్సుబండి కదిలింది.

"సస్పెన్సు శాస్త్రి" - కోటు జేబులో చుంచుపిల్ల నవ్వింది.

"రుధిరోద్గారి"- నాలుకమీద కలకత్తా రుద్రకాళి కత్తిగీటు పెట్టింది.

ఊసరవెల్లి వులిక్కిపడి, తెప్పరిల్లి చూసాడు. అంతా భయానక దృశ్యాలు. విసురుగా ప్రక్క కిటికీదగ్గరకు వెళ్లాడు. పరజా దీశాడు-ప్రకృతిలోకి పారిపోయాడు.

దేవి వాళ్లయిదుగురి ముందుకొచ్చింది.

"చి...కా...బు" యెత్తి చూపింది.

ఒకళ్ళ మొగా లొకరు చూసుకొన్నారు. అప్రయత్నంగా అందరి నోటిమీదికి వచ్చిందీ క్రిందిమాట:—

"చిత్తు కాగితాల బుట్ట"—

"ఇన్నాళ్ళబట్టి యెంతో ఐకమత్యంగా వుండగలిగాం."—

"యివ్వాళ ఎవరిదారిన వాళ్ళు వెళ్ళి పోతున్నాం." అంటూ రచనలు వాళ్లయిదుగురి కరకమలాల్లోకి వెళ్లి నవ్వాయి.

దేవి హృదయానికి యెదురుగాలి మంద మలయానిలమై శాంతి - హాయి - చేకూర్చింది.

అక్కయ్య

శ్రీ ఆర్. యం. చిదంబరం

సముద్రపుటలలు అశాంతితో చెలరేపుతున్న హృదయంలా ఎగిరిపడుతున్నాయి. సంధ్యకాంతులు నెమ్మదిగా జారుతున్నాయి. అంతసేపటివరకూ తేనెపట్టులాగుండిన సముద్రతీరం క్రమంగా పల్చబడుతోంది. సంధ్య సౌందర్యాన్ని, అరసికుడి చేతిలో పడిన అందంలా, కబళించి వేయటానికి చీకటి తొంగిచూస్తూ వచ్చింది.

అక్కడి వాతావరణం శ్రీపతి హృదయంలో ప్రతిబింబించింది. హృదయ సముద్రపు వీచికలు. హోరుమని చెవులదగ్గర నిరంతర ధ్వని. నాలుగోసారి అటుచూశాడు. ఛీ...ఏనాడూ రానిది తను బీచ్‌కెందుకొచ్చాడు. అవును. నిస్సందేహంగా అది అక్కయ్యే. తెల్లకాగితంమీద ఎర్రసిరాగీతల్లా కిరణాలు.

ఆదర్శానికీ-యథార్థానికీ మధ్యయుద్ధం.

తెగినవీణమీద శాస్త్రీయ సంగీతాలాపన...

ధైర్యంగా అక్కడకు వెళ్ళలేడు. అక్కయ్యను పలకరించలేడు. అతని మనసంతా విపరీతపు టాలోచనల్తో ఉక్కిరిబిక్కిరవుతోంది.

క్రమంగా చీకటిపడుతోంది. అతను నెమ్మదిగా నడవనారంభించాడు. అక్కయ్యపక్కనుంచే కదిలిపోతున్నాడు. ఆమె తన్ను పిలిస్తే?...పిలవదు. పక్కన కూర్చుని విరగబడినవ్వుతున్న వ్యక్తిని చూడగానే అతని కళ్ళు రెండూ ఎర్రబడ్డాయి. రిక్షాయెక్కి సినిమా రోడ్డుకు పోనిమన్నాడు.

శ్రీపతి కృష్ణాటాకీస్ దగ్గరకొచ్చాడు. ఇంకా సినిమావదల్లేదు. అదేదో ఇంగ్లీషు చిత్రం. బైటవున్న స్టిల్సుని బట్టి అంతా 'సెక్స్'. నాన్న గనక తను యీ సినిమాకు వెళ్ళటంచూసివుంటే?...బుర్ర బ్రద్దలు కొట్టుకునేవాడు. ఇప్పటికతను అక్కయ్యను టవున్లో మూడుసార్లు చూశాడు. ఓసారి సిటీ యంపోరియంలో సిల్కు చీరలు కొంటుండగా-అతను పలకరించలేదు. ఆమెచూడలేదు గాబోలు! చూస్తే పలకరించదూ! మరోసారి మేటినీషోలో-మూడోసారి పార్కులో-తప్పించుకుని వెళ్ళిపోయాడు.

సిగరెట్టుకాలుస్తూ రోడ్డువోరగా నిలబడ్డాడు. సగంకాలిన సిగరెట్టువంక చూశాడు. గుండె గుభేలుమంది. తనవంశంలో-కనీ-వినీ-ఎరగంది...

నాన్నకు తెలిస్తే?

తక్షణం ఆత్మహత్య.

సిగరెట్టు కాలుస్తే తప్పేముంది? పరిమితంగా వుంటే ఫరవాలేదు. అనేవాడు ఓలెక్చరరు. క్రమంగా ఆ సిద్ధాంతం అతనిలో జీర్ణించుకు పోయింది. ప్రతి విషయంలోనూ మోడరేషన్ వుండాలనే హిల్టన్ వాదన కూడా అతను "హేట్సాఫ్" అన్నాడు. ఆఖరుకు స్త్రీ పాతివ్రత్యాని కూడా మోడరేషన్! అతను నవ్వుకున్నాడు.

సినిమా వొదిలేశారు.

మరో అరగంటకు టిక్కెట్టు తీసుకుని వెళ్ళి కూర్చున్నాడు. ఆట మొదలు పెట్టటానికి ఇంకా గంట వుంటుంది.

అతను మరో సిగరెట్టు వెలిగించాడు.

"సిగరెట్టు కాలుస్తున్నావా తమ్ముడూ!... నాన్నకు తెలిస్తే ఏమవుతుందో - ఎంత బాధపడతాడో తెలుసా?"

శ్రీపతివాస్తవికప్రపంచంలోపడి పక్కకు తిరిగి చూశాడు. అక్కయ్య కనిపించింది. ప్రక్కన సాయంత్రం కమల నవ్వులో భాగం పంచుకున్న వ్యక్తి.

" ఇక్కడ కూర్చుందాం "...తన పక్కన అక్కయ్య అతనూ కూర్చున్నారు. అత నింకా

ఆమెకేసి అలా చూస్తూ నిల్చున్నాడు. మెళ్ళో రత్నాల నెక్లెస్ మెర్క్యురీ లైటు కాంతిలో తళుక్కు తళుక్కు మంటోంది. ఎర్రటి దుద్దులు మెరుస్తున్నాయి. చేతిలో హేండ్ బాగ్! స్వంతంగా అల్లింది గాబోలు! ఇంతటి సిరి సంపదలు అక్కయ్య ఏ నాడైనా ఎరుగునా?

"నామీద నీకు కోపం కదూ తమ్ముడూ? అందుకే అలా మూగనోము పట్టావు" చిలిపిగా, ప్రేమగా నవ్వింది అక్కయ్య.

"ఛీ...సిగ్గులేని నవ్వు" అనుకున్నాడు.

"ఎందుకూ కోపం?"

"కాకపోతే నన్ను బీచ్‌లో చూసినప్పుడు ఎందుకు పలకరించ లేదు? ఇంతకు ముందు మూడుసార్లు నువ్వు నన్ను చూడటం - నిన్ను నేను చూడటం సంభవించింది. నీ అభిప్రాయం?"

"నిజంగా నేను నిన్ను చూడలేదు. కాని నువ్వు చూశావు కదా! ఎందుకు పలకరించలేదు?"

"నువ్వు పలకరిస్తావో లేదో చూద్దామనే వూరుకున్నా!"

"నేనూ అంతే!" అనేసి నాలిక్కరచుకున్నాడు.

"అబద్ధం ఆడినా నేర్పుగా వుండాలి. దొరికి పోయావ్" అంటూ పకపక నవ్వింది. శ్రీపతి సిగ్గుపడి పోయాడు.

"సారీ- అయిష్టంతో నే మాటలు మానుకున్నా; నువ్వు చేసినపనికి ఎవరైనా అంతే! ఇందులో క్రాస్ ఎగ్జామిన్ చెయ్యటానికి వీల్లేదు."

అక్కయ్యకు కోపం రాలేదు. నవ్వింది. అంత గంభీరత అక్కయ్యకెలా వచ్చిందో!

"ఇతను మా తమ్ముడు శ్రీపతి. ఇంటర్ సీనియర్...ఈయన మీ బావగారు." అంటూ పరిచయ వాక్యాలు పలికింది అక్కయ్య.

"బావ" అన్నమాట వినగానే అతనికి ముళ్ళ మీద నడిచినట్లైంది.

"అలాగా!...మా బావమరిదిని కలుసుకున్నందుకు చాలా సంతోషం. నీ గ్రూపు?"

శ్రీపతి జవాబు చెప్పకూడదనే అనుకున్నాడు. కాని అనుకోకుండా "యం పి. సి." అన్నాడు. అతని మొహం చూడగానే రావలసినంత కోపం రాలేదు.

ఇంటర్వెల్ దాకా ముగ్గురికీ మధ్య మౌనం నిలిచింది. అక్కయ్య మూడు డ్రింకులు పుచ్చుకుని ఒకటి శ్రీపతికిచ్చింది. అతను వద్దనలేక పుచ్చుకుని తాగాడు. నాన్న మాటల్లో అనాలంటే అటువంటి పాపిష్టిదాని చేతి డ్రింకు తాగినందుకు ఏడుజన్మల పర్యంతం మహాపాపం వెంటబడ్తూంటుంది. సినిమాలోంచి వెళ్ళిపోదామనుకున్నాడు కూడా!

ఇంతకీ అక్కయ్య చేసిన అపరాధం?—

* * *

ఆవేళ ఇంకా బాగా తెల్లవారలేదు. గలగలమని మువ్వలచప్పుడు క్రమంగా దగ్గరై ఇంటిముందు ఆగింది. అక్కయ్య రెండెడ్ల బండిలోంచి దిగింది. ముసుగు తన్ని పెట్టి నిద్రపోతున్న తను ఒక్కసారి మేలుకున్నాడు. ముందు వుత్తరం ముక్కయినా రాకుండా అక్కయ్య వచ్చింది. ఇందులో ఏదో విశేషముంది- అక్కయ్య తనెందుకు వచ్చిందీ చెప్పనూ లేదు. నాన్న అడగనూ లేదు. ఎందుకొచ్చావని కన్నకూతుర్ని నెలా గడుగుతాడు? అందుకే ఆవిడ నోటంటే విందామని వూరుకున్నాడు.

'అల్లుడు రాలేదే?' అని మాత్రం అడిగాడు.

దానికి అక్కయ్య ఎలాంటి సమాధానమూ యివ్వకపోవటంతో అనుమానాలు ఇంకా స్థిరపడ్డాయి.

అక్కయ్య మునుపటికిమల్లే ఉత్సాహంగా లేదు. ఎప్పుడూ నవ్వేదిగాదు. దిగులుగా వుండేది. ఇదంతా చూస్తుంటే ఇద్దరికీ మధ్య ఏదో అఘాతం ఏర్పడిందన్న సంగతి రుజువైంది. ఓనాడు నాన్న అడిగాడు:

'అమ్మాయ్!...ఏదో దాస్తున్నావు. అసలు సంగతి చెప్పమ్మా!'

అక్కయ్య భోరుమంది. ఇన్నాళ్ళూ అణచిపెట్టిన దుఃఖం లావాలా పైకుబికింది. అగ్నిపర్వతం బద్దలైంది. బావకితత్వం ఆయనికి కొద్దిగా తెలుసు. అక్కను రెండో పెళ్ళివాడికిచ్చారు. మొదట్లో ఈ సంబంధం వొద్దని నలుగురూ నచ్చచెప్పారు. కాని

తండ్రి వినలేదు. వాళ్ళకుటుంబం సంప్రదాయమైంది. దేవుడి గదిలో ఎత్తయిన దేవుడివిగ్రహం ముందు కూర్చుని పెద్దగా మంత్రాలు చదువుతూ, మడిగా నియమంగా పూజచేస్తున్నాడట. నిత్యపూజలు వుదయమే. కాలవకెళ్ళి స్నానంచేసి వస్తుంటాడట. ఇంటి నిండా దేవుడిపటాలు! ఇంతకంటె ఏం కావాలి?... సాయంత్రమయ్యేసరికి భగవద్గీతా పారాయణం కాని-పురాణ పఠనం కాని వుంటుంది.

మొదటి పెళ్ళాన్ని అత్తగారు విషం పెట్టి చంపింది రాచిరంపాన పెట్టింది...

ప్రతిరోజూ తల్లిమాటలు విని పెళ్ళాన్ని అకారణంగా చావగొడతాడు. అతన్తో ప్రతిదీ పేచీయే!

అక్కయ్య ఏడుస్తూ ఇంకా చెప్పింది. భర్త ఎన్నివిధాల తనను బాధ పెట్టాడో! అత్తగారు ఎన్ని విధాల సాధించిందో! అంతా మామూలు సాధ! అందుకే తను ఎదిరించి వచ్చేసింది.

'అయితే ఇంక వెళ్ళవా? శాశ్వతంగా బంధం తెంపుకుని వచ్చేశావా?...ఆడదానికి పుట్టిల్లు నరకం-అత్తిల్లు స్వర్గం-భర్త దైవం- తెలిసిందా? అనవసరంగా అప్రతిష్ఠ. నేను తలెత్తుకు తిరగొద్దూ? అది సంప్రదాయ కుటుంబం. కట్టుబాట్లు ఎక్కువగా వుంటాయి. అన్నింటికీ ఓర్చుకోవాలి. మరి ఆపదంటే ఏమనుకున్నావు?" అని వుపదేశం చేశాడు తండ్రి. అత్తగారిబాధలు ఎలాగ తొలగిపోతాయో కూడా తండ్రి వివరించాడు. ఆవిడకు ముసలితనం వచ్చింది. కనక త్వరగా కన్ను మూస్తుంది. అప్పుడు అక్కయ్యే ఆ యింటికి రాణీ అవుతుంది. భర్తను తన కనుసన్నల్లో వుంచవచ్చు. అంతేకాని కళ్ళువుండి తను గోతిలోకి దూకొద్దని మాత్రం ఒప్పుకోడు నాన్న. అక్కయ్య మూగగా చూసింది. ఆమె మానసికబాధ శ్రీపతి కర్థం కాలేదు. ఆ యింట్లోనే వుండి తండ్రి భావాలలో భాగం పంచుకున్నవాడు కనక అతను అక్కయ్యను క్షమించలేక పోయాడు. నాలుగయిదు సార్లు అక్కయ్యను తిరిగి భర్త దగ్గరకు వెళ్ళిపొమ్మని శాసించాడు తండ్రి. అంటే అతనికి కూతురిమీద ప్రేమ లేకనా? బోలెడంత ఉంది......అది అతనికి మాత్రమే అర్థం అవుతుంది.

"నన్ను తలెత్తుకుని తిరగనియ్యవా?" అన్నాడు. నలుగురూ నాలుగు మాటలూ అంటున్నారట. ఎలాగ?

పతి ఎలాంటి వాడయినా అతనే దైవం!...... తుమ్మెద రొదలా చెవిలో ఉపన్యాసం...హిందూ స్త్రీ అంటే?...భర్త ఎలాంటి వాడయినా అతనికి సపర్య చెయ్యాలి. తన సర్వస్వం అతని కప్పగించాలి. ఎంతమంది వొచ్చినా వొండిపారేయాలి. కనీసం రెండు కూరలు - ఓ పచ్చడి - అతిథి మర్యాదలంటే యేమిటి మరి? భర్త కుష్ఠురోగి అయినా అతన్ని మోసుకుని వెళ్ళి అతని ప్రేయసి దగ్గరకు చేర్చాలి. చచ్చిపోతే యముడితో పోట్లాడాలి.

'నువ్వు గులాబీరంగు చీరకట్టుకో!' అంటే వెంటనే ఆపని చెయ్యాలి. రాత్రిపన్నెండైనా, రెండుకూ అతనువచ్చినా మేలుకునివుండి అతను అన్నంతిన్నాక తనుతినాలి. ఎంతమంది పిల్లల్నికంటే అంతగొప్ప. 'ఒక్కసారి సినిమాకు తీసికెళ్ళరూ?' అంటూ భర్తను బ్రతిమాలుతూండాలి. ఇంతవినయంగా అణగిమణగివుంటే సమాజం ఆమెకు 'ఉత్తమ ఇల్లాలు' పట్టాన్ని ప్రసాదించటానికి యత్నిస్తుంది...శ్రీపతికూడా అక్కయ్యతో మాట్లాడటం మానుకున్నాడు.

చివరికి ఓనాడు అక్కయ్య అంది: 'నాన్నా! నేనివాళ వెళతాను. నాకు ప్రపంచం అర్థమైంది. ఎత్తిపొడుపులు ఇంక సహించలేను.'

నాన్నకళ్ళు తళుక్కుమన్నాయి. హిందూ ధర్మం నిలిచింది. 'దేవుడికి కటాక్షం కలిగింది' అన్నాడు. అక్కయ్య బండెక్కి వెళ్ళింది...భర్త దగ్గరకు.

'మొగుడంటూ వొకడుంటే అదే పదివేలురా! భర్తపోయినవాళ్ళను చూడు!' అన్నాడు, అక్కయ్య వెళ్ళిపోయాక తన్ను దీవించి నాన్న. అదీ నిజమే ననిపించింది అతనికి. భర్తపోతే హిందూసంఘంలో ఇంకేమైనావుందా? చీకటిగదిలో వుండాలిట. పువ్వులను గురించి మనసులో అయినా తలపెట్టకూడదు. సౌందర్యాన్ని చంపుకోవాలి. వీలైనన్ని ఉపవాసాలు చెయ్యాలి. భగవద్గీత నిరంతరం చదువుకోవాలి. పోనీ, రామాయణభాగవతాల్లాంటి గ్రంథాలనైనా సరే!... నాన్న దేవుడిముందు కూర్చుని 'ఓం' అంటూ ముక్కు పట్టుకున్నాడు.

సరిగ్గా అక్కయ్య వెళ్ళిపోయిన పదిరోజులకు ఓనాడు సాయంత్రం తండ్రి తన రూంకు పరుగెత్తుకొచ్చాడు.

"కొంప మునిగింది" అన్నాడు. శ్రీపతి ఏమన్నట్టు చూశాడు.

"మీ అక్కయ్య భర్తదగ్గరకు కాదు వెళితే-"

"కొంపతీసి మనసువిరిగి ఆత్మహత్యకాని చేసుకోలేదుకదా ?"

శ్రీపతి ఈమధ్య తండ్రి దగ్గర లేనికారణంచేత పత్రికలు తెగచదువుతున్నాడు. అందులో ఇలాంటి సంఘటనలు అనంతం.

"అలాగైనా బాగుండును. ఎవడితోనో లేచిపోయింది. నా పరువు ప్రతిష్ఠలన్నీ గంగపాలయ్యాయి. అందరికీ యీ విషయం తెలిసిపోయింది. కడుపులో చిచ్చు పెట్టింది. మన కుటుంబ గౌరవాన్నంతా మంట గలిపింది. ఇంక ఏ మొహం పెట్టుకుని వూళ్లో తిరగను?"

నాన్న వొణికిపోతున్నాడు. అతనికున్న మనస్థైర్యం అంతే! అతనికి సంఘంలో ఆకాశమంత ఎత్తు స్థానం వుంది. సమాజం ఈమాటతన్ని కిందకు తోసివేస్తుంది. నాన్న పాతాళంలో పడ్డాడు. శ్రీపతికూడా చలించి వూరుకున్నాడు. అక్కయ్యను గురించి అతని కెలాంటి అభిప్రాయమూ కలుగలేదు.

తరువాత కొంతకాలానికి అక్కయ్య సిల్కు చీరలు కొంటూ సిటీ ఎంపోరియంలో కనిపించింది.

* * *

"తమ్ముడూ !... పరధ్యానంగా వున్నావు. సినిమా చూడ్డానికికదూ నువ్వొస్త? అప్రస్తుతం ఆలోచించి బుర్ర పాడుచేసుకునేవాళ్లు సంఘానికి విద్రోహులు." అంది అక్కయ్య. అతను పరధ్యానంగా అనుకోకుండా నవ్వాడు.

సినిమా అయిపోయింది.

ముగ్గురూ బయటకొచ్చారు. శ్రీపతి సైకిలు రిక్షా బేరమాడబోయాడు.

"నువ్వీ రాత్రి మాతో రావాలోయ్! ఎక్కడికీ వెళ్ళటానికి వీలులేదు" అంది అక్కయ్య. అతను ఎందుకో కాదనలేకపోయాడు. డ్రైవరు డోర్ ఓపెన్ చేశాడు. శ్రీపతి ముందు సీట్లో కూర్చున్నాడు. ఇద్దరూ వెనకాల కూర్చున్నారు.

"శ్రీపతికి ముభావంగా వుండటం సరదాగా బోలు!" అన్నాడతను.

"మరే...నిజం తెలిసొచ్చేవరకూ అలాగే వుంటుంది." అని సమాధానం చెప్పింది అక్కయ్య.

ఇంగ్లీషు పిక్చరు కావటం మూలాన త్వరగా అయిపోయింది. ఓ పెద్ద మేడముందు కారు ఆగింది. శ్రీపతి అక్కయ్య వెనకాల ఇంట్లో అడుగు పెట్టగానే గడియారం పన్నెండుకొట్టింది. ఇంటిముందు గులాబీ మొక్కలు, మల్లె మొక్కలు నిద్రపోతున్నాయి. మెర్క్యురీ లైటు వేయగానే హాలంతా తళుక్కుమంది...

"స్వీట్ హోం" అంటూ గుమ్మానికి కర్టెను.

"తమ్ముడూ నువ్వు భోంచేశావా?"

"చేశాను." అన్నాడు ధీమాగా.

"అబద్ధం!" అంది. అతను భయపడ్డాడు. ఈ ఆడవాళ్లకు రహస్యాలన్నీ ఎలా తెలుస్తాయి? అదీ విచిత్రమే!

"నిన్ను భోంచెయ్యమని బలవంతం పెట్టంలే! పన్నెండు గంటలకు భోజనం యేమిటి? మాకూ ఆ అలవాటులేదు' అని అక్కయ్య శ్రీపతి ముందు ఆపిల్సూ, ద్రాక్షా, పాంగ్రిల్లా స్లైస్ బిస్కట్సు ఉంచింది. ఫ్లాస్కులో ఉన్న పాలు ముగ్గురికీ సర్దింది. అతను సంకోచిస్తూ తినసాగాడు. ఎదిరించి అక్కణ్ణుంచి వెళ్ళిపోదామనే ఉంది. కాని ఎలాగ? ఎందుకో హృదయం అంగీకరించటం లేదు. ఏదో అజ్ఞాతశక్తి ముందరికాళ్ళకు బంధం వేసి తనను కదలనీయకుండా చేస్తోంది.

'అయితే శ్రీపతీ! నువ్వు బై. పి. సి. తీసుకుని ఉంటే హాయిగా మెడిసన్ చదవొచ్చుగదా! ఎందుకు ఎం. పి. సి. చదువుతున్నావు?'—అతను కొంచెం ఆశ్చర్యపడ్డాడు. అయితే తన్నుగురించి అక్కయ్య అంతా చెప్పిందన్నమాట!

'బహుశా ఇంజనీరింగు చదువుదామని గామోలు ఏం తమ్ముడూ! అంతేనా?' అంటూ భర్త ప్రశ్నకు తనే సమాధానం చెప్పింది.

'నీకు తెలియందేముంది అక్కయ్యా!...నాన్న తత్వం - ఆయనతీరు కొత్తకాదుగా!' అన్నాడు శ్రీపతి. అతనికే ఆశ్చర్యం కలిగింది. 'అక్కయ్యా!'

అని పిలవకూడదనుకొన్నాడు... కాని అక్కయ్య అంతా గ్రహించినట్లు నవ్వింది.

'పోనీ... నే చదివిస్తా చదువు నీకంటె కావలసిన వాళ్లు నాకెవరూ లేరు.'

అక్కయ్య గంభీరంగా అంది.

'సరి...అయితే నన్ను వెయిటింగ్ లిస్టులో వేశావన్నమాట!' అని హృదయపూర్వకంగా నవ్వాడు డాక్టరు.

అయిదు నిమిషాలు నిశ్శబ్దం తాండవించింది.

'శ్రీపతీ!...నువ్వు మూర్ఖుడివి కాదు. తెలివైన వాడివని మీ అక్కయ్య చాలాసార్లు చెప్పింది. అంచాత మూఢ సంప్రదాయాలకు, అర్థంలేని పట్టింపులకూ లొంగిపోయి బుర్ర పాడుచేసుకోకు. విశాల హృదయంతో పరిస్థితుల ప్రాధాన్యాన్ని అర్థం చేసుకొని మంచి చెడ్డలు నిర్ణయించు. చెప్పాను మాటలు ఎన్నడూ వినకు...మీ యక్క మీద నీకు విపరీతమైన కోపం వుండి వుంటుంది. ఆ కోపం ఇంకా నీలో వుంటే నీకూ, అనాది మానవుడికీ వ్యత్యాసం లేదన్నమాట... అంతేకాదు. నీ చదువు కూడా వృథా'

శ్రీపతి ఏదో తప్పిదం చేసినవాడిలా బాధపడుతూ వింటున్నాడు. డాక్టరు ఇంకా ఏదో చెప్పబోయాడు. టెలిఫోన్ కాల్ వచ్చింది.

'అర్జంటుగా కేసొకటి వచ్చింది. నేను వెళ్లాలి.'; అంటూ పాలు మాత్రం ఒక్క గుటకలో తాగేసి డాక్టరు స్టెతస్కోపు, లెదర్ బాగ్ తీసుకుని వెళ్ళిపోయాడు.

'క్షణం తీరిక వుండదు; ఇంట్లో సుఖం వుండదు ఏం డాక్టర్లు బాబూ!...తమ్ముడూ, నువ్వు మాత్రం డాక్టరు చదవొద్దు. ఇంజనీరైనా అంతేననుకో.'

శ్రీపతి పాలు తాగటం పూర్తయింది.

'డాక్టరుగారెప్పుడు రారా!

'వస్తారు. కాని బావని పిలవటానికి నీకు నోరు తిరగటం లేదుకదా! అవును...ఎలా తిరుగుతుంది? నేను చేసిన పని వ్యభిచారంతో సమానంగా —ఇది క్షంతవ్యం కానిపని. అందరూ మొహంమీద వుమ్మేస్తారు. సంఘంలో ఎవరూ గౌరవించరు... నువ్వూ అంతేనంటావా?'

అతను మాట్లాడలేకపోయాడు.

తలుపులు రెండూ చేరవేసింది.

'నిద్ర వొస్తోందా? నీకు బాగా లేదుకదా!'

"లేదు.... నేను ఒంటిగంటదాకా ఏదో చదువుకుంటూ వుంటాను." శ్రీపతి చిన్న అబద్ధం ఆడాడు. అతను పదింటికే పడుకోటం అలవాటు.

"నేను చేసినపని తప్పని నువ్వు విశ్వసిస్తున్నావా?...నీకు నేనంటే అసహ్యంగా లేదూ? నన్ను తప్పు పడతావుకాని నేనెలాంటి జీవితం అనుభవించానో నీకు తెలుసా? భర్త భార్యను అకారణంగా చావగొట్టి, అత్తగారూ, వెనకకూతురూ కూడా ఎందుకులే! సింహాసనంమీద కూర్చుని నానా చాకిరీ చేయిస్తుంటే, అన్నీ సహించి, ఆఖరుకు భర్త శీలాన్ని శంకిస్తే? అప్పుడు హిందూస్త్రీ గతేదిటని నువ్వెప్పుడైనా ఆలోచించావా? నా పరిస్థితులు కూడా అంతే! డాక్టరుగారు, ఆయన స్నేహితులు. డాక్టరుగారితో నాకు అనుబంధంవుందని శంకిస్తే?...దాన్ని నిజం చేసుకోటమే వుత్తమం. నువ్వింకా చిన్నవాడివి. నేనూ మొన్న మొన్నటిదాకా చిన్నదానినే! కాని ఈ స్వల్పకాలంలో నాకు ప్రపంచం అర్థమైంది. నాలాంటివాళ్లు ఎంతమందో నీకేం తెలుసు? ఈ సంసారాల్లో నూటికి తొంభైమంది ట్రాజికల్. నా చరిత్ర సామాజిక యితివృత్తం కదూ?"

శ్రీపతి కళ్లమ్మట నీళ్లు తిరిగాయి. అక్కయ్య కూడా ఏడుస్తోంది. పాత గాథలన్నీ తలుక్కున మెరిసివుంటాయి. అక్కయ్య ఏడవటం అతను సహించడు. అక్కయ్యస్థితి బాగుపడిందికదా! ఇంకా ఎందుకీ కన్నీరు! ఇంతటి అనుభవం సంపాదించినది ఏడవటంవలన జీవిత శృంఖలాలు తెగవని తెలుసుకోలేదూ?

'అక్కయ్యా!...నువ్వు దేవుడి గుళ్ళోకి వెళుతున్నావా?'

అక్కయ్య తమాషాగా నవ్వుతూ 'ఎందుకూ?... అలాంటి నమ్మకాలు నాకూ వొదలిపోయాయి. నాకు ముక్తి, మోక్షం అక్కర్లేదు స్వర్గలోకం అసలేవొద్దు. అదీకాక నావంటి పాపాత్ముల్ని దేవుడు క్షమించడుగా!...నువ్వు రూంలో ఎందుకుంటున్నావు? ఇక్కడికి వచ్చేయకూడదూ? కలిసి హాయిగా వుండవచ్చు' అంది విషయం మారుస్తూ.

అతను సమాధానం చెప్పకుండా భయంభయంగా చూశాడు.

'భయం వేస్తోంది కదూ!... ఈ దుర్మార్గురాలితో నా కొందుకనుకుంటున్నావు కదూ! మాతో కలిసివుంటే చిత్రగుప్తుడు నీ పేరుకూడా చిట్టాలో ఎక్కిస్తాడు. అప్పుడు యమకింకరులు నిన్ను సల సల కాగే నూనెలో పడేస్తారు...అమ్మో! ఆ బాధ అనుభవించటం కష్టంకాదూ?...అదీకాక నాన్న గుండెలు బాదుకుని ఏడవడూ? నీ సంప్రదాయ జీవితం నశింపు కాదూ?'

అదేంకాదు...తప్పకుండా వొస్తాను.'

అక్కయ్య ఇంకేం మాట్లాడలేదు. గడియారం ఒంటిగంట మోగించింది. అతను నిద్ర వొస్తోందని పడుకున్నాడు. తన కర్తవ్యాన్ని గురించి ఆలోచిందుకుంటూ రెండు గంటలదాకా గడిపాడు. తరవాత చిన్న కునుకు పట్టింది...

శ్రీపతి రూం మార్చలేదు కాని ఇరవైనాలుగు గంటల్లో ఇరవైగంటలు అక్కయ్య ఇంటిదగ్గిరే గడుపుతున్నాడు. అతను డాక్టరుని 'బావ' అని మాత్రం పిలవటం లేదు. ఎన్నో విషయాలు అతనికి తెలిశాయి. ఎంతోమంది కొత్త వ్యక్తులతో అతనికి పరిచయం కలిగింది. డాక్టరు బలవంతాన క్లబ్‌లో మెంబరయ్యాడు. ఇద్దరూ కలిసి రాత్రి ఎనిమిదింటివరకూ పింగ్‌పాంగ్ ఆడుకుంటూ వుండిపోయేవారు.

అక్కయ్య నూతన జీవితాన్ని సూక్ష్మంగా పరీక్షించే అవకాశం కలిగిందతనికి. ఆమె లేచివచ్చిందన్న సంగతి ఎవరికీ తెలియదు. డాక్టరు కూడా తలిదండ్రులు లేరు. కావలసినవాళ్లెవరూ లేరు. ఇద్దరూ రిజిష్టర్డ్ మేరేజి చేసుకున్నట్టు చెప్పాడుట డాక్టరు. ఈ అబద్ధం ఆడకపోతే ఎంత సుహృదయులైనా హిందూ సంఘంలో క్షమించరన్న సంగతి అతనికి బాగా తెలుసు.

ఓనాడు తండ్రి తనను వెతుక్కుంటూ క్లబ్బుకు వచ్చాడు. తండ్రి క్లబ్బుకు రావటం ఇదే మొదటిసారి. రూంకు మొదట్లో వెళ్లాడట. తనీ మధ్య అసలు రూంకి రావటంలేదని, ప్రస్తుతం క్లబ్బులో వుంటాడనీ ఆ యింటి యజమాని అన్నాడట. దాంతో నాన్న తిన్నగా ఇక్కడికే వచ్చేశాడు. శ్రీపతి డాక్టరుతో పింగ్‌పాంగ్ ఆడుతూ లోకాన్నే మరిచాడు. తండ్రి పిలవగానే వెళ్ళాడు.

'వెంటనే రూంకి పోదాం పదారా...నీతో మాట్లాడాలి' అన్నాడు ముందుగు రెండడుగులు వేసి.

మళ్ళీ అక్కడికి వెళ్లిపోయాడు.

"మళ్ళీ ఎక్కడికిరా?" అని గర్జించాడు తండ్రి.

"ఆయనతో నేను వెడుతున్నానని చెప్పేసి వస్తా."

శ్రీపతి తండ్రివెంట, పితృవాక్య పరిపాలకుడిలా నడచి వెడుతుంటే డాక్టరు నవ్వుకున్నాడు. రూమ్ చేరుకున్నాక తండ్రి అడిగాడు: "ప్రథంగా మూర్ఖుని చదువుకు వేశాడివి. ఏం పోయ్యే కాలమొచ్చి ఆ క్లబ్బులో చేరావురా" డబ్బు తేరగా వస్తుందనుకున్నావా?..."హోటల్‌లో భోజనం చెయ్యటం లేదట. మరి యేం చేస్తున్నట్టు?" అతని కనుమానముగానే వుంది. దాపరిక మెందుకనుకున్నాడు శ్రీపతి.

"మా అక్క ఈ వూళ్లోనే వుంటుతోందట కదూ? అది మరో వెధవతో కారులో వూరేగుతుంటే మన రామాచారి చూచి చెప్పాడు. నిజమేనా? దాని మొహం తగలెయ్య. కుటుంబ గౌరవానికి చిచ్చు పెట్టింది"

శ్రీపతి వుద్రేకం అపుకోలేకపోయాడు.

"అరునాన్నా ... అక్కయ్య ననవసరంగా యేమనకు"

"అయితే దానిచర్యను సమర్థిస్తున్నావన్న మాట...దౌర్భాగ్యుడా? నాకంతా తెలుసు. దానింటి దగ్గరే నీ మకాం—దాని చేతి తిండి కూడా తింటున్నావు. నీ పాపం లక్ష జన్మాలకయినా తిరగదు. మరి నేనెందుకు చావటానికి?"

తెగేవరకూ తాడు లాగటమే మంచిది.

"నీకంత బాధగావుంటే నా గురించి శ్రమ పడొద్దు"

అప్రయత్నంగా శ్రీపతి చెంప ఛెళ్లుమంది. అతను మాట్లాడలేదు. ఎడం చేత్తో చెంప రాసుకున్నాడు.

"అవునుమరి...ఇన్నాళ్లూ చదివించాను కదూ మరి! అందుకు ప్రతిఫలం! "ఇప్పుడా రండు ముండ

కనపడగానే కళ్లు నెత్తిమీదికొచ్చి నాన్న కనపట్టం మానేశాడు. నీకు కొమ్ములొచ్చాయి. ఎలాగా తెగ తెంపులు చేసుకున్నావు కనక అలాగే చావు... నీకూ నాకూ బంధం నాస్తి" అనేసి ఆయన చకచక వెళ్లి పోయాడు. నాన్న తత్వం తనకు తెలుసు. ఎన్నను కుంటే ఏం లాభం? అయినా తనకంత పుత్రేకం చూపడు. అక్కయ్యను అనరాని మాట లంటుంటే తను క్షమించలేకపోయాడు. చేతిసంచీ పట్టుకుని, చింకిగొడుగుతో వెళ్లిపోతున్న నాన్నను చూడగానే అతనికి కళ్లమ్మట నీళ్లు తిరిగాయి. పోనీ—వెనకాల వెళ్లి బ్రతిమాలాడి తీసుకొస్తే!...

గదికి తాళం వేసి అక్కయ్య దగ్గర కెళ్ళాడు. అంతా వివరించాడు.

"నీయిష్టం. తండ్రీ కొడుకులమధ్య అనుబంధాన్ని ఛేదించావనే అపవాదు నాకెందుకు? అనవసరంగా అక్కయ్యకోసం నీ నైతికజీవితాన్ని పాడు చేసుకోకు."

అతని దుర్బల హృదయం ఘోరమంది. ఎటూ నిర్ణయించుకోలేకపోయాడు.

ఆకాశంలో చీకటి ఆవరిస్తోంది. చుక్కల్ని క్రమంగా మబ్బులు కబళిస్తున్నాయి వర్షానికి నాంది వాక్యం కాబోలు!

ఆవేళ డాక్టరు రాత్రి తొమ్మిదిదాటాక వచ్చాడు. రావటంతోనే గుండెల్లో బాధగావుందంటు పడుకున్నాడు. ఇద్దరి గుండెల్లోనూ రాయిపడింది. చేసిన తప్పులకి శిక్ష అనుభవించే సమయం వచ్చిందా? అయినా ఇంత చిన్న విషయానికి కంగారెందుకు? తాము చేసిన చర్యలు తప్పని భావించేవా రందరికీ క్షణక్షణానికీ ఇలాంటి అనుభూతులు తప్పవు. అక్కయ్య మాత్రం నవ్వుతూనే వుంది. గుండె కాచింది. శ్రీపతి నిలువునా కంపిస్తున్నాడు. ఏ తెగకూ చెందని వాడతను. అలాగని తటస్థుడూ కాడు. ఉభయ పక్షాల్లోనూ వున్నాడు. దేవుడు వున్నాడని నమ్మలేడు. లేడని ధీమాగా చెప్పటానికి తరతరాలనుంచీ వొస్తున్న ఆచారాలు, కట్టుబాట్లు ఆకాశాన్ని అంటుతున్న అనేక రకాల దేవుళ్ల గుళ్ళు అడ్డం వొస్తున్నాయి. అలాగే అక్కయ్య చేసిన పనిని పూర్తిగా సమర్థించనూ లేడు. ద్వేషించి వైదొలగనూలేడు. అతని తత్వం ఉభయ భ్రష్టత్వం. అందుకే అక్కకు లేని భయం అతనికి.

* * *

'నువ్వేం కంగారు పడకు. ఇదీయనకు అప్పుడప్పుడు వొస్తూంటుందిలే! తగ్గిపోతుంది. కొంచెం హార్ట్ వీక్ నెస్ అంతే' అంది అక్కయ్య. కాని పదైనా నొప్పి తగ్గలేదు. ఫోన్ చెయ్యగానే డాక్టర్ సీతాపతి వొచ్చాడు. అతనేదో చికిత్సలు చేస్తూ ఆ రాత్రికక్కడే వుండిపోయాడు. డాక్టరుకు సీతాపతి ముఖ్య స్నేహితుడు. అతని ఆంతరంగిక విషయాలన్నీ-ముఖ్యంగా అతని వివాహం గురించి అంతా సీతాపతికి తెలుసు.

'మరేం ఫరవాలేద'ని అభయమిచ్చాడు సీతాపతి. కాని ఆరాత్రే అతని అభయ హస్తాన్ని ఖండించి డాక్టరును ఎగేసుకు పోయింది మృత్యువు.

ఏడవటం తెలివితక్కువని బోధించిన అక్కయ్య కన్నీరు మున్నీరుగా ఏడ్చింది. ఎంతకాలం నుంచి దాచి వుంచిందో! భర్తను వొదిలివచ్చినప్పుడు కూడా అక్కయ్య ఏడవలేదు. ఆ సంగతి అతనికి బాగా తెలుసు. ఆకాశమంత యెత్తున హృదయ జ్వాలలు... ఇప్పుడామె బ్రతుకు?...ఎవరైనా ఛాందసుడి దగ్గరకు వెళ్లి అక్కయ్య జీవితాన్ని నేటివరకూ వివరిస్తే ఏం చెప్తాడు? ముందు అలాంటి పాపిష్టి గాథ విన్నందుకు చెవులు మూసుకుంటాడు గాబోలు! 'అంతే అవుతుంది నాయనా!...పాపానికి తగ్గ ఫలితం అనుభవించొద్దూ? కట్టుకున్న మొగుణ్ణి వదిలేసి మరొకడితో వుండటం రంకుతనం కదూ!...దానికి ప్రాయశ్చిత్తం అంటూ లేనేలేదు. చూడు నాయనా! అహల్య, మండోదరి, ద్రౌపది. వీళ్లందరికీ మల్లే పతివ్రతల్లా బతకొద్దూ? ఎందుకొచ్చిన పాడుబతుకు!' అని సమాధానం చెప్తాడు. మండోదరికి ఇద్దరు భర్తలట. ద్రౌపదికి అయిదుగురు వున్నా కర్ణుడిమీద మోజు వుండేదట. శ్రీపతి వెర్రిగా నవ్వుకున్నాడు. అక్కయ్య ఎంత కాలం ఏడుస్తుంది? అమ్మో! ఆమె కన్నీటికి ప్రపంచాలు మునిగిపోవూ? ఇంకెలా జీవిస్తుంది?...మరొకణ్ణి పెళ్లాడుతుందేమో!...

ఆమెను ఓదార్చటానికి అతను యత్నించలేదు. మర్నాడుదయం సీతాపతి వచ్చాడు. అతను కూడా చాలా బాధపడ్డాడు. అక్కను ఓదార్చటానికి ఎన్నో విధాల ప్రయత్నించాడు. డాక్టరు తాలూకు సొమ్ము బాంక్ లో ముప్పైవేల దాకావుంది. ఆమెకు బోలెడు నగలున్నాయి. ఇక

ముందు ఆర్థికంగా ఎలా నడుస్తుంది అన్నది ప్రస్తుతానికి సమస్య కావేకాదు. సీతాపతి ఆనాటినుంచి పాతస్నేహాన్ని పురస్కరించుకుని తరుచుగా వొస్తూండేవాడు. డాక్టరు పోవటం శ్రీపతికి మళ్ళీ సమస్యను సాధించి పెట్టింది. ఇప్పుడు అక్కయ్యకు "నా" అన్నవాళ్లెవరూ లేరు. అంటే ఒక్క శ్రీపతే! అంచాత అతను అక్కదగ్గరేవుంటూ ఆమె యోగక్షేమాలు గమనిస్తూవుండటం స్థిరపడిపోయింది. గది వదిలేసి బసమార్చాడు. అక్కయ్యకూడా ఆడంబరం తగ్గించింది. పనిమనిషిని మాన్పించింది. వీలైనంతవరకూ ఖర్చులు తగ్గించింది. శ్రీపతి తండ్రికి వుత్తరం రాశాడు కాని జవాబు రాలేదు. ఒకసారి తనే స్వయంగా వెళ్లాడు.

ఆ వూళ్లో నలుగురూ అతన్ని యీసడిస్తూ చూశారు. నోటికొచ్చినట్టు తిట్టారు. తండ్రిని చంపావన్నారు. అతను దిక్కులేని చావు చచ్చేందుకు తనే కారణమన్నారు. ఇల్లూవాకిలీ అమ్మేసి కొంతధర్మానికి, కొంత తనకిమ్మని ఏర్పాట్లు చేశాడు. శ్రీపతి తల బాదుకుని ఏడ్చాడు. "అంతా దొంగ ఏడుపు...నటన" అన్నారు. ఓ పెద్దమనిషి అతని ముందు డబ్బులెక్క పెట్టిప్పించాడు. శ్రీపతి అది కూడా ధర్మనిధికి కలపమన్నాడు. అతని గొప్పతనాన్ని ఎవరూ మెచ్చుకోలేదు.

"పాపం!... ఆ మారాజు ఎంతమంచివాడు! కొడుకు కెలాంటి వాడైనా కన్నకడుపుకదూ! అతని కన్యాయం జరగకూడదని సగం వాటా అతనికిచ్చాడు. మరోడైతే ఆ స్తంతా తగలెట్టటానికైనా వొప్పుకుంటాడు కాని ఇతనికివ్వడు. కుర్రతనం వాడికేం తెలియదు అంటూ పోయాడు. ఎంత పరువుగా బతికాడు! ఎంత నిష్ఠగా వున్నాడు! ఆచారం. కట్టుబాటు!...ఆహా హా! ఆయన కాయనేసాటి!" అన్నారు అందరూ.

శ్రీపతి తను పుట్టి పెరిగిన యింటికేసి వోమాటు చూసి వెనక్కి తిరిగాడు. అతనికి నాన్న ఎదురుగా కనిపిస్తూనే వున్నాడు. చిన్న పిలక - ఎప్పుడూ పంచలపాక చొక్కా - కళ్లల్లో కాఠిన్యం - తాను పట్టిన కుందేటికి మూడేకాళ్ళనే తత్వం—ఎంతో అభిమానం, ప్రేమ వున్నా వెల్లడించటం చేతకాదు. అర్థంలేని ఆవేశం—అతను తిరిగొచ్చి అంతా అక్కయ్యకు నివేదించాడు. అక్కయ్యకూడా భోరున ఏడవటంతో "ఆమె కెందుకు చెప్పావా?" అనుకున్నాడు.

* * *

శ్రీపతి జీవితక్రమమంతా మారింది. తన కుటుంబ చరిత్ర నలుగురికీ తెలిస్తే తనకు సంఘంలో వున్న గౌరవం నశిస్తుందేమోనని అతనికి భయంగానే వుంది. అతని తల్లిదండ్రులనుగురించి నలుగురూ అడిగారు. అతనేదో సమాధానం చెప్పుకున్నాడు. "ఫలానా లేట్ డాక్టరు గారి భావమరిదిని నేన"ని కొన్నిచోట్ల పరిచయం చేసుకున్నాడు.

శ్రీపతి ఇంటర్ ప్యాసై ఇంజనీరింగులో సీటు సంపాదించాడు. తను ఇంజనీరింగు చదవగలనని అతనెన్నడూ అనుకోలేదు. సీతాపతి ఇదివరకటికంటె తరుచు అక్కడికి వొస్తున్నాడు. నలుగురూ నాలుగు మాటలూ అనుకోటం అటుంచి శ్రీపతి కూడా కొంత ఫీల్ అయ్యాడు: ముగ్గురు నలుగురు అతన్ని గురించి చాటుగా అనుకోటం కూడా జరిగింది. ఏ ఇద్దరైనా నెమ్మదిగా మాట్లాడుకుంటూ మధ్య మధ్య అతనికేసి చూస్తుంటే అదంతా తనను గురించేనని అతను చాలాసార్లు అనుకోటం సంభవించింది. సీతాపతిని రావొద్దందామని చాలాసార్లనుకున్నాడు. కాని అక్కయ్య ఏమంటుందోనని కొంచెం భయం. తను లేనప్పుడు కూడా సీతాపతి వొచ్చేవాడు. అయితే అతను అక్కయ్యతో అంత తరుచుగా మాట్లాడటానికేం విషయాలున్నాయో మాత్రం అతని కంతుచిక్కలేదు.

ఇంజనీరింగు కాలేజీలో చేరిన నెలరోజులకు అతనోమాటు కాకినాడలో ఎగ్జిబిషన్ చూసి తిరిగి వస్తూ సామర్లకోటలో రైలుకోసం నిలబడ్డాడు. అతని భుజంమీద బరువైన చెయ్యి పడింది. వులిక్కిపడి వెనక్కి తిరిగాడు.

'శ్రీపతీ!... నేను జ్ఞాపకం వున్నానా?' అనడిగాడా వ్యక్తి. శ్రీపతి నిమిషంసేపు అతన్ని తేరిపార చూసి 'ఓ...బావ! ఏమిటీ అవతారం! కులాసాగా వున్నావా?' అనడిగాడు.

'ఈ అవతారం ఎందుకెత్తానో వూహించుకో. ఇది పదకొండో అవతారం.' అనేసి నవ్వాడు బావ.

శ్రీపతి కళ్లు నులుముకున్నాడు. బావకేసి చూడలేకపోయాడు. ఎందుకో బాగా గడ్డం పెంచాడు. బట్టలు మాసిపోయాయి. కళ్లు "పాతాళం ఇక్కడే నయ్యా! ఎందుకు అనవసరంగా వెదుకుతావు?" అంటున్నాయి. దవడలు రెండూ పీక్కుపోయాయి. మనిషి సగమయ్యాడు.

'రా బావా! స్టాల్‌కి వెళదాం.' అంటూ ఓవర్ బ్రిడ్జి క్రాస్ చేశాడు.

'నీకు బండికి టైం కాలేదూ?' అనడిగాడు బావ.

'ఇంకా అరగంటవుంది...అసలు సంగతేమిటి? ఎందుకిలాగైపోయావు?' అనడిగాడు పూరీ—కూరా అతని ముందుకు తోస్తూ.

'నీకు తెలియందేముంది? మీ అక్కయ్య వెళ్ళిపోయాక నేను పశ్చాత్తాపపడ్డాను. అంతా జరిగిపోయింది. ఎందుకులే అవన్నీ చెప్పుకోటం...అసలు నిన్ను పలకరించకూడదనుకున్నాను మొదట. మా అమ్మ—నాన్న ఇద్దరూ కలరావచ్చి పోయారు. నేనూ పోతే బాగుండును...తరవాత మీ సంగతి గురించి అంతా విన్నాను. నేను సుఖపెట్టలేక పోయాను. దానైన్నా సుఖపడనీ—'

రెండు జతల కళ్లు కన్నీటిని నింపుకున్నాయి. నాన్న ఇదివరకన్న మాటలు అతనికి జ్ఞప్తికొచ్చాయి... "అత్తగారికి ముసలితనం వచ్చింది కనక ఆవిడ త్వరగా కన్నుమూస్తుంది. అప్పుడు అక్కయ్య ఆ యింటికి రాణీ అవుతుంది. భర్తను తన కనుసన్నల్లో వుంచవచ్చు.' బావ ఎన్నడూ పూరీల మొహం ఎరగనివాడిలా ఆవురావురుమని తింటున్నాడు.

'ఇప్పుడెక్కడికి వెడుతున్నావు?'

'మాపూరే! ... పెళ్లి సంబంధం మాట్లాడానికి కాకినాడెళ్ళాను.'

'ఎవరికి? నీకా?'

బావ ఫకాలుమన్నాడు. 'నాక్కాదు, ఏం? నేను పెళ్ళికొడుకులా కనిపిస్తున్నానా? ఇంకీ జీవితానికి అలాంటి ఆశల్లేవు. మా చెల్లాయికి సంబంధం.'

బావ వెళ్ళాల్సిన బండి వొచ్చింది. మౌనంగా బండిలోకెక్కి కూర్చున్నాడతను. బండి కదులుతుంటే బావ అన్నాడు:

'మీ అక్కయ్యతో నన్ను క్షమించమని చెప్పు.'

'తప్పు బావా! అవేం మాటలు!' అన్న శ్రీపతి వాక్యాలు రైలింజను కూతలో కలిసిపోయాయి.

శ్రీపతికి బావగురించి ఇదివరకున్న అభిప్రాయాలు కొంచెం పరివర్తన చెందాయి. పాపం! అతని హృదయం అమాయకత్వంలో మునిగిపోయింది. నవనీతం లాంటిది...తల్లీ తండ్రీ కలిసి అతనిలో వున్న మంచిని అణచివేసి అతనికయిష్టమైన పనులు చేయించారు. అతన్నలా పెంచారు. తనను తండ్రి పుస్తకాల పురుగుగా—మూఢ నమ్మకాలకి—'ఏం? ఎందుకు?' అని ప్రశ్నించటానికి వీలులేని కట్టుబాట్లకు బానిసగా పెంచాడు. చివరి కాసంకెళ్లు అక్కయ్య తెంపాల్సి వచ్చింది. బావకివికాక జీవితం ప్రసాదించిన కొన్ని సమస్యలున్నాయి. అందులో మొదటిది సరైన వుద్యోగం కాని ధనకాధారం కాని లేకపోవటం—చెల్లాయి పెళ్ళొకటి—నలుగురూ అనుకుంటారు. 'అమ్మాయి అచ్చోసిన ఆంబోతులా తిరుగుతుంటే పెళ్లెందుకు చెయ్యరు? పెళ్ళానికి మల్లే ఇదికూడా వోనాడు వుడాయిస్తుంది' అంటారు. ఈ మాటలన్నీ పడుతూ—ఈ సమస్యలను ఛేదించటానికి మార్గం వెతుక్కుంటూవుంటే జీవితకాలం సరిపోతుంది. మీసాలు వరకూ గెడ్డం పెరుగుతుంది. జుట్టు తెల్లబడుతుంది. అగితే బావకు పట్టేట్టుగా వుంది. ఆవేళ బావను చూట్టంతో అతని మనసంతా చికాకుతో నిండిపోయింది. రాగానే అక్కయ్యతో అంతా చెప్పాడు. అతను వెళ్ళేసరికి సీతాపతితో మాట్లాడుతూనేవుంది. శ్రీపతి వుత్సాహంగా వుండలేకపోయాడు.

పిచ్చి పిచ్చి ఆలోచనల్తో ఆ రాత్రంతా అతనికి నిద్ర పట్టలేదు. జీవితాన్నంతా విమర్శించుకున్నాడు మళ్ళీ. మర్నాడు వుదయం లేచేసరికి కళ్లు మండిపోయాయి. తల బరువుగా వుంది. నాడి పట్టుకుని చూసుకుంటే జ్వరం వచ్చిందని తేలింది. నిద్ర లేకపోవటం మూలాన వచ్చింది. అదే తగ్గుతుందనుకున్నాడు కాని మధ్యాహ్నానికి పడుకోబెట్టేసింది. అక్కయ్య సీతాపతికి ఫోన్ చేసింది.

'ఎందుకక్కయ్యా! అదే తగ్గిపోతుంది. ఈ మాత్రం దానికి డాక్టరెందుకు?' అన్నాడు. వున్న విషయం, అతనికి సీతాపతి రావటం ఎంతమాత్రం యిష్టంలేదు. మరో పావుగంటకు అతను కారుమీద వచ్చి పరీక్ష చేశాడు. ఇంజెక్షన్ ఇచ్చేసి వెళ్ళాడు. తగ్గిపోతుందనుకున్న జ్వరం క్రమంగా టైఫాయిడ్‌లోకి దింపింది. సీతాపతి రోజుకు మూడుసార్లు వచ్చి చూసి పోతున్నాడు...ఇదికాక మరోసారి తీరిగ్గా వచ్చి

ఆమెతో కబుర్లు చెబుతూ కూర్చునేవాడు డాక్టరు పోయిన తరువాత సీతాపతికి ప్రాక్టీస్ మంచి జోరుగా వుంది.

అక్కయ్య రాత్రింబగళ్లు మంచంపక్కన కూర్చుని తనకు సేవచేసింది. ఒక్కొక్కనాడు తిండికూడా మానేసేది...అతను క్రమంగా కోలుకున్నాడు... కాని శ్రీపతి ఆలోచనలు మరో దిశలో విచిత్రంగా సాగిపోయాయి. ఒకవేళ అక్కయ్యకాని సీతాపతిని పెళ్ళిచేసుకుంటుందేమో! వాళ్ల మాటలతీరు—నవ్వులాటలు చూస్తుంటే అలాగేవుంది. అక్కయ్య లేచి రావటం సహించని తనను తానెలా ఊరడించుకున్నాడో—అలాగే—ఈ సంఘటన జరిగినా సహించుకుని తనను తాను ఊరడించుకోవాలి. అయినా సీతాపతి వివాహం చేసుకుంటాడా? అతనికి వెంటనే నవ్వొచ్చింది. అక్కడి బావ బతికే వున్నాడు. ఇక్కడి సంఘంలో అక్కయ్య విధవగా చలామణీ అవుతోంది......

* * *

ఈమధ్య ఏడింటికే శ్రీపతి మంచ మెక్కుతున్నాడు. అరయ్యేదాకా అతనికి మెలకువ రాదు. ఓనాడు అర్ధరాత్రి అతనికి మెలకువ వచ్చింది. ఎక్కడో గుసగుసలు వినిపిస్తున్నాయి. అతను లైటు వేసి పక్కగదిలో కెళ్ళాడు. అక్కడ సీతాపతి, అక్కయ్య కనిపించారు.

"అరే!...డాక్టరుగారెప్పుడొచ్చారు?" అన్నాడు. సీతాపతి కంగారుపడుతూ 'గంటవుతుంది' అన్నాడు.

"ఇలా మామూలుగా వొస్తుంటారా సరదాగా?" అని నవ్వుతూ అడిగాడు. ఎలాంటి సమాధానమూ రాలేదు. శ్రీపతి లైటు ఆర్పేసివచ్చి పడుకున్నాడు.. ఏమైనా సరే! ఈ వాతావరణంలోంచి తను బయటపడాలి......

ఇది ఆఖరుకు వ్యభిచార గృహంగా తయారయ్యేలా వుంది.

సీతాపతి వెంటనే వెళ్లిపోయాడు.

మర్నాడుదయం శ్రీపతి అవస్థపడుకుంటూ భయపడుతూ అడిగాడు: "అక్కయ్యా!... నువ్వు పునర్వివాహం చేసుకుంటావా?" అని. ఆ ప్రశ్న అడిగాడేకాని అతను అక్కయ్య మొహంలోకి ఏమాత్రం చూడలేక పోయాడు.

"ఏం!..అలాగ అడుగుతున్నావు? నాకలాంటి ఆలోచ నెప్పుడూ లేదు" అని సమాధానం ఇచ్చింది.

అతను సాయంత్రం యింటికి తిరిగొచ్చేసరికి అక్కయ్య అటుతిరిగి పడుకునుంది. వేళకాని వేళ యెందుకు పడుకునుంది? వంట్లో బాగాలేదేమో ననుకున్నాడు. అక్కయ్యను లేపబోయి కెవ్వుమన్నాడు. ...అతనికి ఏమీ స్ఫురణ లేదు. పెద్దగా ఏడుద్దామనుకున్నాడు కాని ఎవరో పీకనొక్కేసినట్టయింది. అది శాశ్వతనిద్ర. బల్లమీది ఉత్తరం చదువుకున్నాడు.

"తమ్ముడూ!

ఆత్మహత్య పాపమని చేతకానివాళ్లంటారు. అంతకంటే జీవిత శృంఖలాల్లోంచి బయట పడడానికి మంచిమార్గం లేదు. అందుకే నన్ను నేను అంతమొందించుకుంటున్నా.

మరి ఈ ఆత్మహత్యకు కారణం ఏమిటని అడగవూ? డాక్టరుగారంటే నాకెంతో గౌరవం. ప్రేమ—కానీకి కొరగాని నన్ను వివాహం చేసుకుని ఆయన ఉద్ధరించాడు. అటువంటి ఆయనకు ద్రోహం చేశాను. నా భర్తను వదిలిరావటం నేను ద్రోహం అనను... నా ఆత్మహత్యలో సీతాపతిగారికి వాటా తక్కువ. అందుకు ప్రాయశ్చిత్తం యిది. ఆ బాధ ననుభవిస్తూ కుమిలిపోయే దానికంటె యిది ఉత్తమం. ఇంక నేను బ్రతికి ఏంలాభం చెప్పు?

నువ్వు వట్టి అమాయకుడివి. తెల్లనవన్నీ పాలు—నల్లనవన్నీ నీళ్లు అని విశ్వసిస్తావు. గడుసుగా వుండటం నేర్చుకో. ఎన్ని మానసిక బాధలున్నా అన్నింటినీ అణిచేసుకుని నాలా పైకి నవ్వుతూ కనపడాలి. అప్పుడే ఈ సంఘంలో బ్రతకగలవు. అంతేకాని అడుగడుగునా భయపడుతూ జీవయాత్ర సాగించలేవు. కొంత తెగింపు. ఎదిరించే శక్తి వుండాలి. అందుచేత అనవసరంగా గడచిన వాటిని తల్చుకుని వివేక బుద్ధిగా చదువుకుని ఉన్నతస్థితికి రా. నీ జ్ఞానతృష్ణకి ఆయనకూడా కారకులు గనుక నన్ను మర్చిపోయినా ఆయన్ను జ్ఞాపకముంచుకో... నా కిలాంటిగతి పట్టిందికదా అని నాలా తెగించిన వాళ్లందరికి జీవిత పర్యవసానం ఇదేనని నేను విశ్వసించను. చిన్నవాడవయినా నా పొరపాట్లు క్షమించు...ఆశీస్సులు..."

శ్రీపతి ఉత్తరం భద్రంగా దాచాడు. మళ్ళీ మొప్పాలైయినా అక్కయ్య ఆదేశాన్ని చదువుకోవమ్మ కర్మకాండంతా పూర్తయ్యేసరికి రాత్రి తొమ్మిదైంది. ...శ్రీపతిని ఓదార్చటానికి కూడా లేరు. అనుకోటానికి బంధువులెవరూ లేరు. బావకు టెలిగ్రాం ఇద్దామనుకున్నాడు. అనవసరంగా అతన్నెందుకు శ్రమ పెట్టటం! ఆ రాత్రి అతనింటిదగ్గ రుండలేక పోయాడు. ఎక్కడ చూసినా అక్కయ్యే కనిపిస్తోంది. కొంచెం భయం వేసింది కూడా. అక్కయ్యకు మల్లే తనూ "స్లీపింగ్ టాబ్లెట్స్" ఓ డజను వేసుకుంటే... శ్రీపతి తలుపు తాళం వేసి బయలుదేరాడు. తిన్నగా వెళ్ళి పార్కులో కూర్చున్నాడు.

వాతావరణం ప్రశాంతంగా వుంది. గాలికూడా స్తంభించి పోయింది. ఆకాశంలో నక్షత్రాలు చీకటిని చూసి భయంతో వొణుకుతున్నాయి. శ్రీపతి చెక్కిళ్ళమీదుగా నయాగరాజలపాతంలా నీరు ప్రవహిస్తోంది. అతనికి గడచిన జీవితం అంతా జ్ఞప్తికొచ్చింది.

నాన్న!....ఎవర్నీ మెప్పించలేని జన్మ! చచ్చినవాడి కళ్ళుచేరడని చనిపోయాక అందరూ పొగిడారు. పిచ్చివాడిలా తిరిగాడు. తన బాధస్తంతో కొడుకును దూరం చేసుకున్నాడు. అయినా నాన్న తన కోసం ఎంత శ్రమించాడు! తను కృతఘ్నుడు కదూ! జంతువులకైనా కుక్కకైనా కృతజ్ఞత వుంటుంది. మానవుడికుండదు. గర్భశోకం గురించి తనకేమీ తెలియదు. తెలియక పోవటమే మంచిది. ఇంక బావ!...పిచ్చి బావ! అమ్మ నాన్న పన్నినవల్లో చిక్కుకుని రాలేక బాధపడ్డాడు. ఇంకా అతనెన్ని బాధలు అనుభవించాల్సి వుందో!...లేక అతనుకూడా అక్కయ్యకు మల్లే హఠాత్తుగా శూన్యంలో కలిసిపోతాడేమో!... ఇంక అక్కయ్య! అమ్మో! అదో గంభీరస్వరూపం... దాన్ని తెల్సుకోలేం...ఇంక తను? సిమండ్స్ అన్నాడు..."నీ గురించి నీకు పూర్తిగా తెలియదు." అదీ నిజమే ననిపించింది. ఇంటర్‌లో చేరేవరకూ తన అభిప్రాయాలు!...దేవుడంటే అమితభక్తి!

ఈ రెండేళ్లలో తను పూర్తిగా మారాడు. వచ్చిన కొత్తలో అనాది మానవుడికీ - తనకూ మధ్య అంతరం మాత్రమే దూరం—తన భావాలు, అభిప్రాయాలు అన్నీ విపరీతంగా మారిపోయాయి. స్కూలు ఫైనలు దాకా గడచిన అతని జీవితక్రమం స్ఫురణకు వచ్చింది ..ఆరుదాటకుండా లేవాలి. ఆరున్నరకల్లా గణగణమని గంటమోగిస్తూ నాన్న పూజకు నాందీవాక్యం పలికేవాడు. విధిగా తను పూజ అయ్యేవరకూ ఆ ఇత్తడి విగ్రహాలకు నమస్కరిస్తూ కూర్చోవాలి. భక్తిలేకపోయినా అథవా వున్నట్లయినా నటించాలి... అదవగానే చద్దన్నం తినేసి పుస్తకం చదువుకోవాలి. మధ్యమధ్య నాన్నవచ్చి తనిఖీ చేస్తుంటాడు. బయటికి పోకూడదు. సినిమాలు చూడకూడదు. అగ్నా చూసినా పోతన-త్యాగయ్య-లాంటి భక్తిరసచిత్రాలకే ప్రవేశం. పత్రికలూ-నవలలూ చదవకూడదు. టంచనుగా అయిదయ్యేసరికి పుస్తకం పుచ్చుకొని చదువుకోవాలి. షికార్లకు పోకూడదు. ఇదీ అతని జీవితం. ఇంటి దగ్గర్నుంచి స్కూలుకున్న రెండు ఫర్లాంగుల రోడ్డు తప్పించి అతనికేమీ తెలీదు. తెలుసుకోవలసిన అవసరం కూడా లేదు.

కాని ఇప్పుడు! అంతా మారిపోయింది.

పన్నెండుగంటలవరకూ అతనక్కడే వున్నాడు నైట్ వాచర్ అతన్ని బైటికి పంపాడు.

అంతులేని ఆలోచనల్తో చీకట్లో ఒంటరిగా నడుస్తూ వస్తున్న శ్రీపతిని ఏటి వొడ్డున గంభీరంగా నిలబడిన క్లాక్ టవర్ 'నీ భావిజీవితం గురించి ఆలోచిస్తున్నావా?' అనడిగి నట్టయింది.

అతను వెర్రిగా నవ్వుకుంటూ కటిక చీకట్లో కలిసిపోయాడు.

కలగూరగంప

జాతక చంద్రికపై పండిత మీమాంస:

శ్రీ ఆదిరాజు అన్నాజీరావు

శ్రీ పిడపర్తి చినకృష్ణమూర్తి శాస్త్రి గారి, శ్రీ వరఘుల చినసీతారామస్వామిశాస్త్రిగారి అభిప్రాయ భేదములు-

శ్రీ పూసపాటి విజయరామగజపతి (1670-1757) మీర్జా-మన్సుల్తాన్-మహారాజా-ముశే-రీపుల వలన వగైరా వారియొక్క 199 వర్ధంతి మహోత్సవ సందర్భమున 24-1-1956 తారీఖున సాయంత్రం సభ నివ. ద్వహోరమున-శ్రీ వారి చిత్రఫలకావిష్కరణము-వారిచే సంస్కృతమునుండి ఆంధ్రీకరింపబడిన జ్యోతిష ఫలగ్రంథరాజము పారాశరీయ హోర (విజయ రామరాజీయం) యొక్కయు ముద్రిత ప్రతుల ప్రకటన సందర్భమున శ్రీ "కళా ప్రపూర్ణ" వరఘుల చినసీతారామస్వామిశాస్త్రిగారి అధ్యక్షతను సభ జయప్రదముగ వర్తించినది. శ్రీ అధ్యక్షుల వారు తొలిపలుకులందు జాతకచంద్రికను గూర్చి కొన్ని విషయములను ప్రస్తావించిరి. అందు మూడు విషయములయందు అభిప్రాయ భేదము-సభాముఖమున బ్రహ్మశ్రీ పిడపర్తి చినకృష్ణమూర్తిశాస్త్రిగారు సవినయముగ ప్రతిపాదన చేసిరి-ఆవిషయములను దిగువ పొందుపరచుచున్నాను.

1. ప్రతిలగ్నం సమాలక్ష్య పూర్వోద్దిష్టవిరోధతః
తత్తద్గ్రహస్వరూపాణి క్రమేణైవం వివృణ్మహే

అని ప్రతిజ్ఞచేసి- మేషలగ్నమునకు - "కవిర్నాతో న్నహంతా స్యాత్ మారకత్వేన లక్షితః" అనుశ్లోకము పూర్వగ్రంథమునకు విరుద్ధము. ఎట్లన "వదిశంతి శుభం నృణాం సౌమ్యాః కేంద్రాధిపా యది". మరియు "అష్టమం హ్యాయుషస్థానం అష్టమాదష్టమం చ తత్ తయోరపి వ్యయస్థానం మారకస్థానముచ్యతే" అని చెప్పుట వలన శుక్రునకు కేంద్రాధిపత్యము-ద్వితీయ సప్తమ మారక స్థానములకు ఆధిపత్యము కలిగిన శుక్రుడు మారకుడు కాడని చెప్పుట-పూర్వోత్తర భాగములకు విరోధము కనుక, మరియొకడు ఉత్తర పారాశరిని చేసి ఇందుల జతపరచినట్లు అభిప్రాయమును వ్యక్తపరచిరి.

అనంతరమందు శ్రీ పిడపర్తి చినకృష్ణమూర్తి శాస్త్రిగారు ప్రసంగించుచు ఈ సందర్భమున శ్రీ శాస్త్రిగారు వ్యక్తపరచిన పూర్వాపర విరోధము లేదని గ్రంథమంతయు సాంతముగ విమర్శించ ఏకకర్తృకమనియు చెప్పుచు స్వాభావికముగ, ఆధిపత్య ప్రతిపాదితములు శుభపాపత్వములను మేళవించి నిష్కర్షచేసి గ్రంథకర్త చెప్పెనని చెప్పుచు పూర్వభాగమున "కేంద్రాధిపత్యదోషస్తు బలవాన్ గురుశుక్రయోః, మారకత్వేపి చ తయోర్మారకస్థాన సంస్థితిః"—అనగా గురు శుక్రులకు కేంద్రాధిపత్య దోషము బలముకలది. గురు శుక్రులకు మారకత్వము కలుగుచుండగ (అనగా మారక స్థానాద్యాధిపత్యముచే కలిగిన మారకత్వము కంటె మారకస్థానస్థితి బలముకలది. అనగా కేవల మారక స్థానాద్యాధిపత్యమువలన శుక్రుడు ప్రబల మారకుడు కాడనుట స్పష్టము. ప్రబల మారకుడే మారకమును చేయును. ఇదియు లోక ప్రసిద్ధిని పొందినది. ఈ విషయము నే ఉత్తర భాగమున బలపరచి చెప్పెను. మారకత్వేన లక్షితః, ఆధిపత్యముచే మారకుడగు కవిః శుక్రుడు, సాక్షాన్న హంతా-తావన్మాత్రముచే (అన్య సహాయము లేకుండగ) చంపువాడుకాడు. కనుక ఈ చెప్పుట పూర్వభాగమునకు విరుద్ధము గాదు. అని సమన్వయ పరచుచు, ఈ రీతిగ విమర్శించుచో పూర్వోత్తర భాగములకు భేదములేదు కనుక ఏకకర్తృకమేయనియు, భిన్నకర్తృకము కాదనియు ప్రసంగించిరి.

(2) పశ్యంతి సప్తమాన్ సర్వే శని జీవ కుజాః పునః
విశేషతశ్చ త్రిదశ త్రికోణ చతురశ్రగాన్.

"సంజ్ఞాం బ్రూమో విశేషతః" అని వెనుకటి శ్లోకములో చెప్పుటచే - వీరి పారాశరహోరయందు - బృహజ్జాతకాదులందు వరాహమిహిరాదులు చెప్పిన-పాదదృష్టి - అర్ధదృష్టి త్రిపాద దృష్టులను పారాశరి గ్రంథకర్త అంగీకరించలేదు కనుక - పరాశర తంత్రమున పాదార్ధ త్రిపాద దృష్టులను ఫలవిశేషములపట్ల చూపె నవసరము లేదని శ్రీ వఝల చినసీతారామస్వామి శాస్త్రిగారు సెలవిచ్చిరి.

అనంతరమందు శ్రీ పిసుపర్తి చినకృష్ణమూర్తి శాస్త్రి మాట్లాడుచు ఈ సందర్భమున పాద - అర్ధ - త్రిపాద దృష్టులు శని - గురు - కుజులకు లేక పూర్ణ దృష్టితో చూచెదరు. అనగా 3—10 గృహములను అన్ని గ్రహములు పాదదృష్టితోను, శని - విశేషతః అనగా పూర్ణదృష్టితోను, 5, 9 గృహములను అన్ని గ్రహములు అర్ధదృష్టితోను గురుడు విశేషతః అనగా పూర్ణ దృష్టితోను, 4, 8 గృహములను అన్ని గ్రహములు త్రిపాద దృష్టితోను—కుజుడు - విశేషతః అనగా పూర్ణ దృష్టితోను చూచునని విశేషమును చూపెనుగాని పరాశర తంత్రమున సర్వాత్మనాపాద దృష్టి - అర్ధదృష్టి, త్రిపాద దృష్టులను ఫలవిషయము పట్ల గ్రహించ కూడదని - గ్రంథకర్త అభిప్రాయము కాదు. "అనుక్త మన్యతో గ్రాహ్య" మని చెప్పియుండెను కనుక—గ్రంథకర్త చెప్పిన విశేషదృష్టిని- అన్య గ్రంథకర్తలచే చెప్పబడిన సామాన్యదృష్టిని జతపరచి చూడవలయునని గ్రంథకర్త అభిప్రాయ మైనట్లు— శ్రీ॥ వ॥ చిన సీతారామస్వామి శాస్త్రిగారితో గల అభిప్రాయ భేదమును వ్యక్తపరచిరి.

3. సర్వే త్రికోణ నేతారో గ్రహాః శుభ
ఫల ప్రదాః
పతయ స్త్రిషడాయానాం యది పాప
ఫల ప్రదాః

అను శ్లోకమునకు శ్రీ॥ వ॥ చిన సీతారామస్వామి శాస్త్రి తాత్పర్యమును విశదపరచుచు త్రికోణములకు (1-5-9) అధిపతులగు అన్ని గ్రహములు శుభఫల ప్రదులు. అన్ని గ్రహములకు 3-6 11 లకు ఆధిపత్యం కలిగిన పాపఫల ప్రదత్వము అనియు సెలవిచ్చిరి.

అనంతరము శ్రీ పిసుపర్తి చినకృష్ణమూర్తి శాస్త్రి గారు ఉపన్యసించుచు ఈ సందర్భమున యది అను అవ్యయమువలన ఏ గ్రహములకు త్రికోణాధిపత్యము కలదో ఆ గ్రహములకు త్రిషడాయాధిపత్యము కలిగిన శుభత్వము పోయి పాపత్వము సంభవించునని మకర లగ్నమునకు షష్ఠ భాగ్యాధిపతి యగు బుధుడు పాపి యగుచున్నాడని తమ అభిప్రాయభేదమును ప్రకటన చేసి తమ ఉపన్యాసమును విరమించి అధ్యక్షుల యొద్ద సెలవు గైకొని సభ ముగియకుండగనే వెళ్ళిపోయిరి.

తరువాత శ్రీ అధ్యక్షులు ప్రసంగించుచు ముందు త్రికోణములను — తరువాత త్రిషడాయములను — అనంతరమందు కేంద్రములను క్రమముగ చెప్పుటచే పిసుపర్తి చిన కృష్ణమూర్తి శాస్త్రిగారు చెప్పినది శాస్త్రీయ మార్గము కాదని, సాహిత్య పరిజ్ఞానము లేక చెప్పిన విషయమని వారి పరోక్షమున విమర్శించిరి

4. ఇచట నా విమర్శనమును పొందుపరచు చున్నాను.

కొన్నిట కేవలము తృతీయషష్ఠ లాభాధిపత్యములు కలవు. కొన్నిట కోణాధిపత్యముతో కూడిన త్రిషడాయాధిపత్యములు కలవు

శ్రీ పిసుపర్తి చినకృష్ణమూర్తి శాస్త్రిగారు చెప్పిన అర్థమును గ్రహించిన-కేవలతృతీయ షష్ఠ లాభాధిపతుల శుభ పాపత్వ విచారణ కాదు-శ్రీ సీతా రామస్వామి శాస్త్రిగారికి గ్రహించిన త్రిషడాధి పత్యములు, త్రికోణాధిపతికి వచ్చినప్పుడు శుభపాపత్వ నిర్ధారణ పూర్తిగాదు. గ్రంథకర్త ద్వాదశ భావముల యొక్క ఆధిపత్యములచే కొన్ని విషయములను చెప్పి కొన్ని విషయముల చెప్పలేదనుట సబబు గాదు కనుక విచారణచేయగ-ఈ ఈఇద్దరి పండితుల అభిప్రాయములను ఒకచో మేళవించి చూచిన శాస్త్రీయములని స్పష్టపడుచున్నది-ఎట్లనగా యది అను అవ్యయమును-కలిపి ఒకసారి. కలుపకనొకసారి సమన్వయము చేసిన చక్కగ కుదురుచున్నది

1. "త్రికోణ నేతారః సర్వేగ్రహాః శుభఫల ప్రదాః (2) త్రిషడాయానాం పతయః అశుభఫల ప్రదాః (3) త్రికోణ నేతారః త్రిషడాయానాంపతయో యది అశుభ ఫలప్రదాః" అని సమన్వయము చేసిన అన్ని విషయములు సంగతములగుచున్నవి- శ్రీ వఝల చిఃసీతారామస్వామి శాస్త్రిగారు చినకృష్ణమూర్తి శాస్త్రిగారు-చెరియొక వ్యాఖ్యా

మును ఆధారముచేసుకొని ప్రసంగించియుందురు-ఇట్టి తరి శ్రీ చినకృష్ణమూర్తి శాస్త్రిగారు సభాముఖమున విమర్శక దృష్టితో నిర్ధారణకాకుండగనే అభిప్రాయభేదమును తెలియపరచిన మాత్రమున అన్యథాబలు-వారి పరోక్షమున న్యూనతగా విమర్శించుట "వృద్ధాస్తే న విచారణీయ చరితాః" అను భవభూతి వాక్యమును స్మృతిపథమునకు తెచ్చుచున్నది.

దైవజ్ఞపుంగవులు ఈ మూడు విషయముల యందును ఈ పండితద్వయముయొక్క అభిప్రాయములను-మూడవ విషయమున ప్రత్యేకముగా నా అభిప్రాయమును విమర్శించి పత్రికాముఖమున తమ అభిప్రాయములను వ్యక్తము చేయగోరుచున్నాను.

నందవరీక మంత్రులు

శ్రీ కొత్త భావయ్యచౌదరి

నియోగి బ్రాహ్మణులలో నందవరీక మంత్రుల చరిత్ర ప్రాచీనమైనదిగ కన్పడుచున్నది. వీరిలో కొందరు దిమకుగల యద్భుత మహిమలచే ప్రసిద్ధికెక్కినదే గాక, నందరాజువలన యగ్రహారములు పొందిరట. నందరాజునకు కాశీకిపోవుటకై యోగశక్తులనొసంగగా, నతడు నియమాగ్రమున నిత్యము కాశికేగువాడట. మంత్రశక్తులను జల్లి యప్పటి కప్పుడు రానిమోడునకు చిగుళ్లు వచ్చునట్లు చేయుటయు చాముండేశ్వరీ మహాశక్తిని సాక్షిగా సాక్షాత్కరించునట్లు చేసిరనియు పరంపరా జెప్పుకొందురు. వీరి మంత్రతంత్రము లెట్లున్నను, అప్పటినుండియు పారంపర్యముగా నగ్రహారీకులై రాజసభలందు పేరుగాంచుచున్నట్లు విదితమగుచున్నది. 16 వ శతాబ్దినుండియు మనకు తెలిసినంతలో వీరిలో వాత్సేయ గోత్రజులందు రొనుముచింతలవారు ప్రసిద్ధికెక్కినవారు. వీరికి మూలపురుషుడు చెన్నమరాజను నతడు. ఈయనకు అయిలమాంబ యను సతీరత్నమువల్ల లక్ష్మీపతి, కొండయ్య, తిమ్మయ్య, కృష్ణమంత్రి యను వారలు జన్మించిరి. ఇందలి కొండమంత్రికి తిమ్మన, తిమ్మన మంత్రులనువారు జనించి ప్రసిద్ధికి వచ్చిరి. ఇందలి తిమ్మన విజయనగరరాజ్యమున మంత్రులలో నొకడుగా పేరొందెను. పెనుకొండ రాజ్యమును శ్రీరంగరాయలు (1566-1586) పాలించుచుండగా నతడు మంత్రిత్వము వహించుటయే గాక నా రాజన్యుని దక్షిణ భుజాదండమని, మతికెక్కెను. ఆయనచే "గజవాహవాందోళికా సితచ్ఛత్రములు" బహుమానముగా బొంది ప్రసిద్ధికెక్కెను. శ్రీరంగరాయల రాజ్యపాలన ముగిసిన పిమ్మటగూడ నతడు రెండవ వెంకటపతి రాయల పాలనలో నుండి (1586-1614) యనేక రాచకార్యములను చక్కబెట్టుచు, రాయనచే పొగడ్తల నందుటయే గాక విపక్షులు గాని మన్నె సరదారులను జయించి రాతనికి పాదాక్రాంతులుగ జేయగల్గెనట. ఈ మంత్రివర్యుని కీర్తి దశదిశల వ్యాపించగా, నుత్తరదేశమున గల రాజాస్థానము లెల్లెడల నీయనను నుతించుచుండిరట. ఈయన పినతండ్రి యగు కృష్ణమరాజు దానరాధేయుడుగా కీర్తివహించెను. ఈతడుగూడ విజయనగర రాష్ట్రమున ప్రసిద్ధ మంత్రివర్యుడే. అందుననే యాతడు "సకల భువనైక భవపాళి" కి నయనచో మాన్యుల విధిన హాసిత జిష్ణుహితమంత్రి యని చెప్పబడినాడు. ఈ సకల భువనైక భవనము రాయలవారిదే గాని యన్యము గాదనవచ్చును. విజయనగరములోని కృష్ణదేవరాయల భువనవిజయము వంటిది పెనుకొండలో నిర్మింపబడి యుండును. ఈ కృష్ణ మంత్రికి బసవాంబయను భార్యయందు తిమ్మన, లింగన యను యిర్వురు మంత్రు లుదయించిరి. తిమ్మమంత్రి మిక్కిలి యౌదార్యవంతుడనియు, నతని తమ్ముడగు లింగమంత్రి శ్రీరామునికి లక్ష్మణునివలె విధేయుడై మెలంగినవాడనియు జెప్పెదరు. ఈ లింగమంత్రి 1594 ప్రాంతీయుడై పెమ్మసాని పెదవీర నృపాలుని సమకాలికుడై యుండెను. వీరి చర్యలను రాయలు మిక్కిలి మెచ్చుకొనుచుండెనట. తిమ్మమంత్రికి వెంకటపతి, శ్రీహరి యను యిర్వురు కుమాళ్లు జనించిరి. ఈతిమ్మమంత్రి తన కాలములో బ్రాహ్మణపల్లె యందొక గోపాలస్వామి యాలయమును నిర్మాణమొనరించి, యాడకి గ్రామమందొక వనమును ప్రతిష్ఠించి, చెరువొకదానిని త్రవ్వించి, బ్రాహ్మణులకు వేదశాస్త్రములను, నేర్పించి పేరొందెను. శ్రీహరి మంచి [illegible], రాజ సభలందు సముచిత ప్రసంగములలో నారితేరి, యుద్ధములందు గూడ బాల్గొనుచు ప్రసిద్ధి

కెక్కెను. లింగమంత్రి 1594 లో చింతలరాయస్వామికి సూర్యగ్రహణకాలమున గొంత భూమిని (పెమ్మసాని నారసింహనృపాలుని త్రిము) నొసంగెను. శ్రీహరికి మంగపతియను కుమారుడు జనించెను. ఈతడు గూడ నొక మంత్రి వర్యుడుగానే ప్రసిద్ధికి వచ్చినట్లు కనపడుచున్నది.

ఇక మంత్రివర్యుడగు మంగపతికి జనకుడైన శ్రీహరికి తాతగారి జ్యేష్ఠులైన లక్ష్మీపతి కొండయ మంత్రులలో లక్ష్మీపతి కిర్వురు భార్యలుండిరి. చౌడాంబిక, తిప్పమాంబ యనువారు. వీరిలో చౌడమకు వెంకటామాత్యుడు, తిప్పమాంబకు చెన్నమరాజు, రామచంద్రుడు, తాయన, అను మువ్వురుకుమారులు గల్గిరి. వీరందరును రాయల యాస్థానములోనే యుండి రాచకార్యములందు ప్రసిద్ధిగాంచుచుండిరి. ఇందలి చెన్నమరాజునకు బాలకొండమయను సతివల్ల శేషమంత్రి జనించెను. ఈ శేషమంత్రి తన తల్లిదండ్రుల పేర అగ్రహారము లిచ్చిన దనియు, రాయలవారే గాక, రాజాధిరాజులు గూడ తల లూచునట్లు తన ప్రజ్ఞావిశేషములు కనబరచె ననియు చెప్పబడినది.

శేషమంత్రి రామాంబ, సర్వమాంబలను యిర్వురుభార్యల బెండ్లాడెగా సర్వమాంబయందు తిమ్మన, లక్ష్మీపతి, చెన్నయామాత్యుడు, తాయన యనువారిని గాంచెను. వీరు నల్వురును రాజాస్థానములందు దండనాయకులు మంత్రులుగా ప్రసిద్ధికెక్కిరి.

ఇందలి చెన్నమరాజు పెమ్మసాని తిమ్మభూపాలునికి మంత్రిగా గండికోటరాజ్యమునందుండెను. తిమ్మభూపాలుడు వెంకటపతి రాయలవారికి సామంతుడై, యీయనకు మహమ్మదీయులకు జరిగిన అనేక యుద్ధములలో పాల్గొని "గండరాదిత్య, గండరగండ, మన్నె మార్తాండా"ది బిరుదములను, గరుడ నారాయణ బిరుదధ్వజము, బంగారుపూవుల చంద్రకావిపావడ, తురాయి, గజము, అశ్వము, వీరముల హారికంఠమాలిక, తాళిచౌకట్లు, ముత్యాల కడియాలు, గండపెండెరము, కత్తి, కమ్మ మున్నగు బహుమానములను బొందగలైను. ఈ బహుమతులు చెన్నమరాజను మంత్రి రాయల యాస్థానమునుండి తెచ్చి యొసగగా తిమ్మభూపాలుడు తన మంత్రికి ప్రీతితో రాయదత్తమైన.కుళ్లాయి మీది పాగ, ధవళ శంఖము, పల్లకి, తాళిచౌకట్లు ఒసంగి గౌరవించెను. రాయలవారు చెన్నమంత్రికి "పంచ కళాంజి" బట్టించుకొనుటకు (అనగా చామరములు వేయించుకొనుట) ఆజ్ఞయిచ్చిరట. ఈ పంచకళాంజి పట్టించుకొను గౌరవము రాజులకు మంత్రులకే కలదు. ఈ చెన్నయామాత్యుడు గండికోటరాజ్యము (ఇది కమ్మవారిది) నందు ప్రధానియగుటవల్ల, నచటి తాడిపత్రిలో గోపాలకృష్ణ ప్రతిష్ఠ యొనర్చియు. ఆ స్వామికి కిరీట పీతాంబరము లొసంగియు, యాడికివద్ద కోనే రొకటి, వనమొకటి వేయించియు, తన తల్లిపేర సర్వమాంబాపురాగ్రహార నిర్మాణము జేసియు, మిక్కిలి కీర్తి వహించెను. ఈతడు కేవల మంత్రివర్యుడగుటయే గాదు, పండిత కవియగుట వలన "చారుచంద్రోదయము" అను కావ్యమును రచించి తన యిలవేల్పగు గోపాలకృష్ణస్వామి కంకితమొసంగెను.

ఈ చెన్నమరాజునకు యల్లమాంబ, అక్కమ్మ యను యిర్వురు సతీమణులుండిరి. ఇందలి యల్లమాంబ వల్ల గోపాలామాత్యుడు, శేషమంత్రియను యిర్వురు కుమారులు జనించి తండ్రియుండగనే ప్రసిద్ధ మంత్రివర్యులై, పుత్రపౌత్రులతో వలరారుచు ప్రసిద్ధికి వచ్చిరట.-గోపాలామాత్యుడు "రాజనీతి విలసద్బాహాపరాభూతి గోపాలామాత్యుడని" చెప్పబడినాడు. ఇతను బంధు రక్షణ కళాపాండిత్య సంస్తుత్యుండట. శేషయామాత్యుడు "మంచివనికె, జననుతిప్రజ్ఞ నుపకారఘనమనీష సభ్యసాంగత్యము"లు గల్గియుండి పేరొందెనని చెప్పబడినది. ఇటే నందవరీక బ్రాహ్మణులలోని యీమునుచింతల వంశీకులు ప్రసిద్ధమంత్రివర్యులుగా మొదటి శ్రీరంగ రాయలకాలము (1575-1586) నుండియు పనిజేయుచు మహమ్మదీయుల దాళకు విజయనగర హిందూరాజ్యము లెక్కనేయక పెనుగొండలో నిలుచువందాక దాదాపు 1650 వరకు నున్నట్లు కనబడుచున్నది. వీరి కాలములో వైష్ణవమతము మన దేశమున బాగుగా ప్రోత్సహింపబడి వృద్ధిలోనికి వచ్చినట్లు, యిందలి మంత్రుల కథనములవల్లనే స్పష్టపడగలదు.

ఈ వ్యాసమునకు చెన్నమరాజు ప్రణీతమగు చారుచంద్రోదయ ప్రబంధమును, యితర చరిత్రలు మూలాధారములు. చారుచంద్రోదయ మింకను అముద్రితముగా ఓరియంటల్ మానుస్క్రిప్ట్సు గ్రంథాలయములో నున్నది.

జీవశాస్త్రంలో విచిత్ర పరిణామాలు

జంతువులనుంచి గాని, వృక్షములనుంచి గాని సజీవ పదార్థాని సేకరించి దానిని మైక్రోస్కోపుతో పరీక్ష చేస్తే అది లక్షోపలక్షల జీవకణాల సంపుటీకరణంగా మనకు కనుపిస్తుంది. ఇలాంటి ప్రతి కణం (Cell) లోనూ మధ్యగా కేంద్రకం (Nucleus) ఒకటి వుంటుంది దీనిచుట్టూ సైటోప్లాజమ్ (Cytoplasm) ఆవరించి వుంటుంది. ఈ సైటోప్లాజమ్‌లో ప్రోటోప్లాసమ్ అనే ముఖ్యమైన పదార్థం ఒకటి వుంటుంది.

ఈ జీవకణాల విభజనవల్లనే జీవపదార్థం పెరుగుతుంది. ఈ జీవకణంలోని కేంద్రకం ఉన్నట్టుండి గోళాకారస్థితిని కోల్పోయి సన్నని దారపు పాములా విస్తరించి పోగుగా సాగుతుంది. అనంతరం ఈ పోగు దానంతటికదే ముక్కలు ముక్కలుగా విడిపోతుంది. ఇలా విడిపోయిన ముక్కలను శాస్త్రవిజ్ఞానవేత్తలు 'క్రోమోజోము' లంటున్నారు. ఇలా యేర్పడిన క్రోమోజోములు, కణంలో ఎడమవైపున వున్నవి ఎడమవైపుకూ, కుడివైపున వున్నవి కుడివైపుకూ జరిగి రెండువైపులా రెండు క్రొత్తకేంద్రకాలుగా ఏర్పడతాయి. ఈ పరిణామాన్ని అనుసరిస్తూ తొలికేంద్రకం చుట్టూవున్న సైటోప్లాసమ్‌కూడా క్రమేణా దానంతటదే రెండుభాగాలుగా విడిపోయి ఈ రెండుభాగాలు ఈ రెండు కేంద్రకాలచుట్టూ ఆవరించుకొంటూవుంటాయి. ఇలా అనుక్షణం జీవకణాలలో సహజమైన పరిణామం కలిగి ఒకటి రెండు కణాలుగానూ, రెండు నాలుగుగానూ ఇలా పెరిగిపోతూ వుంటాయి. ఇలా జీవిలోని జీవకణాల సంఖ్య పెరిగిన కొద్దీ జీవి పెరుగుతూ వుంటుంది.

విచిత్రమేమిటంటే ప్రతి ప్రత్యేక జీవరాశిలోనూ, ఈ కణాలు చీలి యేర్పడే క్రోమోజోములు ఒక నిర్ణీతసంఖ్యలోనే వుంటాయి. జీవరాసులలో వంశపారంపర్యంగా సంక్రమించే రూపురేఖ గుణాదికాలకు ఈ క్రోమోజోములే కారణం. ఈ క్రోమోజోములలో జీన్స్ (Jenes) అనే ప్రోటీన్లు ఉన్నవనీ వీటివల్ల వంశపారంపర్యత సిద్ధింపజేస్తూ ఉంటవేగాక వీటిలో వచ్చేమార్పులే జీవరాశి పరిణామానికంతకూ కారణమనీ చెబుతున్నారు.

ఇటీవల, మెసాచ్యుసెట్స్ (Massacheucets) టెక్నాలజీ కేంద్రంలో, ష్మిట్ అనే శాస్త్రజ్ఞుడు ప్రోటోప్లాసమ్‌లోని ప్రోటీనులమీద కొన్ని పరిశోధనలు చేశారు. ఈ ప్రోటీనులను కొన్ని రసాయనిక పదార్థాలతో విరగగొట్టగా అవి ఇంకొకంటే చిన్నరకం ప్రోటీనులుగా ఏర్పడినాయి ఇలా ఏర్పడిన ఈ చిన్నరకం ప్రోటీనులకు ఆయన 'మేక్రోమాలిక్యూల్స్' (Macromolecules) అని నామకరణం చేశారు. ఈ మేక్రోమాలిక్యూల్సును, మళ్లా కొన్ని రసాయనిక పదార్థాలతో చేర్చి తిరిగి మొదటిరకం ప్రోటీనులను తయారు చేశారు. మొదటి ప్రమాణంగల ప్రోటీనులనే గాక అనేక రకాల ప్రోటీనులనుకూడా తయారు చేయగలిగారు.

ప్రోటీనులను ఎలక్ట్రానిక్ మైక్రోస్కోపుతో పరీక్షించితే అవి రేఖలు రేఖలుగా కనుపిస్తవి. ప్రతి ప్రత్యేక జీవరాశిలోవుండే ప్రోటీనులలోను ఈ రేఖకూ రేఖకూ వుండే దూరం నిర్ణీతంగా వుంటుంది. అంతే గాక ఈ రేఖల సంపుటి ప్రత్యేకాకృతి (Special pattern) గలదిగా వుంటుంది. ఈ ఆకృతినిబట్టి మనం ఆయా జీవరాసుల ప్రోటీనులను గుర్తించగలం.

మేక్రోమాలిక్యూల్సు కూర్పు వల్లనే ఈ రేఖలు కనుపించుతాయనీ, పరిసర రసాయనిక స్థితినిబట్టి మేక్రోమాలిక్యూల్సు వేరు వేరు విధాలుగా (Different patterns) కూడుకొని వేరువేరు రకాల ప్రోటీనులు యేర్పడుతాయనీ ష్మిట్ భావిస్తున్నారు.

ప్రోటీనులకే గాక క్రోమోజోములకు కూడా యిలాటి రేఖలు వుండటం శాస్త్రజ్ఞులకు చిరకాలంగా విదితమైయున్న విషయమే. కాని ష్మిట్ పరిశోధనా ఫలితాన్నిబట్టి యీ రేఖలు మేక్రోమాలిక్యూల్సు, అస్తిత్వంవల్లనేమోయని ఊహించటానికి వీలుగా వుంది. ఇదే నిజమయితే జీవిశాస్త్ర విజ్ఞానంలో ఒక మహత్తర పరిణామమే రావచ్చు. క్రోమోజోములను కూడా పై ప్రోటీనులను విరగగొట్టినట్టే విరగగొట్టి, వాటి నిర్మాణాను మన యిష్టమువచ్చినట్లు మార్చటానికి వీలు కావచ్చు. క్రోమోజోములకు వుండే ఈ రేఖలను గమనించి మనం ఆ ప్రత్యేక జీవియొక్క పరంపరాగత గుణాలను విస్పష్టంగా తెలుసుకొనగలగటమే కాకుండా, ఈ క్రోమోజోముల రూపురేఖలను మార్పు చేయగల శక్తిని చేజిక్కించుకుని ప్రత్యేక జీవరాసులలో పరంపరగా సంక్రమించే రూపగుణాలను సహితం మనయిష్టంవచ్చినట్లు మార్చి వేయగలుగుతామేమో! జీవరాశి భవిష్యత్తును మన యిష్టంవచ్చిన రీతి పరిణమింప జేయగలమేమో కూడా!

ష్మిట్ క్రోమోజోముల మీదకూడా ఇటువంటి పరిశోధనలనే చేయబోతున్నట్టు వెల్లడించారు.



రిపబ్లిక్ మహోత్సవాల సందర్భంలో ఢిల్లీకి వచ్చిన నాగజాతి నాయకులు

గ్రంథ విమర్శనము

సర్వమంగళేశ్వర శాస్త్రిగారి జీవిత చరిత్ర

రచన: శ్రీ వడిమింటి పతంజలిశాస్త్రి, అడ్వొకేట్ పార్వతీపురం: వెల రూ 1 4-0.

'అభినవ కాళిదాస' బిరుదాంకితులు కీ॥ శే॥ వడిమింటి సర్వమంగళేశ్వర శాస్త్రిగారి జీవితచరిత్ర. గ్రంథకర్త వీరి ప్రపౌత్రులు.

శబ్దమంజరి చేత బట్టిన ప్రతిఒక్కరికీ సర్వమంగళేశ్వర శాస్త్రిగారి నామం సుపరిచితమే. సంస్కృతం అభ్యసించాలనుకునే జిజ్ఞాసువులకు ఎలా అభ్యసించాలో తెలియక సరియైన ప్రాథమిక పాఠ్య గ్రంథాలు లేక దారీ తెన్నూ తెలియకుండా వున్న అయోమయస్థితిలో శ్రీ సర్వమంగళేశ్వర శాస్త్రిగారు శబ్దమంజరినీ, సమాసకుసుమావళినీ రచించి మహోపకారం చేశారు ఈ రెండు గ్రంథాలూ ఒకే గ్రంథముగా సంపుటీకరింపబడి సంస్కృత బాలశిక్షగా ఒక్క ఆంధ్రసీమలో నేగాక ఆ సేతు హిమాచలమూ వ్యాప్తిలో వుంది. సంస్కృతం చదువుకోదలచిన వారికి నాటికీ నేటికీ ఇవే శరణ్యం. సమాసకుసుమావళిలోని ఈ దిగువ శ్లోకంలో వారి నామధేయాదులు పొందుపరుపబడివున్నయ్.

శ్రీమన్యమందిర కులాంబుధి పూర్ణచంద్ర
శ్రీ సర్వమంగళమనీషికృతా సలీలమ్
ఏషా సమాసకుసుమావళి రాబ్దతారం
జీయాత్కృపానిధి సదాశివ సత్ప్రసాదాత్

శ్రీ శాస్త్రిగారి జన్మస్థలం:

అమలాపురంతాలూకా "ముంగండ" గ్రామానికి చేరువలోవున్న గన్నవరమనే గ్రామం. విజయనగరగజపతిరాజులఆస్థానంలో, విజయరామగజపతి(2), నారాయణగజపతుల కాలంలో పండితులుగా వుండేవారు. ఆసేతు హిమాచలం పర్యటించారు. ఆయాదేశాలలో వున్న పెక్కురు సంస్కృత పండితులతో వాదోపవాదాలు సలిపి విజయాన్ని చేపట్టారు. వీరికి "అభినవ కాళిదాసు" అనే బిరుదు వుంది. శ్రీ శాస్త్రిగారి చాటూక్తులు మధురములు చమత్కార సంయుతములు.

రచయిత అలాంటి చాటూక్తులను అనేకం సేకరించి ఈ గ్రంథంలో పొందుపరిచారు. ఒకటి రెండు చవి చూతాం:

దక్షిణదేశయాత్రలో శ్రీ సర్వమంగళేశ్వర శాస్త్రిగారు, ఒక రోజున ఆనందతాండవపుర మనే ఒక అగ్రహారంలో ఒక తమిళ బ్రాహ్మణుని యింట్లో భోజనం చేశారు ఆ యింటి యజమానురాలు శాస్త్రిగారికి నెయ్యి వడ్డించింది అనంతరం ఆ నేతిగిన్నె మీద శాస్త్రిగారు చెప్పిన చాటువు:

శ్లో॥ ఆనందతాండవపురే ద్రవిడస్య గేహే
చిత్రం వశిష్ఠవనితా సమ మాజ్య పాత్రమ్.
విద్యుల్లతేవ పరివృత్యతి తత్ర దర్వీ
ధారాం విలోకయతి కశ్చన యోగసిద్ధః॥

అర్థము: — ఆనందతాండవ పురమున ఒక ద్రావిడుని యింటియందు ఆజ్యపాత్రి (నేతిగిన్నె) అరుంధతీ నక్షత్రమువలె (వసిష్ఠ వనిత) ఉన్నది. అంటే కనుపించీ కనుపించకుండా మినుకుమినుకుమంటూ వుంది. అంటే అంత చిన్నది. తత్రదర్వీ = దానిలో గరిటె — విద్యుల్లతేవ పరివృత్యతి = మెరుపు తీగవలె నాట్యమాడు చున్నది — జిగేల్ జిగేల్మని అంతలో కన్పించి అంతలో మాయమౌతున్నది. ధారాం = గరిటలోనుంచి పడే ఆజ్యధారను — విలోకయతి కశ్చన యోగసిద్ధః = యోగసిద్ధి పొంది దివ్యదృష్టిని సంపాదించిన మహాపురుషులు మాత్రమే చూడగలరు — మానవ మాత్రుల మామూలు కళ్ళకు కనుపించదు - అని.

సత్యప్ప పంతులు అనే ఉద్యోగివిషయంలో శ్రీ శాస్త్రిగారు చెప్పిన మరో శ్లోకం:

"అమంగళే మంగళవార సంజ్ఞా
అపుణ్యకే పుణ్యజన ప్రతీతిః
అసత్యకే సత్యప ఇత్యభిఖ్యా
త్రయః ప్రసిద్ధా విపరీతరీత్యా"

అమంగళకరమగు వారమునకు మంగళవారమని పేరు పెట్టుట, అతి పాపులగు రాక్షసులకు పుణ్యజనులని పేరు పెట్టుట. సంతతము అసత్యములే పలుకు వీనికి సత్యప్ప పంతులని పేరు పెట్టుట యీ మూడును ప్రసిద్ధ విపరీతములు. ఇలాంటి చాటువులు ఇంకా అనేకం ఉన్నయ్.

చాటువులే కాక శాస్త్రిగారి జీవితానికి సంబంధించిన చిత్రవిచిత్రములైన కథల నెన్నిటినో రచయిత యీ గ్రంథంలో పొందుపరిచారు.

ఒకసారి జగన్నాథ క్షేత్రం వెళ్ళినప్పుడు శాస్త్రిగారు దేవదర్శనం చేసుకొని బయటికి వస్తూ ఆలయ ప్రాకారంలో వున్న మఱ్ఱిచెట్టు ఆకులు నాలుగు కోసి చేత్తో బట్టుకున్నారట. అది ఒక ఉత్కళ పండితుడు చూచి ఇలా పృచ్ఛించాడట.

ఉ. పం: అయ్యా మీరు మఱ్ఱియాకుల నెందుకు తెంపితిరి.

మం. శా: విస్తరంట కుట్టి భోజనము చేయుటకు

ఉ. పం: మఱ్ఱియాకున భుజింతురా?

మం. శా: ఏమి? విశేషమున్నదా?

ఉ. పం: లేకేమి మీకు తెలియదా?

మం. శా: నాకు తెలిసినంతవరకు ఎట్టి విశేషమును లేదు.

ఉ. పం: 'వటార్కాశ్వత్థ పత్రేషు భుక్త్వా చాంద్రాయణం చరేత్' అని లేదా?

మం. శా: దాని యర్థము మీరేమనుకొనుచున్నారు?

ఉ. పం: మఱ్ఱి, జిల్లేడు, రావి ఈ యాకులలో భుజించినయెడల తత్పాప పరిహారార్థము చాంద్రాయణ వ్రతము చేయవలెనని.

మం. శా: అట్లు కాదు; చాంద్రాయణ వ్రతము చేయదలచుకొన్నవారు, వట, అర్క, అశ్వత్థ ఈ మూడు జాతుల ఆకులలో ఏదైన నొకదానియందు భుజించి తరువాత నా వ్రతము చేయవలయునని దాని యర్థము. అయ్యది విధిని సూచించుచున్నది గాని నిషేధమును గాదు.

ఉ. పం: అయిన భగవంతుడు వట పత్రశాయి కాడా? భగవంతుని శయ్యను భుజింపదగునా?

మం. శా: మీ ఉత్కళులు భగవంతుని అవతారములలో మత్స్యకూర్మవరాహముల నే భక్షించి వేయుచున్నారు గదా. ఆయన శయ్యను భుజించుట మీకు తప్పుగా కనిపించుచున్నదా? (ఆంధ్ర బ్రాహ్మణులవలె గాక ఉత్కళ బ్రాహ్మణులు మత్స్యములను తాబేళ్లను అడవి పందులను భుజింతురట).

ఇలాగే మరొక కథ:

ఒకసారి శాస్త్రిగారు శ్రీ విజయరామగజపతి గారి సభకు రాగా రాజావారు తిమరాకకు కారణమేమని శాస్త్రిగారిని పృచ్ఛించారు. శాస్త్రిగారు:

'నాకుపనయనము, నా కుమారునకు వివాహము కావలెను' అన్నారు.

రాజావారికి ఆ దేవిటో అర్థం కాక ఉపిరితప్పిరైంది. సరే రేపు తప్పక సభకు దయచేయండి అని చెప్పి ఆ నాటికి తప్పించుకుని యివతల బడ్డారు. శాస్త్రిగారు బయటికి వెళ్ళిపోగానే రాజావారు మిగతా పండితులను ఆ మాటలకు అర్థమేమిటని అడిగారు. పండితులు: 'బహుశా శాస్త్రిగారు తడబాటుగా పొర

పడి అలా అడిగి వుంటారు. వారికి భార్యావియోగము తటస్థించింది. వారికి వివాహమూ, కుమారునికి ఉపనయనము అవటానికి అలా అని వుంటారు' అని చెప్పారు.

కాని మహామహుడైన శ్రీ శాస్త్రిగారికి తిష బాటేమిటని రాజా వారే స్వయంగా ఆలోచించారు.

మరునాడు శ్రీ శాస్త్రిగారు సభకు రాగానే రాజావారు పట్టుగుడ్డలు కప్పివున్న రెండు పళ్లెములను తెప్పించి వాటిలో మొదటిపళ్లెం మీది గుడ్డలు తొలగించి శ్రీ శాస్త్రిగారి చేతికందిస్తూ 'మీ కుమారుల వివాహమునకు' అన్నారు. ఆపళ్లెంనిండా కొంత వెండి, బంగారం వుంది. రెండో పళ్లెం మీది గుడ్డలు తొలగించి: 'తమకీ యుపనయనముల నేది తగియుండునో చూడుడు' అన్నారు. ఆపళ్లెంలో రకరకాల సైజులలో కొన్ని కళ్లజోళ్లున్నాయ్. సభవారికి అమితమైన ఆశ్చర్యం కలిగింది.

శాస్త్రిగారి కుమారుని పెళ్లిలో జరిగిన ముచ్చటొకటి మనోజ్ఞంగా వుంది.

శాస్త్రిగారి కుమారుడు భగవత్పతంజలి శాస్త్రిగారికి వివాహం జరుగుతోంది. ఆడపెళ్లివారు పెళ్లికొడుకును తలుపుదగ్గర ఆటకాయించి పెళ్లికూతురు పేరు చెబితే గాని తలుపుతీయమని పట్టుబట్టారు. 'మేము పేరు చెప్పవలసినవారము కాము,' అన్నారు పెళ్లికొడుకు. అలా కుదరదన్నారు ఆడపెళ్లివారు. ప్రక్కన నిల్చున్న మంగళేశ్వర శాస్త్రిగారు 'అబ్బాయీ నీవన్నమాటే మరోమారు చెప్పరా'— అన్నారు. పెండ్లికుమారుడు తండ్రిగారి ఆదేశంతో మరింత ఉత్తేజితుడై 'మేము పేరు చెప్పవలసినవారము కాము, కాము, కాము,' అన్నాడు.

సరే యిక యిరువురి పంతాలూ చెల్లిపోయాయి గనుక తలుపుతీయండి అని చమత్కరించారు శ్రీ శాస్త్రిగారు. నలుగురూ తెల్లబోయారు.

పెళ్లికూతురు పేరు 'కామాక్షమ్మ'. తల్లిదండ్రులు "కాము" "కాము" అని కూడా పిలుస్తూ వుండేవారు.

ఇలాంటి చక్కటికథలు ఎన్నో ఈగ్రంథంలో వున్నాయ్.

కాని ఈ గ్రంథాన్ని గురించి ఒకమాట చెప్పవలసివుంది. చదవటానికి గ్రంథం ఎంత హృదయాహ్లాదకరంగా వున్నా దానికి చారిత్రిక సిద్ధి లభించే ఆస్కారం కనుపించుటలేదు. దీన్లోనుంచి భగవత్సాక్షాత్కారాదికాలను తొలగించితే బాగుండేది. శాస్త్రిగారికి భగవత్సాక్షాత్కారం వున్నదని వక్కాణించనంత మాత్రంచేత శాస్త్రిగారి ప్రతిభకు వన్నె తరిగేదేమీలేదు.

శాస్త్రిగారు రచించిన గ్రంథాలు:

(1) కర్మజ్ఞానవివరణము (మీమాంసాశాస్త్రసారం)
(2) వేదసారము
(3) పార్థివిజయము (కావ్యం)
(4) సమాసకుసుమావళి (శబ్దమంజరి సహితము)
(5) విభక్తివిలాసము (అచ్చుకాలేదు)
(6) సర్వమంగళీయము (వ్యాకరణ గ్రంథం)
(7) సమ్మతీయం (ఖండన గ్రంథం)
(8) భగవద్గీతాభాష్యము
(9) శ్రీ జగన్నాథాష్టకము
(10) శ్రీ లలితా పంచదశీ మంత్ర వర్ణమాలా స్తోత్రము
(11) సూర్యాష్టకము (సౌరాష్టాక్షరీ వర్ణమాలాష్టకము)

శంకరగ్రంథ రత్నావళి

[ప్రథమ సంపుటము]

అనువాదకులు: శ్రీ నిర్వికల్పానందస్వామి, ప్రచురణ: సాధన గ్రంథ మండలి, తెనాలి, వెల రు. 3; పోస్టు ఖర్చులు రు. 0-12-0

"శంకరాచార్య నామధారు లెందరు? వారువారు రచించిన గ్రంథము లేవి?" అని చర్చించటానికి ఇది అవకాశం కాదు. ఈ గ్రంథములో శంకరాచార్య కృతులుగా చెప్పబడుతున్న వలకై రచనలున్నయ్. ఇవి:

అద్వైతానుభూతి, ఆత్మానాత్మ శ్రీ వివరణ ప్రకరణమ్, ఆత్మషట్కమ్, ఆత్మపూజ, ఆత్మబోధ, ఏకశ్లోకి, కాశీపంచకమ్, కేవలో అహమ్, కౌపీన పంచకమ్, గుర్వష్టకమ్, భజగోవిందం, మోహముద్గరం జీవన్ముక్తానందలహరి, తత్త్వోపదేశం, ధన్యాష్టకమ్, నిరంజనాష్టకమ్, నిర్వాణాష్టకమ్, నిర్వాణదశకమ్, నిర్వాణమంజరి, నిర్గుణమానసపూజ, ప్రాతఃస్మరణ, ప్రశ్నోత్తర రత్నమాలిక, ప్రశ్నోత్తర మణిరత్నమాల, ప్రౌఢానుభూతి, బ్రహ్మజ్ఞానావళీమాల, బ్రహ్మానుచింతనమ్, మనీషాపంచకం, మఠామ్నాయం, యోగతారావళి, వాక్యవృత్తి, లఘువాక్యవృత్తి, వాక్యసుధ, విజ్ఞాననౌక, వేదాంతడిండిమం, సదాచారం, సాధనపంచకం సారతత్త్వోపదేశం, స్వాత్మప్రవేశిక, హస్తామలకమ్.

శ్రీ నిత్యకల్యాణంస్వామివారి తెలుగు వచనానువాదాలతో ఈరచనల సంస్కృత మాతృకలను సహితం ఈగ్రంథంలో ప్రచురించారు. ఈ రచనలు చాలామటుకు నిత్యపారాయణకు అనువైన గ్రంథాలు కనుక ముముక్షువులకు చాలా ఉపయోగకరంగావుంది. శ్రీ స్వామివారి అనువాదం చాలా సరళమైన భాషలో సర్వులకూ సుబోధకంగా వుంది. శ్రీ శంకరాచార్యుల గ్రంథముల నన్నిటినీ కూడా అనువాదరూపంలో సంపుటాలుగా తీసుకురావటానికి ప్రకాశకులు ప్రయత్నించుచున్నారని తోస్తుంది. వీరి కృషికి తప్పక తగిన ప్రోత్సాహం లభించగలదని ఆశించుచున్నాము.

Printed & Published For Nageswara Rao Estates Ltd., by S. Radhakrishna, at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras—1.
Editor: S. Sambhu Prasad.